సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 303

మంగళవారం 16-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



స్పెయిన్ తడాఖా

నాలుగోసారి 'యూరో' టైటిల్ సొంతం.. ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయం

- 12లో



అర్జెంటీనా ధమాకా

16వసారి కోపా అమెరికా కప్ కైవసం.. ఫైనల్లో కొలంబియాపై గెలుపు

- 12లో



రాజ్యసభలో బలం 90 దిగువకు..

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ బలం పెద్దల సభలో చాన్నాళ్ల తర్వాత 90 కంటే దిగువకు పడిపోయింది.

వివరాలు 6లో ▸



డీకే శివకుమార్‌కు చుక్కెదురు

అక్రమాస్తుల కేసులో సీబీఐ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కోరగా 'సుప్రీం' తిరస్కరించింది.

వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ తగ్గిన బరువు 2 కిలోలే..

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైల్లో ఉన్నప్పుడు తగ్గిన బరువు రెండు కిలోలు మాత్రమేనని తీహార్ జైలు అధికారులు చెప్పారు.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్ ఖాన్‌కు భారీ షాక్

దేశ వ్యతిరేక చర్యల ఆరోపణలపై ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీని నిషేధించాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸

'భూ'కాయింపు!

శ్వేతపత్రం పేరుతో సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు

జగన్ సంస్కరణలకు శ్రీకారం చుడితే.. స్కామ్‌లకు బాబే ఆద్యుడు

- భూ సంస్కరణలతో ఏకంగా 25 లక్షల మందికి ప్రయోజనం
- పేదలకు పెద్ద ఎత్తున భూ పంపిణీతోపాటు అసైన్డ్, చుక్కలు, ఈనాం, అనాధీనం, లంక భూముల సాగుదారులకు లబ్ధి
- ఇలా లక్షల మందికి మేలు చేయడం చంద్రబాబుకు దోపిడీగా కనిపిస్తోందా?
- అసలు దోపిడీ అంటే.. అమరావతి కుంభకోణం.. విశాఖలో భూముల కబ్జా కాదా బాబూ?
- మైనింగ్ ఆదాయం బాబు హయాంలో ఏటా రూ.2 వేల కోట్లే.. జగన్ వచ్చాక ఏటా రూ.4 వేల కోట్లు
- ఐదేళ్లలో మైనింగ్ ఆదాయం రూ.10 వేల కోట్లు పెరిగితే.. రూ.19 వేల కోట్ల దోపిడీ అంటూ అర్థరహిత ఆరోపణలు
- ఇసుకతో పారదర్శకంగా రూ.4 వేల కోట్ల రాబడి సమకూరిస్తే దోపిడీ జరిగినట్లా?...
- మీ హయాంలో ఉచితం పేరుతో ప్రభుత్వానికి రూపాయి ఆదాయం లేకుండా చేస్తే దాన్నేమంటారు?

2 లో



సమగ్ర భూ సర్వే రద్దు

- భూములు, సహజ వనరులపై శ్వేతపత్రం విడుదలలో సీఎం చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ అనాలోచితంగా రీ సర్వే చేపట్టింది.. గతంలో నేనూ ఆ ప్రయత్నం తలపెట్టి విరమించుకున్నా
- ఇకపై భూ యజమానులు వచ్చి కోరితే మినహా సర్వేలు చేయం
- మీ భూమి కబ్జా చేస్తే ఫిర్యాదు చేయండి.. వెంటనే తిరిగి ఇప్పిస్తాం.. గుజరాత్ మోడల్‌లో ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెస్తాం

2 లో

చనిపోయాననే అనుకున్నా

కుడివైపు తిరగబట్టే బతికిపోయా

కాపాడింది దేవుడో, అదృష్టమో!

ప్రాణాంతక దాడిపై ట్రంప్

పోలీసుల తప్పిదమే: ఎఫ్‌బీఐ

6 లో

"ఆ సమయంలో నేను చనిపోయాననే అనుకున్నా. కేవలం అదృష్టమో, దైవమో నన్ను కాపాడాయి. నాకు చికిత్స చేసిన డాక్టర్ కూడా ఇలాంటి దృశ్యాన్ని తన కెరీర్లోనే ఎన్నడూ చూడలేదని, ఇది అద్భుతమని చెప్పారు. కాల్పుల తర్వాత కూడా ప్రసంగం కొనసాగించాలనే అనుకున్నా. కానీ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల ఒత్తిడి మీద ఆస్పత్రికి వెళ్లా. అధ్యక్షుడు జో బైడెన్ నాకు ఫోన్ చేసి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు.



- అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



మళ్లీ తడబడ్డ బైడెన్

6 లో

తలపట్టుకుంటున్న డెమొక్రాట్లు


నిన్ను చంపేస్తే మా నాన్న మేనేజ్ చేస్తారు



- రాయలసీమ వర్సిటీలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడి కుమారుడి వీరంగం
- బయటి వ్యక్తులతో కలిసి విద్యార్థిపై దాడి
- చంపేస్తానంటూ హెచ్చరిక

3లో

సాగర్ కుడికాలువకు 4 టీఎంసీలు



గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా నాలుగు టీఎంసీల విడుదలకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ అంగీకరించింది. ఈ నెల 17 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని బోర్డుకు సిఫార్సు చేసింది.

5లో

'కృష్ణా'లో కుండపోత



ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోని రోడ్లు చెరువుల్ని తలపించాయి. విజయవాడలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గుంటూరులో మోస్తరు వర్షం కురిసింది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.

14లో



ఘటన జరిగిన ప్రదేశం



బీబీనాయక్



బాగేల్ రాందేవ్



దుర్గారావు

బండరాళ్ల కింద ముగ్గురు సజీవ సమాధి

ఎన్టీఆర్ జిల్లా దొనబండ క్వారీలో ప్రమాదం

యజమాని నిర్లక్ష్యమే ఘటనకు కారణం

రెండు రోజులుగా వర్షాలు పడుతున్నా ఆగని పనులు

కొరవడిన మైనింగ్ అధికారుల పర్యవేక్షణ

10 లో

జగన్ ఉన్నత లక్ష్యానికి బాబు ఉరి

పేద, మధ్యతరగతి పిల్లల వైద్య విద్య కల సాకారానికి వైఎస్ జగన్ చర్యలు

రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం

- పటిష్ట ప్రణాళికతో మహోన్నత ఆశయాన్ని ముందుకు నడిపించిన వైఎస్ జగన్
- గత ఏడాది 5 కళాశాలలు ప్రారంభం
- అందుబాటులోకి 750 ఎంబీబీఎస్ సీట్లు.. ఈ ఏడాది మరో 5 కాలేజీల ప్రారంభానికి ఏర్పాట్లు
- తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతరత్రా ఏర్పాట్లు పూర్తి
- ఏపీవీవీపీ ఆస్పత్రులు అప్‌గ్రేడ్.. 90 శాతం సిబ్బంది నియామకం
- చంద్రబాబు ప్రభుత్వం రాకతో కాలేజీలకు గ్రహణం.. కొత్త కాలేజీలకు అనుమతులు నిరాకరించిన ఎన్ఎంసీ



10 లో

- అప్పీలుకు వెళ్లే అవకాశమున్నా సర్కారు మౌనం
- పేదల అభ్యున్నతిపై బాబు వ్యతిరేకతకు ఇదే నిదర్శనం

నాయుడుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



గురుకుల విద్యార్థులకు కలుషిత ఆహారం

139 మందికి అస్వస్థత

ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం.. నెల్లూరు, నాయుడుపేట ఆస్పత్రుల్లో చికిత్స

14 లో

నాలుగేళ్ల బాలిక ఉసురుతీసిన అతిసార

కర్నూలు జిల్లా సుంకేశ్వరిలో కలుషిత నీరు సరఫరా

14లో



అవన్నీ ఓట్లుగా మారితే ఎంత బాగుండో! ప్చ్!

గిరిజన బాలిక ఎక్కడ బాబూ?

పది రోజులైనా ఆచూకీ లేని చిన్నారి.. ఈ ఒక్క బాలికనైనా తెచ్చి చూపించు పవన్

- నాడు ప్రగల్భాలు పలికి నేడు మౌనముద్రలో సీఎం, డిప్యూటీ సీఎం
- బాధిత కుటుంబాన్ని కనీసం పలకరించని హోంమంత్రి అనిత
- అసలు కుటుంబం దగ్గరకే వెళ్లని నంద్యాల జిల్లా మంత్రులు
- నిందితులకు కొమ్ముకాస్తున్న జిల్లా టీడీపీ పెద్దలు.. కేసును పక్కదారి పట్టిస్తున్న పోలీసులు
- వారం రోజులుగా పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- బాలికను అత్యాచారం చేసి హత్య చేసినట్లు తెలిపిన నిందితులు?
- బాలిక అదృశ్యం వెనుక టీడీపీ సన్నిహితులు
- అసలు దోషులను కాపాడేందుకు చంద్రబాబు ప్రభుత్వం పన్నాగం

3 లో



రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయింది.. - ప్రతిపక్ష నేతగా చంద్రబాబు

రాష్ట్రంలో 34వేల మంది బాలికలు అదృశ్యమయ్యారు. వలంటీర్లు ఎత్తుకుపోయారు. వాళ్ల ఆచూకీ తెలియాలి. మేం అధికారంలోకి వస్తే అదృశ్యమైన బాలికలను సురక్షితంగా వెనక్కి రప్పిస్తాం.

- ఎన్నికలకు ముందు పవన్‌కళ్యాణ్

దళిత బాలిక అనుమానాస్పద మృతి

- ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి హత్యచేసి ఉంటాడని అనుమానం
- పరారీలో అనుమానితుడు
- గుంటూరు జిల్లాలో ఘటన

14 లో

డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు అమన్ అరెస్టు

నైజీరియన్ గ్యాంగ్‌ను పట్టుకున్న యాంటీ నార్కోటిక్స్ టీమ్

పాజిటివ్ వచ్చిన ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

199 గ్రాముల కొకైన్ స్వాధీనం.. ఇద్దరు సూత్రధారుల పరారీ

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ), సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్‌లో ఐదుగురు డ్రగ్ పెడ్లర్స్ చిక్కారు. వీరి విచారణలో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు, టాలీవుడ్ నటుడు అమన్ ప్రీత్ సింగ్ సహా 13 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిలో అమన్ సహా ఐదుగురిని పరీక్షించగా, వారు డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. దీంతో ఈ ఐదుగురినీ నిందితులుగా చేర్చి అరెస్టు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్ పెడ్లర్స్‌లో కొందరు స్థానికులూ ఉన్నారని, పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన సూత్రధారుల కోసం గాలిస్తున్నామని తెలిపారు.



గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఆయన ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

విదేశాల నుంచి తెప్పించి...

నైజీరియాకు చెందిన డివైన్ ఎబుక సుజీ, ఫ్రాంక్లిన్‌లు బిజినెస్, స్టడీ వీసాలపై హైదరాబాద్‌కు వచ్చారు. కొన్నాళ్లు నగరంలోని

మిగతా 3వ పేజీలో ▸

‘భూ’కాయింపు!



విశాఖపట్నంలో గీతం విద్యాసంస్థలు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు(ఫైల్‌)

శ్వేతపత్రం పేరుతో సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు

జగన్‌ సంస్కరణలకు శ్రీకారం చుడితే.. స్కామ్‌లకు బాబే ఆద్యుడు

సాక్షి, అమరావతి: ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి వాటిని అమలు చేయలేక కాలయాపన చేస్తున్న సీఎం చంద్రబాబు దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు శ్వేతపత్రాల పేరుతో అభూత కల్పనలు, అడ్డగోలుగా వక్రీకరణలకు దిగారు. పేదలకు మంచి జరిగేలా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను దోపిడీగా చిత్రీకరిస్తూ తన కడుపుమంటను మరోసారి బయట పెట్టుకున్నారు. ఖజానాకు రాబడి పెంచిన ప్రభుత్వాన్ని నిందిస్తూ.. ఆదాయానికి తూట్లు పొడుస్తున్న తన సర్కారు గురించి జబ్బలు చరుచుకోవడంపై రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచమే విస్తుపోయేలా నాడు అమరావతి, విశాఖలో తన హయాంలో జరిగిన భూ కుంభకోణాలను నిస్సిగ్గుగా కప్పిపుచ్చుతూ బురద చల్లేందుకు సీఎం చంద్రబాబు యత్నించారు. అసైన్డ్‌ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా దళితులు, పేదల జీవితకాల కోరికను నెరవేర్చడాన్ని తప్పుబట్టి ఆయా వర్గాలను దారుణంగా అవమానించారు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేల కోట్లు దోచుకోగా, వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక క్రమపద్ధతి ప్రకారం జరిగిన విక్రయాలను తప్పుబడుతున్నారు. ధరల బోర్డు ఏర్పాటు చేసి మరీ ఇసుకను విక్రయిస్తూ పైకి మాత్రం ఉచితమంటూ బుకాయిస్తున్నారు. పారదర్శకంగా ఇసుక అందచేసి ఏటా రూ.750 కోట్లకుపైగా ఆదాయాన్ని, ఐదేళ్లలో రూ.4 వేల కోట్లను రాబడిని గత ప్రభుత్వం ఖజానాకు జమ చేయడం అక్రమమా? ప్రభుత్వానికి రూపాయి రాబడి లేకుండా చేసి ఉచిత ఇసుక పేరుతో పచ్చమూకల జేబులు నింపడం ఓ గొప్ప పథకమా? భూముల సమగ్ర రీ సర్వే (జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష చట్టం) ద్వారా అమ్మేవారికి, కొనేవారికి పూర్తి భరోసా లభిస్తుంది. వివాదరహితంగా భూములపై హక్కులు కల్పించడంతోపాటు ఏదైనా సమస్య ఉత్పన్నమైతే ప్రభుత్వమే గ్యారెంటీ ఇస్తుంది కాబట్టి నిశ్చింతగా ఉండవచ్చు. దేశ చరిత్రలో తొలిసారిగా ఆంగ్లేయుల తరువాత భూముల సమగ్ర సర్వే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్‌ సీపీ హయాంలో చేపట్టింది. రైతులపై పైసా భారం పడకుండా ఉచితంగా సర్వే చేయడంతోపాటు సరిహద్దు రాళ్లను కూడా ఉచితంగానే పాతేలా చర్యలు తీసుకుంది. 15,000 మంది సర్వేయర్లను నియమించింది. చంద్రబాబు ఆరోపిస్తున్నట్లుగా కబ్జాలే నిజమైతే తమ భూములు లాక్కున్నారని ఏ ఒక్క రైతైనా ఫిర్యాదు చేశారా? గత సర్కారు ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను సమర్థంగా అరికడితే దానిపైనా అడ్డగోలు వాదనకు దిగారు. సహజ వనరులను దోపిడీ చేశారని, భూములను దోచుకున్నారని కళ్లార్పకుండా బుకాయించారు. వాస్తవానికి వైఎస్‌ జగన్‌ తెచ్చినవి సంస్కరణలైతే చంద్రబాబు హయాంలో చోటు చేసుకున్నవన్నీ స్కామ్‌లే!!

పేదలకు భూమి పంచడం నేరమా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు భూమిని పంచడాన్ని అక్రమంగా చంద్రబాబు అభివర్ణించారు. 46 వేల ఎకరాలను 40 వేల మందికిపైగా రైతులకు పంపిణీ చేయడాన్ని తప్పుబడుతూ అందులో 8 వేల ఎకరాలను వైఎస్సార్‌సీపీ వారికి పంచారంటూ గగ్గోలు పెట్టారు. నిరుపేదలైన వారికి భూములు ఇవ్వడాన్ని వక్రీకరిస్తూ అందులో రూ.1,300 కోట్ల అవినీతి జరిగిందని పేదలపై తనకున్న ద్వేషాన్ని చంద్రబాబు చాటుకున్నారు. చంద్రబాబు తన హయాంలో భూ పంపిణీయే చేయలేదు. ఏనాడూ పేదల గోడు పట్టించుకున్న పాపాన పోలేదు.

అసైన్డ్‌ భూములపై అడ్డగోలు వాదన

అసైన్డ్‌ భూముల రైతులకు చారిత్రక రీతిలో వైఎస్సార్‌సీపీ హయాంలో దక్కిన యాజమాన్య హక్కులను చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారు. వారి భూములపై వారికి హక్కులు కల్పించడం తప్పన్నట్లు చిత్రీకరించారు. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక అసైన్డ్‌ రైతులు అవస్థలు పడ్డా పట్టించుకోని చంద్రబాబు, వారికి హక్కులు ఇవ్వడాన్ని వక్రీకరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు ఆ భూములను కొట్టేశారంటూ నిరాధార ఆరోపణలు చేశారు. అసైన్డ్‌ రైతులకు వారి భూములపై సంపూర్ణ అధికారాలు దక్కడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో కొంతమంది రైతులు హక్కులు వచ్చాక వాటిని విక్రయించారు. 27 లక్షల ఎకరాల అసైన్డ్‌ భూములకుగానూ తొలి విడతలో పది లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికి హక్కులు కల్పించారు. అందులో కొంతమంది అమ్ముకోవడం ముఖ్యమంత్రికి నేరంగా కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో 22 ఏలో చేర్చిన 2 లక్షల ఎకరాల నిషేధిత భూములు, 34 వేల ఎకరాల షరతుగల పట్టా భూములు, 50 వేల ఎకరాల అనాధీనం భూములపై వైఎస్సార్‌సీపీ హయాంలో ఆంక్షలు తొలగాయి. 1.79 లక్షల ఎకరాల సర్వీస్‌ ఈనాం భూములను 22ఏ నుంచి తొలగించి వారికి మేలు చేశారు. రైతుల సాగులో ఉన్న 9,064 ఎకరాల లంక భూములను 17,768 మంది లబ్ధిదారులకు హక్కులతో అందచేసింది. ఎస్సీలకు శ్మశాన వాటికల కోసం 1,543 గ్రామాలలో 933 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పంచాయతీలకు అప్పగించింది. ఇవన్నీ చంద్రబాబుకు అక్రమాలు, అన్యాయాలుగా కనిపించడాన్ని ఏమనాలి?

రీ సర్వేపై తప్పుడు భాష్యాలు..

గత వందేళ్లలో ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన భూముల రీ సర్వేను ఒక అనాలోచిత చర్యగా చంద్రబాబు అభివర్ణించటాన్ని బట్టి రెవెన్యూ వ్యవస్థపై సీఎం చంద్రబాబుకు ఉన్న అవగాహన ఏపాటిదో స్పష్టమైంది. అనేక చిక్కుముళ్లు, ఆటంకాలు, వ్యయ ప్రయాసలను అధిగమించి 6 వేల గ్రామాల్లో పూర్తయిన రీ సర్వేను రద్దు చేస్తానని ఆయన చెప్పడం రాష్ట్రానికి తీరని ద్రోహం చేయడమే. వివాదాలు లేని భూముల వ్యవస్థ తేవటాన్ని వ్యతిరేకించడమంటే వివాదాలు కోరుకోవడమే. తద్వారా డ్రోన్లు, విమానాలతో మొత్తం 1.26 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని సర్వే చేయడం, ప్రతి గ్రామానికి ఆధునిక డిజిటల్‌ రెవెన్యూ రికార్డులను అందుబాటులోకి రావడం, ప్రతి రైతుకి భూహక్కు పత్రం, భూములకు జియో ట్యాగింగ్‌ హద్దులు లాంటివన్నీ వృథా అయినట్లే! ఇప్పటివరకూ సర్వే పూర్తయిన గ్రామాల్లో 10 లక్షల పట్టా సబ్‌ డివిజన్లు, 8 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. అవి కూడా చంద్రబాబుకు తప్పుగానే కనిపించాయి. అన్నిటికీ మించి సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియ కూడా ఆగిపోతుంది. వివాదాస్పదమైన పాత భూముల వ్యవస్థనే మళ్లీ తేవాలని చంద్రబాబు నిర్ణయించడంపై రెవెన్యూ యంత్రాంగం విస్తుపోతోంది. భూ హక్కులకు భరోసా కల్పించేలా దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో తెచ్చిన ల్యాండ్‌ టైట్లింగ్‌ చట్టానికి రాజకీయ మకిలి అంటించి దాన్ని చంద్రబాబు చెత్తబుట్టలో వేసేశారు. ఏపీలో ఎప్పుడూ జరగని విధంగా చేపట్టిన ఈ భూసంస్కరణలన్నింటిపైనా తప్పుడు ముద్ర వేసి తొలగించాలనుకోవడం మూర్ఖత్వానికి పరాకాష్టగా నిలుస్తోంది.

ఇదేం విచిత్రం?

2019లో చంద్రబాబు దిగిపోయే నాటికి మైన్స్‌ ద్వారా ప్రభుత్వానికి రాబడి ఏటా రూ.2 వేల కోట్లు ఉంటే 2024లో ఏటా దాదాపు రూ.4 వేల కోట్లకు చేరింది. మరి ఖజానాకు ఆదాయం రెట్టింపు అయినప్పుడు రూ.19 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణ చేయడం విచిత్రం కాదా? ఇంత చిన్న లాజిక్‌ ఎలా మిస్‌ అయ్యావ్‌ చంద్రబాబూ! గనుల కేటాయింపుల్లో పారదర్శక విధానాలు తెచ్చి ఆదాయం పెంచిన గత ప్రభుత్వం పారదర్శకంగా పని చేసినట్లా? లేక ఆదాయం తక్కువ చేసి, పారదర్శక విధానాలు లేకుండా చేసిన చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడినట్లా? చిన్నపిల్లలను అడిగినా ఈ విషయం సులభంగా చెప్పేస్తారు కదా!

ఒక్క ఇల్లూ కట్టని చంద్రబాబు.. 31 లక్షల ఇళ్లు ఇచ్చిన జగన్‌పై విమర్శలా?

దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇచ్చి గృహ నిర్మాణాలను సైతం చేపట్టిన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై చంద్రబాబు బురద చల్లేందుకు సాహసించారు. పేదలకు ఒక్క సెంటు భూమి ఇవ్వని చంద్రబాబు, 72 వేల ఎకరాల్లో 17 వేల కాలనీలు నిర్మించి పేదలకు పంచడాన్ని కుంభకోణంగా అభివర్ణించడం అంటే ఆకాశంపై ఉమ్మి వేయడమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాలనీల కోసం 28 వేల ఎకరాలను సేకరించగా, మరో 25 వేల ఎకరాల ప్రైవేటు భూములను కొనుగోలు చేసి కాలనీలు కట్టించారు. అమరావతిలో పేదలకు 50 వేల ఇళ్ల పట్టాలు ఇస్తే కోర్టుకెళ్లి అడ్డుకున్న చరిత్ర చంద్రబాబుది కాదా? పేదల సొంతింటి కలను నెరవేర్చే ఇళ్ల యజ్ఞాన్ని అడ్డుకుని ఇప్పుడు నీతి సూక్తులు చెప్పడం విస్మయపరుస్తోంది. కనీస ఆధారాలు లేకుండా భూసేకరణలో వేల కోట్ల అవినీతి జరిగిందని సీఎం స్థాయి వ్యక్తి దిగజారుడు ఆరోపణలు చేయడం తగునా? 31 లక్షల మంది పేదలకు మంచి జరిగిన విషయాన్ని కప్పిపుచ్చుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి పది వేల ఎకరాలను బలవంతంగా లాక్కున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటు కాక మరేమిటి?

ఖనిజ వనరులను దోచుకుంది ఎవరు?

ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ఆదాయం జగన్‌ హయాంలో అనూహ్యంగా పెరిగింది.2020–21లో రూ.502 కోట్లు ఉన్న ఆ సంస్థ ఆదాయం 2022–23 సంవత్సరానికి రూ.1,806 కోట్లకు చేరింది. 2023–24 నాటికి రూ.4 వేల కోట్లకు చేరడాన్ని బట్టి మైనింగ్‌ ఆదాయాన్ని జగన్‌ ప్రభుత్వంలో ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబు హయాంలో గనుల ఆదాయం తగ్గిపోయి అప్పట్లో గనుల దోపిడీ యథేచ్ఛగా జరిగిపోయిందని స్పష్టమవుతోంది. గనుల్ని ఇష్టానుసారంగా దోచుకు తిన్నది టీడీపీ నేతలే. ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న అయ్యన్నపాత్రుడు లేటరైట్‌ కొండల్ని తొలిచేశారు! రోడ్డు మెటల్‌ తవ్వకాలతో నర్సీపట్నం పరిసర ప్రాంతాలను లోయలుగా మార్చేసిన ఘనత అయ్యన్నదే! మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలిలో చేసిన గనుల దోపిడీ అంతా ఇంతా కాదు. ప్రకాశం జిల్లాలోనూ టీడీపీ నేతలు గ్రానైట్‌ మాఫియాగా మారి దోచుకున్నారు. 2019లో వైఎస్‌ జగన్‌ అధికారం చేపట్టాక కొత్త గనుల విధానం ద్వారా ఆదాయం పెరిగేలా చేశారు. రాయల్టీ వసూళ్లలోనూ కొత్త మార్గదర్శకాలు ప్రవేశపెట్టారు. అరకొరగా ఉన్న మైనింగ్‌ సిబ్బంది వల్ల సీనరేజీ వసూళ్లు సరిగా జరగడంలేదని గుర్తించి ప్రైవేటు సంస్థలకు పారదర్శకంగా కాంట్రాక్టులు ఇచ్చారు. లీజుల జారీ విధానాన్ని అందరికీ అనుకూలంగా ఉండేలా మార్చారు. వీటన్నింటి ఫలితంగానే ఆదాయం పెరిగింది.

‘గీతం’ కబ్జాలు గుర్తులేవా?

సాక్షి, విశాఖపట్నం: శ్వేతపత్రం పేరుతో తనకు నచ్చిన అబద్ధాలను ముద్రించేసిన సీఎం చంద్రబాబు విశాఖలో భూములు మింగేసిన అనకొండలు టీడీపీకి చెందినవేనన్న విషయాన్ని కప్పిపుచ్చేందుకు విఫలయత్నం చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం లీజుకిచ్చినా తప్పేనంటూ అసత్యాలు వల్లెవేశారు. టీడీపీ అనకొండల నుంచి మార్కెట్‌ ధర ప్రకారం రూ.5 వేల కోట్ల విలువైన 430 ఎకరాల భూమిని గత ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. గీతం పేరుతో రూ.500 కోట్ల విలువైన 42.51 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే వైఎస్సార్‌సీపీ హయాంలో 40.51 ఎకరాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

స్టూడియో భూములపై అవగాహన ఉందా?

రామానాయుడు స్టూడియోను ప్లాట్ల పేరుతో ఆక్రమించి విక్రయించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు యత్నించారంటూ సీఎం చంద్రబాబు ఆరోపించారు. నిజానికి స్టూడియో యజమానులే రెసిడెన్షియల్‌ లేఅవుట్‌ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సమగ్ర విచారణతో పాటు నిబంధనలు పరిశీలించిన తర్వాతే గత ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. స్టూడియో యజమానులు దరఖాస్తు చేసుకుంటే వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంపై బురద చల్లేందుకు చంద్రబాబు యత్నించారు. నిజంగానే కబ్జా జరిగితే స్టూడియో అధినేతలు ఎందుకు ఉపేక్షిస్తారనే కనీస అవగాహన లేకుండా అర్థం పర్థం లేని విమర్శలు చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పీఠానికి లీజుకే..

వేద పాఠశాల నిర్మాణం కోసం విశాఖ శారదా పీఠానికి 2022 ఫిబ్రవరి 8న 15 ఎకరాల భూమిని తక్కువ ధరకే అప్పగించేశారని, దీని వెనుక కుట్ర ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. వాస్తవానికి శారదా పీఠానికి భూమిని కేవలం లీజుకు మాత్రమే అప్పగిస్తున్నట్లు జీవో 64లో స్పష్టంగా ఉంది. గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలను అనుసరించి ఎకరా రూ.లక్ష చొప్పున లీజుకు ఇస్తే శారదా పీఠానికి భూములు రాసిచ్చేసినట్లు చంద్రబాబు మభ్యపుచ్చేందుకు ప్రయత్నించారు. మరి లీజు, సేల్‌ రెండూ ఒకటి కాదనే విషయం ఆయనకు కచ్చితంగా తెలిసే ఉంటుంది కదా?

హయగ్రీవపైనా అబద్ధాలు..

ఓల్డేజ్‌ హోమ్‌ కోసం హయగ్రీవ ల్యాండ్స్‌ 12.51 ఎకరాలను ఇస్తే వైఎస్సార్‌సీపీ నేతలు కొట్టేయ్యాలని చూస్తున్నారంటూ చంద్రబాబు ఆరోపించారు. 2008 డిసెంబర్‌ 6న ప్రివిలైజ్డ్‌ మార్కెట్‌ వాల్యూ ప్రకారం ఎకరం రూ.45 లక్షలు చొప్పున (ఆ సమయంలో ఎస్‌ఆర్‌వో విలువ ఎకరం రూ.28.40 లక్షలు) 12.51 ఎకరాలను కేటాయిస్తూ జీవో నం.1447 జారీ అయింది. ప్రభుత్వ ఉత్తర్వులు, కన్వేయన్స్‌ డీడ్‌ షరతుల ప్రకారం మొత్తం భూభాగంలో 10% కాటేజీల నిర్మాణానికి, 30% రోడ్లు, డ్రెయిన్లు, ఇతర నిర్మాణాలు, సౌకర్యాల కోసం వినియోగించాలి. సదరు సంస్థ జీవీఎంసీకి 2012 ఫిబ్రవరి 24న (బీఏ నం.10900/2014/డీసీపీ–1/జీ1) దరఖాస్తు చేసుకుంది. ప్లాన్‌లను ఆమోదించకపోవడంతో కలెక్టర్‌ ఉత్తర్వుల్ని సవాలు చేస్తూ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై జీవీఎంసీ, వుడాకు లేఖ రాసే హక్కు కలెక్టర్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. సమస్య పరిష్కరించేంత వరకూ భూమి లాక్కోకూడదని, బలవంతపు చర్యలు వద్దని, చట్ట ప్రకారం వ్యవహరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. తక్షణమే పిటిషనర్‌కు ఎన్‌వోసీ జారీ చేయాలని కలెక్టర్‌ను 2017లో ఆదేశించింది. నిబంధనలను పాటిస్తూ భూ కేటాయింపు సమయంలో విధించిన షరతులకు లోబడే కన్వేయన్స్‌ డీడ్‌, ప్లాన్‌ను ఆమోదిస్తే చంద్రబాబు అబద్ధాలతో మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారు.

ఇసుకపైనా అసత్యాలే

అధికారంలోకి వచ్చిన నెలన్నర వ్యవధిలోనే 40 లక్షల టన్నుల ఇసుకను బొక్కేసిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ హయాంలో ఇసుక దోపిడీ జరిగిపోయిందంటూ గుండెలు బాదుకోవడం గజ దొంగల్ని సైతం విస్మయానికి గురిచేస్తోంది. ఇసుక ఫ్రీ అని మభ్యపుచ్చి ప్రభుత్వానికి ఎలాంటి రాబడి లేకుండా చేశారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఖజానాకు ఏటా రూ.780 కోట్లు రాబడి తెచ్చే విధానాన్ని తీసుకొచ్చి టెండర్లు పిలిచి ఇసుక అప్పగించింది. ఐదేళ్లలో రూ. 4 వేల కోట్లు ఇసుక ద్వారా ప్రభుత్వానికి రాబడి వచ్చింది. 2014–19 మధ్య ఇసుక ఫ్రీగా ఇచ్చానని బుకాయించిన చంద్రబాబు ఎంత దోపిడీకి తెర తీశారో ఇప్పుడెంత కొల్లగొట్టనున్నారో ఆయనకే తెలియాలి మరి!!

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: సచివాలయంలో మంగళవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ సందర్భంగా తల్లికి వందనం, కొత్త ఇసుక, ఎక్సైజ్‌ పాలసీకి సంబంధించి నూతన విధానాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం. అదే విధంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టే ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌ ఆర్డినెన్స్‌కు కేబినెట్‌ ఆమోదం తెలపడంతో పాటు, సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనపైనా చర్చిస్తారని తెలిసింది. ఉదయం 10:45 గంటలకు సీఎం చంద్రబాబు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరి రోడ్డు మార్గంలో సచివాలయానికి చేరుకుంటారు. 11 గంటలకు మంత్రివర్గ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 3:45 గంటలకు సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి వెళ్తారు.

23 నుంచి ఆధార్‌ క్యాంప్‌లు

27 వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో ఆధార్‌ స్పెషల్‌ క్యాంప్‌లు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్‌ ఎం.శివప్రసాద్‌ కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం సర్క్యులర్‌ జారీచేశారు. యూఏడీఏఐ నుంచి వచ్చిన సమాచారం మేరకు రాష్ట్రంలో 49,83,561 మంది ఆధార్‌ బయోమెట్రిక్, 1,36,17,047 మందికి సంబంధించి ధ్రువపత్రాల అప్డేషన్‌ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ అప్డేషన్‌ పూర్తి చేయడంతో పాటు, 0–5 ఏళ్ల చిన్నారులను వందశాతం ఆధార్‌ ఎన్‌రోల్‌మెంట్‌ చేయడం కోసం స్పెషల్‌ క్యాంప్‌లకు అనుమతి ఇచ్చినట్టు పేర్కొన్నారు.

సమగ్ర భూ సర్వే రద్దు

భూములు, సహజ వనరులపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తన హయాంలో ఒకసారి రీ సర్వే చేయాలని భావించామని, కెనడా నుంచి హెలికాప్టర్లు తెప్పించి సర్వే చేస్తే హద్దులు మారిపోతుండటంతో ముందుకు వెళ్లలేదని చెప్పారు. కాంగ్రెస్‌ సర్కారు కూడా రీసర్వే తలపెట్టి విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత భూహక్కు –భూరక్ష పథకం పేరుతో అనాలోచితంగా రీ సర్వేను చేపట్టిందని విమర్శించారు. ఇకపై భూ యజమానులు వచ్చి తమ హద్దులు నిర్ణయించాలని కోరితే మినహా ఎవరికీ సర్వే చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భూములు, సహజ వనరులకు సంబంధించి సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో భూ యజమానులకు రక్షణ కల్పించేందుకు గుజరాత్‌ తరహాలో ఏపీ ల్యాండ్‌ గ్రాబింగ్‌ చట్టాన్ని తెస్తామని చెప్పారు. ఈ చట్టం ప్రకారం కబ్జాదారులే భూమి తమదని నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. తమ భూములు కబ్జాకు గురైనట్లు బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే వారి భూములను వెనక్కి ఇప్పిస్తామన్నారు. ల్యాండ్‌ టైట్లింగ్‌ చట్టం పేరుతో గత సర్కారు భూ దోపిడీకి కుట్రలు పన్నితే తాము రద్దుకు క్యాబినెట్‌లో తీర్మానం చేశామన్నారు. నీతి ఆయోగ్‌ ప్రతిపాదించిన ల్యాండ్‌ టైట్లింగ్‌ చట్టం దేశంలో ఎక్కడా అమలులో లేదన్నారు. ప్రజల భూములు లాక్కునేందుకే ఏపీలో అమలు చేశారన్నారు. అసైన్డ్‌ భూములను ఫ్రీ హోల్డ్‌ చేయడంతో పేదలకు హక్కులు కల్పించినట్టే చేసి వైఎస్సార్‌ సీపీ నాయకులు దోచేశారన్నారు. భూ దందాలపై ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు త్వరలోనే టోల్‌ ఫ్రీ నంబర్‌ అందుబాటులోకి తెస్తామన్నారు.

రూ.35 వేల కోట్ల భూ దోపిడీ

వైఎస్సార్‌ సీపీ హయాంలో భూములతో పాటు ఖనిజాలు, అటవీ సంపదను దోచేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. రీ సర్వేతో భూ హద్దులు మార్చేశారన్నారు. అసైన్‌మెంట్, అసైన్డ్, చుక్కల, నిషేధిత భూముల విషయంలో కొత్త రకం దోపిడీకి పాల్పడ్డారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో మార్కెట్‌ కంటే ఐదు రెట్లు అధిక ధర చెల్లించి భూములు కొన్నారని ఆరోపణలు చేశారు. వైఎస్సార్‌ సీపీ కార్యాలయాలకు రూ.300 కోట్ల విలువైన 40.78 ఎకరాలను కేటాయించుకున్నారని చెప్పారు. తమకున్న సమాచారం మేరకు రూ.35 వేల కోట్ల భూ దోపిడీ జరిగినట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఒంగోలు భూ కబ్జాలపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. 22–ఏలో భూములను చేర్చి అక్రమాలు చేశారని, అసైన్డ్‌ భూములను వైఎస్సార్‌సీపీ నాయకులు దోచేసి పట్టాలు పొందారని ఆరోపించారు. పుంగనూరులో భూ వ్యవహారాలను పునఃపరిశీలన చేస్తున్నామన్నారు. మైనింగ్, క్వారీ లీజుల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బెదిరింపులు, భారీ జరిమానాలతో లీజులను లాక్కుని గనులు కొల్లగొట్టారన్నారు. అధికారులను డిప్యూటేషన్లపై తెచ్చి పథకం ప్రకారం దోపిడీ చేశారన్నారు. ఇసుక, లేటరైట్, ఇతర ఖనిజ నిక్షేపాలతో రూ.19 వేల కోట్లు దారి మళ్లించారన్నారు. తమ హయాంతో పోలిస్తే ఎర్ర చందనం విక్రయాల ద్వారా గత ఐదేళ్లలో 27 శాతం మాత్రమే ఆదాయం వచ్చిందన్నారు. వీటన్నింటిపై ప్రజల్లో, అసెంబ్లీలో విస్తృతంగా చర్చించిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఏం చేయాలో అర్థం కావట్లేదు..

రూ.500 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రుషికొండపై భవంతులు కట్టారని సీఎం చంద్రబాబు విమర్శించారు. వాటిని ఇప్పుడు ఏం చేయాలో తనకు అర్థం కావట్లేదన్నారు. మద్యం, గంజాయికి బానిసలై సంఘ విద్రోహ శక్తులుగా మారిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాజకీయ విపక్షకు తావులేకుండా తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. ఒక్క కిలో కూడా ఖనిజం దోపిడీకి గురికాకుండా అడ్డుకుంటామన్నారు. గతంలో దోపిడీని ప్రశ్నిస్తే దాడులు చేశారని, మడ అడవులను కబ్జా చేసి ఇళ్ల స్థలాలిచ్చారని చెప్పారు. తప్పులు చేసిన అధికారులను తొలగిస్తే దోమల మందు కొట్టించేందుకు కూడా ఎవరూ ఉండరని వ్యాఖ్యానించారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూమిలో వాటా కొట్టేయాలని చూశారన్నారు. దసపల్లా భూముల్లో అక్రమంగా అపార్ట్‌మెంట్లు నిర్మించారని చెప్పారు. హయగ్రీవ భూముల్ని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కొట్టేయాలని చూశారని చెప్పారు. టీడీఆర్‌ బాండ్లలోనూ కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. శారదా పీఠానికి ఎకరా రూ.లక్షకే 15 ఎకరాలు ఇచ్చారని చెప్పారు. ఒంగోలులో రూ.101 కోట్ల ఆస్తులు, తిరుపతిలో మఠం భూములనూ కొట్టేశారన్నారు. చిత్తూరు జిల్లాలో 982 ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని చెప్పారు. భూ కబ్జాలపై ఫిర్యాదులకు టోల్‌ ఫ్రీ నంబర్‌ ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 10 వేల ఎకరాలు లాక్కున్నారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో సిలికా శాండ్‌ లీజ్‌ ఓనర్లను బెదిరించి వైఎస్సార్‌సీపీ నాయకులకే అమ్మేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. క్వార్ట్జ్, లేటరైట్‌ను దోచేసి సొంత సిమెంట్‌ ఫ్యాక్టరీలకు సరఫరా చేసుకున్నారన్నారు. పెద్దిరెడ్డి మనుషులకు ఇష్టానుసారం లీజులిచ్చారన్నారు. పోలవరం కుడి కాల్వ పనుల్లో రూ.800 కోట్ల మట్టిని తరలించారని ఆరోపించారు.

బాబు శ్వేతపత్రం ఓ బూటకం

- హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చేందుకే శ్వేతపత్రాల పేరుతో నాటకం
- విశాఖలో గీతం భూ ఆక్రమణల గురించి ఎందుకు మాట్లాడలేదు
- మాజీ మంత్రి మేరుగు ధ్వజం



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రం ఓ బూటకమని, అబద్ధాలతో కూడిన నిందల పత్రమని మాజీ మంత్రి మేరుగ నాగార్జున దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు మోపి, అనరాని మాటలు అనడానికే ఈ తంతు సాగించారని మండిపడ్డారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు అత్యంత దారుణంగా పొగరు, కొవ్వు, ఉన్మాదం, మదం వంటి పదజాలం వాడటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సీఎం స్థానంలో ఉన్న బాబు నోటి నుంచి వచ్చిన ప్రతి అక్షరానికి అకౌంటబులిటీ ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. శ్వేతపత్రంలోని ప్రతి అంశం టీడీపీ వారికి సంబంధించినవేనని చెప్పారు. నాగార్జున చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..

హామీలు అమలు చేయకుండా దృష్టిని మళ్లించడానికే

చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేసి, ఇప్పుడు ఇస్తున్న పథకాలను కూడా ఆపేసి, డబ్బుల్లేవని చెబుతున్నారు. ఎన్నికలప్పుడు ఈ విషయం తెలియదా? హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే శ్వేతపత్రాల తంతు తీసుకొచ్చారు. బాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారు. ఇచ్చిన మాట మీద నిలబడే నాయకుడు జగన్‌ మాత్రమేనని, అలా నిలబడలేకే బాబు దూషణలకు పరిమితమయ్యారు. దసపల్లా భూములు ప్రభుత్వానివి కావని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. అయినా దాన్ని పట్టుకుని బాబు నిస్సిగ్గుగా ఆరోపణలు చేస్తున్నారు. ఇన్ని మాట్లాడుతున్న చంద్రబాబు గీతం కాలేజీ అక్రమాలపై ఎందుకు నోరెత్తరు? వందల కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని గీతం వర్సిటీ ముసుగులో మాజీ ఎంపీ ఎంవీవీఎస్‌ మూర్తి స్వాహా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందులో 24.13 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. దీనిపై ఎందుకు మాట్లాడరు?

ఇళ్ల పట్టాలపై నిరాధార ఆరోపణలు

వైఎస్‌ జగన్‌ నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపైనా చంద్రబాబువి నిరాధార ఆరోపణలు. వైఎస్‌ జగన్‌ 28వేల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకిచ్చారు. మరో 25వేల ఎకరాలు అత్యంత పారదర్శకంగా కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా ఎప్పుడైనా ఒక్క కుటుంబానికి సెంటు భూమైనా ఇచ్చారా? పైపెచ్చు కేసులతో అడ్డుకున్నారు. రాజధానిలో 52 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారు. ఆ స్థలాల్లో పేదలకు ఇళ్లు కట్టించే దమ్ము బాబుకు ఉందా?

ల్యాండ్‌ టైట్లింగ్‌ యాక్టు రద్దు చేయించండి

ల్యాండ్‌ రీసర్వే, టైట్లింగ్‌ చట్టంపైనా చంద్రబాబు అవహేళనగా, తప్పుడు మాటలు కూడా మాట్లాడారు. చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారు. ఆ చట్టాన్ని తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వం. అది సరైంది కాదని అనుకుంటే, బాబే ప్రధానమంత్రి మోదీని ఒప్పించి, ఆ చట్టాన్ని రద్దు చేయించవచ్చు. ఆ ధైర్యం చంద్రబాబుకు ఉందా?

అడ్డూ అదుపూ లేకుండా ఇసుక దోపిడీ

ఎన్నికల్లో గెలిచిన రోజు నుంచి అడ్డూ అదుపూ లేకుండా ఇసుకను దోచుకుంటున్నారు. ఇసుక ఉచితం అని చెప్పి సీనరేజ్, రవాణా చార్జీల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదీ గర్భాల్లో ఉన్న ఇసుకను కొల్లగొట్టిన గజదొంగలు కూడా బాబు పార్టీ మనుషులే. వైఎస్‌ జగన్‌ హయాంలో ప్రతి ఒక్కటీ పారదర్శకంగా చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్లాట్‌ఫాం మీద టెండర్లు పిలిచారు. మా ఇసుక విధానం వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.765 కోట్లు, ఐదేళ్లలో రూ.3,825 కోట్లు ఆదాయం వచ్చింది. గతంలో బాబు పాలనలో ఇన్ని వేల కోట్లు ఎవరి జేబులోకి వెళ్లాయి? దశాబ్దాలుగా గనులను దోచుకుని, అడ్డగోలుగా సంపాదించింది బాబు మనుషులే. ఆయన హయాంలో మైన్స్‌పై ఆదాయంలో పెరుగుదల (సీఏజీఆర్‌) 17 శాతం నమోదైతే, వైఎస్‌ జగన్‌ హయాంలో 40 శాతం. అంటే దోపిడీ బాబు మనుషులు చేసినట్టు కాదా? బాబు హయాంలో నిరుపేదలకు ఒక్కరికి కూడా ఒక ఎకరం భూమి ఇవ్వలేదు. పైగా రికార్డుల్లో క్లారిటీ లేదంటూ లేనిపోని సాకులు చూపి లక్షలాది ఎకరాలను నిషేధిత జాబితా (22 ఏ)లో చేర్చారు. దీంతో ఆ భూములపై హక్కులు దక్కక, ఆపత్కాలంలో అమ్ముకునే అవకాశం లేక లక్షలాది రైతు కుటుంబాలు నానా ఇబ్బంది పడ్డాయి. అందుకే జగన్‌ చుక్కల భూములు, నిషేధిత భూములను ఆ జాబితాల నుంచి తొలగించి, అటవీ, ఇనాం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించి, మేలు చేశారు.

అందుబాటులోకి 668 గోదాములు

సాక్షి, అమరావతి: గిట్టుబాటు ధర లభించే వరకు రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలుగా వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం మౌలిక సదుపాయాలను ప్రతిపాదించింది. తాజాగా 4.07లక్షల టన్నుల నిల్వ సామర్థ్యంతో కూడిన 668 గోదాములు అందుబాటులోకి వచ్చాయి. రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా బహుళ ప్రయోజిత కేంద్రాల (ఎంపీఎఫ్‌సీ) ఏర్పాటుకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు కింద రూ.1586 కోట్లతో పీఏసీఎస్‌లకు అనుబంధంగా 2,536 ఆర్బీకేల పరిధిలో చేపట్టిన ఎంపీ ఎఫ్‌సీలలో గోదాములతో పాటు డ్రైయింగ్‌ ప్లాట్‌ ఫారమ్స్, డ్రైయ్యర్స్, పాలిషర్స్, ఎస్సైయింగ్, ప్రొక్యూర్‌మెంట్, క్లీనర్స్‌ వంటి 39,403 మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు ప్రతిపాదించారు.

4.07 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం

ఇంట్రస్ట్‌ సబ్‌వెన్షన్‌ కింద 3 శాతం వడ్డీ రాయితీతో అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్‌ కింద మంజూరైన నిధులతో 15 సెంట్ల భూమిలో 500 టన్నులు, 25 సెంట్ల భూమిలో 1000 టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేపట్టారు. తొలివిడతలో రూ.493.15 కోట్ల అంచనా వ్యయంతో 1,167 గోదాములు, వాటిలో రూ.166.83 కోట్లతో 8 రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతిపాదించారు. వీటిలో 1,092 గోదాముల నిర్మాణం చేపట్టగా, 500 టన్నుల సామర్థ్యంతో 579, వెయ్యి టన్నుల సామర్థ్యంతో 89 గోదాముల నిర్మాణం పూర్తయ్యాయి. ఇలా 4.07లక్షల టన్నుల నిల్వ సామర్థ్యంతో కూడిన 668 గోదాములు అందుబాటులోకి రాగా, వీటిలో 274 గోదాములను పీఏసీఎస్‌లకు అప్పగించారు. మరొక వైపు ఉద్యాన పంట ఉత్పత్తులు పండించిన చోటే గ్రేడింగ్, నిల్వ చేసుకునేందుకు వీలుగా వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఆర్బీకేలకు అనుబంధంగా పెద్ద ఎత్తున కోల్డ్‌ రూమ్స్, కలెక్షన్‌ సెంటర్స్‌ నిర్మాణం చేపట్టింది. తొలి దశలో 945 కలెక్షన్‌ సెంటర్స్, 344 కోల్డ్‌ రూమ్స్‌ నిర్మాణం తలపెట్టింది. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఫండ్‌) నుంచి ఒక్కొక్కటి రూ.15లక్షల అంచనా వ్యయంతో రూ.141.75కోట్లతో 945 కలెక్షన్‌ సెంటర్‌ల నిర్మాణం చేపట్టగా 475 సెంటర్లు, రూ.12లక్షల అంచనా వ్యయంతో రూ.41.28కోట్లతో 344 కోల్డ్‌ రూమ్స్‌ నిర్మాణం చేపట్టగా, 89 కోల్డ్‌ రూమ్స్, 2905 ప్యాక్‌ హౌస్‌లు రైతులకు అందుబాటులోకి వచ్చాయి.

క్లుప్తంగా...

మంత్రి నాదెండ్ల తీరు చట్ట విరుద్ధం

సీఎం చంద్రబాబుకు ఆప్ నేత పీవీఎస్ శర్మ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవహారశైలిపై మాజీ బ్యూరోక్రాట్, ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ జనరల్ సెక్రటరీ పీవీఎస్ శర్మ తన 'ఎక్స్' ఖాతా ద్వారా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. మంత్రి తన అధికారిన్ని దుర్వినియోగం చేస్తూ చిన్నచిన్న దుకాణాల్లో తనిఖీలు చేస్తూ రేషన్ డీలర్లను భయపెడుతుండటాన్ని ఆయన తప్పుబట్టారు. 'మంత్రి అధికారం ఉంది కదా అని చిన్నచిన్న దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ఇది చట్ట విరుద్ధం. ఎటువంటి వారెంట్ లేకుండా మంత్రి ఆ ప్రాంతంలోకి ప్రవేశించడానికి వీల్లేదు. ఈ రాజ్యాంగ విరుద్ధమైన మంత్రి ప్రవర్తనను ఏపీ సీఎం చంద్రబాబు గమనిస్తారని ఆశిస్తున్నా' అని ట్వీట్ చేశారు. అలాగే ఈ పోస్టును డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు కూడా ట్యాగ్ చేశారు.

సమగ్ర విచారణ తర్వాతే ఉచిత ఇసుక పంపిణీ

అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): గబ్బాడ స్టాక్ పాయింట్‌లో ఇటీవల వరకు జరిగిన ఇసుక విక్రయాలపై సమగ్ర విచారణ చేసిన తర్వాతే ఉచిత ఇసుక పంపిణీని ప్రారంభించాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఆయన సోమవారం నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఇసుక స్టాక్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మైనింగ్ ఎండీ ప్రవీణ్‌కుమార్‌తో ఫోనులో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా, జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులకు తెలియకుండా రాజమండ్రి నుంచి వేల టన్నుల ఇసుకను గబ్బాడ డిపోకు తరలించారని చెప్పారు. రాజమండ్రి నుంచి తీసుకొచ్చిన ఇసుక ఎంత, ప్రభుత్వ పరంగా ఎంత విక్రయించారు, ప్రస్తుతం నిల్వ ఎంత ఉందనేది తేల్చాలని కోరారు. విచారణ అనంతరం గబ్బాడ స్టాక్ పాయింట్‌లో ఉచిత ఇసుక పంపిణీని ప్రారంభిస్తామన్నారు. అనకాపల్లి జిల్లాకు ప్రత్యేకంగా ఒక రీచ్ కేటాయించాలని మైనింగ్ విభాగం ఎండీని అయ్యన్నపాత్రుడు కోరారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేస్తామని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి మంచి అవకాశం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు ఇదే మంచి అవకాశమని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో బీజేపీ ప్రజాప్రతినిధుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలంతా కూటమితో కలిసి సమన్వయంతో కలిసి బీజేపీకి గొప్ప విజయాన్ని అందించారన్నారు. రాబోయే రోజుల్లో 50 మంది ఎమ్మెల్యేలను, 10 మంది ఎంపీలను గెలిపించుకునే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కొత్తవారికి కూడా అవకాశం.. ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ మాట్లాడుతూ బీజేపీ విభిన్న సంస్కృతులు గల విలక్షణ పార్టీ అన్నారు. 2019–24 మధ్య అరాచక పాలన సాగిందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయని విమర్శించారు. అన్ని శాఖలను దోచుకుని, వాటి అర్థాలు సైతం మార్చేశారన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో పాలన సాగిందని తెలిపారు.

పవన్.. ఇప్పుడు స్పందించవెందుకో!?

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి



పగిడ్యాల: అత్యంత పాశవికంగా ఓ మైనర్ బాలికపై హత్యాచారం జరిగి.. పది రోజులవుతున్నా రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి నిలదీశారు. సోమవారం ఆమె నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ఎల్లాల గ్రామంలో బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం డాక్టర్ శశికళారెడ్డి మాట్లాడుతూ ఇదే పవన్ కళ్యాణ్ సుగాలి ప్రీతిబాయి ఘటనపై నానా రాద్ధాంతం చేశారని, డిప్యూటీ సీఎం అయ్యాక నోరెందుకు పెగలడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉంటే ఒకలా, లేకపోతే ఒకలా మాట్లాడడం పవన్‌కే చెల్లిందని విమర్శించారు. అలాగే ఆలస్యంగా స్పందించిన రాష్ట్ర హోంమంత్రి అనిత మైనర్ బాలిక కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం కంటితుడుపు చర్యేనని, రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు నిందితుల నుంచి నిజాన్ని ఎందుకు రాబట్టలేకపోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యురాలు న్యాయవాది శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలిక ఎక్కడ బాబు?

పది రోజులైనా ఆచూకీ లేని చిన్నారి.. నాడు ప్రగల్భాలు పలికి నేడు మౌనముద్రలో సీఎం, డిప్యూటీ సీఎం

సాక్షి, అమరావతి/నందికొట్కూరు

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళలు, బాలికలపై అఘాయిత్యాల విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నానా యాగీ చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిగా ఉండి కూడా నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల గిరిజన బాలిక అదృశ్యంపై నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన జరిగి ఇప్పటికి పది రోజులైంది. దీనిపై ప్రభుత్వ తీరు అత్యంత సందేహాస్పదంగా మారింది. అసలు ఆ బాలిక జీవించి ఉందో లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదు. ఆ బాలికను అత్యాచారం చేసి హత్య చేసినట్లు మీడియాకు లీకులివ్వడం విడ్డూరంగా ఉంది. వారంరోజులుగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు సాగిస్తున్న డ్రామా వెనుక పెద్ద గూడుపుఠాణి ఉందన్నది స్పష్టమవుతోంది. బాలిక అదృశ్యం వెనుక ఉన్న టీడీపీ పెద్దల కుటుంబ సభ్యులను కాపాడేందుకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ముగ్గుర్ని అరెస్టుచేశామని హోంమంత్రి అనిత సోమవారం చెప్పగా.. నంద్యాల పోలీసులు మాత్రం అరెస్టుచేసినట్లు చెప్పనేలేదు. అంటే ఆ ముగ్గుర్ని అరెస్టు చూపించడం ద్వారా అసలు దోషులను కాపాడేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కాగా పన్నాగం పన్నిందన్నది సుస్పష్టమవుతోంది.

చంద్రబాబు, పవన్‌పై జనాగ్రహం..

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇప్పటివరకూ ఈ వ్యవహారంపై నోరు మెదపకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. వారెందుకు మౌనం వహించారని ప్రజలు, ప్రజా సంఘాల వాళ్లు ప్రశ్నిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ దత్తత తీసుకున్న కొణిదెల గ్రామానికి కూతవేట దూరంలో బాలిక అదృశ్యమై పది రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో లా అండ్ ఆర్డర్ అంటే ఇదేనా పవన్ అని వారు సూటిగా ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్రాథమిక ఆధారాలు కూడా లభించకపోవడం విడ్డూరం.

బాలిక తల్లిదండ్రుల మొర వినిపించిందా?

అదృశ్యమైన గిరిజన బాలిక ఎక్కడుంది చంద్రబాబు? మీరు పాలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో అయిదో తరగతి విద్యార్థిని ఈనెల 7న అదృశ్యమైందనే విషయం తెలుసా అసలు? శ్వేతపత్రాల పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించే హడావుడిలో ఉన్న మీకు 'మా అమ్మాయిని సురక్షితంగా తీసుకురండి.. కనీసం బతికుందో లేదో చెప్పండి'.. అన్న ఆమె తల్లిదండ్రుల మొర వినిపించనేలేదు. కనీసం హోంమంత్రిని పంపించి ధైర్యం చెప్పాలనిపించలేదు. ఆ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డితోనైనా ధైర్యం చెప్పించారా?

ఈ ఒక్క బాలికనైనా తీసుకురండి పవన్..

రాష్ట్రంలో వలంటీర్లు ఏకంగా 34వేల మంది బాలికలను అదృశ్యం చేశారని ఎన్నికల ముందు నానా యాగీ చేసిన పవన్.. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో నోరెందుకు మెదపడంలేదు!? తమ బిడ్డను సురక్షితంగా తమకు అప్పగించాలని బాలిక తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. మరి మీరెందుకు ఆ బాధిత తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేదు? పోలీసు అధికారులను ఎందుకు ప్రశ్నించలేదు? గిరిజన బాలిక విషయంలో మీరెందుకు చిత్తశుద్ధి చూపించలేదు? ఈ ఒక్క బాలికనైనా తీసుకొచ్చి చూపించండి పవన్!

దర్యాప్తు పక్కదారి పట్టిస్తున్న పోలీసులు..

ఇక గిరిజన బాలిక అదృశ్యం కేసును పోలీసు శాఖ ఉద్దేశపూర్వకంగా కేసును పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఈనెల 7న ఉదయం నుంచి బాలిక కనిపించడంలేదు. అదేరోజు సాయంత్రం ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 48 గంటలపాటు పోలీసులు పట్టించుకోలేదు. రెండ్రోజుల తర్వాత ఆమె తల్లిదండ్రులు ధర్నా చేశాకే పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారం రోజులుగా విచారిస్తున్నారు. అయినా, బాలిక ఆచూకీపై పోలీసులు స్పష్టత ఇవ్వకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఎందుకంటే ఆ ముగ్గురే బాలికను అత్యాచారం చేసి హత్యచేసినట్లు పోలీసులే మీడియాకు లీకులివ్వడం ప్రశ్నార్థకంగా మారింది. మృతదేహం కోసం పోలీసుల గాలింపు సందేహాస్పదంగా ఉంది. నిందితులు చెప్పారంటూ మూడుచోట్ల గాలించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో.. చంద్రబాబు ప్రభుత్వం సోమవారం చేసిన హడావుడితో ఈ కేసులో అసలు దోషులను కాపాడేందుకు సిద్ధమైందన్నది తేలిపోయింది. బాలిక అదృశ్యం వెనుక కొందరు టీడీపీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులుగానీ సన్నిహితుల పాత్రగాని ఉందని ముచ్చుమర్రిలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. బాలిక సురక్షితంగా ఉందా.. అత్యాచారం చేశారా.. హత్య చేశారా అన్నది ఇప్పటివరకూ పోలీసులు తేల్చలేదు.

ఆ ముగ్గుర్ని చంపేయాలి

పది రోజులైనా మా పాప ఏమైందో చెప్పలేకపోతున్నారు. మా పాపను అత్యాచారం చేసి చంపేశామని ముగ్గురు చెబుతున్నా పోలీసులు వారిని ఏమీచేయలేకపోతున్నారు. వాళ్లను కాల్చేస్తేనే మా పాప ఆత్మకు శాంతి కలుగుతుంది. మరో ఆడబిడ్డకు ఇలాంటి పరిస్థితి రాకూడదంటే వాళ్లను చంపేయాలి'.. అని బాలిక తల్లిదండ్రులు అంటున్నారు.




ముచ్చుమర్రి ఎత్తిపోతల కాలువలో గాలింపు

ముగ్గురు నిందితులు అరెస్టు : హోంమంత్రి

ఇక నంద్యాల జిల్లాలో గిరిజన బాలిక ఘటన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టుచేశామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. బాలిక మృతదేహం ఆచూకీ ఇంకా లభించలేదని ఆమె సోమవారం మీడియాకు చెప్పారు. ఈ ఘటనలో నిందితులను విడిచిపెట్టే ప్రసక్తేలేదన్నారు. బాధితురాలి కుటుంబానికి రూ.10 లక్షలు, విజయనగరం జిల్లాలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయంగా చంద్రబాబు ప్రకటించారని ఆమె తెలిపారు. మరోవైపు.. నంద్యాల జిల్లా పోలీసులు మాత్రం నిందితులను అరెస్టుచేసినట్లు సోమవారం అర్ధరాత్రి వరకు వెల్లడించలేదు.

నిన్ను చంపేస్తే మా నాన్న మేనేజ్ చేస్తారు

కర్నూలు కల్చరల్: తెలుగుదేశం నాయకుడి కుమారుడు, రాయలసీమ విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ పీజీ సీనియర్ విద్యార్థి రామ్‌ప్రకాష్ సోమవారం వీరంగం వేశాడు. తన జూనియర్ విద్యార్థి జి.సురేష్‌బాబును బయటినుంచి వచ్చిన స్నేహితులతో కలిసి దూషిస్తూ తీవ్రంగా కొట్టాడు. బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఫేర్‌వెల్ పార్టీకి సంబంధించి డాటా సైన్స్ ల్యాబ్‌లో డెకొరేషన్, క్యాటరింగ్, సౌండ్ సిస్టమ్ పనులను తాను చెప్పినట్లు చేయలేదని సురేష్‌బాబు మీద రామ్‌ప్రకాష్ దాడిచేశాడు. అతడితోపాటు బయటి నుంచి వచ్చిన అతడి స్నేహితులు కూడా సురేష్‌బాబును తీవ్రంగా కొట్టారు. దీనిపై సురేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 'మా నాన్న టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జేమ్స్. నిన్ను కొట్టి చంపేస్తే ఎస్పీని మ్యానేజ్ చేస్తారు. కర్నూలులో ఉన్న సీఐలను, ఎస్ఐలను మ్యానేజ్ చేస్తారు.



సురేష్‌పై దాడి ఘటనలో వాచిన మోచేయి పైభాగం, తొడ భాగం

దాడిచేసినట్లు పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ ఇస్తే నేను నిన్ను చంపేస్తా..' అని రామ్‌ప్రకాష్ వార్నింగ్ ఇచ్చినట్లు సురేష్‌బాబు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారినుంచి తనకు ప్రాణహాని ఉందని తెలిపాడు. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గొడవ జరిగినట్లు తమకు ఆలస్యంగా తెలిసిందన్నారు. సురేష్‌బాబుతో మాట్లాడామని, బయటి వ్యక్తులు వచ్చి దాడిచేసినట్లు తెలిస్తే కేసు పెడతామని చెప్పారు. రామ్‌ప్రకాష్ తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడతామన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.టి.కె.నాయక్ సమక్షంలో మంగళవారం ఇద్దరు విద్యార్థులతో మాట్లాడి జరిగిన విషయం తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'కాంచనగంగ'పై నవరత్నాల బ్యానర్ ప్రదర్శించిన సురేష్‌బాబు

గాయపడిన సురేష్‌బాబు పర్వతారోహకుడు. 2022 మే 21న ప్రముఖ పర్వతాల్లో ఒకటైన కాంచనగంగ పర్వతాన్ని అధిరోహించి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల బ్యానర్‌ను ప్రదర్శించాడు. రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన ఇలాంటి విద్యార్థిపై దాడిచేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు అమన్ అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

పారామౌంట్‌కాలనీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విదేశాల నుంచి కొకైన్ సహా వివిధ రకాలైన డ్రగ్స్ ఖరీదు చేస్తున్న వీళ్లు తమ ఏజెంట్ల ద్వారా దేశవ్యాప్తంగా అనేక మంది పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నారు. నైజీరియా నుంచి వచ్చి బెంగళూరులో హోమ్ సర్వీస్ పని చేస్తున్న అనోహ బ్లెస్సింగ్ వీరికి ప్రధాన ఏజెంట్‌గా ఉంది. ఈమె హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, గోవాల్లో ఉన్న పెడ్లర్స్, సెల్లర్స్‌కు మాదకద్రవ్యాలు సరఫరా చేసింది. ఏడాదిన్నర కాలంలో 20 సార్లు నగరానికి మాదకద్రవ్యాలు తెచ్చింది. డ్రగ్స్‌ను హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని, విమానాలు, రైళ్లలో తిరుగుతూ సప్లై చేస్తుంటుంది. ఈ డ్రగ్స్‌ను నిజాం కాలేజీ విద్యార్థిగా ఉన్న నైజీరియన్ అజీజ్ నోహీమ్ అడెషోలా, బెంగళూరులో ఉంటూ ఓ కంపెనీకి లీడ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న విశాఖ వాసి అల్లం సత్య వెంకట గౌతమ్, అమలాపురం నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న కారు డ్రైవర్ సనబోయిన వరుణ్ కుమార్, బండ్లగూడకు చెందిన ఈవెంట్స్ కొరియోగ్రాఫర్ మహ్మద్ మెహబూబ్ షరీఫ్‌లకు పంపిణీ చేస్తోంది. వీళ్లు తమ వినియోగదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

గ్రాముకు రూ.500 కమీషన్

2018 నుంచి ఈ దందాలో ఉన్న అనోహ ఆఫ్రికా నుంచి జోయినా గోమెస్ పేరుతో నకిలీ పాస్‌పోర్టు తీసుకుని వినియోగిస్తోంది. తరచూ బెంగళూరు–హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న గౌతమ్... అనోహ ద్వారా అందుకున్న డ్రగ్స్‌ను పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. ఒక్కో గ్రాముకు రూ.500 చొప్పున కమీషన్ తీసుకుంటూ డెలివరీ ఇస్తున్నాడు. ఇటీవలే ఇద్దరు నైజీరియన్లు ఇతడి బ్యాంకు ఖాతాలోకి రూ.13.24 లక్షల కమీషన్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇతడు ఐదు నెలల క్రితమే ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమె బ్యాంకు ఖాతాలోకి రూ.2.5 లక్షల కమీషన్ డిపాజిట్ చేయించాడు. ఇతడు గత ఏడు నెలల్లో 2.6 కేజీల కొకైన్ క్రయవిక్రయాలు చేసినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వరుణ్ కుమార్‌కు తన వినియోగదారుడైన మధు ద్వారా గౌతమ్‌తో పరిచయం ఏర్పడింది. అలా ఈ దందాలోకి వచ్చిన ఇతడు నైజీరియన్ల నుంచి గ్రాము రూ.8 వేలకు ఖరీదు చేసి, రూ.12 వేలకు విక్రయిస్తున్నాడు. ఇలా ఆరు నెలల కాలంలో రూ.7 లక్షల వరకు ఆర్జించాడు. వీరి దందాపై టీజీఏఎన్‌బీ అధికారులకు సమాచారం అందింది. దీంతో సోమవారం హైదర్షాకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. అక్కడ ఎబుక, ఫ్రాంక్లిన్ మినహా మిగిలిన ఐదుగురూ చిక్కారు. వీరి నుంచి 199 గ్రాముల కొకైన్, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పెడ్లర్స్ విచారణలో 13 మంది నగరవాసులు తమ నుంచి తరచూ డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్నట్లు బయటపెట్టారు. వీరిలో బంజారాహిల్స్‌కు చెందిన బిల్డర్ అనికేత్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్ వ్యాపారి ప్రసాద్, సినీ నటుడు అమన్‌ప్రీత్ సింగ్, మాదాపూర్ వాసి మధుసూదన్, పంజాగుట్టకు చెందిన నిఖిల్ దావన్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు డ్రగ్ టెస్ట్ చేయగా... కొకైన్ వాడుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో వీరిని అరెస్టు చేసిన అధికారులు పరారీలో ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నారు. డ్రగ్స్‌పై సమాచారం తెలిస్తే 8712671111కు తెలపాలని కోరారు. ఎబుక, ఫ్రాంక్లిన్ సమాచారం అందిస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

జనసేన జెండాలో శ్రీచక్రాన్ని తొలగించాలి

- ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్

హైదరాబాద్: పరబ్రహ్మ స్వరూపం అయిన ఆదిపరాశక్తి అమ్మవారి శ్రీచక్ర యంత్రాన్ని జనసేన పార్టీ తన జెండాకు ఉపయోగించడం అన్యాయమని, ఇది అమ్మవారిని, హైందవ ధర్మాన్ని అవమానించడమేనని ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు శ్రీచక్ర యంత్రంతో రాజకీయాలు చేస్తూ, అమ్మవారిని అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. ఈ చిహ్నాన్ని అనుమతించిన రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఇందుకు బాధ్యత వహించాలన్నారు. ఈ అంశంపై తెలంగాణ డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. శ్రీచక్ర యంత్రాన్ని పవన్ జెండానుంచి ఉపసంహరించుకోవాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఆరెస్సెస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీల సన్మానసభలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: బీజేపీ మాతృ సంస్థ ఆరెస్సెస్ గొప్ప ఆర్గనైజేషన్ అని.. దాని నుంచి జనసేన నేతలు స్ఫూర్తి తీసుకోవాల్సిన అవసరం ఉందని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచించారు. స్వయంసేవక్‌లు ఎంతసేపు దేశం, సమాజమంటూ చాలా నిస్వార్థంగా ఉంటారని చెప్పారు. వారి నుంచి జనసేన శ్రేణులు ప్రేరణ తీసుకుని నిస్వార్థంగా పనిచేయాలని చెప్పారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జనసేన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పవన్ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొన్నటి ఎన్నికల్లో జనసేన తీసుకున్న 21 సీట్లే కూటమి విజయానికి వెన్నెముక అంటూ వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఐదేళ్ల కాలం గిర్రున తిరిగిపోతుంది. వైఎస్సార్‌సీపీ నేతలు మనకు శత్రువులు కాదు, ప్రత్యర్థులు మాత్రమే. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడొద్దు.

టీటీడీ చైర్మన్ పదవి 50 మంది అడిగారు..

నన్ను కలవాలనుకునే నాయకులు మూడు వారాలు ముందుగా తెలియజేయండి. టీటీడీ చైర్మన్ కావాలని 50 మంది అడిగారు. అక్కడ ఉంది ఒక్కటే. నాగబాబు గారికి అలాంటి కోరికలు లేవు. నామినేటెడ్ పదవులు మనకున్న పరిమితమైన స్థానాలవల్ల జాగ్రత్తగా పంచుకోవాలి.. సర్దుబాటు చేసుకోవాలి. చంద్రబాబు దగ్గరకు నేను వీటిని ఎలా తీసుకెళ్లాలో తెలీడంలేదు. మా పార్టీ సంగతి ఏంటని ఆయన అంటే నేను ఏం చెప్పగలను? మీ అభ్యర్థనలను హరిప్రసాద్, నాగబాబు దృష్టికి తీసుకురండి. నంద్యాలలో జరిగిన సంఘటనపై నన్ను స్పందించమని జాతీయ మీడియా ప్రతినిధులు నన్ను కోరితే మాట్లాడనని చెప్పా. శాంతిభద్రతలు చాలా బలంగా ఉండాలి.

జగన్ ప్రభుత్వ ఉత్తమ విధానాలపై

ఎన్‌హెచ్‌ఎం వర్క్‌షాప్‌లో చర్చ

సాక్షి, అమరావతి: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యాన విజయవాడలో సోమవారం ప్రారంభమైన నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) 3వ రీజనల్ వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావులేకుండా గత ప్రభుత్వం అమలు చేసిన ఉత్తమ విధానాలపై చర్చించారు. రెండు రోజులు నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో ఉత్తరప్రదేశ్, తెలంగాణ, కేరళ, ఏపీ సహా దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో వివిధ రాష్ట్రాల్లో అమలుపరిచిన ఉత్తమ విధానాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు. ఈ మేరకు వైద్యరంగంలో మానవవనరుల అంశానికి సంబంధించి గడచిన ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏపీలో అనుసరించిన విధానాలపై వైద్యశాఖ ప్రజెంటేషన్ ఇచ్చింది. ఐదేళ్లలో సుమారు 53వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశారు. జీరో వేకెన్సీ పాలసీని తెచ్చి వైద్యశాఖలో ఎప్పుడు ఏర్పడే ఖాళీలను అప్పుడే భర్తీ చేపట్టేలా అత్యవసర అనుమతులు ఇవ్వడంతోపాటు నియామకాల కోసం ప్రత్యేకంగా మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్పెషలిస్ట్, సూపర్‌స్పెషాలిటీ వైద్యుల పోస్టుల భర్తీ కోసం పలు దఫాలుగా వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించి, ఇతర రాష్ట్రాల్లోని వైద్యులను ఆహ్వానించి పోస్టులు భర్తీ చేశారు. ఈ అంశాలన్నింటినీ వైద్యశాఖ వివరించినట్లు సమాచారం. అదేవిధంగా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం నాటి సీఎం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంపై కూడా వర్క్‌షాప్‌లో చర్చించినట్లు తెలిసింది.

అటల్ ల్యాబ్స్‌తో విద్యార్థులకు విజ్ఞానం

సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందిస్తున్నట్లు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జమ్మూ కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, యూనిసెఫ్ ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడి అటల్ టింకరింగ్ ల్యాబ్ పనితీరు, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. అనంతరం వారు ఎస్పీడీ, ల్యాబ్ మెంటార్స్ అయిన ఇంజినీరింగ్ విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెంటార్స్‌ను ఎస్పీడీ శ్రీనివాసరావు సత్కరించారు. కాగా, ప్రతినిధులు మంగళవారం రెడ్డిగూడెం, మొవ్వ పాఠశాలలను సందర్శించనున్నారు. ఏఎస్పీడీ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎస్.మస్తానయ్య, అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రతినిధి ప్రతీక్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలపై మంత్రి కొండపల్లి సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలపై ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం సమీక్షించారు. విజయవాడలోని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాలపై ఆరా తీశారు. వాటికి సంబంధించిన పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. సమావేశంలో కార్పొరేషన్ సీఈవో ఆదర్శ రాజేంద్రన్, ఈడీ సుదర్శన్ బాబు, ఏడీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

తమిళ యూట్యూబర్ అరెస్ట్

వీడియో పోస్టింగ్‌పై విచారణ

తిరుమల: శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల సర్వదర్శనం క్యూలైన్‌లో ప్రాంక్ వీడియోలను పోస్ట్ చేసిన తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన యూట్యూబర్ వి.వైకుంఠవాసన్, గోవిందరాజ రామస్వామిలను తిరుమల టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ నెల 11న శ్రీవారి సర్వదర్శనం క్యూ లైన్‌లో యూట్యూబర్ ప్రాంక్ వీడియో చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం, ఆలయ గౌరవానికి భంగం కలిగించడం , భక్తుల మధ్య శాంతి, భద్రతలకు విఘాతం కలిగించడంపై టీటీడీ సైబర్ సెక్యూరిటీ విభాగం అధికారి తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ సత్యనారాయణ నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు.

కేసీఆర్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన ఈ పిటిషన్ సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తొలుత కేసీఆర్ తరఫు న్యాయవాది.. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరంటూ పాస్‌ఓవర్ కోరారు. దీనికి ధర్మాసనం అనుమతించింది. బెంచ్‌ముందున్న మిగిలిన కేసుల విచారణ పూర్తయ్యేసరికి కోర్టు సమయం ముగిసే దశకు చేరుకుంది. సమయాభావం వల్ల కేసీఆర్ పిటిషన్ విచారణ చేపట్టలేమని, మంగళవారం విచారిస్తామని సీజేఐ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించగా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను కేసీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.



ఉన్న జీవితాన్ని ఆనందించలేకపోవడం,
అయినప్పటికీ మృత్యువును ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు భయపడటం...
రెండింటిలో లోతైన వైరుధ్యం ఉంది.

– యోషిదా కెంకో

సాక్షి

మంగళవారం, 16 జూలై 2024

మారకుంటే... ముప్పు

రక్తసిక్త అమెరికా రాజకీయ చరిత్రలో కొత్త పేజీ అది. అమెరికా దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా నేడో రేపో అధికారికంగా ఖరారవుతారని భావిస్తున్న మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌పై పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ వద్ద శనివారం జరిగిన కాల్పులు, హత్యాయత్నంతో అగ్రరాజ్యమే కాదు... యావత్ ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఓ ఎన్నికల ర్యాలీలో చేసిన ఈ దాడిలో దుండగుడి తుపాకీ తూటా ట్రంప్ కుడి చెవి పైభాగాన్ని రాసుకుంటూ, రక్తగాయం చేసి పోయింది. నిఘా వర్గాల భద్రతా వైఫల్యాన్ని బట్టబయలు చేసిన ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ఆయన బయట పడ్డారు. ఎన్నికల బరిలో ట్రంప్‌కు ప్రధాన పోటీదారైన ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సహా ప్రపంచ దేశాల నేతలందరూ ఈ దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన ఇరవై ఏళ్ళ వ్యక్తిని భద్రతా దళాలు మట్టుబెట్టారన్న మాటే కానీ, ఈ దుశ్చర్య వెనుక అసలు కారణాలు లోతైన దర్యాప్తులో గానీ వెలికిరావు. తాజా దాడి ఘటనతో అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయావకాశాలు పెరుగుతాయని ఓ అంచనా. అది నిజం కావచ్చు. కానీ, అంతకన్నా కీలకమైనది ఇంకోటుంది. ప్రపంచంలోని అతి ప్రాచీన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకొనే నేలపై ఆ స్ఫూర్తి వెనకపట్టు పట్టి, హింసాకాండ చెలరేగుతోంది. అమెరికా సమాజమే కాదు... ప్రపంచమంతా ఆందోళన చెందాల్సిన విషయమిది.

అమెరికాలో నేతలపై దాడులు, హత్యాయత్నాలు ఇదే తొలిసారి కాదు. గతంలో అబ్రహామ్ లింకన్, జాన్ ఎఫ్. కెనడీ సహా నలుగురు దేశాధ్యక్షులు దుండగుల దుశ్చర్యలకు బలయ్యారు. రీగన్, థియోడర్ రూజ్‌వెల్ట్ లాంటి వాళ్ళు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, తాజా ఘటన జనంలో మునుపెన్నడూ లేని రీతిలో పేరుకున్న అణిచిపెట్టుకున్న ఆగ్రహానికీ, చీలికకూ ప్రతీకగా కనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే, ట్రంప్‌పై హత్యాయత్న ఘటన జరిగిన కొద్ది గంటల తరువాత కూడా అమెరికాలో రాజకీయ భాష రెచ్చగొట్టే విధంగా సాగడం విషాదం. ఘటన జరిగిన మూడు గంటలకే రక్తసిక్తమైన ట్రంప్ పిడికిలి బిగించిన ఫోటోలతో టీషర్టులు ఆన్‌లైన్‌లో అమ్మకానికి వచ్చేశాయి. ఈ జగడాలమారి వైఖరిని చూస్తుంటే, అగ్రరాజ్యంలో నేతలు పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. విలువలు మరచిన మాటల దాడితో వేడెక్కుతున్న ఎన్నికల వాతావరణంలో ప్రజల్లో తీవ్రమైన ఇష్టానిష్టాలు ప్రబలి, పరిస్థితి ఎక్కడి దాకా పోయే ప్రమాదం ఉందో చెప్పడానికి ట్రంప్‌పై దాడి తార్కాణం. ఎన్నికలను యుద్ధంలా, రక్తం చిందించైనా సరే గెలవడమే పరమావధిగా భావించడం అతి పెద్ద తప్పు. ఇది అమెరికాయే కాక ప్రజాస్వామ్య దేశాలన్నీ విస్మరించలేని పాఠం.

ఈ పాపంలో అన్ని పార్టీలకూ భాగం ఉంది. అనేక జాతులు, తెగలతో కూడిన అమెరికా రాజకీయ వ్యవస్థలో విభేదాలు సహజమే. కానీ, ట్రంప్ మళ్ళీ పగ్గాలు చేపడితే అది అమెరికాకు విలయమేనంటూ డెమోక్రాట్లు ప్రచారం సాగిస్తూ వచ్చారు. రిపబ్లికన్లు, ట్రంప్ సైతం సైద్ధాంతికంగా దిగజారుడుతనంలో తక్కువ తినలేదు. అమెరికాలో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ప్రతీకగా దేశ చట్టసభకు పీఠమైన యూఎస్ క్యాపిటల్ భవనాన్ని చుట్టుముట్టి, 2021 జనవరి 6న ట్రంప్ అనుకూల మూకలు యథేచ్ఛగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్య సౌధంలో ప్రమాద ఘంటికలు మోగాయి. తాజా హత్యాయత్నానికి డెమోక్రాట్లు, బైడెన్‌ల ప్రచార ధోరణే కారణమంటూ ట్రంప్ సహచరులు విరుచుకుపడుతున్నారు. ఒక్కమాటలో... అగ్రరాజ్యమనీ, భూతల స్వర్గమనీ అనుకొనే అమెరికాలో పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పెరుగుతున్న హింసాత్మక ధోరణులు, పార్టీల వారీగా నిలువునా చీలిపోయిన జనం, ఆగని రాజకీయ హింస అక్కడి సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఆ దేశంలో తుపాకీ సంస్కృతి పెను సర్పమై బుసలు కొడుతోంది.

అమెరికాలో తుపాకీలు బజారులో అతి సులభంగా కొనుక్కోవచ్చన్నది జగమెరిగిన సత్యం. అమెరికా రాజ్యాంగ ప్రకారం ఆత్మరక్షణార్థం ఆయుధాలు కలిగివుండే హక్కు పౌరులకుంది. అమెరికా వయోజనుల్లో ప్రతి పది మందిలో నలుగురింట్లో తుపాకులున్నాయి. చిత్రమేమిటంటే, 2023 జూన్ నాటి ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వే ప్రకారం తుపాకీ చేతిలో ఉంటే చట్టాన్ని పాటించే పౌరులుగా తమను తాము కాపాడుకోవచ్చని నూటికి 49 మంది అమెరికన్లు భావిస్తున్నారు. మరోమాటలో అమెరికన్ సమాజానికి దేశ శాంతి భద్రతలపై అంతటి అపనమ్మకం ఉందనుకోవచ్చు. మరి, పౌరుల చేతిలోని ఈ ఆయుధాలు తప్పులు చేసేవారి చేతుల్లో పడితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. దేశంలో పాఠశాలలు, వాణిజ్యభవన సముదాయాల్లో విచక్షణారహితమైన కాల్పుల ఘటనల నుంచి తాజా హత్యాయత్నం దాకా అనేక సంఘటనలే అందుకు సమాధానాలు. తుపాకీలపై నియంత్రణలున్నంత మాత్రాన ఈ ఘటనలు జరగవని కాదు కానీ, లేనప్పుడు జరిగే అవకాశాలు ఇంకా ఎక్కువని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు.

ప్రస్తుతం అమెరికా ముందు, ఆ దేశ రాజకీయ నేతలు, పార్టీలు, ప్రజల ముందు ఓ పెను సవాలుంది. అంతకంతకూ దిగజారుతున్న పరిస్థితులు, పేట్రేగుతున్న రాజకీయ విద్వేషం, హింసలకు అడ్డుకట్ట వేయాల్సింది వారే. అన్ని పక్షాలూ కళ్ళు తెరిచి, ఈ పతనాన్ని నివారించాలి. అతివాదాన్ని నిరసించాలి. ఎన్నికల ప్రచారంలో పరస్పర గౌరవంతో సైద్ధాంతిక చర్చలే అనుసరణీయ మార్గమన్న తమ మౌలిక సూత్రాలనే మళ్ళీ ఆశ్రయించాలి. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదనీ, ఎన్నికలొక్కటే సామాజిక, రాజకీయ సమస్యలన్నిటికీ పరిష్కారమని ఓటర్లు తమ తీర్పు ద్వారా మరోసారి చాటాలి. అలా కాక, ఇలాంటి ఘటనల్ని వాటంగా చేసుకొని ఎవరికి వారు మరింత రెచ్చగొట్టుడు ధోరణికి దిగితే కష్టం. అది ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, **తిథి:** శు.దశమి సా.5.05 వరకు, తదుపరి ఏకాదశి,
నక్షత్రం: విశాఖ రా.11.57 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** లేదు,
దుర్ముహూర్తం: ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.31 నుండి 4.12 వరకు,
కర్కాటక సంక్రమణం, దక్షిణాయన ప్రారంభం.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సభాపతులే పక్షపాతం ప్రదర్శిస్తే..!

విశ్లేషణ



అజయ్ కె మెహ్రా

స్వరాజ్ పార్టీతో తన సంబంధాలను తెంచుకోవడం ద్వారా స్పీకర్ స్థానానికి విఠల్‌భాయ్ పటేల్ ఆరోగ్యకరమైన ప్రారంభాన్ని ఇచ్చారు. 1946లో సెంట్రల్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైనప్పుడు, జి.వి. మావలంకర్ 'కాంగ్రెస్‌వాడిని అయినప్పటికీ... నిష్పక్షపాతంగా వ్యవహరించడం, పార్టీకి చెందిన అన్ని అంశాలకు అతీతంగా ఉండటం నా కర్తవ్యం' అన్నారు. 1956లో స్పీకర్ పదవిని చేపట్టడం కోసం, ఎం.ఏ. అయ్యంగార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 1970ల నాటికి లోక్‌సభ స్పీకర్ నిష్పాక్షికత బలహీనపడటం మొదలైంది. ఇక ప్రస్తుత లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రిసైడింగ్ అధికారులిద్దరూ తమ పార్టీ ఆదేశాల మేరకు భారత పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కడం ద్వారా, వెస్ట్ మినిస్టర్ సంప్రదాయాలకు కళంకం తెస్తున్నారు.

స్పీకర్ అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కోసం నిష్పక్షపాతంగా ఉంటారు. అన్ని అంశాలను నిర్ణయించే ముఖ్యమైన న్యాయపరమైన విధులను స్పీకర్‌కు సభ వదిలివేయవచ్చు.

– సర్ ఐవర్ జెన్నింగ్స్,
పార్లమెంట్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, 1957

18వ లోక్‌సభ మొదటి సెషన్ జూన్ 24న సమావేశమైనప్పుడు, బీజేపీ మెజారిటీని కలిగి ఉన్న 16వ, 17వ లోక్‌సభలలో రాజకీయ పార్టీలు విడిచిపెట్టిన చోట నుండే పక్షపాతం తిరిగి ప్రారంభమైంది. సహజంగానే, లోక్‌సభ స్పీకర్‌కు పోటీ, 'ఎన్నిక', సభ తదుపరి కార్యకలాపాల నిర్వహణ వంటివి 'నిష్పక్షపాతానికి' చాలా దూరంగా ఉన్నాయి. బ్రిటిష్ పార్లమెంట్ గురించిన తన విశిష్ట అధ్యయనంలో సర్ జెన్నింగ్స్ ఇలాంటి స్థితి గురించి వివరంగా నమోదు చేశారు.

వాస్తవానికి, రాజ్యాంగానికి తగిన గౌరవం ఇవ్వకపోగా, దాని సంప్రదాయాన్ని కూడా పక్కనపెట్టి, పార్లమెంటును తన కట్టడిలోనే పనిచేసేలా చూస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ నొక్కి చెప్పింది. లోక్‌సభ, శాసనసభలలో రాజ్యాంగం అమలైనప్పటినుండి కొత్తగా ఎన్నికైన ఎంపీల చేత ప్రమాణ స్వీకారం చేయించడానికి, సభలోని అత్యంత సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించే వెస్ట్‌మినిస్టర్ నమూనాకి చెందిన పురాతన సంప్రదాయానికి ఈసారి తిలోదకాలు ఇచ్చేశారు. సంప్రదాయం ప్రకారమైతే ఆ పదవిని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ ఎంపీకి కేటాయించాల్సి ఉండింది. కానీ ఈసారి పార్లమెంటులో బీజేపీకి చెందిన రెండో సీనియర్ సభ్యునికి ప్రొటెం స్పీకర్ పీఠం దక్కింది.

సహజంగానే, 'మా ఎంపికను అంగీకరించడమే ఏకాభిప్రాయం' అనే రాజకీయ ప్రకటనలో, ఏకాభిప్రాయం కోసం ఏదైనా ప్రతిపక్ష సూచనను ఆశించే, ఆమోదించే అవకాశమే లేదు. ఈ ఏడాది లోక్‌సభలో మోదీ నేతృత్వంలోని బీజేపీ సంపూర్ణ మెజారిటీని ప్రజలు లాక్కుని ఆ పార్టీ బలాన్ని 303 సీట్ల నుంచి 240కి తగ్గించారు. ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ ఏర్పర్చుకున్న కొత్త మిత్రుల దన్నుతో 293 మంది ఎంపీలతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ 99 సీట్లతోనూ, విస్తృత ప్రాతిపదికన 'ఇండియా' కూటమి 234 సీట్లతోనూ తిరిగి రావడం వల్ల, తమను తాము నొక్కి చెప్పుకోగల ప్రతిపక్షంతో, ట్రెజరీ బెంచ్‌లను సర్దుబాటు చేసే కథను పూర్తి చేశాయి. ప్రతిపక్ష నేత కార్యాలయం రాహుల్ గాంధీని ముందుకు నడిపింది.

ఏది ఏమైనప్పటికీ, స్పీకర్ పదవికి పోటీని మొదట ప్రతిపాదించినప్పటికీ, భారతదేశం ఎక్కువగా అనుసరించే వెస్ట్‌మినిస్టర్ సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవిని కేటాయి



స్తారని ఆశించిన ఇండియా కూటమి... ఎన్డీఏ ఎంపిక మేరకు (మోదీ ఎంపిక అని భావించాలి) మునుపటి స్పీకర్ ఓం బిర్లాకు మద్దతు ఇచ్చింది. కానీ ప్రతిపక్షాలకు ఈ ప్రత్యేక పదవిని నిరాకరించడానికి, పదేళ్లపాటు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచారు. దీనిపై ఇప్పటికీ మౌనం కొనసాగించడం అరిష్టదాయకం అనే చెప్పాలి.

హౌస్ ఎక్స్–అఫీషియో ఛైర్మన్ అయిన భారత ఉపరాష్ట్రపతిని ఒక వ్యవస్థ ఎన్నుకున్నప్పుడు రాజ్యసభ ప్రిసైడింగ్ అధికారి ఎవరనే ప్రశ్న పరిష్కరించబడుతుంది. దీనిని తప్పనిసరి చేసే ఆర్టికల్ 89, సభ్యుల నుండి డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికను కూడా తప్పనిసరి చేస్తుంది. ప్రతిపక్షాలకు ఈ పదవిని కల్పించేందుకు రాజ్యాంగపరమైన నిబంధన కానీ, సంప్రదాయం కానీ లేవు. అయితే, 1952 నుండి అనేక సందర్భాల్లో ప్రతిపక్ష ఎంపీ ఈ పదవిని అలంకరించారు.

'ఒకసారి స్పీకర్‌ను నియమించిన తర్వాత, ఆయన తన పార్టీ స్వభావానికి దూరంగా ఉంటాడనీ, అలాగే తనను నియమించిన వారిని సమర్థించకుండా ఉంటాడనీ' బ్రిటన్ సంప్రదాయాలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

స్వరాజ్ పార్టీతో తన సంబంధాలను విఠల్‌భాయ్ పటేల్ తెంచుకున్నప్పుడు, 1926లో తన పార్టీ శాసనసభ్యులతోపాటు వాకవుట్ చేయడానికి నిరాకరించినప్పుడు వెస్ట్ మినిస్టర్ వ్యవస్థ సంప్రదాయాలకు కట్టుబడి భారతదేశం ఆరోగ్యకరమైన అభ్యాసాన్ని ప్రారంభించింది. విఠల్‌భాయ్ పటేల్ 1927లో కూడా ఈ సంప్రదాయాన్ని అనుసరించారు. 1946లో సెంట్రల్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైనప్పుడు, జి.వి.మావలంకర్ ఇలా అన్నారు: ''కాంగ్రెస్‌వాడిని అయినప్పటికీ, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, పార్టీకి చెందిన అన్ని అంశాలకు అతీతంగా ఉండటం నా కర్తవ్యం''. 1956 మార్చిలో స్పీకర్ పదవిని చేపట్టడం కోసం, ఎంఏ అయ్యంగార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

సర్దార్ హుకుమ్ సింగ్ (1962 నుండి 1967 వరకు లోక్‌సభ స్పీకర్) కూడా తనకు తానుగా ఆరోపణలకు దూరంగా ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ స్పీకర్ పదవికి ఎన్నిక కావడానికి, అధికారంలో ఉన్న లేదా మెజారిటీ పార్టీపై ఆధారపడటం వల్ల పాలక పార్టీల ఆజ్ఞలకు అతడు/ఆమె కట్టుబడాల్సి ఉంటుందనే విషయాన్ని ఆయన గమనించారు. అందుకే 1970ల నాటికి లోక్‌సభ స్పీకర్ నిష్పాక్షికత కాస్త బలహీనపడటంలో ఆశ్చర్యం లేదు. సోమనాథ్ ఛటర్జీ (2004–09) తన నిష్పాక్షికతతో స్పీకర్ కార్యాలయాన్ని ఉన్నతీకరించగా, బలి రామ్ భగత్, బలరామ్ జాఖడ్ వంటి కొందరు స్పీకర్ బాధ్యతలు ముగిసిన తర్వాత తిరిగి కేంద్ర మంత్రివర్గంలో చేరి పనిచేశారు.

ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత ఇద్దరూ స్పీకర్ కుర్చీ వద్దకు ఓం బిర్లాను తీసుకువెళ్లినప్పుడు, ఆయన మోదీ ముందు వంగి కరచాలనం చేయడం, తరువాతి ప్రతిపక్ష నేత వద్ద నిటారుగా నిలబడటం ద్వారా తన విధేయత ఎవరి పట్ల ఉందనే విషయాన్ని స్పష్టం చేశారు. జూన్ 27న శశి థరూర్ 'జై సంవిధాన్' అని చెప్పడం ద్వారా ఎంపీగా తన ప్రమాణ స్వీకారం ముగించినప్పుడు ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కీర్తిస్తూ ప్రమాణం చేయడానికి అభ్యంతరం ఎందుకు అని దీపేందర్ హుడా అడిగినప్పుడు, బిర్లా ఆయన్ని ఆక్షేపించి కూర్చోవాల్సిందిగా కోరారు. ఇది స్పష్టంగానే నిశ్చితమైన పక్షపాతానికి సంకేతం.

స్పష్టంగా ప్రధానమంత్రి సూచనల మేరకు, 1975 నాటి ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా చేసిన తీర్మానం, ఆయన పార్టీ విధేయతకు తిరుగులేని సంకేతం. లోక్‌సభకు సంబంధించిన రూల్స్ అండ్ ప్రొసీజర్‌లోని రూల్ 380 కింద ప్రధాని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలను కూడా ఆయన తొలగించారు. కొన్ని వివాదాస్పద బిల్లులను అడ్డంకులు లేకుండా ఆమోదించడం కోసం 17వ లోక్‌సభలో 100 మంది ప్రతిపక్ష ఎంపీలను బహిష్కరించిన ఈ వ్యక్తి, అధికార పక్షానికి తన విధేయతను ప్రదర్శించారు.

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కూడా ద్వంద్వ పాత్రను పోషిస్తూ, గత పార్లమెంటులో బిల్లులను ఆమోదించడం కోసం 46 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడటానికి సమయం నిరాకరించడం, వారు ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని అడ్డుకోవడం ద్వారా ధన్‌ఖడ్ రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించడంలో పక్షపాత వైఖరిని కొనసాగిస్తున్నారు.

పార్లమెంటులోని ప్రిసైడింగ్ అధికారులిద్దరూ తమ పార్టీ ఆదేశాల మేరకు భారత పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కడం ద్వారా, వెస్ట్ మినిస్టర్ సంప్రదాయాలకు కళంకం తెస్తున్నారు.

వ్యాసకర్త రాజకీయ శాస్త్రవేత్త
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కుళ్లు వ్యవస్థ



చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ సోషల్ మీడియా అకౌంట్లను డిలిట్ చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో ఊహించుకోండి. (తప్పుడు ధ్రువీకరణలతో ఒక అధికారిణి ఐఏఎస్ అయ్యిందన్న కథనాల నేపథ్యంలో.)

– మింటీ శర్మ, వ్యాఖ్యాత

ఏదైనా చెప్పొచ్చు!



మెషిన్ లెర్నింగ్‌కు సంబంధించిన దశాబ్దాల విలువైన గణితం, ప్రాతిపదిక అవగాహనలను విస్మరించి... సాధారణీకృత కథనాలతో మిమ్మల్ని వేలమంది నమ్మేట్టు చేసుకోగలిగే ఒకే ఒక్క వేదిక ట్విట్టర్.

– మరీయా ఐ. వాసిలీవా, ఏఐ సైంటిస్ట్

దేవుడి మీద కాక...



యూకే పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీల్లో 40 శాతం మంది దేవుడి మీద ప్రమాణం చేయడాన్ని ఎంపిక చేసుకోలేదు. ఇందులో ప్రధాని, క్యాబినెట్‌లోని 50 శాతం మంది మంత్రులు కూడా ఉన్నారు. తాజా బ్రిటిష్ సామాజిక వైఖరుల సర్వే ప్రకారం, 53 శాతం మంది జనాలు మతంతో ముడిపడిలేమని వెల్లడించారు. 2021 జనగణనలో ఇలాంటివారి సంఖ్య 37 శాతం మాత్రమే. ప్రపంచంలో మతాచరణ అతి తక్కువగా ఉన్న దేశాల్లో యూకే ఒకటి.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

తీవ్ర అడ్డంకి



స్వర్గాన్ని తలపించే లోయలు, సహజమైన ఊటలు, దట్టమైన అడవులు ఉండే వజీరిస్తాన్(పాకిస్తాన్) పర్యాటకులు కోరుకునే అత్యుత్తమ ప్రదేశం. కానీ తీవ్రవాదం వల్ల దాన్ని ప్రపంచపు కళ్ల నుంచి దాచి వుంచారు.

– ఐమా ఖాన్, మానవ హక్కుల కార్యకర్త

కలిసి పనిచేద్దాం!



మీ హృదయపూర్వక అభినందనలకు ధన్యవాదాలు (భారత) ప్రధాని నరేంద్ర మోదీ! మన పరస్పర లబ్ధి కోసం నేపాల్– ఇండియా సంబంధాలను బలోపేతం చేసేందుకు మీతో సన్నిహితంగా పనిచేయడానికి కట్టుబడి ఉన్నాను. మనం ఉమ్మడిగా మన చారిత్రక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చగలం.

– కె.పి. శర్మ ఓలి, నేపాల్ ప్రధాని

అదా విజయం?



దేశానికి 'అచ్ఛే దిన్' తెస్తాననీ, కోటి ఉద్యోగాలతో ఇండియాను 'అమృత్ కాల్'లోకి నడిపిస్తాననీ వాగ్దానం చేసిన మోదీ మూడోసారి ప్రధానిగా ఉన్నారు. ఇప్పుడు మోదీకి 'ఎక్స్'లో 10 కోట్ల మంది ఫాలోవర్స్ వచ్చిన విజయాన్ని ఆయన తాలుకు అపఖ్యాత ఐటీ సెల్ ఉత్సవం చేస్తోంది. ఇన్‌ఫ్లుయెన్సరా, ప్రధానా?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

తుపాకుల సంగతి?




అమెరికాలో ఏ మూర్ఖుడైనా ఇట్టే ఒక సెమీ–ఆటోమేటిక్ రైఫిల్ సంపాదించగలడు కాబట్టే డొనాల్డ్ ట్రంప్ దాదాపుగా హత్యకు గురయ్యారు. తుపాకుల హింస కారణంగా అమెరికాలో ప్రతీ ఏడాది 40 వేల మంది చనిపోతున్నారు. అయినా ఈ మూల కారణం గురించి ఎవరూ పట్టించుకుంటున్నట్టు లేదు. ఆయుధ మాఫియాను నియంత్రించడానికి ట్రంప్ గానీ, బైడెన్ గానీ పెద్దగా ఏమీ చేయలేదు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

తిరుగుబాటు వీరుడు

తెలుగు నేలపై 1857లో మొదటి స్వాతంత్ర్య పోరాటానికి తెరలేపి అసువులు బాసిన రొహిల్లా వీరుడు తుర్రాబాజ్ ఖాన్. నాటికి నిజాం రాజ్యంలో, దేశం మొత్తంలో సంభవిస్తున్న రాజకీయ పరిణామాలకు ప్రభావితుడైన అతడు పలు బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాల్ని గుల్బర్గా వంటి ప్రాంతాల్లో చేపట్టాడు. అందుకు కఠిన శిక్షలూ అనుభవించాడు. 1857 జూలై 17న హైదరాబాద్‌లోని మక్కా మసీదు దగ్గర జరుగుతున్న రహస్య సమావేశానికి హాజరయ్యాడు. మౌల్వీ సయ్యద్ అల్లాఉద్దీన్ కోఠీలో ఉన్న బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించాలని పిలుపునిచ్చాడు. తానూ ఈ ముట్టడిలో పాల్గొనడానికి అంగీకరించి గుర్రంపై శరవేగంగా బేగం బజారుకు వెళ్లాడు తుర్రాబాజ్. అప్పటికప్పుడు దాదాపు 5 వేల మంది రోహిల్లాలూ, అరబ్బులూ, ఇతరులనూ సమకూర్చుకొని రెసిడెన్సీ వైపుకు కదిలాడు.



తుర్రాబాజ్ ఖాన్

మౌల్వీ సయ్యద్ అల్లా ఉద్దీన్ కూడా తన అనుచర గణంతో పుత్లీ బౌలి మీదుగా పయనించి రెసిడెన్సీ నైరుతి కొన ప్రాంతానికి చేరుకొన్నాడు.

తుర్రాబాజ్, అల్లా ఉద్దీన్‌ల నాయకత్వంలోని ఉద్యమకారులు తొలుత రెసిడెన్సీ పశ్చిమ గోడకు ఎదురుగా గల అబ్బన్ దాస్, జై గోపాల్ దాస్‌ల రెండు పెద్ద గృహాలను, దిల్‌షుక్ గార్డెన్‌ను స్వాధీన పరచుకొని రెసిడెన్సీని ముట్టడించారు. రెండు గేట్లను ధ్వంసం చేశారు. కానీ బ్రిటిష్ వారి ప్రతిఘటనతో అబ్బన్, జై గోపాల్ ఇండ్లపైకి చేరుకొని తుపాకీలతో పోరాటం ఆరంభించారు. 1857 జూలై 17 సాయంత్రం 6.30 గంటలకు మొదలైన ముట్టడి తెల్లవారు జామున 4 గంటల వరకు కొనసాగింది. ఈ పోరాటంలో పలువురు మరణించడం, బంధీలవ్వడంతో అదనపు బలగాలు సేకరించడానికై తుర్రాబాజ్, అల్లా ఉద్దీన్‌లు అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ప్రయత్నంలో ఉండగానే జూలై 22న అషూర్ ఖానా సమీప అడవుల్లో బ్రిటిష్ సైనికులకు చిక్కాడు తుర్రాబాజ్ ఖాన్. అండమాన్ దీవుల్లో జీవితాంతం ఖైదీగా ఉండాలని హైదరాబాద్ కోర్టు తీర్పు చెప్పింది. కానీ, అతడు 1858 జనవరి 18న జైలు నుండి తప్పించుకొన్నాడు. చివరకు, కుర్బాన్ అలీ నేతృత్వంలోని సాయుధ బలగాలు 1859 జనవరి 23న తూప్రాన్ దగ్గర అతడిని చంపేశాయి. గులాం హైదర్, బాబూలాల్ వంటి వారి రక్షణలో ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చి బేగం బజార్‌లోని ఆయన ఇంటి సమీపంలోని చెట్టుకు వేలాడదీశారు. అల్లా ఉద్దీన్‌ను కూడా నాటి ఇబ్రహీం పట్నం తాలూకాలోని మంగల్‌పల్లిలో పట్టుకుని అండమాన్ పంపారు. ఇలాంటి వీరుల గురించి భావి తరాలకు చెప్పవలసిన బాధ్యత మనదే!

– దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత చరిత్రాచార్యులు
(రేపు బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించిన రోజు)

సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలి!

అభిప్రాయం



డా॥ ఎ. కుమార స్వామి

ప్రాదేశిక సమగ్రత, అభివృద్ధికి కొన్ని ప్రాంతాల్లో ఉన్న దేశాలు సభ్యదేశాలుగా ప్రత్యేక సంస్థలు ఏర్పడ్డాయి. అటువంటివాటిలో ఒకటి షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ). ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాంతీయ సంస్థగా గుర్తింపు పొందింది. సుమారుగా 40 శాతం జనాభా, 20 శాతం జీడీపీని ఈ ఎస్సీఓ సభ్య దేశాలు కలిగి ఉన్నాయి.

ఎస్సీఓ 1996లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, కజక్‌స్తాన్, కిర్గిజ్‌స్తాన్, రష్యా, తజికిస్తాన్ వంటి ఐదు దేశాలతో ఏర్పాటు చేశారు. తర్వాత ఉజ్బెకిస్తాన్, భారతదేశం, పాకిస్తాన్, ఇరాన్, బెలారస్‌లు క్రమంగా చేరుతూ రావడంతో ప్రస్తుతం దీని సభ్య దేశాల సంఖ్య పదికి చేరుకుంది. ఎస్సీఓ ప్రధాన కార్యాలయం చైనా రాజధాని బీజింగ్‌లో ఉంది. ఈ సంస్థ యురేషియా (ఆసియా, యూరప్) ప్రాంతాల్లో తీవ్రవాదం, వేర్పాటువాదాలను నిర్మూలించడానికి... రాజకీయ, ఆర్థిక, వ్యాపార, రక్షణ, శాంతి భద్రతల అంశాల్లో సహకారం కోసం ఈ సంస్థ కృషి చేస్తోంది. అందుకే దీన్ని యురేషియన్ పొలిటికల్, ఎకనామిక్, సెక్యూరిటీ కూటమిగా చెప్పవచ్చు.

ఈ ఏడాది జూలై 3, 4 తేదీల్లో మధ్య ఆసియా దేశమైన కజక్‌స్తాన్ రాజధాని ఆస్తానాలో షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ 24వ సమావేశం జరిగింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, మన దేశ విదేశాంగ మంత్రి జయ శంకర్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ భద్రత, స్థిరత్వాలను మెరుగుపరచడం; ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని పెంపొందించడం; సాంస్కృతిక, మానవతా సహకారాన్ని ప్రోత్సహించడం; పర్యావరణ సంబంధిత సమస్యలను, సవాళ్లను పరిష్కరించడం; డిజిటల్ సేవలు, ప్రాంతీయ రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం;



సంస్థ సభ్యత్వాన్ని విస్తరించడం వంటి అంశాలపై చర్చించింది.

ఎస్సీఓలో భారత్ కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి మోదీ హాజరు కాకపోవడాన్ని కొందరు విమర్శించారు. ఎస్సీఓ నుంచి భారతదేశం వైదొలుగుతుందనడానికి సంకేతంగా దీన్ని చైనా మీడియా వక్రీకరించింది. నిజానికి మన దేశంలో సార్వత్రిక ఎన్నికల తర్వాత మొదటి సారిగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రధానమంత్రి ఎస్సీఓకు హాజరు కాలేకపోయారు. నరేంద్ర మోదీ 'సెక్యూర్' ప్రసంగాన్ని మన దేశ విదేశాంగ మంత్రి జైశంకర్ చదివి వినిపించారు. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారతదేశ వాస్తవాధీన రేఖను చైనా గౌరవించాల్సిన అవసరం ఉందని జైశంకర్ ప్రకటించారు.

2023 నాటికి ఎస్సీఓ ముఖ్యంగా భద్రతకు సంబంధించిన అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ సంస్థ ఎటువంటి వాస్తవ సంఘర్షణలలో సైనిక సహాయాన్ని అందించలేదు. అయితే, 2017 నుండి తీవ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని, సమన్వయాన్ని ప్రోత్సహించడానికి సభ్య దేశాల మధ్య సైనిక విన్యాసాలు మాత్రం జరుగుతున్నాయి. 2023లో ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి ఒప్పందంపై సభ్యదేశాలు సంతకం చేశాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని స్థాపించాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని ప్రతిపాదించారు.


యురేషియా ప్రాంతాలలో శాంతి సౌభ్రాతృత్వాలను నెలకొల్పుతూ, తీవ్రవాదాన్ని నియంత్రించడానికి ఏర్పడ్డ ఎస్సీఓ సభ్య దేశాల మధ్యే తరచూ ఉద్రిక్తతలు రేకెత్తుతుండటం విమర్శలకు దారి తీసింది. భారత్ – చైనాల మధ్య సరిహద్దుల సమస్య, భారత్ – పాకిస్తాన్‌ల మధ్య ఉన్న వేర్పాటువాద, ఉగ్రవాద సమస్యలపై ఉన్న వివాదాలు; కజక్‌స్తాన్– తజికిస్తాన్ సరిహద్దు సమస్య వంటివి పరిష్కారమైతేనే ఈ ప్రాంతంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ ఏడాది సమావేశాలు ఆ దిశలో ముందడుగు వేయాలి.

వ్యాసకర్త పోలీస్ పరిశోధన – అభివృద్ధి సంస్థ పూర్వ పరిశోధకులు । 90006 18068

విశ్వవ్యాపకుడు

మహా భారత కథలో పాండవులు కపట జూదంలో ఓడిపోయాక, పెద్దలందరు ఆసీనులైన నిండు సభలో, దుశ్శాసనుడు ద్రౌపదీ దేవిని ఈడ్చుకుని వచ్చి అవమానం చేయటానికి పూనుకుంటాడు. ద్రౌపదికి ఆ సమయంలో దిక్కు తోచదు. వెంటనే కృష్ణ పరమాత్మ గుర్తుకు వచ్చాడు. 'ఓ గోవిందా! ద్వారకా వాసా! నన్నీ అవమానం నుంచి కాపాడమని' ప్రార్థించింది. సమయం గడుస్తున్నా కృష్ణుడు రాలేదు. ఏ సహాయం అందించలేదు. ద్రౌపది మళ్ళీ శ్రీకృష్ణుని 'విశ్వాత్మ! విశ్వ భావన! మహా యోగి! ఈ అవమానం నుంచి కాపాడ'మని ఆర్తితో ప్రార్థించింది. తక్షణమే ద్రౌపదికి కృష్ణ సహాయం లభించింది. ఆపద తొలగింది.

కృష్ణుడు ఆర్తరక్షణ పరాయణుడు కదా తను ప్రార్థించిన



జ్యోతిర్మయం

వెంటనే ఎందుకు సహాయం చేయలేదు? కొంచెం ఆలస్యం ఎందుకు చేశాడు? అని చాలా రోజులు అనుకున్నది ద్రౌపది. తర్వాత, కృష్ణుని దర్శనం దొరికినప్పుడు ఆమె ఈ ప్రశ్నలనే అడిగింది. అప్పుడు కృష్ణుడు 'నన్ను భక్తితో ప్రార్థించిన వారికి సహాయం చేయటం నా కర్తవ్యం. నిజమే. కానీ, నువ్వు మొదట ద్వారకా వాసీ అని సంబోధించావు. ద్వారక నుంచి హస్తినాపురం రావాలంటే సమయం పడుతుంది కదా' అని చిరునవ్వు నవ్వాడట. అప్పుడు ద్రౌపదికి అర్థమైంది. విశ్వమంతా వ్యాపించిన పరమాత్ముని నేను ద్వారకకే పరిమితమైనట్లు భావించాను. అందుకే ఆయన రాలేదు. రెండవసారి విశ్వాత్మ అని సంబోధించిన వెంటనే వచ్చి కాపాడాడు కాబట్టి భగవంతుడు అపరిమితుడు అని గుర్తించింది. ఏ రూపమైనా దేవుడొక్కడే, ఆయన విశ్వవ్యాపకుడు. అంతటా నిండి ఉంటాడు. ఏ ప్రదేశానికీ, ఏ రూపానికీ, ఏ పేరుకీ పరిమితుడు కాదని గ్రహించాలి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

టమాటాకు 'రికార్డు' ధర

- పలమనేరులో బాక్సు రూ.1,200
- ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలే కారణం



పలమనేరు (చిత్తూరు జిల్లా): పలమనేరు మార్కెట్‌లో సోమవారం టమాటా బాక్సు ధర (14 కిలోలు) రూ.1,200 రికార్డు ధర పలికింది. కొన్నాళ్లుగా బాక్సు ధర రూ.600 ఉంటుండగా, అమాంతం రూ.1000కి పెరిగింది. అది కాస్తా సోమవారం రూ.1,200కి చేరింది. వర్షాలు, చీడపీడల కారణంగా పంట దిగుబడి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా అక్కడ టమాటాకు భారీ డిమాండ్ నెలకొంది. సాధారణంగా పలమనేరు మార్కెట్‌కు రోజూ 20 లారీల దాకా సరుకు వస్తుండేది. కానీ ఇప్పుడు సరుకు తగ్గడంతో 13 లారీలు మాత్రమే వస్తున్నాయి.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు సోమవారం పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు సమీప రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వదర్శనానికి నాలుగు గంటలు, శీఘ్ర దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.

నేడు తిరుమలలో ఆణివార ఆస్థానం



ఆణివార ఆస్థానానికి ముస్తాబవుతున్న పుష్ప పల్లకీ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం సాలకట్ల ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు పుష్ప పల్లకిపై తిరువీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అష్టదళ పాద పద్మారాధన సేవ, కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. అదేవిధంగా ఆదివారం ఆస్థానంకు టీటీడీ ముమ్మర ఏర్పాట్లు చేసింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,797 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 24 గంటలు సమయం పడుతోంది.

అల్ట్రాటెక్ ప్రమాద ఘటనలో మరొకరు మృతి

నాలుగుకు చేరిన మరణాల సంఖ్య



బూదవాడ(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. దీంతో ఈ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్ల మండలం చేరాలకు చెందిన బొంతా శివనారాయణ(45) అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినప్పుడు కాంట్రాక్టు కార్మికుడిగా చేరాడు. ఆ తర్వాత కొంతకాలానికి అతని ఉద్యోగం రెగ్యులర్ అయ్యింది. జగ్గయ్యపేటలోని ధనంబోడులో ఇల్లు అద్దెకు తీసుకొని ఒక్కడే ఉంటూ పనులకు హాజరవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పైప్ పేలడంతో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వివిధ ఆస్పత్రుల్లో చేర్పించారు. అందులో ముగ్గురు మృతి చెందగా.. బొంతా శివనారాయణ విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. శివనారాయణ కుటుంబానికి నందిగామ ఆర్డీవో రవీంద్రరావు రూ.25 లక్షలు(అల్ట్రాటెక్ నష్టపరిహారం) అందజేశారు. ఆర్డీవోతో పాటు తహశీల్దార్ శేషగిరి, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, వీఆర్వో లచ్చేశ్వరావు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

పోలవరం నుంచి కావేరికి గోదావరి



- ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశంలో ఏపీ ప్రతిపాదన
- బొల్లాపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోయాలి
- అక్కడి నుంచి కావేరికి తరలించాలని వినతి
- సమ్మక్క బ్యారేజ్ నుంచి అనుసంధానం చేపట్టాలన్న తెలంగాణ
- ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజ్‌ల నుంచి అనుసంధానానికి అంగీకరించబోమన్న ఛత్తీస్‌గఢ్
- రాష్ట్రాల ఏకాభిప్రాయంతోనే అనుసంధానం చేపడతామన్న కేంద్ర జల్ శక్తి శాఖ
- త్వరలో బేసిన్ పరిధిలోని రాష్ట్రాలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడి

సాక్షి, అమరావతి: గోదావరి నది పరీవాహక ప్రాంతం (బేసిన్)లో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షిస్తూ పోలవరం నుంచి గోదావరి – కావేరి అనుసంధానం చేపట్టాలని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం నుంచి గోదావరి జలాలను బొల్లాపల్లి వద్ద 300 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి కావేరికి తరలించాలని సూచించింది. ఇచ్చంపల్లి నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజ్ నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని, దీని ద్వారా తరలించే నీటిలో 50 శాతం తమకు కేటాయించాలని తెలంగాణ ప్రతిపాదించింది. తెలంగాణ ప్రతిపాదనను ఛత్తీస్‌గఢ్ వ్యతిరేకించింది. సమ్మక్క, ఇచ్చంపల్లి బ్యారేజ్‌ల వల్ల తమ రాష్ట్రంలో ముంపు ఉత్పన్నమవుతుందని, దీనికి తాము అంగీకరించబోమని స్పష్టం చేసింది. బేసిన్ పరిధిలోని రాష్ట్రాల ఏకాభిప్రాయంతోనే గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని, ఇందుకు త్వరలోనే ఆ రాష్ట్రాలతో సమావేశం నిర్వహిస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ స్పష్టం చేశారు.

వాడీవేడిగా ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశం

దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి 73వ సమావేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్, ఏపీ ప్రభుత్వం తరఫున హైడ్రాలజీ విభాగం సీఈ కుమార్, తెలంగాణ తరఫున ఈఎన్‌సీ అనిల్‌కుమార్, అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి, అక్కడి నుంచి జలాలను కావేరికి తరలించాలన్న ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనను తెలంగాణ ఈఎన్‌సీ అనిల్ వ్యతిరేకించారు. తెలంగాణ రాష్ట్రానికి 158 టీఎంసీల (దేవాదులకు 38, సీతారామకు 70, తుపాకులగూడెంకు 50 టీఎంసీ) నీటి అవసరాలున్నాయని, ఇచ్చంపల్లి వద్ద బ్యారేజ్ నిర్మిస్తే తెలంగాణ, ఏపీ అవసరాలతోపాటు గోదావరి– కావేరీ అనుసంధానం ప్రాజెక్టు అవసరాలను ఏకకాలంలో ఎలా తీరుస్తారని ప్రశ్నించారు. సమ్మక్క బ్యారేజ్ నుంచి అనుసంధానం చేపట్టాలని కోరారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కారు తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజ్‌ల వల్ల తమ ప్రాంతం ముంపునకు గురవుతుందని, అందువల్ల ఆ బ్యారేజ్‌ల నిర్మాణానికి అంగీకరించబోమని తేల్చిచెప్పింది. ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజ్‌లను ఎగువ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ సీఈ కుమార్ ప్రతిపాదించారు. ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోసి.. అక్కడి నుంచి సోమశిలలోకి, అక్కడి నుంచి కావేరికి తరలించాలన్న ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని తేల్చిచెప్పారు. గోదావరికి జూలై ఆఖరు నుంచి ఆగస్టు వరకు భారీ వరద ఉంటుందని, ఆగస్టులో కృష్ణాకు కూడా వరద వచ్చి నాగార్జున సాగర్ కూడా నిండుగా ఉంటుందని వివరించారు. గోదావరి–కావేరి అనుసంధానంలో నాగార్జున సాగర్‌ను భాగం చేస్తే దాని ఆయకట్టుకు కూడా విఘాతం కలుగుతుందన్నారు. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను పరిరక్షించాలంటే పోలవరం నుంచి గోదావరి జలాలను కొత్తగా బొల్లాపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి సోమశిల.. అటు నుంచి కావేరికి తరలించాలని సూచించారు. ఇదే ప్రతిపాదనను ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులు గతంలో రాష్ట్రంలో పర్యటించినప్పుడు అందజేశామని, దాన్ని పరిశీలించాలని కోరారు. పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు తరలిస్తున్న 80 టీఎంసీలకు గానూ.. ఆ మేరకు సాగర్ ఎగువన కృష్ణా బేసిన్‌లో వాడుకునేలా రాష్ట్రాలకు ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చిందని ఏపీ, తెలంగాణ అధికారులు గుర్తు చేశారు. మహారాష్ట్ర 14, కర్ణాటక 21 టీఎంసీలు అదనంగా వాడుకుని, గోదావరి–కావేరి అనుసంధానం వల్ల కృష్ణా జలాలను ఆ రాష్ట్రాలకు అదనంగా వాడుకోవడానికి అవకాశం కల్పిస్తే శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆయకట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వెలువడ్డాకే గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్ స్పష్టం చేశారు.

సాగర్ కుడికాలువకు 4 టీఎంసీలు

రేపటినుంచి తాగునీటి అవసరాల కోసం విడుదల

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం

సాక్షి, అమరావతి: గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా నాలుగు టీఎంసీల విడుదలకు కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ అంగీకరించింది. ఈ నెల 17వ తేదీ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని బోర్డుకు సిఫార్సు చేసింది. హైదరాబాద్‌లోని కృష్ణా బోర్డు కార్యాలయంలో సోమవారం బోర్డు సభ్య కార్యదర్శి డి.ఎం.రాయ్‌పురే అధ్యక్షతన ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలు సి.నారాయణరెడ్డి, అనిల్‌కుమార్ సభ్యులుగా ఉన్న త్రిసభ కమిటీ సమావేశమైంది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువకు నాలుగు టీఎంసీలు విడుదల చేయాలని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి చేసిన విజ్ఞప్తికి బోర్డు సభ్య కార్యదర్శి డి.ఎం.రాయ్‌పురే సానుకూలంగా స్పందించారు. సాగర్‌లో నీటిమట్టం తగ్గిన నేపథ్యంలో శ్రీశైలం నుంచి విద్యుదుత్పత్తి చేస్తూ 5.7 టీఎంసీలను సాగర్‌కు తరలించి, అందులో నాలుగు టీఎంసీలను కుడికాలువకు కేటాయిస్తామని చెప్పారు. ఇందుకు ఏపీ ఈఎన్‌సీ అంగీకరించారు. శ్రీశైలం నుంచి మూడు టీఎంసీలు ఏపీ, 2.7 టీఎంసీలను తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేయాలన్న రాయ్‌పురే సూచనకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు అంగీకరించారు. శ్రీశైలం, సాగర్‌లలో లభ్యతగా ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం వాడుకోవడానికి రాయ్‌పురే అంగీకరించారు.

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి

- ఏపీ ప్రభుత్వానికి కేడబ్ల్యూడీటీ–2 ఆదేశం
- కౌంటర్ దాఖలుకు ఇదే ఆఖరి అవకాశమని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ ప్రభుత్వ స్టేట్‌మెంట్‌కు నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ) – 2 ఆదేశించింది. కౌంటర్ దాఖలుకు ఇదే ఆఖరి అవకాశమని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఏర్పాటైన కేడబ్ల్యూడీటీ–2 కృష్ణా జలాల పంపిణీపై సోమవారం విచారణ జరిపింది. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్–89 ప్రకారం రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీపై విచారణ చేస్తున్న కేడబ్ల్యూడీటీ–2కు గతేడాది జూలై 7న కేంద్ర జల్ శక్తి శాఖ కొత్త విధి విధానాలు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ) దాఖలు చేసింది. కొత్త విధి విధానాల ప్రకారం మే 15న కేడబ్ల్యూడీటీ–2 నిర్వహించిన విచారణలో రెండు రాష్ట్రాలూ అభిప్రాయాలను వెల్లడిస్తూ నాలుగు వారాల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం జూన్‌లో అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందని, అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్‌గా కొత్త వారిని నియమించాల్సి ఉన్నందున కౌంటర్ దాఖలుకు 4 వారాల సమయం ఇవ్వాలని కోరుతూ గత నెల 28న కేడబ్ల్యూడీటీ–2కు ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ చేపట్టిన కేడబ్ల్యూడీటీ–2 కౌంటర్ దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి 4 వారాల సమయం ఇచ్చింది. గడువులోగా రెండు రాష్ట్రాలు కౌంటర్లు, సమాధానాలు, అఫిడవిట్లు దాఖలు చేయాలని, ఇకపై సమయం ఇవ్వబోమని తేల్చిచెప్పింది. విచారణను ఆగస్టు 28, 29 తేదీలకి వాయిదా వేసింది.

చుండూరు ఎస్‌హెచ్‌వోపై కేసు

తెనాలి రూరల్: కోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారన్న కారణంగా బాపట్ల జిల్లా చుండూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో (స్టేషన్ హౌస్ ఆఫీసర్) పై కేసు నమోదు చేయాలని తెనాలి ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పవన్‌కుమార్ ఆదేశించారు. వివరాలు... చుండూరు పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన కేసులో నాలుగో నిందితునిగా ఉన్న ఈమని సాయివెంకటరెడ్డి వాయిదాలకు హాజరు కావడంలేదు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ఈయనపై 2023 నవంబరులో అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. నిందితుడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాల్సి ఉండగా, చుండూరు పోలీసులు పట్టించుకోలేదు. దీంతో కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

రేపటి నుంచి రొట్టెల పండగ

నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రొట్టెల పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వర్ణాల చెరువు వద్ద ఈ నెల 17 నుంచి ఐదు రోజులపాటు పండగ జరుపుతారు. ఈ పండగను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ ఏదైనా కోరిక కోరుకుని ఒకరి నుంచి మరొకరు రొట్టె మార్చుకుంటే.. ఆ కోరికలు తీరతాయని విశ్వాసం. చదువు రొట్టె, ఆరోగ్య రొట్టె, సంతాన రొట్టె, వివాహ రొట్టె ఇలా 12 రకాల కోర్కెలకు సంబంధించిన రొట్టెలు ఇచ్చిపుచ్చుకోవడం ఇక్కడ ప్రత్యేకం.



రొట్టెల పండగకు గత ఏడాది వచ్చిన భక్తులు

రొట్టెల పండగ నేపథ్యం ఇదీ..

ఆర్కాటు నవాబుల కాలంలో స్వర్ణాల చెరువులో రజకులైన భార్యాభర్తలు దుస్తులు ఉతుకుతుండగా పొద్దుపోవడంతో అక్కడే నిద్రపోయారు. రజకుని భార్యకు కలలో బారాషహీద్ కనిపించి ఆర్కాటు నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతోందని.. ఆమెకు ఇక్కడి సమాధుల పక్కనున్న మట్టిని తీసుకెళ్లి ఆమె నుదిటిపై రాస్తే కోలుకుంటుందని చెప్పినట్టు ప్రతీతి. ఉదయాన్నే ఆ దంపతులిద్దరూ ఇంటికి వెళ్లగా.. నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలుస్తుంది. ఆమెకు సరైన వైద్యం చేసిన వారికి విలువైన బహుమతి అందచేస్తామని నవాబు దండోరా వేయించగా.. రజకుడు తన భార్యకు కలలో వచ్చిన విషయాన్ని నవాబు ఆస్థానంలో వారికి చెబుతాడు. దీంతో రాజు తన అనుచరులను చెరువు వద్దకు పంపి అక్కడి మట్టిని తెప్పించుకుని రాజు భార్య నుదిటిపై పూస్తారు. వెంటనే ఆమె ఆరోగ్యం కుదుటపడుతుంది. దీంతో ఆ రాజు సంతోషంతో తన భార్యతో కలిసి నెల్లూరులోని స్వర్ణాల చెరువు సమీపంలోని సమాధుల వద్దకు వచ్చి బారాషహీదులకు ప్రార్థనలు చేసి, తమ వెంట తెచ్చుకున్న రొట్టెల్లో కొన్నింటిని అక్కడి వారికి పంచుతారు. అప్పటి నుంచి రొట్టెలు మార్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కోర్కెలు తీరిన వారు రొట్టెలను తీసుకుని దర్గా వద్ద చెరువులో తడిపి మరొకరికి ఇవ్వడం, కోర్కెలు కోరుకునే వారు వాటిని తీసుకోవడం అప్పటి నుంచి ఆచారంగా వస్తోంది. మొదట్లో మొహరం నెలలో ఒక్కరోజు మాత్రమే జరుపుకునేవారు. కాలక్రమంలో భక్తుల తాకిడి ఎక్కువై రొట్టెల పండగను ఐదు రోజులు జరుపుకుంటున్నారు.

తిరుమలలో ఆహార పరిశోధనా కేంద్రం

టీటీడీ ఈవో జె.శ్యామలరావు



తిరుమల: తిరుమలలో అన్న ప్రసాదాల తయారీకి వినియోగించే ముడి సరుకుల నాణ్యత ప్రమాణాల పరిశీలనకు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా) సహకారంతో ప్రత్యేక ఆహార పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో సోమవారం ఎఫ్ఎస్ఎస్ఏఐ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీ కొనుగోలు చేస్తున్న వివిధ ముడి సరుకులు అత్యంత నాణ్యతతో ఉండడానికి గాను, వాటిని పరీక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫుడ్ లేబరేటరీ (ఆహార పరిశోధనా కేంద్రం) దోహద పడుతుందన్నారు. ముడి సరుకుల కొనుగోలుకు సంబంధించి ఎస్‌వోపీని తయారు చేయాలని జేఈవోకు సూచించారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధన్‌రావు ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రరావు నాణ్యత పెంచడానికి అవసరమైన సూచనలను ఈవోకు వివరించారు.

నాపై ఆరోపణల నిగ్గుతేల్చాలి

- సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌ను డిమాండ్ చేస్తున్నా
- ఒంగోలు రాజకీయాల్లో ఉంటా.. ప్రజల కోసం పోరాటాలు చేస్తా
- మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: 'నా మీద ఆరోపణలు నిజమో కాదో తేల్చాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను కోరుతున్నా. భూకబ్జా అంటూ ఒక దుర్మార్గుడు తప్పుడు ఆరోపణలు చేశాడు. నాపై సోషల్ మీడియాలో, వారి అనుకూల మీడియాలో ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేయించాడు. ఇప్పుడు అధికారంలోకి మీరొచ్చారు. అందుకే నిజం నిగ్గు తేల్చమని డిమాండ్ చేస్తున్నా. నేను అధికారంలో ఉన్నప్పుడు ఒంగోలులో భూ వివాదాలపై సిట్ వేయించాను. జిల్లా కలెక్టర్, ఎస్పీ సరిగ్గా స్పందించకపోతే సీఎంకు ఫిర్యాదు చేసి విచారణ వేగవంతం చేశాను. నేను ముందు మైనింగ్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేశారు. అప్పుడు నా మీద కూడా కేసు పెట్టేందుకు జేడీ లక్ష్మీనారాయణ మనుషులు మా కార్యాలయంలో ప్రతి ఫైలును పరిశీలించారు. కానీ, ఎలాంటి తప్పులేదని వారు గుర్తించారు. అప్పుడే బాలినేని ఏంటో జనానికి తెలిసింది. ఇక రెండోసారి విద్యుత్ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడానే తప్ప ఎక్కడా అవినీతి చేయలేదు. అలాగే, మా వియ్యంకుడు వేసిన విల్లాలో 24 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంటే అది కూడా లేఅవుట్‌లో చూపించి ప్రభుత్వ భూమి అని పక్కాగా చూపించాం'.. అని మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒంగోలుకు సోమవారం వచ్చిన ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బాలినేని ఇంకా ఏమన్నారంటే..

ఆ డబ్బు ఎవరిదో కూడా తేల్చండి..

నా కొడుకు మీద గతంలో హవాలా అని, భూకబ్జాలు అని అనేక ఆరోపణలు చేశారు.



మొదటిది చెన్నైలో పట్టుబడిన రూ.5 కోట్ల డబ్బు గురించి. ఆ డబ్బు ఒంగోలుకు చెందిన వ్యాపారి నల్లమల్లి బాలుది. ఆయనిప్పుడు మీ పార్టీలోనే ఉన్నారు. ఆ డబ్బు ఎవరిదో నిగ్గుతేల్చాలని కోరుతున్నా. కానీ, అది హవాలా డబ్బు అంటూ నా కొడుకుపై అన్యాయంగా బురద జల్లారు. ఇక రెండోది బ్రాహ్మణులకు సంబంధించిన స్థలం. ఒంగోలుకు చెందిన వెంకట సుబ్బారావు, మూర్తి అనే ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం ఉంది. వాస్తవం ఏమిటో దమ్ముంటే విచారణ జరిపి నిరూపించాలి. అవన్నీ కూడా నేడు అధికారంలోకి వచ్చిన నేతలు నిరూపించాలి. మీరు నిరూపించడం ద్వారా నిజం ఏమిటో ప్రజలకు తెలుస్తుంది. నేను మంచో, చెడో కూడా స్పష్టమవుతుంది. ఆస్తులమ్మి అయినా కార్యకర్తలకు అండగా నిలబడే సంస్కృతి మాది.

మేం ఎన్టీఆర్ విగ్రహాల జోలికి వెళ్లామా?

ఇక రాష్ట్రవ్యాప్తంగా మేం వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్నారు. గతంలో మీరు వేసిన వాటి జోలికి మేం ఎప్పుడైనా వెళ్లామా? వైఎస్సార్, ఎన్టీఆర్‌లు ప్రజల హృదయాల్లో నిలిచిన నేతలు. అలాంటిది వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా ఎలాంటి సంస్కృతిని వ్యాప్తిచేస్తున్నారో తెలుస్తోంది. మేం అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీయార్ విగ్రహాల జోలికివెళ్లామా? అలాగే, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. మీరు చేసే ప్రతి తప్పుకూ తప్పకుండా శిక్ష ఉంటుంది. ఇందులో ఏమాత్రం వెనుకాడేది లేదు. ఆర్థిక వ్యవహారాలను ఒకటి రెండు నెలల్లోనే పరిష్కరించుకుని మళ్లీ ఒంగోలులోనే రాజకీయాల్లో ఉంటా. ప్రజల కోసం పోరాటాలు చేస్తా.. మీరు చేసే అవినీతి, అక్రమాలను నిలదీస్తా.

బిల్లులు రాకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు

- పంచాయతీ కార్యదర్శి చులకనగా చూస్తున్నారు
- పండితవిల్లూరు సర్పంచ్ లక్ష్మీచంద్రిక ఆవేదన

పోడూరు: తమ గ్రామంలో నిర్వహించిన చెరువు అభివృద్ధి పనులకు బిల్లులు రాకుండా టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకట్రాజు అడ్డుకుంటున్నారని పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పండితవల్లూరు గ్రామ సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారు అయిన ఆమె సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలోని ఇద్దరు టీడీపీ నాయకుల ఒత్తిడితో తమ పంచాయతీ కార్యదర్శి వెంకట్రాజు చెరువు పూడికతీత పనులకు బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో గ్రామంలోని లక్ష్మీదేవిచెరువు (పశువుల



పండితవిల్లూరు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక

చెరువు)లో రూ.10 లక్షల అంచనా వ్యయంతో పూడిక తీసినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చెరువు పూడిక తీసేందుకు ఫిబ్రవరిలో తీర్మానం చేసినట్లు చెప్పారు. నివాసాల పక్కన ఉన్న ఆ చెరువులో సీసా పెంకులు ఎక్కువగా ఉన్నాయని, తాము పనులు చేయలేమని, చాలా మంది ఉపాధిహామీ కూలీలు వెనకడుగు వేశారని తెలిపారు. దీంతో జూన్ 19న నిర్వహించిన పంచాయతీ సమావేశంలో యంత్రాలతో చెరువులో పూడిక తీసేందుకు ఆరుగురు వార్డు సభ్యులు, తాను ఆమోదం తెలపగా నలుగురు ఆమోదం తెలపలేదని పేర్కొన్నారు. మెజార్టీ సభ్యులు ఆమోదం తెలుపడంతో పనులు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో గ్రామంలో టీడీపీ పెత్తందారుల ఒత్తిళ్లకు పంచాయతీ కార్యదర్శి వత్తాసు పలుకుతూ బిల్లుల చెల్లింపు జరగకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తాను బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళను కావడం వల్లే టీడీపీ పెత్తందారులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పంచాయతీ కార్యదర్శి కూడా తనను చులకనగా చూస్తున్నారని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురించి తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. సర్పంచ్ ఆరోపణలపై పంచాయతీ కార్యదర్శి వెంకట్రాజును అడగగా సర్పంచ్‌ను తాను చులకనగా చూస్తున్నానన్న ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. లక్ష్మీదేవిచెరువు పూడికతీత పనులపై డీఎల్‌పీవోకి ఫిర్యాదు వెళ్లడంతో తాను వచ్చి పరిశీలిస్తానని డీఎల్‌పీవో చెప్పారని తెలిపారు.

హజ్బెండ్ ఫర్ సేల్..!

- 'ఎక్స్'లో ట్వీట్ చేసిన భార్య
- మాజీ ప్రియురాలి కామెంట్‌తో చెలరేగిన చిచ్చు
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

తిరువళ్లూరు (చెన్నై): 'హజ్బెండ్ ఫర్ సేల్' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేసింది ఓ మహిళ. 'కొందామని ఉంది కానీ..' అంటూ మాజీ ప్రియురాలు కామెంట్ చేయడంతో చిచ్చు రేగి.. పంచాయితీ కాస్తా పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ఈ ఘటన తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కైవండూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కైవండూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మదన్‌కుమార్‌కు అదే ప్రాంతానికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేకపోవడంతో తరచూ భార్యభర్తల మధ్య ఘర్షణ జరుగుతోంది. మూడు రోజుల క్రితం భార్యభర్తల మధ్య వివాదం చెలరేగడంతో మనస్తాపానికి గురైంది. కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చి మదన్ తనను వివాహం చేసుకున్నాడని, వివాహమై రెండేళ్లయినా సంతానం లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయని ఎక్స్‌లో పేర్కొంది. ఇలాంటి భర్తను ఇంట్లో ఉంచుకుని వేధింపులు భరించడం కంటే అమ్మేయడమే మేలంటూ 'హజ్బెండ్ ఫర్ సేల్' అని పోస్ట్ చేసింది. దీనికి భారీగా స్పందన రావడంతో వైరల్‌గా మారింది. కాగా.. పోస్టును గుర్తించిన మదన్‌కుమార్ మాజీ ప్రియురాలు 'నాకు కొనుగోలు చేయాలని ఉంది. కానీ.. నా భర్త ఒప్పుకోడు' అని కామెంట్ చేయడంతో వివాదం మొదలైంది. మాజీ ప్రియురాలితో తన భర్త అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని, ఆమెకు తన భర్తపై మోజు తగ్గలేదని మదన్ భార్య తిరువళ్లూరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు భార్యభర్తలిద్దరికీ నచ్చజెప్పారు. దాదాపు 4 గంటల పాటు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. మదన్ మాజీ ప్రియురాలిని సైతం ఫోన్‌లో హెచ్చరించారు.

నిరుపేద దేశం...సమున్నత లక్ష్యం!

జాంబియాలో ఉచిత విద్య • భారీగా పెరిగిన విద్యార్థులు • మౌలిక సదుపాయాలే సవాలు

జాంబియా. ఆఫ్రికా ఖండ దక్షిణ భాగంలో ఉండే అత్యంత నిరుపేద దేశం. మూడేళ్ల క్రితం ఓ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. అదే... బాల బాలికలందరికీ ఉచిత విద్య. అందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి దాకా విద్యా వ్యయమంతటినీ ప్రభుత్వమే భరిస్తుంది. జాంబియా వంటి దేశానికి ఇది ఒకరకంగా తలకు మించిన భారమే. మిగతా రంగాల మాదిరిగానే జాంబియాలో విద్యా రంగాన్ని కూడా మౌలిక సదుపాయాల తీవ్ర లేమి పట్టి పీడిస్తోంది. మరోవైపు కాసులకు కటకట. అయినా ఉచిత విద్యా పథకం అమలు విషయంలో అక్కడి ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదు. పదో తరగతి స్థాయిని దాటినా సజావుగా చదువను, రాయను రాని దుస్థితి నుంచి తమ కాబోయే పౌరులను బయట పడేసి తీరాలని కృతనిశ్చయంతో ఉంది. ఆ లక్ష్యసాధన కోసం గత మూడేళ్లలో విద్యా రంగంపై ఏకంగా 100 కోట్ల డాలర్లకు పైగా వెచ్చించింది!




సమయం ఇంకా ఉదయం ఏడు గంటలే. పైగా చలికాలపు ఈదురుగాలులు ఈడ్చి కొడుతున్నాయి. అయినా సరే, ఆ విద్యార్థులంతా అప్పటికే స్కూలుకు చేరుకున్నారు. తమ క్లాసురూముల వైపు పరుగులు తీస్తున్నారు. అవును మరి. ఏమాత్రం ఆలస్యమైనా బెంచీలపై కూర్చోవడానికి చోటు దొరకదు. రోజంతా చల్లటి చలిలో కింద కూర్చోవాల్సిందే! జాంబియా రాజధాని లుసాకాకు 60 కి.మీ దూరంలోని చన్యన్యా ప్రభుత్వ ప్రైమరీ, సెకండరీ స్కూల్లో మూడేళ్లుగా రోజూ ఇదే దృశ్యం. ఉచిత విద్యా పథకం మొదలై నాటినుంచీ దేశంలో స్కూళ్లన్నీ విద్యార్థులతో కిటకిటలాడిపోతున్నాయి. గరిష్ఠంగా 40 మంది ఉండాల్సిన క్లాసురూముల్లో కనీసం 90 నుంచి 100 మందికి పైగా కన్పిస్తున్నారు. 30 మంది మాత్రమే పట్టే ఒక క్లాస్‌రూములోనైతే ఏకంగా 75 మంది బాలలు, 85 మంది బాలికలు కిక్కిరిసిపోయారు! ఈ మూడేళ్లలో దేశవ్యాప్తంగా ఏకంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కొత్తగా బడిబాట పట్టారు మరి!

మంచి సమస్యే!

ఇంతమందికి విద్యార్థులకు తగిన స్థాయిలో దేవుడెరుగు, కనీస స్థాయిలో కూడా మౌలిక వసతులు లేకపోవడం జాంబియా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 2019లో ఒక్కో క్లాసులో 40 మంది పిల్లల కంటే ఉండేవారు కాదని, ఇప్పుడు మాత్రం కనీసం 100కు పైగానే ఉంటున్నారని క్లియోపాత్రా జులు అనే టీచర్ వాపోయారు. వీళ్ల చాలరన్నట్టు దాదాపు రోజూ కొత్త విద్యార్థులు జాయినవుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వమిచ్చే ఒక్కో పుస్తకాల సెట్టు కోసం కనీసం ఆరేడు మంది పిల్లలు కొట్టుకునే పరిస్థితి! అయితే ఇవన్నీ 'మంచి సమస్య'లేనంటారు దేశ విద్యా మంత్రి డగ్లస్ స్యకలిమా. ''క్లాసురూముల్లో ఇరుక్కుని కూర్చునైనా సరే, ఈ బాలలంతా మూడేళ్లుగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారు. వారంతా మరో దిక్కు లేక నిస్సహాయంగా వీధులపాలైన రోజులతో పోలిస్తే ఇదెంతో మెరుగు కదా'' అన్నది ఆయన పాయింటు. ''మౌలిక సదుపాయాలు కూడా త్వరలో మెరుగవుతాయి. ఎందుకంటే విద్యా రంగంపై చేసే పెట్టుబడి నిజానికి అత్యుత్తమ పెట్టుబడి'' అని వివరించారు. ఆయన వాదన నిజమేనని 18 ఏళ్ల మరియానా చిర్వా వంటి ఎందరో విద్యార్థుల అనుభవం చెబుతోంది. ''2016లో నాలుగో తరగతిలో ఉండగా స్కూలు మానేశాను. ఉచిత విద్యా పథకం పుణ్యాన మూడేళ్లుగా మళ్లీ చదువుకోగలుగుతున్నా. మా అమ్మానాన్నా ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉంటారు. ఉచిత పథకం లేకుంటే స్కూలు ఫీజు కట్టడం అసాధ్యం మాకు'' అని చెప్పుకొచ్చిందామె. 2026 నాటికి కనీసం 55 వేల మంది కొత్త టీచర్ల నియామకం చేపట్టాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 37 వేల మంది నియామకం జరిగిపోయింది. తమకిచ్చిన ప్రభుత్వ నివాసాల్లో అత్యంత దుర్భరమైన పరిస్థితులున్నాయని టీచర్లు వాపోతున్న నేపథ్యంలో ఆ సమస్యపైనా దృష్టి సారించారు. దీనికి తోడు దేశవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన కనీసం మరో 170 స్కూళ్లు నిర్మించనున్నారు. 2020లో రుణ ఊబిలో చిక్కి దివాళా తీసిన దేశానికి ఇది నిజంగా గొప్ప ఘనతేనని ఐరాస బాల సంస్థ యునిసెఫ్ కూడా ప్రశంసిస్తోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

చదువు అందని ద్రాక్షే

ఆఫ్రికాలో జాంబియా వంటి సబ్ సహారా ప్రాంత దేశాల్లో అందరికీ విద్య ఇప్పటికీ అందని ద్రాక్షే. అక్కడి దేశాల్లో సగటున ప్రతి 10 మంది విద్యార్థుల్లో ఏకంగా 9 మందికి నాలుగు ముక్కలు తప్పుల్లేకుండా చదవడం, అర్థం చేసుకోవడం ఇప్పటికీ తలకు మించిన వ్యవహారమేనని ఐరాస బాల సంస్థ యునిసెఫ్ అధ్యయనం చెబుతోంది. అయితే కొంతకాలంగా ఆ దేశాలన్నీ జాంబియా బాటలోనే నాణ్యమైన విద్యపై దృష్టి సారిస్తుండటం హర్షణీయమంది.

యాంటీ నార్కోటిక్స్ హెల్ప్ లైన్–1933

జాతీయ స్థాయిలో త్వరలో అందుబాటులోకి..

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో తొలిసారిగా టోల్ ఫ్రీ నంబర్ మానస్–1933 ఈ నెల 18న అందుబాటులోకి రానుంది. దీంతోపాటు, ఈమెయిల్ కూడా అదే రోజు హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. వీటి ద్వారా డ్రగ్స్ నేరాలు, సంబంధిత ఇతర అంశాలపై నేరుగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)కి ఎవరైనా సమాచారం అందించే వీలుంటుంది.

చైనా, రష్యా విన్యాసాలు

నాటో దేశాల ఆందోళన

బీజింగ్: చైనా, రష్యా నావికా దళాలు సంయుక్త కసరత్తులు నాటో కూటమికి ఆందోళన పెంచుతున్నాయి. ఇరు బలగాలు ఇటీవల పశ్చిమ, ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో గస్తీ కాశాయని చైనా రక్షణ శాఖ ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. నూతన అంతర్జాతీయ సైనిక కూటమికి చైనా కేంద్రంగా మారుతోందని నాటో ఆరోపించడం తెలిసిందే.

ఇమ్రాన్‌కు భారీ షాక్

- ఆయన నెలకొల్పిన పీటీఐ పార్టీని నిషేధించే యోచనలో పాక్ సర్కార్
- దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిందని ఆరోపణ



ఇస్లామాబాద్: ప్రధాని పదవి కోల్పోయి పలు కేసుల్లో ఇరుక్కుని జైలుపాలైన పాక్ మాజీ క్రికెటర్, మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను కోలుకోలేని దెబ్బతీయాలని పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇమ్రాన్‌కు చెందిన ది పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్(పీటీఐ) పార్టీని నిషేధించాలని నిర్ణయించినట్లు సమాచార శాఖ మంత్రి అతౌల్లాహ్ తరార్ సోమవారం పత్రికాసమావేశంలో ప్రకటించారు. 2022 ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయాక ఇమ్రాన్ ప్రభుత్వం కుప్పకూలింది. పలు కేసుల్లో ఇరుక్కున్న ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండి నగరంలోని అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు పీటీఐను నిషేధించడంతో పాటు ఇమ్రాన్, మాజీ పాకిస్తాన్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, పైనా ఆర్టికల్ 6 ప్రకారం కేసులు నమోదుచేస్తామని మంత్రి ప్రకటించారు.

బలమైన ఆధారాలున్నాయ్..

''దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే పీటీఐ వంటి పార్టీలు అవరోధంగా ఉండకూడదు. మా ఓర్పు, సహనాన్ని చేతగానితనంగా కొందరు భావించారు. విదేశా నిధుల కేసులు, మే 9న దేశవ్యాప్తంగా చెలరేగిన అల్లర్లు, హింస, సైఫర్ కేసులు, అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) నుంచి పాక్ ప్రభుత్వం రుణాల పొందకుండా అడ్డుకునే కుట్ర ఉదంతాల్లో పీటీఐ పార్టీ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు బలమైన ఆధారాలు లభించాయి. అందుకే నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిషేధం నిమిత్తం ప్రభుత్వం త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేయనుంది. స్వతంత్రులుగా గెల్చి వేరే పార్టీలో చేరిన పీటీఐ నేతలకు దామాషా పద్ధతిలో పార్లమెంట్‌లో రిజర్వ్‌డ్ సీట్లు కేటాయిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని మరో పిటిషన్ వేస్తాం. పీటీఐ అడక్కపోయినా కోర్టే ఆ పార్టీకి ఇలా ఉపశమనం కల్పించింది' అని మంత్రి ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వ్‌డ్ సీట్లు పొందే అవకాశం పీటీఐకి రావడం, అక్రమ వివాహం కేసులో ఇమ్రాన్‌కు ఉపశమనం లభించినవేళ పీటీఐపై ప్రభుత్వం కఠిన ఆంక్షలకు దిగడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పు అమలైతే పార్లమెంట్, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలు, మైనారిటీలకు కేటాయించిన రిజర్వ్ సీట్లు పీటీఐ పార్టీకి దక్కుతాయి. దాంతో 109 మంది సభ్యులతో పాక్ పార్లమెంట్‌లో అతిపెద్ద పార్టీగా పీటీఐ అవతరిస్తుంది. దీనిని ఎలాగైనా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లింలీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్) ప్రభుత్వం ఇలా నిషేధ నిర్ణయం తీసుకుంది.

చనిపోయాననే అనుకున్నా

- కుడివైపు తిరగబట్టే బతికిపోయా
- కాపాడింది దేవుడో, అదృష్టమో!
- ప్రాణాంతక దాడిపై ట్రంప్

మిల్వాయుకీ (డెలావెర్): ప్రాణాంతకమైన దాడికి గురైన క్షణాలను అమెరికా మాజీ అధ్యక్షుడు గుర్తు చేసుకున్నారు. ''ఆ సమయంలో నేను చనిపోయాననే అనుకున్నా. కేవలం అదృష్టమో, దైవమో నన్ను కాపాడాయి'' అని చెప్పుకొచ్చారు. పెన్సిల్వేనియాలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా 20 ఏళ్ల దుండగుడు ఆయనపై కాల్పులకు తెగబడటం తెలిసిందే. 78 ఏళ్ల ట్రంప్ కుడి చెవికి తూటా గాయంతో త్రుటిలో బయటపడ్డారు. తనను రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించే మూడు రోజుల పార్టీ జాతీయ సదస్సుకు వెళ్తూ ఆయన న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థతో మాట్లాడారు. సరిగ్గా కాల్పులు జరిగిన సమయంలోనే కుడివైపుకు తల తిప్పడం వల్లే బతికి బయటపడ్డానన్నారు. దీన్ని నమ్మశక్యం కాని అనుభవంగా అభివర్ణించారు. ''గాయం తర్వాత పిడికిలి పైకెత్తి ఫైట్ అంటూ నేను నినదిస్తున్న ఫొటోను అంతా ఐకానిక్ ఫొటోగా అంటున్నారు. అలాంటి ఫొటో కావాలంటే మామూలుగానైతే చనిపోవాల్సిందే'' అంటూ సరదా వ్యాఖ్యలు చేశారు. కాల్పుల తర్వాత కూడా ప్రసంగం కొనసాగించాలనే అనుకున్నట్టు వెల్లడించారు. అధ్యక్షుడు బైడెన్ తనకు ఫోన్ చేసి క్షేమం కనుక్కున్న తీరును అభినందించారు. ఈ సందర్భంగా ట్రంప్ కుడి చెవికి బ్యాండేజీ ధరించి కన్పించారు.

రిపబ్లికన్ సదస్సుకు భారీ భద్రత

రిపబ్లికన్ల మూడు రోజుల జాతీయ సదస్సు మిల్వాయుకీలో సోమవారం మొదలైంది. ట్రంప్‌పై దాడి నేపథ్యంలో సదస్సుకు కనీవినీ ఎరగని స్థాయిలో వేలాది మంది సిబ్బందితో అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

పోలీసును బెదిరించాడు!

ట్రంప్‌పై దాడికి దిగిన క్రూక్స్ కదలికల్ని కాల్పులకు ముందే ఓ పోలీసు అధికారి పసిగట్టాడు. క్రూక్స్ నక్కిన గోడౌన్‌పైకి ఎక్కి అతన్ని సమీపించబోగా తుపాకీతో బెదిరించాడు. దాంతో ఆ పోలీసు కిందికి దిగేశాడు. అదే సమయంలో ట్రంప్‌పై క్రూక్స్ తూటాల వర్షం కురిపించాడు.

స్కూలు రోజుల నుంచీ ముభావే

క్రూక్స్ స్కూలు రోజుల నుంచీ ఒంటరిగా, ముభావంగానే ఉండేవాడని తోటి విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ''క్రూక్స్‌కు పెద్దగా మిత్రులు కూడా లేరు. తోటి విద్యార్థులంతా అతన్ని బాగా ఏడిపించేవారు. రైఫిల్ గురిపెట్టడం చేతగాక స్కూల్ షూటింగ్ టీమ్‌లోకి ఎంపిక కాలేకపోయాడు'' అన్నారు.

జగన్నాథుడే కాపాడాడు: ఇస్కాన్

ప్రాణాంతక దాడి నుంచి ట్రంప్‌ను పూరీ జగన్నాథుడే కాపాడాడని ఇస్కాన్ పేర్కొంది. 48 ఏళ్ల కింద న్యూయార్క్‌లో తొలి జగన్నాథ రథయాత్ర విజయవంతం కావడంలో ఆయన ఎంతో సాయపడ్డారని చెప్పింది.

పోలీసుల తప్పిదమే: ఎఫ్‌బీఐ

ట్రంప్‌పై దాడి ఉదంతంపై దర్యాప్తు ముమ్మరమైంది. దీనిపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణకు బైడెన్ ఆదేశించడం తెలిసిందే. దేశీయ ఉగ్రవాద చర్యగా దీనిపై ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది. దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్ ఒంటరిగానే ఈ ఘాతుకానికి తెగబడ్డట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. భద్రతా లోపానికి స్థానిక పోలీసు విభాగానిదే బాధ్యత అని సీక్రెట్ సర్వీస్ విభాగం వాదిస్తోంది. క్రూక్స్ మాటు వేసిన గోడౌన్ తమ భద్రతా పరిధికి ఆవల ఉందని పేర్కొంది. కనుక అదంతా స్థానిక పోలీసుల బాధ్యతేనని వివరించింది.

'ట్రంప్ ధిక్కార' టీ షర్టుల జోరు



బ్యాంకాక్: అటు తూటాల వర్షం. ఇటు చెవి నుంచి చెంప మీదుగా బొటబొటా కారుతున్న రక్తం. అంతలోకే రక్షణ వలయంగా కమ్ముకున్న సీక్రెట్ సర్వీస్ సిబ్బంది. అంతటి భీతావహ పరిస్థితిలోనూ పిడికిలి గట్టిగా బిగించి పైకెత్తి 'పోరాటమే'నంటూ గొంతెత్తి నినాదాలు. ట్రంప్‌పై దాడి జరిగిన క్షణాలకు శాశ్వతత్వం కల్పించిన ఫొటో ఇది. హత్యాయత్నం నుంచి త్రుటిలో బయటపడ్డ క్షణాల్లో కూడా ట్రంప్ ఆత్మనిబ్బరానికి, ఆయన ప్రదర్శించిన సాహసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఫొటో అప్పుడే టీ షర్టులపైకి కూడా ఎక్కింది. అది కూడా దాడి జరిగిన రెండు గంటల్లోపే! అంత తక్కువ సమయంలోనే టావోబావో, జేడీ.కామ్ వంటి చైనా ఈ కామర్స్ దిగ్గజాలు ఆన్‌లైన్ దుకాణాలు ఆ ఫొటోలతో కూడిన టీ షర్టులను తయారు చేయడం, ఇ–కామర్స్ ప్లాట్‌ఫాంల్లో అమ్మకానికి పెట్టడం చకచకా జరిగిపోయాయి! వాటికి చూస్తుండగానే చైనా, అమెరికాల నుంచి 2,000 పై చిలుకు ఆర్డర్లు వచ్చాయి!



మళ్లీ తడబడ్డ బైడెన్

బ్యాలెట్ అనబోయి బ్యాటిల్!
తలపట్టుకుంటున్న డెమొక్రాట్లు

మిల్వాయుకీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తడబాట్ల పరంపర అంతులేకుండా కొనసాగుతూనే ఉంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడి తర్వాత ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన మళ్లీ తప్పులు మాట్లాడారు. విభేదాలను బ్యాలెట్ బాక్సుల్లో పరిష్కరించుకుంటాం అనబోయి 'బ్యాటిల్ (యుద్ధ) బాక్సుల్లో' పరిష్కరించుకుంటామని అన్నారు. దాంతో ఆయన సొంత పార్టీ అయిన డెమొక్రాట్ నేతలు మరోసారి తలపట్టుకున్నారు.

ట్రంప్‌పై దాడి నేపథ్యంలో ఇది రాజకీయంగా ఉద్రిక్తతలను తగ్గించుకోవాల్సిన సమయమని బైడెన్ అభిప్రాయపడ్డారు. ''రాజకీయాలంటే యుద్ధ క్షేత్రం కాదు. పార్టీలుగా నేతల మధ్య విభేదాలు, భేదాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ మనం శత్రువులం కాదని, కలిసి పనిచేసే వారిమని, తోటి పౌరులమేనని గుర్తుంచుకోవాలి. చర్చలైనా, మరోటైనా శాంతియుతమైన జరగాలి. మన దేశంలో హింసకు తావు లేదు. జాతిగా మనమంతా ఒక్కటి కావాల్సిన సమయమిది'' అంటూ పిలుపునిచ్చారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ ప్రమాణం

నాలుగోసారి ప్రధాని పీఠంపై సీపీఎన్‌యూఎంఎల్ చీఫ్



కఠ్మాండు: నెలల వ్యవధిలో ప్రభుత్వాలు కూలి కొత్త ప్రభుత్వాలు కొలువుతీరే హిమాలయాల దేశం నేపాల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్–యూనిఫైడ్ మార్కిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్–యూఎంఎల్) అధినేత కేపీ శర్మ ఓలీ ప్రధానిగా సోమవారం ప్రమాణం చేశారు. ప్రచండ నేతృత్వంలోని కమ్యూనిస్ట్‌పార్టీ ఆఫ్ నేపాల్ ప్రభుత్వానికి ఓలీ, షేర్ బహదూర్ దేవ్‌బా నేతృత్వంలోని నేపాలీ కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించడంతో ఆయన విశ్వాసపరీక్షలో ఓడిపోవడం, ప్రధానిగా రాజీనామా చేయడం తెల్సిందే. దీంతో ఓలీ, దేవ్‌బా ఏడు అంశాలపై ఏకాభిప్రాయంతో కూటమిగా ఏర్పడి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. నేపాలీ రాజ్యాంగంలోని ఆర్టికల్76–2 ప్రకారం ఓలీని నూతన ప్రధానిగా దేశాధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓలీ ప్రధానిగా ప్రమాణంచేశారు. ఓలీ ప్రధాని పదవి చేపట్టడం ఇది నాలుగోసారి కావడం విశేషం. సోమవారం కాఠ్మండూలోని రాష్ట్రపతిభవన్(శీతల్ నివాస్)లో దేశాధ్యక్షుడు పౌడెల్ ఈయన చేత ప్రధానిగా ప్రమాణంచేయించారు. సుస్థిర సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ఆశించారు. కూటమిలోని నేపాలీ కాంగ్రెస్ నుంచి ఎవరెవరిని మంత్రివర్గంలోని తీసుకోవాలన్న విషయంలో భేదాభిప్రాయాలు పొడచూపడంతో ప్రమాణస్వీకార కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో నూతన ప్రభుత్వంలో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయని ప్రపంచ పార్టీ విమర్శలు సంధించింది. కూటమిలో కీలక పార్టీ అయిన నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ భార్య అర్జో రాణా దేవ్‌బాకు విదేశాంగ మంత్రి పదవి కట్టబెట్టారు. ప్రధానిగా పగ్గాలు చేపట్టిన 30 రోజుల్లోపు ఓలీ పార్లమెంట్‌లో బలపరీక్షలో నెగ్గాల్సి ఉంటుంది.

ఇటలీలో 33 మందితో వెట్టి చాకిరీ..

సూత్రధారులైన ఇద్దరు భారతీయులు అరెస్ట్

రోమ్: ఇటలీలోని వెరోనా ప్రావిన్స్‌లో వ్యవసాయ క్షేత్రాల్లో 33 మంది భారతీయులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఆరోపణలపై సూత్రధారులైన ఇద్దరు భారతీయుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.33 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తప్పుడు లెక్కలు చూపుతూ పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇదే ప్రావిన్స్‌లో తోటల్లో పనిచేసే సత్నాం సింగ్ అనే భారతీయుడు ఇటీవల ప్రమాదవశాత్తూ చేతి కోల్పోగా యజమాని అతన్ని రోడ్డు పక్కన వదిలేయడం, వైద్య సాయం ఆలస్యమై మరణించడం తెలిసిందే. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. ప్రధాని మెలోనీ కూడా దీన్ని ఖండించారు. ఈ ఘటనతో ఇటలీ వ్యవసాయ క్షేత్రాల్లో అనధికారికంగా పనిచేసే భారతీయ కార్మికుల దుస్థితి వెలుగులోకి వచ్చింది. సుమారు 2 లక్షల మంది భారతీయులు ఇటలీలోని వ్యవసాయ క్షేత్రాల్లో మగ్గిపోతున్నారని విదేశాంగ శాఖ అంచనా.

రిటైరయ్యేలోపు తీర్పివ్వండి

- చట్టాలను ద్రవ్య బిల్లుల మాటున లోక్‌సభలో ప్రవేశపెడుతున్నారు
- ఇలాంటి విధానం చట్టబద్ధతను త్వరగా తేల్చండి
- సుప్రీంకోర్టులో కాంగ్రెస్ వినతి

న్యూఢిల్లీ: ఆధార్ వంటి సాధారణ చట్టాలను ద్రవ్య బిల్లులుగా ఎన్‌డీఏ సర్కార్ లోక్‌సభలో ప్రవేశపెడుతున్న విధానాన్ని తప్పుబడుతూ ఈ విధానం చట్టబద్ధతను తేల్చేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు అనుమతించింది. సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సంబంధిత పిటిషన్‌ను సోమవారం విచారించింది. కాంగ్రెస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. '' ఏడుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేశాక ఈ అంశాన్ని పరిశీలిస్తాం' అని సీజేఐ చంద్రచూడ్ చెప్పారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో స్పందించారు. '' రాజ్యాంగంలోని ఆర్టికల్ 110 కింద ఎన్నో సాధారణ బిల్లులను ద్రవ్యబిల్లులుగా పేర్కొంటూ మోదీ సర్కార్ లోక్‌సభలో ఆమోదింపజేసుకుంటోంది. ఈ రాజ్యాంగ అతిక్రమణకు 2016నాటి ఆధార్ చట్టం చక్కని ఉదాహరణ. ఇదే అంశాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే కోర్టు కూడా 'ఇది రాజ్యాంగపరంగా మోసమే' అంటూ సమర్థించింది. 2014 నుంచి ఆర్టికల్110 దుర్వినియోగంపై విచారణకు రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేస్తానని సీజేఐ తీర్పుచెప్పడం హర్షణీయం. ఈ ఏడాది నవంబర్‌లో సీజేఐ చంద్రచూడ్ రిటైర్ అయ్యేలోపు తీర్పు ఇస్తారని ఆశిస్తున్నాం' అని పోస్ట్ చేశారు. ఆధార్ చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం(సవరణ) వంటి కీలక బిల్లులను ద్రవ్యబిల్లుగా మోదీ సర్కార్ లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పెద్దలసభలో మెజారిటీ లేని కారణంగా అక్కడ బిల్లులు వీగిపోకుండా, తప్పించుకునేందుకు ప్రభుత్వం ఇలా చేస్తోందని చాన్నాళ్లుగా విపక్షాలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టడం తెల్సిందే.

రాజ్యసభలో 90 దిగువకు బీజేపీ బలం



న్యూఢిల్లీ: మూడోసారి కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ బలం విచిత్రంగా పెద్దల సభలో చాన్నాళ్ల తర్వాత 90 కంటే దిగువకు పడిపోయింది. అయితే బలం తగ్గినా వెంటనే బీజేపీ కూటమికి కల్గే నష్టమేమీ లేకపోవడం గమనార్హం. వచ్చే కొద్ది వారాల్లో ఉప ఎన్నికల తర్వాత మళ్లీ కమలనాథుల బలం పుంజుకోనుంది. కొన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీగా కొనసాగడమే ఇందుకు కారణం. బిహార్, మహారాష్ట్ర, అస్సాంలలో తలో రెండు సీట్లు, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురలో తలో ఒక సీటును శాసనసభలో సంఖ్యాబలంకారణంగా బీజేపీ మళ్లీ సాధించనుంది. దీంతో మరికొద్ది వారాల్లో బీజేపీ బలం పెరగనుంది. సాధారణంగా నామినేటెడ్ సభ్యులు స్వతంత్ర్యంగా వ్యవహరించాలి. కానీ తమను నామినేట్ చేసిన ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తుంటారు. కీలకమైన సందర్భాల్లో అధికార పార్టీ ఎజెండాకు మద్దతు పలకడం తెల్సిందే. ప్రస్తుతం రాజ్యసభలో 226 మంది సభ్యులు ఉన్నారు. బీజేపీకి 86 మంది, కాంగ్రెస్‌కు 26 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు 13 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో ప్రస్తుతం 19 ఖాళీలు ఉన్నాయి.

కేజ్రీవాల్ 2 కిలోలే బరువు తగ్గారు

ఆప్ ఆరోపణలపై తిహార్ యంత్రాంగం స్పందన



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలులో ఉన్న కాలంలో తగ్గిన బరువు రెండు కిలోలు మాత్రమేనని తీహార్ జైలు అధికారులు చెప్పారు. ఆయన ఆరోగ్యంపై ఎయిమ్స్ వైద్య బృందం నిత్యం సమీక్ష జరుపుతోందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ భార్య సునీత నిత్యం ఆయనతో టచ్‌లో ఉంటున్నారని తెలిపారు. జైలులో ఉన్న తమ నేత ఆరోగ్యం రానురాను క్షీణిస్తోందంటూ ఆప్ నేతలు అతిశీ, సంజయ్ సింగ్ చేస్తున్న ఆరోపణలను అధికారులు తిప్పికొట్టారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ తిహార్ జైలు యంత్రాంగం ఢిల్లీ ప్రభుత్వ హోం శాఖకు ఒక నివేదికను పంపించింది. జైలులో ఉండగా కేజ్రీవాల్ 8.5 కిలోల మేర బరువు తగ్గినట్లు శనివారం సంజయ్ సింగ్ ఆరోపించారు. తీహార్ అధికారులు దీనిపై స్పందిస్తూ.. ఏప్రిల్ ఒకటో తేదీన జైలుకు వచ్చిన సమయంలో కేజ్రీవాల్ 65 కిలోలున్నారని, ఏప్రిల్ 8, 29వ తేదీల మధ్య ఆయన బరువు 66 కిలోలని తెలిపారు. 21 రోజుల బెయిల్ ముగిసి జూన్ 2న తిరిగి జైలుకు వచ్చినప్పుడు కేజ్రీవాల్ బరువు 63.5 కిలోలని చెప్పారు. జూలై 14న చూస్తే రెండు కిలోల బరువు తగ్గి 61.5 కిలోలున్నారని వివరించారు. ఇంటి నుంచి అందుతున్న భోజనం ఆయన మూడుసార్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

లిఫ్ట్‌లో 2 రోజులు



తిరువనంతపురం: హాస్పిటల్‌లో చెకప్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి రెండు రోజుల పాటు లిఫ్ట్‌లోనే చిక్కుకుయాడు. కేరళలోని ఉల్లూరుకు చెందిన రవీంద్రన్ నాయర్ (59) శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లాడు. ఓపీలో చెకప్ చేయించుకున్నాడు. ఫస్ట్ ఫ్లోర్ వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కాడు. దిగాల్సిన సమయంలో అది తెరుచుకోలేదు. సాయం కోసం కేకలు వేసినా లాభం లేకపోయింది. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో శని, ఆదివారాలు లిఫ్ట్‌లోనే ఉండిపోయాడు. సోమవారం ఉదయం ఆపరేటర్ లిఫ్ట్‌ను తెరవడంతో బయటపడ్డాడు. రవీంద్రన్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అంతటా వెదికిన కుటుంబసభ్యులు చివరకు మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు ఆస్పత్రి సిబ్బందిని అరెస్టు చేశారు.

విక్రమ్ మిశ్రీ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ: దౌత్యవేత్త విక్రమ్ మిశ్రీ విదేశాంగ శాఖ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన ఈ పదవి చేపట్టిన 35వ అధికారి. వినయ్ క్వాత్రా స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఐకే గుజ్రాల్, మన్మోహన్‌సింగ్, నరేంద్ర మోదీ రూపంలో ఏకంగా ముగ్గురు ప్రధానుకు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన అరుదైన రికార్డు మిశ్రీది. ఆయన గతంలో విదేశాంగ శాఖతో పాటు ప్రధాని కార్యాలయంలో, యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికాల్లో పలు దేశాల్లోని భారతీయ మిషన్లలో పనిచేశారు. 2019–21 మధ్య చైనాలో భారత రాయబారిగా గాల్వాన్ లోయ ఘర్షణలు, ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

సిసోడియా కస్టడీ 22 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 22 వరకు పొడిగించింది.



సోమవారంతో జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో అధికారులు సోమవారం ఆయన్ను సీబీఐ, ఈడీ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఎదుట వర్చువల్‌గా హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. కస్టడీని 22వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. మద్యం కుంభకోణంతో ప్రమేయముందంటూ మనీశ్ సిసోడియాను సీబీఐ ఫిబ్రవరిలో అరెస్ట్ చేసింది.

శివకుమార్‌కు సుప్రీంలో చుక్కెదురు



న్యూఢిల్లీ: కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అక్రమాస్తుల కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఆయన పెట్టుకున్న అర్జీని సోమవారం అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇందుకు సంబంధించిన కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం నిరాకరించింది. ఇప్పటికే ఇవే ఆరోపణలపై ఆదాయ పన్ను శాఖ విచారణ జరుపుతున్నందున, మళ్లీ సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయరాదని శివకుమార్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ వాదించారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ ప్రకారం అనుమతి లేకుండానే సీబీఐ దర్యాప్తున చేపట్టిందన్నారు.

ట్రంప్‌పై రహస్య పత్రాల కేసు కొట్టివేత



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎదుర్కొంటున్న అధికార రహస్య పత్రాల కేసును ఫ్లోరిడాలోని ఫెడరల్ కోర్టు జడ్జి ఐలీన్ కెనన్ సోమవారం కొట్టివేశారు. ఆరోపణలను నమోదు చేసిన ప్రత్యేక న్యాయవాదిని రాజ్యాంగ నియామకాల నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్న ట్రంప్ లాయర్ల వాదనతో ఆమె ఏకీభవించారు. దీంతో, ట్రంప్ ఎదుర్కొంటున్న అనేక కేసుల్లో ఎంతో తీవ్రమైందిగా భావిస్తున్న ఈ క్రిమినల్ కేసుకు అనూహ్యమైన ముగింపు వచ్చినట్లయింది. అధ్యక్షుడిగా ఉండగా ఎన్నో ముఖ్యమైన రహస్య పత్రాలను ఫ్లోరిడాలోని మార్–ఇ–లాగో ఎస్టేట్‌కు తరలించారని, వాటిని వెనక్కి తెచ్చే ప్రయత్నాలను అడ్డుకున్నారంటూ ట్రంప్‌పై అనేక అభియోగాలున్నాయి. తనపై ఇతర కేసులనూ కొట్టేయాలని ట్రంప్ కోరారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 16 : జూలై : 2024

పాత.. ఘనత



అలనాటి పాత బైక్‌లకు ఇప్పుడు ఎంతో క్రేజ్ ఉంది. బెంగళూరు యూబీ సిటీలో పాత జావా, యజ్డీ తదితర మోటార్ సైకిళ్ల ప్రదర్శన

తొలి రోజే సెగలు

- అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు షురూ
- వాల్మీకి మండలి బాగోతంపై బీజేపీ ధర్నా
- పరిషత్‌లో చర్చ కోసం పట్టు



బయట కూల్ కూల్.. లోపల వేడి, సోమవారం విధానసౌధ బయట జల్లుల్లో జన సంచారం

శివాజీనగర/ బనశంకరి: విధానసభ వర్షాకాల సమావేశాల తొలి రోజునే ప్రతిపక్ష బీజేపీ ధర్నాకు దిగింది. సోమవారం ఉదయం సమావేశాలు ఆరంభమయ్యాయి. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో వందలాది కోట్ల రూపాయల కుంభకోణాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామాకు డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభ్యులు.. ఎమ్మెల్యేల భవన్‌లో ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా ముగించి విధానసౌధ ముట్టడికి వస్తుండగా, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అదే సమయంలో కారులో విధానసౌధ పశ్చిమ గేట్ వద్ద వస్తుండగా చూసి ఎమ్మెల్యేలు గట్టిగా నినాదాలు చేశారు. అసెంబ్లీ బయట, లోపలా పోరాటం సాగిస్తామని చెప్పారు. తరువాత విధానసభ సమావేశాలకు వెళ్లారు. వాల్మీకి విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ తదితరులు మాట్లాడుతూ వెంటనే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిధుల అక్రమాలకు సంబంధించి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి దిగిపోయే దాకా ఈ పోరాటం ఆగదని తెలిపారు.

పరిషత్‌లో రచ్చ

వాల్మీకి మండలిలో చోటుచేసుకున్న కోట్లాది కుంభకోణం గురించి చర్చకు అవకాశమివ్వాలని ఎగువసభ విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. సభ ప్రారంభమై దివంగత ప్రముఖులకు సంతాపం ప్రకటించిన తరువాత చర్చ ఆరంభమైంది. బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి మాట్లాడుతూ 59వ నిబంధన కింద వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంపై చర్చ జరపాలని సభాపతి బసవరాజ హొరట్టిని కోరారు. ఇది భారీ అవినీతి స్కాం కావున ఒకరోజు చర్చ జరగాలని అన్నారు. సభాపతి స్పందిస్తూ సభను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, మీరు నోటీస్ ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, ముందుగా ప్రశ్నోత్తరాలు చేపట్టిన తరువాత నిర్ణయం తీసకుంటానని తెలిపారు. మరో ఎమ్మెల్సీ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి మండలి నుంచి బళ్లారి లోక్‌సభ ఎన్నికలకు ఎంత డబ్బు వెళ్లింది, తెలంగాణకు ఎంత సొమ్ము వెళ్లిందనేదానిపై చర్చ జరపాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ సభ్యుడు యుబీ.వెంకటేశ్ మాట్లాడుతూ వేలాది కోట్ల అవినీతి గురించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ప్రశ్నోత్తరాల తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాక గొడవ ఎందుకని ప్రశ్నించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య గలాటా మొదలైంది, వీటి మధ్యనే సభాపతి ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు.



సోమవారం విధానసభలో సమావేశ దృశ్యం



బీజేపీ ఎమ్మెల్యేల నిరసన ర్యాలీ



వాల్మీకి మండలి స్కాంలో చర్చించాలంటూ విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యుల ఆందోళన

స్వర్గీయ ప్రముఖులకు సంతాపం

ఇటీవల కన్నుమూసిన మాజీ శాసనసభ్యులు, ప్రముఖులకు అసెంబ్లీలో ఉభయసభల్లో ఘన నివాళి అర్పించారు. సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే విధానసభలో స్పీకర్ యుటీ.ఖాదర్ సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. మాజీ మంత్రి నాగమ్మ కేశవమూర్తి, కేంద్ర, రాష్ట్ర మాజీమంత్రి వీ.శ్రీనివాస ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సీపీ మూడల గిరియప్ప, మాజీమంత్రి ఎంపీ.కేశవ మూర్తి, మాజీ ఎమ్మెల్యేలు కే.వసంతబంగేరా, డా.పాటిల్ బసనగౌడ గురనగౌడ, నాగరెడ్డి పాటిల్, రమేశ్‌కుమార్ పాండే, టీహెచ్.శివ శంకరప్ప, వాసు, కన్నడ సినీ ప్రముఖుడు ద్వారకేశ్, సాహితీవేత్తలు ప్రొఫెసర్ కమలా హంపనా, నటి, యాంకర్ అపర్ణ, ధర్మగురు ఖాజీ ఫజల్ తదితరులకు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రులు వారి సేవలను కొనియాడుతూ మాట్లాడారు. రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

కొరగజ్జ సేవలో కత్రినా కైఫ్



కొరగజ్జ ఆలయంలో కత్రినా కైఫ్

దొడ్డబళ్లాపురం: మంగళూరు నగరం ఉళ్లాలలోని ప్రసిద్ధ కొరగజ్జ ఆలయానికి ప్రముఖుల తాకిడి పెరిగింది. తాజాగా ప్రముఖ బాలీవుడ్ అందాల నటి కత్రినా కైఫ్ సోమవారం ఆలయాన్ని దర్శించారు. కోల పూజలో పాల్గొన్నారు. కత్రినా భర్త విక్కీ కౌశల్, నటుడు సునీల్ శెట్టి కుమారుడు అహాన్‌శెట్టి, కుమార్తె ఆద్యా శెట్టి, క్రికెటర్ రాహుల్, రేష్మాశెట్టి, వీఎమ్ కామత్ మొత్తం 9 మంది ప్రముఖులు తరలివచ్చారు. మొక్కు తీర్చుకోవడానికి పేర్లు రాయించారు.

దర్శన్ కేసులో సీసీ ఫుటేజీలు సీజ్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు ముమ్మరంగా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. హత్య కేసులో కీలకంగా మారే 33 పైగా సీసీ కెమెరా చిత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ముందు మందు పార్టీ జరిగిన బెంగళూరు ఆర్‌ఆర్ నగరలోని స్టోని బ్రూక్ రెస్టారెంట్‌లో, రెస్టారెంట్ నుంచి పట్టణగెరె షెడ్ వరకూ మార్గం మధ్యలో ఉన్న సీసీ ఫుటేజీలు, శవాన్ని పారవేసిన సోమనహళ్లి రాజకాలువ పరిసరాల్లోని సీసీ చిత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోడ్ల పక్కన షాపులకు అమర్చిన కెమెరాలలో వారి వాహనాల సంచారం నమోదైంది. హీరో దర్శన్, నట పవిత్రగౌడ ఇళ్ల సీసీ కెమెరాల వీడియోలను సీజ్ చేశారు.

దర్శన్‌ను కలిసిన భార్య

గత నెల రోజులుగా పరప్పన అగ్రహార జైలులో ఉన్న దర్శన్‌ను భార్య విజయలక్ష్మి, సోదరుడు తూగుదీప దినకర్ కలిశారు. దర్శన్‌తో భార్యకు ముందు నుంచి తీవ్రమైన గొడవలు ఉన్నప్పటికీ అవన్నీ మరచిపోయి ఆమె తరచూ జైలుకు వస్తూ పరామర్శించడంతో పాటు ఇతరత్రా అండగా ఉంటున్నారు. బెయిలు, కోర్టు అంశాలపై ఆమె దర్శన్‌తో చర్చించినట్టు సమాచారం. తమ్ముడు దినకర్ కూడా విభేదాలు మరచి అన్నకు సహకారం అందిస్తున్నాడు. దర్శన్ ఆరోగ్యంపై విజయలక్ష్మి ఆందోళనగా ఉన్నట్లు సన్నిహితులు తెలిపారు.

న్యూస్‌రీల్

30 లేఔట్ల నివాసుల ర్యాలీ

- సౌకర్యాల కోసం మొర



మైసూరు: మైసూరు నగరంలో ఉన్న తమ తమ లేఔట్‌లలో సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం, పాలికే వెంటనే పరిష్కరించాలని సుమారు 30 లేఔట్ల నివాసులు సోమవారం నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. యరగనహళ్లి లేఔట్ నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ధర్నా చేసి తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. లేఔట్ల సమాఖ్య అధ్యక్షుడు ఎఎం బాబు మట్లాడుతూ మైసూరు ఉత్తర విభాగం పరిధిలో ఉన్న సుమారు 30 లేఔట్లలో విద్యుత్, మంచినీరు, రోడ్లు వంటి కనీస వసతులు లేక కష్టపడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం, పాలికె తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సౌకర్యాలను కల్పించాలని కోరారు.

అక్రమ ఆస్తుల కేసులో డీకేశికి నిరాశ

శివాజీనగర: అక్రమ ఆస్తుల కేసులో తనకు వ్యతిరేకంగా సీబీఐ నమోదు చేసిన కేసును రద్దు చేయాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సుప్రీంకోర్టులో వేసిన అర్జీని కోర్టు తిరస్కరించింది. దీంతో డీకేకి ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది. ఈ కేసు విచారణను మూడు నెలలలోపు పూర్తి చేయాలని సీబీఐకి సుప్రీం ఆదేశించింది. సుప్రీం జడ్జిలు జస్టిస్ బేలా ఎం.త్రివేది, ఎస్.సీ.శర్మ ధర్మాసనం డీకే అర్జీని విచారిస్తూ, ఈ కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. డీకే శివకుమార్ 2013 – 18 మధ్య ఆదాయానికి మించి ఆస్తులను సమకూర్చుకున్నారని సీబీఐ కేసు దాఖలు చేసింది. 2020 సెప్టెంబర్ 3న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది.

కారులో రూ. 5 లక్షలు చోరీ



చోరీ జరిగిన కారు

చింతామణి: గుర్తుతెలియని దుండగులు బైక్‌లో వచ్చి కారులోని నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలోని యాజ్ఞవల్క్య ఆలయం దగ్గర జరిగింది. వివరాలు.. రాజీవ్ నగర ప్రాంతానికి చెందిన ఉల్లిగడ్డల వ్యాపారి కృష్ణారెడ్డి రూ. 5 లక్షల డబ్బులను డ్రా చేసుకుని కారులో వస్తున్నాడు. యాజ్ఞవల్క్య ఆలయంలో పూజలు చేయాలని కారును నిలిపి లోపలికి వెళ్లాడు. కారులో సీటు మీదే డబ్బుల బ్యాగును ఉంచాడు. ఇంతలో ఇద్దరు దుండగులు బైక్‌లో వచ్చి కారు అద్దాల పగలగొట్టి నగదు బ్యాగును ఎత్తుకెళ్లారు. కృష్ణారెడ్డి పూజలు చేసుకొని కారు దగ్గరకు రాగా చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. డీఎస్పీ మురళీధర్, సిబ్బంది వచ్చి పరిశీలించారు. సమీప సీసీ కెమెరాలలో బైక్ దొంగలు రికార్డయ్యారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

కేంద్రమంత్రికి నాన్‌వెజ్ పార్టీనే ముఖ్యమా?

దొడ్డబళ్లాపురం: కావేరి జలాల అఖిల పక్ష సమావేశానికి హాజరుకాని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఒక నాన్‌వెజ్ పార్టీకి హాజరు కావడం సిగ్గుచేటని మంత్రి చెలువరాయస్వామి అన్నారు. సోమవారం విధానసౌధలో మాట్లాడిన ఆయన మాజీ సీఎం, కేంద్ర మంత్రి అయి ఉండి కుమారస్వామి కావేరి జలాల సమావేశానికి రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఒక్క బీజేపీ ఎంపీ కూడా రాలేదన్నారు. కేంద్ర మంత్రులైన ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజె, సోమన్న ఎందుకు రాలేకపోయారని ప్రశ్నించారు. రైతుల పేరు చెప్పుకుని రాజకీయాలు చేస్తున్న కుమారస్వామి అయినా రావాల్సిందన్నారు. చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ ముడా సైట్ల అక్రమాలపై హెచ్‌డీ కుమారస్వామి కుటుంబంపై యడియూరప్ప అప్పట్లోనే ఆరోపణలు చేసారన్నారు. ఇప్పుడు రెండు పార్టీలు పొత్తులు పెట్టుకున్నాయని హేళన చేశారు.


నీళ్లు వదిలి, భేటీలా: కుమార

దొడ్డబళ్లాపురం: కేఆర్‌ఎస్ డ్యాం నుండి రైతుల పేరుమీద తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేసినందుకు అభినందించడానికి సీఎం నిర్వహించిన సమావేశానికి వెళ్లాలా అని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రశ్నించారు. అఖిల పక్ష భేటీకి కుమారస్వామి రాలేదని పలువురు మంత్రులు నిందించడంపై ఆయన మండిపడ్డారు. కేఆర్‌ఎస్, కబిని నుంచి కావేరి నీటిని తమిళనాడుకు వదిలారు. ఇక సభకు గోడంబి, బాదామి తినడానికి వెళ్లాలా అని హేళన చేశారు. తన కార్యక్రమాలకు వెళ్లొద్దని అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తోందన్నారు.

చినుకుల సందడి



సోమవారం శివమొగ్గలో జోరు వాన



ఐటీ నగరిలో దట్టంగా మేఘాలు

- పలు జిల్లాల్లో కొనసాగుతున్న వర్షాలు

బనశంకరి/ శివమొగ్గ: రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు మరింత ఉధృతం కాగా కరావళి, మలెనాడులోని ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ జిల్లాలకు సోమవారం నుంచి మూడురోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మలెనాడు జిల్లాలైన చిక్కమగళూరు, శివమొగ్గ జిల్లాలకు సోమ, మంగళవారం రెడ్ అలర్ట్ జారీ అయ్యింది. ఉత్తర కర్ణాటక జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కోస్తా జిల్లాల్లో గాలి వేగం 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది. బెంగళూరు నగరం చుట్టుపక్కల రెండురోజుల పాటు సాధారణ మబ్బులతో కూడిన వాతావరణం ఉండి, జల్లు వర్షం కురిసే అవకాశం ఉంది.

నదులు, డ్యాంలకు ప్రవాహ

మలెనాడులో కురుస్తున్న భారీ వర్షాలు, అలాగే పశ్చిమ కనుమలలో కుండపోత వల్ల నదులలోకి పెద్ద మొత్తంలో నీరు చేరుతోంది. దాంతో శివమొగ్గ జిల్లాలో ఉన్న జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. సోమవారం అధికారులు తెలిపిన ప్రకారం .. ప్రముఖ జలవిద్యుత్ కేంద్రమైన లింగనమక్కి జలాశయంలోకి 45,115 క్యూసెక్కుల వరద నీరు చేరింది. డ్యాంలో 1778.15 అడుగుల నీరు ఉండగా గరిష్ఠ నీటిమట్టం 1819 అడుగులు. మధ్య కర్ణాటక ప్రముఖ జలాశయం అయిన భద్రా జలాశయంలోకి 16,047 క్యూసెక్కుల వరద నీరు చేరగా, 162 క్యూసెక్కులను వదిలిపెట్టారు. డ్యాంలో 141.3 అడుగుల నీటిమట్టం ఉండగా, డ్యాం గరిష్ఠ సామర్థ్యం 186 అడుగులు. అలాగే చిన్నస్థాయి రిజర్వాయర్లలోనూ భారీగా నీరు చేరుతోంది.

నకిలీ పోస్టును సృష్టించి లూటీ

- వాల్మీకి మండలిలో స్కాం ఇలా
- అధికారులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు
- ఈడీ విచారణలో రట్టు



బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటుచేసుకున్న కోట్లాది రూపాయల కుంభకోణంలో రోజుకో కొత్త సంగతి బయటపడుతోంది. కేంద్ర ఈడీ అధికారుల దర్యాప్తులో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. నిధులు లూటీ చేయడానికి నకిలీ పోస్టు సృష్టించినట్లు తేలింది. ఈడీ అధికారులు మాజీ ఎమ్మెల్యే బీ నాగేంద్రను అరెస్ట్ చేసి సోమవారం తమ కస్టడీలో రెండవరోజు విచారించారు. మండలి ఎండీ పద్మనాభ్ ఒక జూనియర్ అకౌంటెంట్ ఉద్యోగాన్ని సృష్టించి అందులో శివకుమార్ అనే సొంత వ్యక్తిని నియమించాడు. ఆర్థిక వ్యవహారాలు చూసుకునే అధికారం అప్పజెప్పారు. ఆ వ్యక్తి ద్వారా రూ.45 కోట్లను బదిలీ చేసినట్లు బహిర్గతమైంది. ఎంజీ రోడ్డులోని యూనియన్ బ్యాంకులో ఫిబ్రవరి 21 తేదీన అకౌంట్‌ను తెరిచి వాల్మీకి మండలి నుంచి మార్చి 5 , 6 తేదీల్లో రూ.187 కోట్ల నగదును బదిలీ చేశారు. శివకుమార్ ద్వారానే హైదరాబాద్‌లో ఆర్‌బీఎల్ బ్యాంకుకు నగదు బదిలీ కాబడింది. ఇతడు, పద్మనాభ్‌తో పాటు యూనియన్ బ్యాంక్ అధికారులు కుమ్మక్కై కోట్ల రూపాయలను స్వాహా చేసినట్లు ఈడీ విచారణలో తేలింది.

నాగేంద్ర ఆస్తుల తనిఖీ

నాగేంద్ర 2023 శాసనసభ ఎన్నికల సమయంలో బళ్లారి రూరల్ నియోజకవర్గంలో దాఖలు చేసిన నామినేషన్, ఆస్తుల అఫిడవిట్‌ను ఈడీ అధికారులు పరిశీలించారు. ఎన్నికల సమయంలో నాగేంద్ర ఆస్తి రూ.17 కోట్ల 20 లక్షల అని తెలిపారు. వాహనం, బంగారు ఆభరణాలతో పాటు రూ. 4.88 కోట్ల చరాస్తులు, రూ.12.3 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయనకున్న ఆస్తులను అఫిడవిట్‌తో సరిపోల్చగా వ్యత్యాసం కనబడటంతో నాగేంద్ర మరింత చిక్కుల్లో పడ్డారు.

విధానసౌధలో దద్దల్

వాల్మీకి మండలి అధ్యక్షుడు ఎమ్మెల్యే బసవనగౌడ దద్దల్ సోమవారం శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. విలేకరులతో మాట్లాడుతూ సిట్ నుంచి ఎలాంటి నోటీస్ రాలేదని అన్నారు.

నష్టాల్లో ఉన్నా, బస్సు చార్జీలను పెంచం

- రవాణా మంత్రి రామలింగారెడ్డి



శివాజీనగర: బస్సు టికెట్ ధర పెంపు ప్రస్తుతానికి లేదని రవాణా మంత్రి ఆర్.రామలింగారెడ్డి చెప్పారు. ఆదివారం వాయువ్య ఆర్టీసీ అధ్యక్షుడు రాజుకాగె మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణాలు, నష్టాల భారం వల్ల ఆర్టీసీ చార్జీలను పెంచక తప్పదని ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి సోమవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడుతూ అది ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. చార్జీల పెంపు ప్రస్తావన తమ ముందు లేదని తెలిపారు. డీజిల్, విడిభాగాల ధరలు పెరిగాయి, గత 10 సంవత్సరాల నుంచి టికెట్ ధరలను పెంచలేదు. నారీ శక్తి పథకం ద్వారా నష్టాల్లో ఉన్నాం. అయినా కూడా సంస్థను ముందుకు తీసుకొని వెళుతున్నామని మంత్రి తెలిపారు.

పెంచకపోతే ఆర్టీసీ ఉండదు

కేఎస్ ఆర్టీసీ మండలి అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం మాట్లాడుతూ గత త్రైమాసికంలో సంస్థకు రూ.295 కోట్లు నష్టం వచ్చిందని, టికెట్ ధర పెంచకపోతే సంస్థ మిగలదని, కాబట్టి త్వరలోనే చార్జీలను పెంచుతామని ప్రకటించారు. 15 నుండి 20 శాతం మేర చార్జీలను పెంచాలని ముఖ్యమంత్రికి నివేదికను సమర్పించామని తెలిపారు. ఇలా చార్జీలపై తలోరకంగా మాట్లాడడంతో ఒకరకంగా గందరగోళం ఏర్పడినట్లు ఉంది.

డ్యాంలోకి దూకిన యువ జంట



యువతి కోసం గాలిస్తున్న బృందం

హుబ్లీ: కలబుర్గి జిల్లాలోని కురికోట వంతెనపై నుంచి సోమవారం బెణ్ణెతొర జలాశయం బ్యాక్ వాటర్‌లోకి ఓ ప్రేమజంట దూకింది. యువకుని మృతదేహం లభించగా, యువతి మృతదేహం కోసం గాలిస్తున్నారు. కమలాపుర తాలూకా ముద్దటగ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ సిద్ధారూఢ ముళగే(27) మృత యువకుడు కాగా యువతి పేరు సంధ్యారాణిగా తెలిసింది. స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్లు యువకుడి మృతదేహాన్ని వెలికితీయగా, యువతి కోసం గాలిస్తున్నారు.

నెత్తురోడిన రహదారులు

- డివైడర్‌కు కారు ఢీ, దంపతుల మృతి
- మరో దుర్ఘటనలో ఒకరు..
- చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకాలో ప్రమాదాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు



డివైడర్‌ను ఢీకొని నుజ్జయిన కారు ముందు భాగం



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి బళ్లారి: చిత్రదుర్గ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం చిత్రదుర్గ జిల్లాలోని చెళ్లకెరె తాలూకా తళకు సమీపంలోని హొసళ్లి వద్ద జాతీయ రహదారి–150ఏపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన గోపినాథ్(55), ఆయన భార్య లలితమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో బెంగళూరు నుంచి బళ్లారికి వస్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే దంపతులు మృతి చెందారు. వారి కుమారుడు శ్రీనివాస్, కుమార్తె శ్రేయ, డ్రైవర్ సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చెళ్లకెరె డీఎస్పీ రాజన్న, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను, గాయపడిన వారిని చెళ్లకెరె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

మరో ఘటనలో చెళ్లకెరె తాలూకా బుడ్నహట్టి సమీపంలో టాటా ఏస్ వాహనం బోల్తా పడి యాదగిరికి చెందిన సిద్ధరామయ్య అనే వ్యక్తి మృతి చెందారు. చెళ్లకెరె తాలూకాలో ఒకే రోజు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనలపై చెళ్లకెరె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీ, ముగ్గురు దుర్మరణం

దొడ్డబళ్లాపురం: రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన ఘటన బెంగళూరు నైస్ రోడ్డులో చోటుచేసుకుంది. ఎక్స్‌యూవీ, కియా కారు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. మైసూరు జాతీయ రహదారి వైపు వెళ్తున్న కియా కారును ఎక్స్‌యూవీ కారు వెనుక నుండి వేగంగా ఢీకొంది. భారీ వర్షం కారణంగా అదుపుతప్పిన కారు మరో కారును ఢీకొంది. ఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి చెందినట్టు సమాచారం. కెంగేరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో మరో ప్రమాదం

బనశంకరి: మినీబస్సును లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఎలక్ట్రానిక్‌సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎలిన్ కంపెనీకి చెందిన 18 మంది ఉద్యోగులు ఉదయం 9 గంటల సమయంలో బొమ్మసంద్రకు మినీ బస్సులో బయలుదేరారు. వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ మినీబస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఎలక్ట్రానిక్‌సిటీకి చెందిన దేవరాజ్ (42) మృతి చెందారు. బస్సులోని మిగతా ఉద్యోగులు స్వల్పంగా గాయపడ్డారు.

క్లుప్తంగా

బస్సు సౌకర్యానికి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఆందోళనకారులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని, రవాణా సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో సోమవారం ఆర్టీసీ డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా సంచాలకుడు రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సులు సరైన సమయానికి రావడం లేదన్నారు. 800 మంది విద్యార్థులు నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్నారన్నారు. కటకనూరు నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతూ ఆర్టీసీ డీసీకి వినతిపత్రం సమర్పించారు.

పూల బొకే, శాలువా తేవద్దు

హుబ్లీ: తనను కలవడానికి వచ్చే వారు పూల బొకే, శాలువాలకు బదులుగా అచ్చుపుస్తకాలు, నోట్ బుక్కులను తేవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పూల బొకేలు, శాలువాలకు బదులుగా నోట్ పుస్తకాలను తీసుకురావాలని కోరారు. పూల దండలు, బొకేలు నిరుపయోగమని, అచ్చు పుస్తకాలు, నోట్ బుక్స్ తెస్తే వాటిని అవసరమైన విద్యార్థులకు అందజేస్తామని, తద్వారా విద్యార్థి జీవితానికి, విద్యాభ్యాసానికి ఉపయోగం ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్ సర్జరీపై శిబిరం



మాట్లాడుతున్న రాఘవేంద్ర

రాయచూరు రూరల్: నగరంలో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ ఆరోగ్య శిబిరాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణుడు రాఘవేంద్ర పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని గాంధీ చౌక్ వద్ద కాలిన గాయాలకు, ప్రమాదంలో జరిగిన గాయాలకు, కాస్మొటిక్ చికిత్స, చర్మ రోగాల నియంత్రణ, స్థన క్యాన్సర్, బోదకాలు, రక్తనాళాల బలహీనత వంటి వాటికి చికిత్స చేస్తారన్నారు. పదేళ్లలో 10 వేలకు పైగా ఆపరేషన్లు చేశామన్నారు. విలేఖర్ల సమావేశంలో గోవిందరాజులు, ముదుగల్ ఈరణ్ణ ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం

హుబ్లీ: పాత హుబ్లీ ఇండి పంపు వద్ద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్డీ ఎంసీ, దాతల సహకారంతో ప్రారంభమైన ఎల్కేజీ, యూకేజీ తరగతులను ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో ప్రతిభావంత విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ హెచ్ఎం కుందరిగి మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన నూతన గదులు, బెంచీలు, రక్షిత మంచినీటి యూనిట్, కంప్యూటర్‌తోపాటు ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే సమకూర్చారన్నారు. ఆయన సహకారంతో పాఠశాల సమగ్రాభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రేమలత గొణసగి, హారతీ కోటి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కార్యాలయం ముట్టడి



ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

రాయచూరు రూరల్: జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారించాలని, తాగునీరు సక్రమంగా అందించాలని కోరుతూ మహిళలు జీపీ కార్యాలయం ముట్టడించారు. సోమవారం దేవదుర్గ తాలూకా భూమనగుండ జీపీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అఖిల భారత రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సంచాలకుడు హులిగప్ప మాట్లాడారు. నీటి ఎద్దడి నివారణకు రూ.38 లక్షలతో నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టినా నీరందించకుండా నిర్లక్ష్యం చేసిన పీడీఓ కట్టెప్పపై చర్యలు చేపట్టి వెంటనే తాగునీటిని అందించాలని కోరుతూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

కలల సాకారానికి కృషి అవసరం

హుబ్లీ: విద్యార్థులు కలలు సాకారం చేసుకోవాలంటే నిరంతరం కఠినంగా శ్రమించడం అత్యవసరమని హుబ్లీ స్వర్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ డాక్టర్ సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. నగర కేఈబీ బోర్డు ఫస్ట్ గ్రేడ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్, వార్షిక స్నేహ సమ్మిలన, విద్యార్థి సమాఖ్య, సాంస్కృతిక ఎన్ఎస్ఎస్, క్రీడా కార్యకలాపాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల పాలక మండలి కార్యనిర్వహణాధ్యక్షురాలు డాక్టర్ సునీత పురోహిత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో వచ్చే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని కఠినమైన సాధన ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎంవీ సిద్ధాంతి, ప్రొఫెసర్ డీఆర్ వడికేరి, ప్రొఫెసర్ విద్యా జమఖండి, లక్ష్మి, ఆనంద్ ఎలెగార పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ఆదేశం.. కాగితాలకే పరిమితం

- అమలులో పాలక మండళ్లు, అధికారుల నిర్లక్ష్యం
- అక్కడక్కడా కొన్ని పాఠశాలల్లో మాత్రమే జారీ

హుబ్లీ: ఉపాధ్యాయుల హాజరు అధికార పూర్వకంగా తేటతెల్లం చేసేలా రాష్ట్ర విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరును ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. అయితే పాఠశాలల పాలక మండళ్లు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ వ్యవస్థ ఆదేశాలకే పరిమితమైంది. విద్యార్థులకు పాఠాలను బోధించాల్సిన ఉపాధ్యాయ బృందంలోని కొందరు ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయ సంఘాల కార్యకలాపాలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఇలాంటి బాధ్యతారాహిత్య ఉపాధ్యాయులకు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను అమలు చేసింది. 2022 సెప్టెంబర్ 3న అప్పటి ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలను కూడా వెల్లడించింది. అయితే దీన్ని వేళ్లపై లెక్కపెట్టగలిగినన్ని పాఠశాలలు మాత్రమే పాటిస్తున్నాయి. మిగిలిన పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఓ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

హాజరు ప్రకారమే వేతనాలకు ప్రణాళిక

పాఠశాలలో బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెల ఇందులోనే హాజరు ప్రమాణాలను లెక్కవేసి వేతనాల చెల్లింపునకు అనుమతి ఇవ్వాలని స్పష్ట నియమావళిని ప్రభుత్వం రూపొందించింది. అయినా జిల్లాలోని 1538 ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు గాను 312 పాఠశాలల్లో మాత్రమే ఈ పద్ధతి అమలైంది. ఇంకా 1226 పాఠశాలల్లో పాత పద్ధతినే కొనసాగిస్తున్నారు. బయోమెట్రిక్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దిష్టంగా నిధులు ఇవ్వడం లేదు. స్థానికంగా లభ్యమున్న నిధులతోనే ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయితే కొన్ని పాఠశాలల్లో నిధుల కొరత సాకుతో బయోమెట్రిక్‌కు తిలోదకాలు ఇచ్చారు. మరి కొన్ని చోట్ల నిధులున్న వాటిని వినియోగించుకొని ఈ వ్యవస్థ జారీకి నిరాసక్తి



బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

చూపించడం కనిపిస్తోంది.

అరకొరగా ఆదేశాల అమలు

ధార్వాడ గ్రామీణ భాగంలో మొత్తం 238 పాఠశాలలకు గాను 15, ధార్వాడ టౌన్ 200 పాఠశాలకు గాను 32, హుబ్లీ గ్రామీణ 238 పాఠశాలలకు గాను 18, కలఘటిగి తాలూకాల్లో 172 పాఠశాలలను గాను 4, కుందగోళ తాలూకాలో 152 పాఠశాలలకు గాను 28, నవలగుంద తాలూకాలో 194 పాఠశాలలకు గాను కేవలం 18 పాఠశాలల్లో మాత్రమే బయోమెట్రిక్ సమకూర్చుకోవడం శోచనీయం. జిల్లాకు సంబంధించి హుబ్లీ టౌన్ పరిధిలో మాత్రమే 50 శాతానికి పైగా పాఠశాలల్లో ఈ వ్యవస్థ అమలులో ఉంది. ఇక్కడి 344 పాఠశాలలకు గాను 197 పాఠశాలల్లో బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలలే ఎక్కువగా ఉండటం విశేషం. మిగిలిన తాలూకాల్లో పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలుకు కట్టుదిట్టమైన సూచనలు ఇచ్చామని ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరోసారి ఆదేశాలను వెల్లడించామని, నూరు శాతం ఫలితమే లక్ష్యంగా తగిన చర్యలు తీసుకుంటామని ధార్వాడ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ఎస్.కేళదిమఠ వివరణ ఇచ్చారు.

ఫసల్ బీమా పరిహారం ఏదీ?



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో రైతులకు పరిహారం అందివ్వాలని కర్ణాటక రైతు సంఘం రాష్ట్రాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 2023–24వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు పీడిత తాలూకాలను ప్రకటించినా రైతులకు ఫసల్ బీమా సొమ్ము అందించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేవరాజ ట్రక్ టర్మినల్‌లో రూ.45 కోట్లు, వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు, ముడా కేసుల్లో రూ.కోట్లాది చేతివాటం కేసుల్లో మునిగిందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన జొన్నలకు ఇంతవరకు డబ్బులు చెల్లించక పోవడాన్ని తప్పుబట్టారు. విద్యుత్ బిల్లు చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

మోస్తరు వర్షం



వర్షంతో చిత్తడిగా మారిన రోడ్డు

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం తెల్లవారు జాము నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎక్కడ చూసిన రహదారులు చిత్తడిగా మారాయి. రంగమందిరం, మున్నూరువాడి, బంగికుంట, మడ్డిపేట, గద్వాల్ రోడ్డు, గాంధీ చౌక్, మహవీర్ చౌక్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లోకి వర్షపు నీరు చొరబడ్డాయి.

సాంఘిక న్యాయం కరువు



మాట్లాడుతున్న వెంకటేష్ నాయక్

రాయచూరు రూరల్: సమాజంలో సాంఘిక న్యాయం కరువైందని నాయక్ పోరాట సమితి సంచాలకుడు వెంకటేష్ నాయక్ ఆరోపించారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయక్ వర్గాల హక్కులను పరిరక్షించడంలో ఎస్టీ ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఉపకార వేతనాలు మంజూరు కావడం లేదన్నారు. రూ.187 కోట్ల ఎస్టీ అభివృద్ధి మండలి నిధులను ఎస్టీ వర్గాల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతరత్రాలకు మళ్లించడాన్ని ఖండించారు.

డెంగీతో బాలిక మృతి

హుబ్లీ: అనుమానాస్పద డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఉడిపికి చెందిన ప్రథమ పీయూసీ విద్యార్థిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఇటీవల మృతి చెందిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఇక్కడి ప్రైవేటు కళాశాలలో చదువుతున్న 17 ఏళ్ల బాలిక తీవ్ర జ్వరంతో బాధపడటంతో చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక ఈనెల 11న మృతి చెందింది.

ప్రభుత్వ నిధుల లబ్ధి పొందాలి

- సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి
- 15వ ఆర్థిక కమిషన్ అధ్యక్షుడు నారాయణస్వామి

కోలారు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను స్థానిక సంస్థలు సద్వినియోగం చేసుకోవడమేగాకాకుండా సొంతంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని 15వ ఆర్థిక కమిషన్ అధ్యక్షుడు నారాయణస్వామి తెలిపారు. సోమవారం నగరంలోని నగరభ కార్యాలయంలో నగరసభ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, సమాజ అభివృద్ధికి నగర పాలక సంస్థలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. లభ్యమున్న నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. నిధులను సకాలంలో వినియోగించుకోకుంటే అవి వెనక్కు వెళ్లిపోతాయన్నారు. అందువల్ల నిర్ణీత సమయంలో నిధులు ఖర్చు చేయాలన్నారు.

ప్రభుత్వాలపై ఆధారపడకూడదు

స్థానిక సంస్థలు ప్రతి విషయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడకూడదన్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ, నగర ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రజలు వలస వస్తున్నారు. అదేవిధంగా నగరాలు తమ వ్యాప్తిని పెంచుకుంటున్నాయి. దీని వల్ల స్థానిక సంస్థల ఆదాయం పెరుగుతుంది. ఇలాంటి విషయాలపై అధికారులు ఆలోచన చేయాలన్నారు. నగరసభ సభ్యుడు ప్రవీణ్‌గౌడ మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులపైనే ఆధారపడాల్సిన పరిస్థితిలో కోలారు నగరసభ ఉందన్నారు. పన్నులు సక్రమంగా వసూలు కావడం లేదన్నారు. వసతి సౌలభ్యం కోసం లైసెన్సులు పొందిన వాటిని వాణిజ్య కేంద్రాలుగా మారుస్తున్నారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి

నగరసభ ఆదాయానికి గండి

తద్వారా నగరసభ ఆదాయానికి గండి పడుతోందన్నారు. నగరసభ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేసి రక్షించాలన్నారు. కోలారు నగరసభలో ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువగా ఉందన్నారు. వచ్చే ఆదాయం సిబ్బంది వేతనాలకే సరిపోవడం లేదన్నారు. సభ్యుడు ఎస్ఆర్ మురళీగౌడ మాట్లాడుతూ నగరంలో జనాభా ప్రతియేటా పెరుగుతోందన్నారు. సర్వే నెంబర్ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇ-ఖాతా చేసిస్తే నగరసభ ఆదాయం పెరుగుతుందన్నారు. నగరసభ, ప్రభుత్వ ఆస్తులపై కొంతమంది కోర్టుకు వెళ్లారన్నారు. నగరసభలో అన్ని దాఖలాలు ఉన్నా ఈ ఆస్తులను రక్షించే ఆలోచన చేయడం లేదన్నారు. సమావేశంలో నగరసభ కమిషనర్ శివానంద పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతాం

- జిల్లా ఎస్పీ శోభారాణి వెల్లడి

బళ్లారి టౌన్: నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, వాహనాల పార్కింగ్, వాహనాలను నడపడంపై అవగాహన కార్యక్రమాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టిని సారించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని నూతన ఎస్పీ డాక్టర్ శోభారాణి తెలిపారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు కేసుల్లో అరెస్టు చేసిన నిందితుల వివరాలను తెలిపిన అనంతరం మాట్లాడారు. ఇటీవల తాను నగరంతో పాటు జిల్లాలో పర్యటించానన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య పెను సవాలుగా మారిందన్నారు. తాను బెంగళూరు లాంటి మెట్రో నగరంలో పని చేశానన్నారు. అయితే అక్కడ వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు ఉన్నాయన్నారు.

పార్కింగ్ ప్లేస్‌లు గుర్తిస్తాం

బళ్లారిలో పార్కింగ్ ప్లేస్‌లు లేవన్నారు. తాము స్థలాలను గుర్తించి పార్కింగ్ వ్యవస్థ కల్పిస్తే కొంత వరకు ఉపశమనం లభిస్తుందన్నారు. అంతేగాక ఫుట్‌పాత్‌లను ఆయా దుకాణదారులు ఆక్రమించుకొన్నందున పాదచారులకు ఆటంకం కలుగుతోందన్నారు. దీనిపై కూడా ముమ్మందు తాను చర్యలు తీసుకుంటానన్నారు. అయితే ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. నగరంలో డ్రైవింగ్‌పై అవగాహన లేక హెల్మెట్లు ధరించకుండా వాహనాలను నడుపుతున్నారని, దీనిపై కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సండూరు తాలూకా కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలో జిందాల్ సా కంపెనీలో రామశంకర్ విశ్వకర్మ అనే కార్పెంటర్‌ను హత్య చేసిన ఇద్దరు నిందితులు సురేంద్ర, కిశోర్‌లాల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ శోభారాణి

ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించమన్నందుకే..

ఈ హత్యకు కారణం అప్పు ఇచ్చిన వ్యక్తి ఆ సొమ్మును తిరిగివ్వాలని అడిగినందుకే హతమార్చినట్లు తెలిపారు. అదే విధంగా గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది మార్చి 8న కప్పగల్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద గల సాయి ఆర్యన్ అపార్ట్‌మెంట్‌లో ధనుంజయరెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దోపిడీ చేసిన నిందితుడు కార్తీక్‌ను అరెస్టు చేసి రూ.8,26,500లు విలువగల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అదే విధంగా గత ఏడాది అక్టోబర్ 24న, నవంబర్ 15న, బళ్లారి, కంప్లిలో దొంగతనం చేసిన నిందితులు వడ్డే పీటిల్, గంగాధరను అరెస్టు చేసి రూ.4,30,000 విలువగల బంగారు ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఆమె తెలిపారు.

సమాజ సేవే కలాం సంస్థ ధ్యేయం



యాపలదిన్నిలో ఏర్పాటు చేసిన కలాం కల్పవృక్షవనం

- గడినాడు సరిహద్దుల్లో సేవకు ప్రతి రూపం
- ఏటా విజ్ఞాన రంగ సేవకులకు అవార్డులు

రాయచూరు రూరల్: నక్సలైట్ ప్రభావిత కర్ణాటక–తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని పల్లెటూరులో పుట్టిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో యువకుల బృందం ఓ సేవా సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ఉదార మనోగుణంతో ఏడాదికి ఒకసారి 25 మంది విజ్ఞాన రంగంలో సేవలందించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సమాజ సేవకులను గుర్తించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో రాష్ట్ర స్థాయి అవార్డులను అందించేందుకు శ్రీకారం చుట్టారు. రాయచూరు తాలూకా యాపలదిన్నిలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంస్థ అధ్యక్షుడిగా విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహులు విధులు నిర్వర్తిస్తున్నారు. గత 13 ఏళ్ల నుంచి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, వ్యక్తిత్వ వికాసం, రక్తదాన శిబిరాలు, అభ్యాస సామగ్రి, నీరు, పరిసరాల సంరక్షణ, కలాం కల్పవృక్ష వనం నిర్మాణాలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి అనంత్ కుమార్ హెగ్డే భార్య తేజస్విని కలాం సంస్థ చేసిన సేవలను కొనియాడారు. గ్రామంలో కలాం విగ్రహం ఏర్పాటుకు తేజస్విని ఏడాది క్రితం భూమిపూజ చేశారు. ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో ఇప్పటికే నాలుగు పుస్తకాలను ముద్రించారు.



విగ్రహ నిర్మాణానికి తేజస్విని అనంత్ కుమార్ భూమిపూజ చేస్తున్న దృశ్యం



శ్రమదానం చేస్తున్న సభ్యులు

పరిశ్రమల స్థాపనతో ఉపాధికి ఊతం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాలూరు: మౌలిక సౌకర్యాలకు దూరమైన తాలూకాలోని దిన్నహళ్లి, రాజేనహళ్లి, తృణసి జీపీల పరిధిలోని గ్రామాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలను స్థాపిస్తే ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు, ప్రజలకు ఎంతో అనుకూలం అవుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ మంజునాథ్‌గౌడ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌జీ కళ్యాణ మంటప సభాంగణంలో బీజేపీ, జేడీఎస్ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపీ ఎస్.మల్లేష్‌బాబుకు సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తాలూకాలో అవినీతి, అక్రమాలు తాండవిస్తున్నాయన్నారు. జీపీ, తాలూకా కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదని ఆరోపించారు. నూతన ఎంపీ మల్లేష్‌బాబు మృదు స్వభావి, ప్రజా సమస్యలను పరిష్కరించే ఆసక్తితో ఉన్నారన్నారు. తాలూకాలో పరిశ్రమల స్థాపనకు ఎంపీ కృషి చేయాలన్నారు. ఇదే సమయంలో నూతన ఎంపీని ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జేడీఎస్ నాయకుడు రామేగౌడ, కార్యదర్శి బణకనహళ్లి నటరాజ్, తాలూకా బీజేపీ అధ్యక్షుడు కృష్ణప్ప పాల్గొన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు లేదు



మాట్లాడుతున్న కేహెచ్ మునియప్ప

కోలారు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని, ఇదంతా కేవలం విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కేహెచ్ మునియప్ప స్పష్టం చేశారు. ఆయన సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. ముడా వ్యవహారంలో ముఖ్యమంత్రి పాత్ర ఎంత మాత్రం లేదు. కేసులు విచారణ దశలో ఉన్న సమయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అప్పుడే తుది నిర్ణయానికి రావడం సరికాదు. విచారణ పూర్తయిన తరువాత వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. విపక్షాలు నిర్మాణాత్మక విషయాలపై చర్చిస్తే బాగుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఐదు గ్యారెంటీ పథకాల వల్ల కోట్ల మందికి ప్రయోజనం కలిగిందన్నారు. గ్యారెంటీలతో అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేదన్నారు. చిట్టచివరి వ్యక్తి కూడా జీవించడానికి అవకాశం కల్పించామన్నారు.

పరిషత్ నేతగా బోసురాజు

శివాజీనగర: విధాన పరిషత్ సభా నాయకునిగా మంత్రి బోసురాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సమావేశంలో సభాపతి బసవరాజ హొరట్టి ప్రకటించారు. సీఎం సిద్దరామయ్య సహా పలువురు సభ్యులు బోసురాజును అభినందించారు.

కోలారు వార్తలు...

నోటు పుస్తకాల పంపిణీ

కోలారు: సుప్రీం సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రమణ మహర్షి విద్యాలయంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు నాగానంద కెంపరాజ్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు తోడు విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తోందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు బి.శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులు దాతల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. సంస్థ ప్రముఖుడు సుప్రీం మాట్లాడుతూ పాఠశాలను తమ సొంత విద్యా సంస్థగా తాము భావిస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కసాప తాలూకా గౌరవ అధ్యక్షుడు టి.సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చెట్ల నరికివేతయత్నం భగ్నం

కేజీఎఫ్: శ్రీనివాససంద్ర జీపీలోని పిలవార గ్రామ చెరువులో విలువైన చెట్లను నరికేస్తున్న విషయాన్ని స్థానికులు జీపీ అధికారుల దృష్టికి తేవడంతో పంచాయతీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. 15 రోజుల క్రితమే చెరువులోని చెట్లను బహిరంగ వేలం వేస్తామని అధికారులు ప్రకటించి కరపత్రాలను పంచారు. అయితే గ్రామస్తులు కొందరు గ్రామంలోని ఆలయ రథ నిర్మాణానికి కలప అవసరం ఉండడంతో బహిరంగ వేలం వేయకుండా రథనిర్మాణం కోసం కలపను వాడుకోడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే పంచాయతీ సమావేశంలో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరక పోవడంతో వేలం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేశారు. ఈక్రమంలో సోమవారం పంచాయతీ సభ్యుడు, మాజీ సభ్యుడు కలిసి చెరువులో ఎండిన చెట్లను నరికి తొలగిస్తుండడాన్ని గుర్తించిన స్థానికుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న అధికారులు చెట్లను నరకడాన్ని ఆపేయించారు.



చెరువులో చెట్లను నరుకుతున్న దృశ్యం

19 నుంచి సంగీతోత్సవాలు

కోలారు: చింతామణి తాలూకా కైవార క్షేత్రంలోని సద్గురు యోగినారాయణ మఠంలో ఈనెల 19 నుంచి 21 వరకు గురుపూర్ణిమను పురస్కరించుకుని మూడు రోజుల పాటు గురుపూజ సంగీతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మఠం సంకీర్తన సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతార్ తెలిపారు. ఆయన సోమవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంగీతోత్సవంలో జాతీయ స్థాయి ప్రఖ్యాతి గాంచిన సంగీత కళాకారులు, పెద్ద సంఖ్యలో భజన బృందాలు నాదోపాసన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 19న మఠం ధర్మాధికారి ఎంఆర్ జయరాం ఉదయం 6 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. సంగీతోత్సవంలో స్థానిక కళాకారులతో పాటు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సంగీత కళాకారులు, హరికథా విద్వాంసులు విచ్చేస్తున్నారన్నారు. 72 గంటల పాటు నిరంతరంగా కొనసాగే ఈ సంగీతోత్సవానికి మూడు రోజుల పాటు భారీగా భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కైవార మఠం ప్రచారకులు తళగవార ఆనంద్, మేనేజర్ లక్ష్మీనారాయణ, దాత సత్యనారాయణ ఆచార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ భాగవతార్

ఆక్రమణల తొలగించరూ



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: గోమాళం భూమిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు ట్రాక్టర్లతో ధర్నా నిర్వహించారు. క్యాసంబళ్లి జీపీలోని సర్వరెడ్డిహళ్లిలో చాలా ఏళ్లుగా సర్వే నెంబర్–46లో 8 అడుగుల కాలు దారి ఉండేదని, పూర్వీకులు ఎలాంటి షరతులు లేకుండా మానవతా దృష్టితో రైతులు, గ్రామ ప్రజలు నడవడానికి కాలుదారిని వదిలారని తెలిపారు. అయితే కాలుదారిని కొందరు నకిలీ దాఖలాలతో ఆక్రమించుకుంటున్నందున అధికారులు సర్వే చేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాగవేణికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మరగల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు రామసాగర వేణు, బాబు, సుప్రీంచల, గంగాధర్, తిమ్మణ్ణ పాల్గొన్నారు.

కర్ణాటక వర్సిటీ వెబ్‌సైట్ హ్యాక్

హుబ్లీ: కర్ణాటక విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన దుండగులు అందులో అశ్లీల వీడియోలను అప్‌లోడ్ చేశారు. విశ్వవిద్యాలయం సమగ్ర సమాచారంతో పాటు విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని సమకూర్చడానికి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. అయితే దీన్ని హ్యాక్ చేసి ఎవరో దుండగులు అశ్లీల వీడియోలను ప్రసరింప జేశారు.

క్లుప్తంగా

తుమకూరులో చిరు జల్లులు



తుమకూరు: తుమకూరు నగరంలో సోమవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. దీంతో ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చలిగాలులతో పాటు తుంపర్లు కొనసాగాయి.

విరిగిపడ్డ కొండచరియలు

● భారీ ట్రాఫిక్ జామ్

దొడ్డబళ్లాపురం: కొండచరియలు రోడ్డుకు అడ్డంగా విరిగిపడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డ సంఘటన బెంగళూరు–హొన్నావర రహదారి మార్గంలో చోటుచేసుకుంది. హొన్నావర తాలూకా ఖర్వా క్రాస్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టి దిబ్బలను తొలగించే పనులు చేపట్టింది. అయితే భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండచరియలు విరిగిపడుతూనే ఉన్నాయి. దీంతో పనులకు అంతరాయం కలుగుతోంది.

బాధ్యతల స్వీకరణ



బొమ్మనహళ్లి : కన్నడ చిత్ర నిర్మాత, కాంగ్రెస్ నాయకుడు ఉమాపతి గౌడ కర్ణాటక రాష్ట్ర ఒక్కలిగ సంఘం కోశాధికారిగా ఎన్నిక కావడంతో సోమవారం సంఘం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బొమ్మనహళ్లి ఒక్కలిగ సంఘం సభ్యులు ఉమాపతి శ్రీనివాస్‌గౌడను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనహళ్లి ఒక్కలిగ సముదాయం నాయకులు, బొమ్మనహళ్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.రవింద్రగౌడ, స్థానిక కాంగ్రెస్ నాయకుడు యోగేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కృష్ణరాజపురం: రాష్ట్ర మానవ హక్కుల జాగృతి సమితి ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి, బెంగళూరు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ప్రారంభించారు. హొసకోటె నగరంలోని కన్నురహళ్లిలో ఉన్న ఎం.వి లేఔట్‌లో ఉన్న స్వామి వివేకానంద విద్యాకేంద్ర ఆవరణంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో నగలాపుర మఠాధిపతి శ్రీతేజ శైలలింగశివాచార్య స్వామీజీ, స్థానిక నాయకులు గోపాలగౌడ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బీ.వి.బైరేగౌడ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. బార్ యజమాని మృతి

దొడ్డబళ్లాపురం: ఇంటిలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో బార్ యజమాని మృతి చెందిన ఘటన ఉడుపి పట్టణంలో చోటుచేసుకుంది. రమానందశెట్టి (52) మృతుడు. రమానంద శెట్టి ఉడుపి పట్టణంలోని అంబలపాడిలో శెట్టి బార్ అండ్ రెస్టారెంట్ నడుపుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఇంటిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ రమానందశెట్టిని ఆస్పత్రికి తరలించినప్పటికీ చికిత్స ఫలించక మృతి చెందాడు. ప్రమాదంలో రమానంద భార్య అశ్విని కూడా గాయాలపాలైంది. పిల్లలు మేడమీద పడుకోవడంతో ప్రాణాలతో బయపడ్డారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్‌గా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్నారు.

హీరో రక్షిత్ శెట్టిపై ఎఫ్ఐఆర్

దొడ్డబళ్లాపురం: హీరోరక్షిత్ శెట్టిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. రెండు సినిమా పాటలను అనుమతి తీసుకోకుండా వాడుకున్నాడన్న ఆరోపణలపై రక్షిత్ శెట్టిపై యశ్వంతపుర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు చేశారు. ఎంఆర్‌టీ మ్యూజిక్ భాగస్వామి నవీన్‌కుమార్ బ్యాచులర్ పార్టీ సినిమాలో న్యాయ ఎల్లిదె, గాళిమాతు సినిమాలోని పాటలను అనుమతి తీసుకోకుండా వాడుకున్నాడని రక్షిత్ శెట్టిపై కేసు పెట్టాడు.

మొబైల్ టవర్ తొలగించండి



తుమకూరు: తుమకూరు నగరంలోని పాలికె పరిధిలోని 24వ వార్డు ఉప్పారహళ్లి సైకిల్‌స్టాండ్ ఫ్యాక్టరీ రోడ్డులో ఉన్న సెల్ టవర్‌ను తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఉన్న ఈ మొబైల్ టవర్ వద్ద కోతులు నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, మరో వైపు పాములు కూడా ఇక్కడ తిరుగుతున్నాయని, వెంటనే టవర్‌ను తొలగించాలని పాలికె అధికారులకు విజ్ఞప్తి చేశారు.

దోచేస్తున్న సైబర్ దొంగలు

● ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో వల
● సైబర్ సిటీలో పేట్రేగిపోతున్న వంచకులు
● ఆన్‌లైన్ నేరాల్లో బెంగళూరు టాప్


అమాయకులకు వల వేసి టోకరా

బనశంకరి: సిలికాన్‌సిటీ, ఐటీబీటీ నగరంగా ఖ్యాతిగడించిన బెంగళూరు నగరం ఆన్‌లైన్ నేరాల్లో టాప్‌లో ఉంది. బెంగళూరు నగర పోలీసులు ప్రజలను ఎంత జాగృతం చేస్తున్నప్పటికీ విభిన్న పంథాలో సైబర్‌కేటుగాళ్ల ఆన్‌లైన్ వంచనలకు తెగబడి లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. గత నాలుగేళ్లలో ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగాలు అంటూ దేశంలోనే 73 శాతం వంచన కేసులు బెంగళూరు నగరంలో చోటుచేసుకున్నాయి. ఆన్‌లైన్ ఉద్యోగం, నకిలీ యాప్‌తో పాటు విదేశీ కంపెనీలు పేరుతో వంచనకు పాల్పడేవారి సంఖ్యలో బెంగళూరు నగరం మొదటిస్థానంలో నిలిచింది. 2020 జనవరి 1 నుంచి 2024 మే మధ్య రాష్ట్రంలో మొత్తం 9,479 వంచన కేసులు వెలుగుచూశాయి. ఇందులో బెంగళూరు నగరంలోనే 6,905 కేసులు నమోదు కావడం విశేషం. 2023లో 4,098 వంచన కేసులు వెలుగుచూడగా ఈ ఏడాది 2024 మే నాటికి 2,185కు చేరుకుంది. డిసెంబరు నాటికి 5 వేలకు పైగా చేరుకునే అవకాశం ఉందని పోలీస్‌శాఖ అంచనా వేసింది.

సీఐడీ పోలీసులు తెలిపిన ప్రకారం ఆన్‌లైన్ ఉద్యోగ వంచనలు, కుంభకోణాలు పెరిగాయని కేటుగాళ్లు బహిరంగ స్థలాల్లో ప్రకటనలు అంటించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతకు ఆశ చూపించి డబ్బు దోచేస్తున్నారు. కానీ ఈ వ్యవస్థ మార్పులు రావడంతో సోషల్‌మీడియాలో ఈ దందా హెచ్చుమీరింది. గత జనవరిలో సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి మోసాలకు పాల్పడుతున్న ముఠాను ఛేదించారు. రూ.158 కోట్లు దోచుకున్నట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. దేశం బయటి నుంచి ఫోన్లు వచ్చినట్లు కనిపెట్టారు.

సైబర్ వంచకులు హవా

ఆన్‌లైన్ ఉద్యోగాలు కాకుండా వివిధ ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడటం ద్వారా ప్రజలను వంచనకు పాల్పడుతున్న కేసులు హెచ్చుమీరాయి. రాష్ట్రంలో నిత్యం వందలాది సైబర్ వంచన కేసులు నమోదు అవుతున్నాయి. విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతరులను సైబర్ మోసాలకు తెగబడుతున్నారు. ఇటీవల న్యాయవాదిని మోసగించి లక్షలాది రూపాయలు బ్యాంకు అకౌంట్‌కు నగదు జమ చేసుకున్నారు. అంతేగాక వృద్ధుడు, మహిళా టెక్కీకి ఫోన్ చేసిన వంచకులు లక్షల రూపాయాలు వసూలు చేసుకున్నారు. ఇక డ్రగ్స్‌పేరుతో పార్శిల్ పంపించి పోలీస్, సీసీబీ అధికారులు పేరుతో ప్రజలను బెదిరించి నగదు కాజేస్తున్నారు.

సైబర్ వంచన కేసులు ఇటీవల హెచ్చుమీరాయని, దీని గురించి పోలీస్‌శాఖ సీసీబీ నిరంతరంగా ప్రజలను జాగృతం చేస్తోందని మొబైల్స్‌కు వచ్చే ఓటీపీ, గుర్తుతెలియని వ్యక్తులు నుంచి లింక్‌లను తెరవరాదని సూచిస్తున్నామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని కేసులు ఛేదించామని బెంగళూరు నగరంలోనే కాకుండా విదేశాల్లో కూడా సైబర్‌నేరాలు హెచ్చుమీరాయని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు.

రూ.1800 కోట్లతో వైట్ టాపింగ్ రోడ్డు

● డీసీఎం డీ.కే.శివకుమార్


భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న డీసీఎం

శివాజీనగర: బెంగళూరులోని రోడ్లు పదే పదే దెబ్బతింటున్న నేపథ్యంలో శాశ్వత రోడ్లను నిర్మించేందుకు రూ.1800 కోట్లతో 157 కి.మీ.వైట్ టాపింగ్ రోడ్లు నిర్మించనున్నామని డీసీఎం డీ.కే.శివకుమార్ తెలిపారు. బ్రాండ్ బెంగళూరు సజావు సంచార బెంగళూరు సంకల్పం కింద చామరాజపేట, గాంధీనగర, మల్లేశ్వరం, మహాలక్ష్మీపురలలో రూ.200 కోట్లతో 19.67 కి.మీ. వైట్ టాపింగ్ రోడ్డు నిర్మాణ పనులకు డీసీఎం డీ.కే.శివకుమార్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బెంగళూరులోని ప్రధాన రోడ్లలో గుంతలు పడకూడదనే ఉద్దేశ్యంతో వైట్ టాపింగ్ రోడ్లు చేపట్టామని, ఈ రోడ్లు సుమారు 25 సంవత్సరాల పాటు మన్నికగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మంత్రి దినేశ్‌గుండురావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం

హోసూరు: ప్రజాసేవకు గాను హోసూరు కార్పొరేషన్ మొదటి వార్డ్ అన్నాడీఎంకే కార్పొరేటర్ అశోక్‌రెడ్డికి రాజ్ టీవీ ద్వారా సన్మానించారు. 1వ వార్డు జూజువాడి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలను ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా తీర్చిద్దడానికి సహకరించి, స్థానిక ప్రజల మన్ననలందుకొన్న అశోక్‌రెడ్డిని రాజ్‌టీవి గుర్తించి ప్రజా సేవకుడిగా బిరుదు అందజేసేందుకు ఎంపిక చేశారు. సోమవారం ఎంజీఆర్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది.

25న బెంగళూరులో భారీ ధర్నా


మాట్లాడుతున్న సంఘం నేతలు

తుమకూరు: వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంకు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న బెంగళూరు ఫ్రీడం పార్కులో వాల్మీకి స్వాభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం నేత చళివళి రాజన్న తెలిపారు. సోమవారం ఆయన తుమకూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ...వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో మంత్రులు, అధికారులు రూ. 187 కోట్లు దోచేశారని, పేదలకు లభించాల్సిన నిధులను లూటీ చేశారని ఆరోపించారు. 25 భారీ ధర్నాకు తరలిరావాలని కోరారు.

సమగ్ర చెత్త నిర్వహణకు ప్రాధాన్యత


సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులతో కమిషనర్ తుషార్

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో సమగ్ర చెత్త నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దీనికోసం అనేక పథకాలు చేపడుతున్నామని బీబీఎంపీ పాలనాధికారి ఎస్.ఆర్.ఉమాశంకర్ తెలిపారు. సోమవారం బీబీఎంపీ సీ40 నగరాల సంయుక్త ఆధ్వర్యంలో వాతావరణక్రియ గురించి వికాససౌధలో రెండురోజుల పాటు నిర్వహించే సెమినార్‌ను పాలనాధికారి ఉమాశంకర్ ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరు నగరంలో పొడిచెత్త సమస్య నివారించే ఉద్దేశంతో అనేక చర్యలు తీసుకున్నామని, వాటిని అమలు చేసే దృష్టితో సమగ్ర చెత్త నిర్వహణ కోసం పాలికె నలుదిక్కుల్లో 50 నుంచి 100 ఎకరాల ప్రభుత్వ యాజమాన్యంలో భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రభుత్వం భూమిని పాలికెకు అప్పగించే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. నగరంలో తడి, పొడి చెత్తను కచ్చితంగా విభజన చేసే ప్రక్రియ జరగాలని చెత్తతో విద్యుత్ ఉత్పత్తిచేసే కేంద్రాన్ని నగరంలో ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో వాతావరణ కాలుష్యం నియంత్రణకు అనేక పథకాలు రూపొందించి వాటిని కార్యరూపంలోకి తీసుకువస్తామన్నారు. నగరవ్యాప్తంగా పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మొక్కలు నాటి పెంచాలని తెలిపారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో చాలామార్పులు చోటుచేసుకున్నాయని దీంతో కాలుష్యం తీవ్రప్రభావం చూపుతుందని అందరూ కలిసి కాలుష్యనియంత్రణకు కృషి చేయాలన్నారు. నగరంలో వర్షాలు నేపథ్యంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. సెమినార్‌లో 100 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ ప్రీతిగెహ్లాట్, రమామణి, బసవరాజ్‌కబాడే, సీ40 సిటీస్ ఇంక్లోసివ్‌క్లైమైట్ యాక్షన్ డైరెక్టర్ జాక్విన్ బర్గెస్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం బూట్లు పోయాయి !

శివాజీనగర: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బూట్లు చోరీ అయిన ఘటన బెంగళూరు సదాశివనగర భాష్యం సర్కిల్‌లో జరిగింది. వైట్ టాపింగ్ రోడ్డు పనుల పూజలకు వచ్చిన డీకేశి ఆ సమయంలో షూస్ విప్పి పూజలు చేశారు. అనంతరం పూజలు ముగించుకుని కారు వద్దకు వెళ్లగా బూట్లు కనిపించలేదు. చుట్టుపక్కల చూసినా దొరకలేదు. దీంతో ఆయన తన కారులో ఉన్న మరో షూ జత ధరించి వెళ్లిపోయారు.

విధానసౌధ పశ్చిమ ద్వారం ప్రారంభం

శివాజీనగర: విధానసౌధ పశ్చిమ ద్వారానికి కొత్త రూపు తీసుకువచ్చారు. అత్యంత ఆకర్షణకు నవీకరించిన ఈ ద్వారాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ యూ.టీ ఖాదర్, విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వారం వద్ద రాజ్యాంగ పీఠికను ఏర్పాటు చేసినందుకు సభాధ్యక్షుడిని సీఎం ప్రశంసించారు.

అక్షర దాసోహ ఉద్యోగుల ధర్నా

శివాజీనగర: రాష్ట్ర అక్షర దాసోహ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) నేతృత్వంలో నగరంలోని ఫ్రీడం పార్కులో నిరవధిక సమ్మె చేపట్టారు. బిసిఊట ఉద్యోగులు తమ పనులను స్తంభింపజేసి ఫ్రీడం పార్కులో ధర్నాకు దిగారు. గత సంవత్సరం కమిషనర్ కార్యాలయంలో తమ డిమాండ్ల గురించి సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఆ సమావేశంలో ఇప్పటికే రిటైర్ అయిన, రిటైర్ అవుతున్న బిసిఊట ఉద్యోగులకు ప్రావిడెండ్ ఫండ్ జారీ చేసే విషయం చర్చించారు. నవంబర్ 10, 2023న విద్యామంత్రి అధ్యక్షతలో తమ సంఘం పదాధికారులతో జాయింట్ సమావేశం జరిగింది. నవంబర్ 15న అప్పటి విద్యామంత్రి తమ డిమాండ్ల గురించి ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో చర్యలు తీసుకునే విషయం గురించి రాతపూర్వక పత్రాన్ని పంపి, పోరాటాన్ని ఉప సంహరించుకోవాలని కోరడంతో ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో పోరాటాన్ని రద్దు చేసుకున్నారు. ఈ చర్చలు జరిపిన విధంగానే ఉద్యోగులకు న్యాయం చేస్తామని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంతే కాకుండా బడ్జెట్ సమయంలో, ఎన్నికల సమయంలో ఈ ఉద్యోగులకు జీతం పెంచనున్నట్లు భరోసా ఇచ్చారు. అయితే ఇంతవరకు కూడా అది అమలు కాలేదని వాపోయారు.

నోటు పుస్తకాలు పంపిణీ



చింతామణి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు నేడు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని జీవనెల ఛారిటీ అధ్యక్షుడు శశివర్ధన్ తెలిపారు. సోమవారం కైవార మండలం పరిధిలోని అట్టూరు. వడ్డహళ్లి, వైజకూరు గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. తాను తాలుకాలో రెండు గ్రామాలను దత్తత తీసుకున్నానని చెప్పారు. కార్యక్రమంలో మంజునాథ, అచ్చప్ప, మునిరాజ, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊరి రోడ్డు బాగు చేయరూ


ఏఈఈకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: గ్రామాల నుంచి నగరానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సోమవారం ఉదయం వివిధ గ్రామాల ప్రజలు ప్రజాపనుల శాఖ ఏఈఈకి విజ్ఞప్తి చేశారు. అలీపురం నుండి సీగలహళ్లి, గుంతమడుగు, కామగానహళ్ళి, కొండాపురం, గదరె మార్గంగా సింగానహళ్లి వరకు రోడ్డు మరమ్మతులకు గురైందని, పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. దీంతో వృద్దులు, వికలాంగులు రోగులు గౌరిబిదనూరుకు వెళ్లాలంటే ఎంతో కష్టంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి ఈ రోడ్లను బాగు చేయాలని వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లక్ష్మీనారాయణ్, శ్రీనివాసగౌడ ,ప్రవీణ్‌రెడ్డి, హరీశ్‌కుమార్, వసంత, నాగరాజు, చంద్రశేఖర్, పవన్, మల్లేశ్, సంజప్ప తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి పేరుతో లక్షలు టోకరా

మైసూరు: సైబర్ కేటుగాళ్లు షేర్ల కొనుగోలు పేరిట అమాయకులను వంచిస్తూనే ఉన్నారు. తాజాగా ఓ వ్యక్తి రూ. 41 లక్షలు మోసపోయాడు. మైసూరు గోకులంకు చెందిన ఉదయ్ బాధితుడు. ఇతని సెల్‌కు వచ్చిన మెసేజ్ చూసి అందులోని నెంబర్‌కు కాల్ చేశాడు. ఓ వ్యక్తి లైన్‌లోకి వచ్చి స్టాక్ మార్కెట్‌లో తాము చెప్పిన కంపెనీలలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని చెప్పి నమ్మించాడు. దీంతో అతని మాటలు నమ్మిన ఉదయ్ వారు చెప్పిన ఖాతాలకు రూ. 41 లక్షలు జమ చేశాడు. అనంతరం ఎటువంటి మెసేజ్ రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి మైసూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం


కంటి అద్దాలను అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మనహళ్లి బీజేపీ ఎస్సీ మోర్చ నాయకుడు, సమాజ సేవకుడు బీ.వై.రమేష్ అన్నారు. బెంగళూరు నగరంలోని బొమ్మనహళ్లి పరిధి తాయప్ప గార్డెన్ లేఔట్‌లో నారాయణ నేత్రాలయ, సమృద్ధి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, చందాపుర చిన్మయ సేవా సంస్థ వారి సహకారంతో వైద్య చికిత్స పొందిన వారికి సోమవారం ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. అ సందర్భంగా బీ.వై.రమేష్ మాట్లాడుతూ...బెంగళూరు నగరంలో వైద్య పరీక్షలు ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమని, ఇలాంటి సమయంలో పేదల కోసం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పేదలు, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ యువ అవార్డు గ్రహీత డాక్టర్. చిన్నప్ప చిక్కహాగడె, స్థానిక నాయకులు రవిశంకర్, ముకుంద్‌రాజు, రామమూర్తి, చందాపుర రమేష్, సమృద్ధి సురక్ష ఉమెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షురాలు లలితారాజ్, ప్రధాన కార్యదర్శి ఉమా, కోశాధికారి శైలాజ, పదాధికారులు ప్రియా, కోకిల, గీతా, మీనా తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని బైకిస్టు మృతి

మైసూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడులోని సుజాతపురం వంతెన వద్ద జరిగింది. మృతుడిని శరత్ ప్రకాశ్ (18)గా గుర్తించారు. కేరళకు చెందిన శరత్ బెంగళూరు ఆచార్య కళాశాలలో నర్సింగ్ చదువుతున్నాడు. సోమవారం ఉదయం బైక్‌లో తన మిత్రుడు జోసెఫ్ అయోజిత్‌తో కలిసి కేరళ నుంచి బెంగళూరు బయలుదేరారు. సుజాతపురంలోని మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో శరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన జోసెఫ్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మైసూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎన్ఆర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద రూ. 40 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మైసూరులోని కేసరె ప్రాంతంలో నివాసం ఉంటున్న మహ్మద్ అక్బర్ ఎన్ఆర్ మోహల్లాలో గంజాయి విక్రయిస్తుండగా గస్తీలో ఉన్న పోలీసులు పట్టుకుని నిందితుడిని, గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నాణ్యమైన వైద్యం చేయాలి



మండ్య: వైద్యో నారాయణో హరి అనే సూక్తికి తగినట్లుగా వైద్యులు నడుచుకోవాలని, అనారోగ్యంతో వచ్చే వారికి నాణ్యమైన వైద్యం చేయాలని భారతీయ వైద్య విద్యా సంఘం మండ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్.టి.ఎస్. మరిగౌడ అన్నారు. వైద్యవిద్యా సంఘం ఆధ్వర్యంలో మండ్య నగరంలోని సుమన నర్సింగ్ సమావేశం హాల్లో నిర్వహించిన వైద్యుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ... రోగులతో ప్రేమగా మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యను తెలుసుకుని వైద్యం చేయాలన్నారు. అప్పుడే ప్రజలు వైద్యుల్లో దేవుడిని చూస్తారన్నారు.

జేడీఎల్‌పీ నేతగా సురేశ్ బాబు నియామకం

శివాజీనగర: జేడీఎస్ శాసనసభ పక్ష నేతగా చిక్కనాయకనహళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సురేశ్‌బాబును నియమించారు. జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు హెచ్.డీ.కుమారస్వామి సిఫారస్సు మేరకు జేడీఎస్ పార్టీ నాయకుడిగా నియమించినట్లు శాసనసభ స్పీకర్ యూ.టీ.ఖాదర్ ప్రకటించారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన సురేశ్‌బాబు, తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్ళి నియోజకవర్గం నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇంతకు ముందు హెచ్.డీ.కుమారస్వామి జేడీఎస్ శాసనసభ నాయకుడిగా పని చేస్తుండేవారు. తాజాగా బీజేపీ–జేడీఎస్ పొత్తు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.. ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా ఇవ్వడంతో ఖాళీ అయిన జేడీఎల్‌పీ స్థానంలో సురేశ్‌బాబు నియమించారు.

హోసూరు వార్తలు..

పార్క్ అభివృద్ధికి చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సత్య

హోసూరు: హోసూరు కార్పొరేషన్ రామనాయకుని చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కును మరింత అభివృద్ధి పరిచి స్థానిక ప్రజలకు వసతులు కల్పిస్తామని మేయర్ ఎస్.ఏ.సత్య అన్నారు. సోమవారం ఉదయం పార్కును పరిశీలించిన మేయర్ మాట్లాడుతూ... పట్టణంలోని నడిబొడ్డులోని రామనాయకుని చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్క్‌లో యోగా కేంద్రం, నడకదారి, పిల్లల క్రీడా ఉపకరణాలు ఏర్పాటు చేయడంతో రోజూ వందలాది మంది ప్రజలు ఈ పార్కును వినియోగించుకొంటున్నారు. దీంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలచే పార్కులో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని మేయర్ తెలిపారు.

యువతికి రూ. 6 లక్షలు మస్కా

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగం ద్వారా ఇంటి నుంచే అధిక సంపాదన చేయవచ్చని, తమ వద్ద పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని చెప్పి యువతి వద్ద రూ. 6.50 లక్షలు స్వాహా చేశారు. వివరాల మేరకు హోసూరు బాగలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువతి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుంది. గత నెల 25వ తేదీ ఆమెకు టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన మెసేజ్ చూసి సంప్రదించింది. పైన పేర్కొన్న ప్రకారం ఆమెను సైబర్ మోసగాళ్లు నమ్మించారు. ఆశపడిన ఆమె తన వద్ద ఉన్న రూ. 6.50 లక్షలను జమ చేసింది. తరువాత మోసగాళ్ల ఫోన్లు స్విచాఫ్ కావడంతో మోసపోయినట్లు తెలిసి క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళ ఆత్మహత్య

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. వివరాల మేరకు బేరికె సమీపంలోని నారీపురం గ్రామానికి చెందిన ఆనంద్ భార్య ప్రేమ (48). గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. స్వస్థత కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె గత 13వ తేదీ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బేరికె పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవారికి పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

హోసూరు: హోసూరు పట్టణంలోని బ్రహ్మకొండలో వెలసిన వారాహి అమ్మ ఆలయంలో ఆషాఢ నవరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆషాఢ నవరాత్రి సందర్భంగా అమ్మవారిని ప్రతి రోజూ విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ఆదివారం రాత్రి రూపాయినోట్లు, నాణేలతో విశేషంగా అలంకరించి పూజలు జరిపించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఘనంగా కామరాజ్ జయంతి

హోసూరు, కెలమంగలం: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నదాతగా పేరొందిన దివంగత కర్మవీర కామరాజర్ 121వ జయంతిని సోమవారం క్రిష్ణగిరి జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో హెచ్ఎం పొన్‌నాగేష్ అధ్యక్షతన కామరాజర్ చిత్రపటాన్నుంచి పుష్పాంజలి సమర్పించారు. పట్టణంలోని కామరాజర్ నగర్‌లోని కామరాజర్ శిలావిగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కెలమంగలం బస్టాండులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన కామరాజర్ జయంత్యుత్సవాలను జరుపుకొన్నారు.

పాఠశాలల్లో అల్పాహార పథకం


అల్పాహారం వడ్డిస్తున్న కలెక్టర్ తదితరులు

హోసూరు: జిల్లాలో ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం నుంచి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ శరయు బర్గూరు యూనియన్ బాలేగులి పంచాయతీ ఏలగిరి ప్రాథమిక పాఠశాలలో ఎంపి కే. గోపినాథ్ తదితరులు పిల్లలకు అల్పాహారం వడ్డించారు. డెంకణీకోట తాలూకా మదగొండపల్లిలో నమదుమాత పాఠశాలలో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని అల్పాహార పథకాన్ని ప్రారంభించారు.

కుట్టుయంత్రాల పంపిణీ

క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో ఆరు మంది మైనారిటీ మహిళలకు కలెక్టర్ ఉచిత కుట్టుయంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, పన్నీర్‌సెల్వం, రమేష్‌కుమార్, సుందరరాజు, పద్మలత, మురుగేషన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

టీడీపీ నేత తోట కంచెకు విద్యుత్ సరఫరా.. షాక్‌తో మహిళ మృతి
చిత్తూరు జిల్లా కేపీ బండలో విషాదం


మృతిచెందిన ఆసిఫా

వి.కోట(చిత్తూరు జిల్లా): టీడీపీ నాయకుడికి చెందిన మామిడి తోటకు వేసిన కంచెకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై ఓ మహిళ మృతిచెందారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండలం కేపీ బండ గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... వి.కోట మండలంలోని యాలకల్లు గ్రామ పంచాయతీ కేపీ బండ గ్రామంలో అహ్మద్ జాన్ తన భార్య ఆసిఫా (35), ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. వారి ఇంటి బాత్రూమ్‌కు అత్యంత సమీపంలో టీడీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చక్రపాణి నాయుడుకు చెందిన మామిడి తోట ఉంది. దానికి చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటుచేశారు. తోటలోని విద్యుత్ మోటర్‌కు సంబంధించిన స్టార్టర్‌ను ఆ ఇనుప కంచెకు అమర్చారు. వైర్లను పక్కనున్న స్తంభానికి చుట్టారు. ఈ క్రమంలో ఆసిఫా స్నానం చేసి బయటకు వస్తూ మామిడి తోట ఇనుప కంచెను తగిలారు. ఆ కంచెకు కరెంటు సరఫరా కావడంతో ఆమె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. స్టార్టర్‌కు సంబంధించిన వైర్లు తెగి ఇనుప కంచెపై పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. తోట యజమానిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


పూర్తిస్థాయిలో సేవలు అందించాలి: అపూర్వచంద్ర

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర అధికారులను ఆదేశించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో సోమవారం సంస్థ 10వ స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ సమావేశం అపూర్వ చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం రోగుల సంరక్షణ సేవలకు సంబంధించిన లావాదేవీల కోసం స్మార్ట్ కార్డ్ ఈ–పేమెంట్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. జన్ ఔషధీ కేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్, రెండో ఎంఆర్ఐ, డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రఫీ ల్యాబ్, 24/7 కంట్రోల్ రూమ్, సెంట్రల్ స్టెరైల్ సప్లై డిపార్ట్‌మెంట్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ హెల్త్ సర్వీసెస్ డీజీ ప్రొఫెసర్ డాక్టర్ అతుల్‌గోయల్, ఎయిమ్స్ మంగళగిరి డైరెక్టర్, సీఈవో డాక్టర్ మధుబానందకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమా కొనసాగించాలి
ఏపీ కౌలురైతుల సంఘం డిమాండ్


సాక్షి, అమరావతి: ఉచిత పంటల బీమా పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో పంటల బీమా పథకం అమలు చేస్తామని ఇటీవల చెప్పిన చంద్రబాబు.. గతంలోలా రైతులే ప్రీమియం చెల్లించే విధంగానా, లేక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసినట్లు ఉచితంగానా అనేది చెప్పకపోవడంతో రైతులు ఆందోళనగా ఉన్నారని తెలిపారు.

ఆ ఛానెళ్లవి తప్పుడు వార్తలు: విజయసాయిరెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఆదివాసి మహిళా అధికారికి కొన్ని చానళ్లు ద్రోహం చేశాయని.. మహాన్యూస్, ఏబీఎన్, టీవీ–5 చానళ్లు తప్పుడు వార్తలతో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన జర్నలిజం విలువలనే కాలరాశాయని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి మండిపడ్డారు. నిరాధారిత ఆరోపణలు చేసేటప్పుడు బాధితుల వివరణ తీసుకోవాలనే ఇంగిత జ్ఞానమే లేదా? అని ప్రశ్నించారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి రాక్షస పాలనను ప్రజలు గమనిస్తున్నారు. నిన్న (ఆదివారం) మా ఇంటికి టీడీపీ గూండాలు వచ్చి ఎక్కడికి పారిపోయాడు అని అడిగారట. నేను తాటాకు చప్పుళ్లకు భయపడను. ఎక్కడికి రావాలో చెప్తే ఒక్కడినే వస్తా. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలరోజుల పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా తయారైంది. ఒక ఆదివాసి మహిళా అధికారిని అవమానించారు. ఆమెతో నాకు అక్రమ సంబంధం అంటగట్టారు. ఎలాంటి ఆధారాలులేని అసత్య కథనాలను ప్రసారం చేశారు. వారితో క్షమాపణలను చెప్పిస్తా. ఈ ప్రభుత్వ పతనానికి ఇదే నాంది. నాపై తప్పుడు వార్తలు రాసిన వారినెవర్నీ వదిలిపెట్టను. మహా న్యూస్ వంశీ, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ–5 సాంబడు వీరి పుట్టుకపై నాకు అనుమానం ఉంది. వీరికి జర్నలిస్ట్ విలువల్లేవు. ఇక ఆదివాసి మహిళా అధికారిపై ఫిర్యాదు చేసిన మదన్‌మోహన్ అనే వ్యక్తి వంశీని ఎలా కలిశాడనేది నాకు తెలుసు. వంశీపై చట్టపరంగానే ఫిర్యాదు చేస్తా. అసలు టీవీ–5 సాంబ గురించి సంధ్య శ్రీధర్‌ను అడిగితే తెలుస్తుంది. ఈ వ్యవహారంపై పరువునష్టం దావా వేస్తా. పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్‌చేస్తా.. జర్నలిస్టుల ముసుగులో ఉన్న ఇలాంటి వెధవలను శిక్షించడానికి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరతా. కుల ఛానెళ్ల భరతం పడతా. ఎస్టీ కమిషన్‌కు, ఉమెన్ కమిషన్‌కు, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తా అని తెలిపారు.

జగన్ ఉన్నత లక్ష్యానికి బాబు ఉరి



రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జిల్లాకు ఒక వైద్య కళాశాల మంజూరు చేయాలని అసెంబ్లీలో సభ్యులు కోరగా.. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేదు. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు సాధ్యపడదు. ప్రైవేటు వైద్య కళాశాలలకు అనుమతులు ఇస్తున్నాం' అంటూ అప్పటి వైద్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కరాఖండిగా తేల్చి చెప్పారు. ఒక్క వైద్య కళాశాలకే అప్పట్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బూచీగా చూపి చేతులెత్తేశారు. ప్రైవేటు కళాశాలల ద్వారా దోపిడీకి తెరలేపారు. అలాంటిది కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ఆర్థిక పరిస్థితి కుదేలైనప్పటికీ, ఆ సంక్షోభాన్ని అధిగమించి ఏకంగా 17 కళాశాలల నిర్మాణం ప్రారంభించిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌కే దక్కుతుంది. వైఎస్ జగన్ దీక్ష, దక్షతలకు ఈ కళాశాలలు ఓ నిదర్శనం.

2,550 ఎంబీబీఎస్ సీట్లు సమకూర్చేలా

2019 నాటికి రాష్ట్రంలో ఉన్నవి 11 ప్రభుత్వ వైద్య కళాశాలలే. వీటిలో 2,185 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. ఇవి పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు సరిపోవు. ఈ వర్గాల తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజులు కట్టలేక తమ పిల్లల్ని వేరే కోర్సుల్లో చేర్పించేవారు. వారి కలలను నిజం చేయడానికి వైఎస్ జగన్ కొత్తగా 2,550 సీట్లను సమకూర్చే లక్ష్యంతో 17 కొత్త కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు సమకూర్చారు. నిర్మాణాలూ వేగంగా చేశారు. దీంతో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా 2023–24 విద్యా సంవత్సరంలో ఒకేసారి 5 కళాశాలలను ప్రారంభించారు. విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన విజయనగరం జిల్లాకూ వైద్య కళాశాల రావడంతో ఆ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. 1979లో ఏర్పాటైన ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇదే తొలి ప్రభుత్వ వైద్య కళాశాల. దీంతో ఈ జిల్లా ప్రజలు మెరుగైన వైద్యం కోసం వ్యయప్రయాసలకోర్చి విశాఖపట్నంకు వెళ్లాల్సిన అవసరం తప్పింది. ఈ విద్యా సంవత్సరంలో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పాడేరు కళాశాలలను ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం గత ఏడాది నుంచే వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అన్ని చోట్లా ఏపీవీవీపీ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా పోస్టుల భర్తీ చేపట్టింది. మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాల కోసం లెక్చర్ హాల్, ల్యాబ్, వసతి కోసం హాస్టల్స్, క్యాంటీన్ ఇలా వివిధ నిర్మాణాలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలు వెలువడేనాటికి 80 శాతం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

సాక్షి, అమరావతి

వైద్య విద్యనభ్యసించాలన్న అభిలాష ఉండి, ప్రైవేటు కాలేజీల్లో లక్షల రూపాయల ఫీజులు కట్టలేక తల్లడిల్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్యనందించి, వారి కలను సాకారం చేయాలన్నది వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష. అందుకే 2019లో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.8,480 కోట్లతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని చేపట్టారు. వీటి ద్వారా రాష్ట్రంలోని నిరుపేద, మధ్య తరగతి పిల్లల వైద్య విద్య కల నెరవేరుతుంది. అంతేకాదు.. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి వస్తాయి. దేశంలో ఏ ముఖ్యమంత్రీ సాహసం చేయలేని ఈ మహోన్నత లక్ష్యాన్ని సాధించేందుకు వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. మరోపక్క నాడు–నేడు ద్వారా ఇప్పుడున్న ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు, ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది కొరతకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అసూయ, పేద వర్గాలపై ఆయనకున్న ద్వేషానికి రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య బలవుతోంది.

క్రెడిట్ జగన్‌కే దక్కుతుందని

ఈ ఏడాది మరో 5 కొత్త కళాశాలలు ప్రారంభమైతే ఆ ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఈ విషయాన్ని గ్రహించిన సీఎం చంద్రబాబు అధికారాన్ని చేపట్టగానే వైద్య కళాశాలల ఏర్పాటు అంశాన్నే విస్మరించారు. దీంతో గత నెల 25న ఎన్ఎంసీ ఐదు కళాశాలల్లో తనిఖీలు చేసి, అనుమతులు నిరాకరించింది. దీనివల్ల రాష్ట్ర విద్యార్థులకు అదనంగా రావాల్సిన 500 సీట్లు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఉన్నది కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం. పైగా, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ బీజేపీ నేతే. కేంద్రంలోనూ టీడీపీ అధికారాన్ని పంచుకుంటోంది. ఇలా ఇన్ని అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ కనీసం వైద్య కళాశాలలకు అనుమతులు కూడా రాబట్టలేకపోయింది చంద్రబాబు ప్రభుత్వం. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ప్రభుత్వం ఏర్పాటు కాక ముందే సీఎస్ మార్పు, ఇతర అధికారులను పక్కన పెట్టడంపై పెట్టిన శ్రద్ధ ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న వైద్య కళాశాలలపై ఇసుమంతైనా చూపలేదు. అన్ని వసతులను, 70 నుంచి 90 శాతం మేర వైద్య, వైద్యేతర సిబ్బందిని అందుబాటులో ఉంచింది. కొత్త ప్రభుత్వం మిగిలిన వైద్యులు, సిబ్బందిని నియమించి ఉంటే కళాశాలలకు తప్పనిసరిగా అనుమతులు లభించి ఉండేవని వైద్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ కాస్త పనినీ చంద్రబాబు సర్కారు ఉద్దేశపూర్వకంగా విస్మరించడం వల్ల రాష్ట్రానికి నష్టమే జరిగింది. ఎన్ఎంసీ అనుమతుల నిరాకరణపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఇప్పటికీ ఉంది. ఇందుకు వైద్య శాఖ సిద్ధంగానే ఉంది. అయినా చంద్రబాబు ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆ ప్రక్రియా నిలిచిపోయింది. ప్రభుత్వ తీరు చూస్తే వచ్చే ఏడాది ప్రారంభించాల్సిన మిగిలిన ఏడు కళాశాలలనూ అటకెక్కిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ కళాశాలలపై చంద్రబాబు అసహనం

ఎప్పుడూ ప్రైవేటు వైపే మొగ్గు చూపే సీఎం చంద్రబాబుకు పేద, మధ్య తరగతుల ఊసే పట్టదు. టీడీపీ అధికారంలో ఉండగా రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఒక్క వైద్య కళాశాలా నిర్మించిన దాఖలాలు లేవు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో రిమ్స్‌ల రూపంలో కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్ పాలనలోనే ప్రభుత్వ రంగంలో వైద్య విద్యకు అత్యంత ప్రాధాన్యం దక్కింది. ప్రభుత్వమే ఇన్ని వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడాన్ని చంద్రబాబు అప్పుడు, ఇప్పుడు కూడా జీర్ణించుకోలేరు. ఇటీవల వైద్య కళాశాలలపై జరిగిన సమీక్షలో ఆయన తీరు స్పష్టంగా ప్రదర్శితమైనట్లు సమాచారం. వైద్య కళాశాలల కోసం రూ.8 వేల కోట్లకు పైగా బడ్జెట్ ఏమిటంటూ చంద్రబాబు ఈ సమావేశంలో ఉన్నతాధికారులపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అన్ని నిధులు ఎక్కడి నుంచి తీసుకుని వస్తారని రివర్స్‌లో సీఎం ప్రశ్నించడంతో అధికారులు విస్తుబోయారని సమాచారం.

డబ్బున్నవారికే విద్య సొంతమయ్యేలా

పేదలు, మధ్యతరగతి వర్గాలకు ఉన్నత చదువులు దక్కకూడదనే విధంగానే టీడీపీ, చంద్రబాబు తీరు ఉంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే. డబ్బున్న వారికే వైద్య విద్య సొంతమయ్యేలా 2019కు ముందు టీడీపీ పాలనలో తీసుకున్న నిర్ణయాలే ఇందుకు నిదర్శనం. అప్పట్లో పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఎంబీబీఎస్ చదివిన వారు పీజీ కోర్సులు చేయడానికి వీల్లేని పరిస్థితులు సృష్టించారు. పీజీ కోర్సుల ఫీజులను అమాంతంగా పెంచేశారు. యాజమాన్య కోటా అటుంచితే కన్వీనర్ కోటా సీట్లు కూడా పేద, మధ్య తరగతికి దక్కకుండా ఫీజులను పెంచారు. అప్పటివరకూ కన్వీనర్ కోటాలో క్లినికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రైవేట్ కళాశాలల్లో రూ. 2.90 లక్షలుగా ఉన్న ఫీజును, 2017–18లో ఏకంగా రూ.6.90 లక్షలకు పెంచారు. యాజమాన్య కోటా ఫీజును రూ.5.25 లక్షల నుంచి రూ.24.20 లక్షలకు పెంచారు. దీంతో పేద విద్యార్థులకు కన్వీనర్ కోటా కూడా దక్కకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ ప్రైవేట్ కళాశాలల్లో పీజీ మెడికల్ కోర్సుల ఫీజులను 40 నుంచి 50 శాతం వరకు తగ్గించారు. నిరుపేద, మధ్యతరగతి వారికి భారీ ఊరట కల్పించి అండగా నిలిచారు.

రేపల్లెలో శృతిమించిన టీడీపీ దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులే టార్గెట్
- ఊరొదిలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై గంజాయి కేసు
- పోలీసులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు కేసులు పెట్టిస్తున్న అధికారపార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో టీడీపీ వారి దౌర్జన్యం శృతిమించింది. కూటమి అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులపై దాడులకు దిగి భయభ్రాంతులకు గురిచేసిన టీడీపీ నేతలు ఇప్పుడు పోలీసుల మీద ఒత్తిడి తెచ్చి తప్పుడు కేసులు పెడుతున్నారు. గంజాయి కేసుల్లో ఇరికిస్తున్నారు. అధికారపక్షం కావడంతో పోలీసులు వారు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా రేపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజ్‌పాల్‌పై పోలీసులు గాంజా కేసు నమోదు చేశారు. ఇటీవల గంజాయితో పట్టుబడిన ముఠాలో రాజ్‌పాల్ లేకున్నా పోలీసులు కేసులో అతడి పేరు చేర్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. వాస్తవానికి రాజ్‌పాల్ ఓట్ల లెక్కింపు అనంతరం టీడీపీ నేతల బెదిరింపులతో ఊరువదలి వెళ్లిపోయారు. అప్పటినుంచి ఇప్పటి వరకు రేపల్లెకు రాలేదు. అయినా పోలీసులు అతడిపై గాంజా కేసు నమోదు చేశారు.

తప్పుడు కేసులు మానుకోవాలి

అధికారం శాశ్వతం కాదని, టీడీపీ నేతలు ఇప్పటికైనా తెలుసుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. రేపల్లె నియోజకవర్గంలో టీడీపీ నేతల ఆగడాలు శృతిమించాయన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పోలీసుల ద్వారా తప్పుడు కేసులు పెట్టి హింసిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా మారకపోతే తాము రోడ్డెక్కి ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. రేపల్లెకు చెందిన తమ పార్టీ కార్యకర్త రాజ్‌పాల్ యాదవ్‌పై పోలీసులతో అధికారపార్టీ నేతలు గంజాయి కేసు పెట్టించడం దారుణమన్నారు. పోలింగ్ నాడు టీడీపీ నాయకుడితో రాజ్‌పాల్ గొడవ పడ్డారని, ఆ కక్షతోనే ఇప్పుడు అతడిపై గంజాయి కేసు పెట్టించారని చెప్పారు. ఓట్ల లెక్కింపు తర్వాత టీడీపీ వారి దాడులు పెరగడంతో రాజ్‌పాల్, మరికొందరు ఊరు వదలి వెళ్లారని తెలిపారు. తరువాత ఇప్పటికీ రాజ్‌పాల్ రేపల్లె రాలేదని చెప్పారు. రాజ్‌పాల్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకోబోతే పరారయ్యాడని పోలీసులు కట్టుకథ అల్లి అతడిపై కేసు పెట్టడం దారుణమన్నారు. టీడీపీ వారు దాడులు చేస్తారని ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్న రాజ్‌పాల్‌పై తప్పుడు కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్టీలు అధికారంలోకి రావడం, పోవడం సర్వసాధారణమన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు పద్ధతి మార్చుకోవాలని ఆయన సూచించారు.

అధికారం మనదే.. ఏసెయ్ రోడ్డు

అనుమతులు లేకున్నా ఎమ్మెల్యే ఇంటికి రహదారి


ఎమ్మెల్యే ఇంటికి వేసిన సీసీరోడ్డు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూళ్లూరుపేట శివార్లలో రోడ్లు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే పట్టించుకోని మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే ప్రైవేటు లేఅవుట్‌లో ఉన్న అద్దె ఇంటికి మాత్రం రాత్రికి రాత్రే సిమెంటు రోడ్డు వేసి అధికారం ఉంటే ఏదైనా చేయొచ్చని నిరూపించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఓ ప్రైవేటు లేఅవుట్‌లోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. కాళంగి విజయకృష్ణ ఇక్కడ లేఅవుట్ వేసి విల్లాలు నిర్మించి విక్రయించారు. దీనికి అంతర్గతంగా సీసీ రోడ్లు వేసినప్పటికీ జాతీయ రహదారి నుంచి ఉన్న యాక్సెస్ రోడ్డు వేయలేదు. ఈ గ్రావెల్ రోడ్డుగానే ఉన్నా, ఎమ్మెల్యే రాకపోకలకు ఇబ్బందిగా మారిందని మున్సిపల్ అధికారులు నిబంధనలను అతిక్రమించి సోమవారం రాత్రి అప్పటికప్పుడు సిమెంట్ రోడ్డు వేశారు. గతంలో ఇదే ఇంట్లో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మూడేళ్లు క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అయినా నిబంధనలను ఉల్లంఘించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. దీనిపై వివరణ కోరేందుకు మున్సిపల్ డీఈకి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేశారు.

27న చీఫ్ సెక్రటరీల సమావేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 27వ తేదీన 4వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ తెలిపారు. ఆయన సోమవారం న్యూఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీవ్ గౌబ మాట్లాడుతూ నాలుగో జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని కూడా త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం (వికసిత్ భారత్)గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాల్లో భాగంగా చీఫ్ సెక్రటరీల సమావేశం, నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జాతీయ స్థాయిలో ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. అందువల్ల గత డిసెంబరులో జరిగిన 3వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికను వెంటనే సమర్పించాలని చీఫ్ సెక్రటరీలను ఆదేశించారు. అదేవిధంగా త్వరలో నిర్వహించనున్న రెండు సమావేశాలకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

గిరిజన మహిళంటే అంత చులకనా!

ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర

సాక్షి, అమరావతి: గిరిజన మహిళా అధికారి శాంతిపై సభ్యసమాజం తలదించుకునేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళంటే అంత చులకనైపోయారా? అని ప్రశ్నించారు. ఆమెపై వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమంటూ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఒక మహిళ వ్యక్తిగత జీవితానికి హాని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళా అధికారి శాంతి మీడియా ముందుకు వచ్చి వాస్తవాలను వెల్లడించినా.. పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం దారుణమని మండిపడ్డారు. ఎంపీ విజయసాయిరెడ్డిపై ఉన్న రాజకీయ కక్షతో అమాయకురాలైన అధికారిని బలి చేయడం తగదని హితవు పలికారు. ఏదైనా వార్త రాసే ముందు, ప్రసారం చేసే ముందు ఇరువర్గాల అభిప్రాయాలు తీసుకోవాలన్న విలువలను తుంగలో తొక్కి అదే పనిగా బురద జల్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అన్ని గిరిజన సంఘాలతో కలిసి రాష్ట్ర, జాతీయ ఎస్టీ, మహిళా కమిషన్‌లకు, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

గిరిజన మహిళ జోలికొస్తే ఊరుకోం

గిరిజన మహిళ అయిన శాంతిని మానసికంగా వేధించడం తగదని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. శాంతిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, మానసిక క్షోభకు గురిచేసేలా తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు.

బండరాళ్ల కింద ముగ్గురు సజీవ సమాధి

ఎన్టీఆర్ జిల్లా దొనబండ క్వారీలో ప్రమాదం
యజమాని నిర్లక్ష్యమే ఘటనకు కారణం

సాక్షి ప్రతినిధి, విజయవాడ/కంచికచర్ల/జి.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దొనబండ శివారులోని ఓ క్వారీలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు సోమవారం ఉదయం డ్రిల్లింగ్ చేస్తుండగా బండరాళ్లు దొర్లిపడటంతో వాటికింద చిక్కుకుపోయి దుర్మరణం పాలయ్యారు. మృతుల్ని బత్తుల దుర్గారావు (19), సున్నా బీబీనాయక్ (40), బాగేల్ రాందేవ్ (36)గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. టీడీపీ నాయకుడు చింతల రామ్మోహనరావుకు చెందిన పవన్ గ్రానైట్ మెటల్ వర్క్స్ రాతి క్వారీలో ఒడిశాకు చెందిన బీబీ నాయక్, బాగేల్ రాందేవ్, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెరువు మాధవరం గ్రామానికి చెందిన బత్తుల దుర్గారావు బ్లాస్టింగ్ చేసిన బండరాళ్లను తొలగించేందుకు కొండపైకి ఎక్కారు. ఒడిశాకు చెందిన కుమారి బోలీ దిగువన ఉన్న బండరాళ్లను పగులకొట్టేందుకు డ్రిల్లింగ్ చేస్తున్నాడు. పైన ఉన్న రాళ్లను తొలగించే క్రమంలో ఒక్కసారిగా భారీ బండరాళ్లు ముగ్గురిపైనా పడటంతో విగతజీవులుగా పడి ఉన్నారు. బోలీ అనే యువకుడు సురక్షితంగానే ఉన్నాడు. మృతదేహాలను 5 గంటలపాటు శ్రమించి జేసీబీల సాయంతో వెలికితీశారు. క్వారీ యజమాని చింతల రామ్మోహనరావు నిర్లక్ష్యమే కార్మికుల పాటి మృత్యుపాశంగా మారింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నా ఆపకుండా పని చేయించటం ముగ్గురు కార్మికులను మృత్యు ఒడికి చేర్చాయి. ఘటనా స్థలాన్ని జిల్లా మైనింగ్ ఏడీ వీరాస్వామి, నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ బి.రవికిరణ్, నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు, నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్, ఇంటెలిజెన్స్ సీఐ యువకుమార్, కంచికచర్ల, వీరులపాడు ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, హేమలత, తహసీల్దార్ సుస్వాగతం పరిశీలించారు.

సేఫ్టీ నిబంధనలకు తిలోదకాలు

ప్రమాదం జరిగిన క్వారీలో మైనింగ్ సేఫ్టీ నిబంధనల్ని క్వారీ యజమాని తుంగలో తొక్కారు. ఇష్టారాజ్యంగా మైనింగ్ చేయడంతోనే అక్కడ ప్రమాదం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ముఖ్యంగా క్వారీ ప్రాంతంలో ప్రతి 6 మీటర్లకు బెంచ్ ఫార్మేషన్ చేసుకుని ఎప్పటికప్పుడు లూజును తీసివేయాల్సి ఉండగా.. అక్కడ బెంచ్ ఫార్మేషన్ చేయలేదని గుర్తించారు. మైనింగ్ సేఫ్టీకి సంబంధించి క్వారీలో ఓ మేనేజర్‌ను నియమించాల్సి ఉన్నా అలా చేయలేదు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ సమయంలో కొండ చరియలు విరగటంతో పాటు, అక్కడ ఉన్న లూజు జారి ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా బోల్డర్లను డ్రిల్లింగ్ చేయటమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. కాగా.. క్వారీలపై మైనింగ్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 801 సర్వే నంబరులో 99 లీజులు ఉన్నప్పటికీ ఏ క్వారీ యజమాని నిబంధనలు పాటించటం లేదు. క్వారీ యజమానులకు అధికార పార్టీ అండదండలు ఉండటంతోపాటు, అధికారులు సైతం మామూళ్లు తీసుకొని, నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో మైనింగ్ మాఫియాకు అడ్డు అదుపూ లేకుండాపోయింది.


క్వారీలో మృతి చెందిన దుర్గారావు మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

మూడు కుటుంబాల్లో విషాదం

మృతుల్లో ఒకరైన బీబీ నాయక్ 15 సంవత్సరాల క్రితం ఒడిశా నుంచి వలస వచ్చి జి.కొండూరు మండలం చెవుటూరు బాపూజీ కాలనీలో భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. బాగేల్ రాందేవ్ సైతం ఒడిశా నుంచి 20 ఏళ్ల క్రితం వలస వచ్చి భార్య, కుమార్తెతో చెవు టూరు శివారులోని క్వారీ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. పొట్టకూటి కోసం క్వారీలలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు కుటుంబాలకు పెద్ద దిక్కు కోల్పోవడంతో వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రమాదంలో మృతి చెందిన బత్తుల దుర్గారావు చిన్న వయసులోనే మృత్యువాత పడడంతో చెరువు మాధవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్వారీ యజమానిపై కేసు నమోదు

క్వారీ యజమాని చింతల రామ్మోహనరావుపై కేసు నమోదు చేసినట్టు నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. మృతుడు దుర్గారావు తండ్రి చంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. కాగా.. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.8.50 లక్షల చొప్పున క్వారీ యజమాని అందజేశారు.

నా కళ్లెదుటే మరణించారు

బీబీ నాయక్, రాందేవ్, దుర్గారావు కొండపైకి వెళ్లి రాళ్లను తొలగించే క్రమంలో పైనుంచి భారీ బండరాళ్లు వారిపై పడ్డాయి. దీంతో రాళ్ల మధ్య ఇరుక్కుపోయారు. నా కళ్లెదుటే ముగ్గురూ మరణించారు.
– కుమారి బోలీ, సహ కార్మికుడు

భద్రతా చర్యలు చేపట్టకపోవడమే కారణం

సర్వే నంబర్ 801లో రెండు హెక్టార్ల రాతి క్వారీని చింతల రామ్మోహనరావు పదేళ్లపాటు లీజుకు పొందారు. మైనింగ్ ప్లాన్, సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేకపోవటం, బెంచీలు ఏర్పాటు చేయకపోవటం, సిస్టమాటిక్ మెజర్‌మెంట్స్ లేకపోవటం వల్లే ప్రమాదం జరిగింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్, మైనింగ్

జీతాలు అందక.. వైద్యం చేయించుకోలేక..

గుండెపోటుతో రిటైర్డు ఉద్యోగిని మృతి

కర్నూలు(అర్బన్): జీతాలు అందకపోవడంతో సకాలంలో వైద్యం చేయించుకోలేక ఇటీవల పదవీ విరమణ చేసిన ఎగ్గోని నరసమ్మ గుండెపోటుతో మృతి చెందారని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థలో కార్యాలయ పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న ఆమె గత నెల 30న రిటైర్డు అయ్యారు. అయితే ప్రస్తుతం జీతాలు అందకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌లో నరసమ్మ పార్థివదేహానికి సోమవారం అసోసియేషన్ నేతలు నివాళి అర్పించారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు 15 నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొన్న విషయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి విన్నవించగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.39.61 కోట్లను అడ్వాన్స్‌గా జీతాలకు విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది ఉద్యోగులు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాలను ప్రస్తుత విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా తమ శాఖకు చెందిన ఉద్యోగులంతా నరసమ్మ కుటుంబానికి అందించిన రూ.80 వేలను అందించామన్నారు. మృతి చెందిన నరసమ్మకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, తదితరాలను వెంటనే విడుదల చేయించాలని ఆమె కుటుంబ సభ్యులు ఈఈ లక్ష్మీనారాయణ ద్వారా ఎండీకి వినతి పత్రం పంపించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
మంగళవారం ॥ 16-7-2024

మీకు తెలుసా?



ఒక గ్లోబల్ సర్వే ప్రకారం జీతం పెంపుదల కోరుతున్న స్త్రీల శాతం మన దేశంలోనే ఎక్కువగా ఉంది.

జీతం పెంపుదల కోరుతున్న స్త్రీలు

భారతదేశం	65%
యూఎస్	51%
యూకే	47%



పరాంకుశం వీణాశ్రీవాణి... ఆమె పేరులోనే సరిగమల శ్రుతి వినిపిస్తోంది. అమలాపురంలో ఓ చిన్న అగ్రహారం అమ్మాయి శ్రుతి చేసిన వీణ ఇప్పుడు అంబానీ ఇంటి వేడుకలో సరిగమలతో అలరించింది. ఆ ఆనంద క్షణాలను ఆమె సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు.

అంబానీ వేడుకలో తెలుగు వీణ

"మాది అమలాపురం జిల్లా ఇందుపల్లి అగ్రహారం. బండారులంకలోని పిచ్చుక సీతామహాలక్ష్మిగారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. ఈ రోజు ఇన్ని ప్రశంసలందుకుంటున్నానంటే ఆమె నేర్పిన సంగీత జ్ఞానమే కారణం. అంబానీ కుటుంబంలో పెళ్లి వేడుకకు వీణావాదన చేయడానికి ఆహ్వానం రావడంతో ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే నా పేరు వాళ్లకు తెలిసే అవకాశమే లేదు. నేను సోషల్ మీడియాలో చురుగ్గా ఉండడం వల్లనే నా కళను వారు గుర్తించడానికి కారణం అనుకుంటున్నాను. నీతా అంబానీ గారు చెప్పారు అంటూ వాళ్ల మేనేజరో ఎవరో కాంటాక్ట్ చేశారు. ఏ దుస్తులు ధరించాలనే విషయం నుంచి వేడుకలో ఏ పాటలు కావాలో కూడా ఆమే ఎంపిక చేశారు. నేనిచ్చిన జాబితా నుంచి ఆమె ఎంపిక చేసిన పది పాటలను వీణ మీద వినిపించాను. నా చెలి రోజావే, ఉరికే చిలకా... వంటి పలు భాషల్లోకి అనువాదమై ఉన్న పాటలనే ఎంచుకున్నాను. ఇదంతా పదిహేను రోజులపాటు నడిచింది.

నాలుగు వేల అడుగులు

పన్నెండవ తేదీ ఉదయం ముంబయికి వెళ్లాం. హోటల్‌లో రిఫ్రెష్ అయిన తర్వాత నేరుగా జియో కన్వెన్షన్ సెంటర్‌కెళ్లాం. ఆ సెంటర్ ఎంట్రన్స్ నుంచి నా ప్రదర్శన ఉన్న ఆడిటోరియంలో వేదిక వద్దకు చేరడానికి నాలుగు వేల అడుగులు పడ్డాయి. ఫోన్‌లో చెక్ చేసుకున్నాను కూడా. నిర్వాహకులు వెంట ఉండి తీసుకెళ్లకపోతే నా వేదిక ఏదో తెలుసుకోవడంతోనే రోజు పూర్తయ్యేదేమో. నీతా అంబానీ స్వయంగా కళాకారిణి కావడంతో ఈ వేడుకలో కళాప్రదర్శనకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారనుకున్నాను. భోజనాల దగ్గర కూడా ఆర్టిస్టుల కోసమే ఒక పెద్ద హాలును కేటాయించారు. వేల రకాల వంటలు వడ్డించారని విన్నాను. కానీ నేను సలాడ్‌లు, కాఫీ మాత్రమే తీసుకున్నాను. పెళ్లి వేడుకలో నీతా అంబానీ ఎంత శ్రద్ధగా ప్రతి చిన్న విషయాన్నీ పట్టించుకున్నారంటే డెకరేషన్‌లో ఉన్న పూలను కూడా పరిశీలించి థీమ్‌కి అనుగుణంగా మార్పించారు. కొన్ని రోజులపాటు ఆమె మధ్యాహ్నం మూడు నుంచి తెల్లవారి ఆరుగంటల వరకు పని చేశారట. అయినా సరే ఆమె ముఖంలో అలసట కనిపించలేదు. గొప్ప ఆర్గనైజర్ ఆమె.

రెండు కళ్లు చాలవు!

ఆడిటోరియానికి వెళ్లే దారిలో ఒక వరుస అత్తరులు, ఇత్తడి బిందెలతో గుజరాత్ సంప్రదాయ నమూనా అలంకరణ ఉంది. ఆ తర్వాత ధొలారి ధని థీమ్, ఫారెస్ట్ థీమ్, కలంకారీ థీమ్ ఓ వరుస ఉన్నాయి. శంకర్ మహదేవన్, శ్రేయాఘోషాల్, శివమణి వంటి సంగీతకారులు, గాయకుల ప్రోగ్రామ్‌లను టీవీ లైవ్ లో చూశాను. వందమంది రాజమౌళిలు, వంద మంది సంజయ్ లీలా భన్సాలీలు కలిసి సెట్టింగు వేయించారా అనిపించింది. చూడడానికి రెండు కళ్లు చాలవు. తలను 360 డిగ్రీల్లో తిప్పి చూడాల్సిందే. బారాత్ తర్వాత పెళ్లికి ముందు హై టీ టైమ్‌లో రాత్రి ఏడు నుంచి ఏడు ముప్పావు వరకు నా కచేరీ సాగింది. రాధిక మర్చంట్ కుటుంబం, అంబానీ కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతి. వాళ్లు కదలకుండా కూర్చుని, ఓ పాటను మళ్లీ అడిగి మరీ చక్కగా ఆస్వాదించడం, కళల పట్ల వారికున్న గౌరవం నాకు సంతృప్తినిచ్చింది.



అంబానీ పెళ్లి వేడుకలో...

వీణాపాణి ఇచ్చిన వరం

జనసందోహంలో నేను ఎక్కువ సేపు ఇమడలేను. నా కచేరీ పూర్తి కాగానే నన్ను బయటకు తీసుకెళ్లమని నిర్వాహకులను అడిగాను. గేటు వరకు తీసుకొచ్చి వెహికల్ ఎక్కించేశారు. పదమూడవ తేదీ ఉదయం ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్‌కి వచ్చేసి హమ్మయ్య అనుకున్నాను. నాకిప్పుడు తలుచుకున్నా సరే అంతా కలలా అనిపిస్తోంది. ఆంధ్రుల ఆడపడుచుని, తెలంగాణ కోడలిని. నాకు తెలిసినంత వరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ వేడుకలో కళను ప్రదర్శించిన ఏకైక వ్యక్తిని నేనే... అనుకున్నప్పుడు గర్వంగా అనిపిస్తోంది. సరస్వతీ మాత వీణతోపాటు నాకిచ్చిన వరం ఈ అవకాశం అనుకుంటున్నాను" అని రెండు చేతులూ జోడించారు వీణాశ్రీవాణి తన వీణను మురిపెంగా చూసుకుంటూ.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **నోముల రాజేశ్ రెడ్డి**

ఇడియెట్ సిండ్రోమ్

'గూగుల్ చేసి చూడకు. రాసిచ్చిన మందులు వాడు' అని డాక్టర్ పేషెంట్‌తో చెప్పాల్సి వస్తోంది. కారణం- ప్రిస్క్రిప్షన్ తీసుకుని బయటకు వచ్చిన వెంటనే ఆ మందులను గూగుల్ చేసి వాటి గుణాలు, సైడ్ ఎఫెక్ట్‌లు, వాటిని ఏయే జబ్బులకు వాడతారు అన్నీ పేషెంట్ తెలుసుకోవడమే. తెలుసుకున్న తర్వాత ఎన్నో డౌటానుమానాలు తెచ్చుకొని కొన్ని మందులు వాడకపోవడం, కొన్ని డోస్ తగ్గించమనడం ఇలా చేస్తూ ఆరోగ్యానికి హాని చేసుకుంటున్నారని డాక్టర్లు అంటున్నారు. ఇలా చేసే స్వభావానికి 'ఇడియట్ సిండ్రోమ్' అనే పేరు కూడా పెట్టారు.

గూగుల్ కన్నా డాక్టర్ మిన్న



కొన్ని నెలల క్రితం ఒక యువతి కిడ్నీలు ఫెయిలయ్యే స్థితిలో హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షలు చేసిన డాక్టర్లు ఆమెకు మందులు పని చేయని స్థితిని గమనించారు. కారణం ఆమె యూరిన్ ఇన్ఫెక్షన్ అని చెప్పినప్పుడల్లా తండ్రి ఇంటర్నెట్‌లో చూసి మందులు తెచ్చి వాడటమే. అతను డాక్టర్‌ని కలవాలనుకోలేదు. డాక్టర్ కంటే గూగుల్‌ని నమ్మాడు. ఇలా చేయడం వల్ల ప్రాణాంతకమైతే తిరిగి డాక్టరే రక్షించాల్సి వచ్చింది గూగుల్ కాదు.

డాక్టర్‌కు తెలుసు

డాక్టర్‌లు తమ డాక్టర్ పట్టా కోసం ఐదేళ్లు చదువుతారు. ఆ తర్వాత తర్ఫీదు అవుతారు. ఆ తర్వాత ప్రాక్టీసు మొదలెడతారు. దేహ గుణాలు, మందు గుణాలు పేషెంట్‌ను బట్టి జబ్బును బట్టి తమ అనుభవం కొద్దీ రాస్తారు. పేషెంట్‌ను కాపాడటమే డాక్టర్ లక్ష్యం. గతంలో డాక్టర్ రాసింది పేషెంట్లు నమ్మకంగా ఫాలో అయ్యేవారు. మహా అయితే మందుల షాపువాణ్ణి ఈ మందులు మంచివేనా అని అడుగుతారు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. విస్తృతంగా వచ్చిన ఇంటర్నెట్ వల్ల ప్రతి దాన్ని తెలుసుకోవాలనే ఉబలాటం, ప్రతి దాన్నీ సందేహించే స్వభావం ఏర్పడ్డాయి. డాక్టర్ రాసిన మందులను తమ ఇష్టానుసారం మార్చుకుంటున్నారు. సైడ్ ఎఫెక్ట్స్ చదివి బెంబేలు పడి కొన్ని వాడటమే లేదు. పైగా మందుచీటిని తిరిగి తీసుకొచ్చి ప్రశ్నలతో వేధిస్తున్నారు. పేషెంట్ల ఇలాంటి రుగ్మతకు డాక్టర్లు పెట్టిన పేరే 'ఇడియట్ సిండ్రోమ్'!

నెట్ జ్ఞానం సరికాదు...

'ఇడియట్ సిండ్రోమ్'తో రోగులు వైద్యుల్ని ప్రశ్నించడం, సొంతవైద్యం చేసుకోవడం సరి కాదు. ఇంటర్‌నెట్ సమాచారంతో వ్యాధి నిర్ధారణ సమంజసం కాదు. నెట్ చూసి మందులు వాడితే ఒక్కోసారి ప్రాణాలమీదికి రావచ్చు. వైద్యాన్ని వైద్యుడు తన పరిజ్ఞానంతో, అనుభవంతో, నైపుణ్యంతో వ్యాధి నిర్ధారణ చేసి, ఏయే మందులు ఏయే మోతాదులో వాడాలో నిర్ణయిస్తాడు. గూగుల్ సమాచారంతో ఎవరికి వారు నిర్ధారణలూ, మందుల నిర్ణయాలూ సరికాదని తెలుసుకోవాలి.

- డాక్టర్ పావనీ ప్రియాంక,
కార్యదర్శి, ఐఎంఏ, తెనాలి



శంక వద్దంటున్నారు

ఇటీవల సీఎస్ మంజునాథ్ అనే వైద్యుడు 'మీ గూగుల్ పరిజ్ఞానంతో అయోమయానికి గురై... నా మెడికల్ డిగ్రీని శంకించకండి' అంటూ బోర్డు పెట్టుకున్న దృశ్యం వైరల్ అయ్యింది. ఆయన దగ్గరే కాదు... ఈ తరహా బోర్డులు మరెన్నో ఆసుపత్రుల్లో కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో వంటలూ, వార్తలూ, కామెడీ ఎంత చూసినా పర్లేదు. కానీ వ్యాధులూ, వైద్యాలు చూస్తూ తమ జబ్బులతో తామే పేషెంట్లు చెలగాటాలాడుతున్నారని డాక్టర్ల ఆవేదన. 'ఈ మందును ఎక్కువ వాడితే సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయట' అంటూ డాక్టర్లకే వైద్యం నేర్పుతున్నారు. 'పానీ పూరీ, ఫాస్ట్‌ఫుడ్డూ తినేప్పుడు ఇలాగే సైడ్ ఎఫెక్ట్స్ గురించి ఆలోచిస్తున్నారా' అంటూ డాక్టర్లు చీవాట్లు పెడుతున్న సందర్భాలూ ఉంటున్నాయి. నిజానికి 'పేషెంట్' అనే మాటకు 'రోగి' అన్న పదం అంత గౌరవప్రదంగా లేదంటూ 'బాధితుడు' అని వాడటం పరిపాటి అయ్యింది. ఇడియెట్ సిండ్రోమ్ వల్ల పేషెంట్ల చేతిలో డాక్టర్లు బాధితులవుతున్నారనేది వైద్యుల ఆవేదన.

డాక్టర్ షాపింగ్

వాస్తవానికి వ్యాధి ఏమిటనేది అనుభవంతో కూడిన వైద్యులు, ఎన్నో కోణాల నుంచి పరిశోధన, ఎన్నో పరీక్షలు చేశాక నిర్ధారణ చేస్తారు. తర్వాత తగిన మోతాదులో మందులిస్తారు. అప్పుడు 'ఈ ఫలానా ఇంజెక్షనే ఎందుకు? దీనికి ప్రత్యామ్నాయంగా ట్యాబ్లెట్ ఉందిగా' అంటూ అడుగుతున్న పేషెంట్లు... అంతటితో ఆగకుండా... ఆ డాక్టర్‌ను వదిలి మరో డాక్టర్ దగ్గరికి మరో ఒపినీయన్, ఇంకో ఒపీనియన్ అంటూ తిరుగుతున్నారు. ఇలా తిరగడాన్నే వైద్య పరిభాషలో 'డాక్టర్ షాపింగ్' అంటారు. దీని తర్వాత సొంతంగా మందుల్ని కొని వాడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకున్న దాఖలాలూ ఉన్నాయి. దీనికి పరాకాష్ఠ ఇటీవల ఓ భర్త ఇంటర్‌నెట్ చూస్తూ పురుడు పోస్తూ తన భార్య మరణానికి కారణమయ్యాడు. అందుకే 'ఇడియట్ సిండ్రోమ్' ధోరణి వద్దంటున్నారు.

- బి.ఎల్. నారాయణ, సాక్షి, తెనాలి.

■ పత్తి, కంది, సోయా కట్టెతో బయోచార్ ఉత్పత్తి
■ ఎకరానికి 1 టన్ను చల్లి.. 15% వరకు అదనపు దిగుబడులు
■ మహారాష్ట్రలో ఓ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఓ) అనుభవం

బయోచార్‌తో బెట్ట నుంచి రక్షణ 15% అదనపు పంట!



● ఇనుప బట్టీలతో బయోచార్ ఉత్పత్తి

పంట కోతలు పూర్తయ్యాక పత్తి, కంది, సోయా తదితర పంటల కట్టెకు నిప్పుపెట్టి పర్యావరణానికి హాని చేసే కన్నా.. ఆ కట్టెతో కట్టె బొగ్గు (బయోచార్) తయారు చేసి, తిరిగి భూములను సారవంతం చేసుకోవచ్చు. ఎకరానికి టన్ను బయోచార్ కంపోస్టు వాడితే పంటలు బెట్టను తట్టుకుంటాయి. తద్వారా పంట దిగుబడులను 12-15% వరకు పెంచుకోవచ్చని మహారాష్ట్రలో ఓ రైతు ఉత్పత్తిదారుల సంస్థ అనుభవం చాటి చెబుతోంది..

పంట వ్యర్థాలను తగులబెట్టటం పరిపాటి. ఇది పర్యావరణానికి హాని చేసే పని. పత్తి కట్టె, కంది కట్టె వంటి పంట వ్యర్థాలను కాలబెట్టటం వల్ల గాలి కలుషితమై కార్బన్‌డయాక్సయిడ్ శాతం పెరిగిపోతంది. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోయింది. రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోయింది. ఫలితంగా సాగుభూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. మట్టికి నీటిని పట్టి ఉంచే శక్తి లోపించటం, వాన నీటిని ఇంకింపజేసుకునే సామర్థ్యం తగ్గిపోవటం, సూక్ష్మజీవరాశి నశించటం వల్ల భూములు నిస్సారమైపోతున్నాయి. మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలో 4 లక్షల హెక్టార్లలో పత్తి, లక్ష హెక్టార్లలో కంది పంటలను రైతు సాగు చేస్తారు. పంట కోత పూర్తయిన తర్వాత రైతులు పత్తి, కంది కట్టెను కాల్చివేస్తారు. దీని వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా భూమికి తిరిగి అందాల్సిన సేంద్రియ పదార్థం అందకుండా పోతోంది.

బిఎఐఎఫ్ (బైఫ్) డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ అనే పుణేకు చెందిన స్వచ్ఛంద సంస్థ యవత్‌మాల్ రైతులతో కలసి పనిచేసి ఈ పరిస్థితిలో విజయవంతంగా మార్పుతెచ్చింది. పత్తి, కంది కట్టెను వట్టిగా కాలబెట్టకుండా.. ఒక పద్ధతి ప్రకారం (దీన్నే పైరోలిసిస్ అంటారు) కాల్చితే బొగ్గుగా మారుతుంది. దీన్నే బయోచార్ అంటారు. దీన్ని సేంద్రియ ఎరువులతో కలిపి బయోచార్ కంపోస్టుగా మార్చి భూమిలో చల్లితే మట్టిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుంది. సూక్ష్మజీవుల సంతతి పెరిగి భూసారం మెరుగవుతుంది. బయోచార్ కంపోస్టు వాడకం వల్ల ముఖ్యంగా వర్షాధార వ్యవసాయ నేలలకు బెట్టను తట్టుకునే శక్తిని పెంపొందిస్తాయి.

బయోచార్ కంపోస్టు తయారు చేయాలంటే.. బయోచార్‌ను ఉత్పత్తి చేసే ఇనుప బట్టీని ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత చిన్న రైతులకు విడిగా ఉండదు. అందుకని బైఫ్ ఫౌండేషన్ రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని (ఎఫ్.పి.ఓ.ని) 2019లో రిజిస్టర్ చేయించింది. 220 మంది రైతులను కూడగట్టి ఒక్కొక్క రైతు నుంచి రూ. వెయ్యి షేర్ ధనంతో ఎఫ్.పి.ఓ.ను రిజిస్టర్ చేయించారు. పత్తి, కంది కట్టెను కాల్చవద్దని, దీనితో ఎఫ్‌పిఓ తరఫున బయోచార్ తయారు చేసుకొని పంటలకు వాడుకుంటే బెట్టను తట్టుకొని మంచి దిగుబడులు పొందవచ్చని బైఫ్ ఫౌండేషన్ సిబ్బంది రైతులకు ఆలోచన కలిగించారు.

2021 జనవరిలో ఎఫ్‌పిఓ పత్తి కట్టెను రైతుల నుంచి కిలో రూ. 2.5-3లు చెల్లించి కొనుగోలు చేసింది. రూ. 60 వేల ఖర్చుతో బ్యాచ్‌కు 200 కిలోల కట్టెను కాల్చే ఇనుప బట్టీని ఎఫ్‌పిఓ కొనుగోలు చేసింది. ఈ బట్టీ ద్వారా పైరోలిసిస్ పద్ధతిలో ఈ కట్టెను కాల్చి బొగ్గును తయారు చేసింది. బొగ్గును పొడిగా మార్చి గోనె సంచుల్లో నింపి ఎఫ్‌పిఓ తిరిగి రైతులకే అమ్మింది. మార్కెట్ ధర కన్నా కిలోకి రూ. 2, 3 తగ్గించి అమ్మింది. 2021-22లో ఎఫ్‌పిఓ విజయవంతంగా 100 టన్నుల పత్తి కట్టెతో 25 టన్నుల బయోచార్‌ను ఉత్పత్తి చేయగలిగింది. ఎఫ్‌పిఓ బయోచార్ ఉత్పత్తిని చేపట్టటం వల్ల చాలా మందికి పని దొరికింది. కాల్చేసే పత్తి కట్టెను రైతు అమ్ముకొని ఆదాయం పొందాడు. కట్టెను సేకరించటంలో కూలీలకు పని దొరికింది. వాహనదారులకు కట్టెను బట్టీ దగ్గరకు చేర్చే పని దొరికింది. చివరికి బయోచార్‌ను రైతులే తిరిగి తక్కువ ధరకు కొనుక్కోగలిగారు. అంతిమంగా కాలబెడితే ఆవిరైపోయే పత్తి కట్టె.. ఎఫ్‌పిఓ పుణ్యాన భూమిని సుదీర్ఘకాలం పాటు సారవంతం చేసే బయోచార్‌గా మారి తిరిగి ఆ పొలాలకే చేరటం విశేషం. హెక్టారుకు 2.5 టన్నుల బయోచార్ కంపోస్టును దుక్కిలో వేశారు. ఏటేటా పంట దిగుబడులు పెరిగాయి.



● బయోచార్ కంపోస్టు

ఎకరానికి టన్ను బయోచార్ కంపోస్టు

యవత్‌మాల్ జిల్లాలోని 0.5% కన్నా తక్కువగా ఉండే వర్షాధార పత్తి తదితర పంటలు పండించే నేలలను బయోచార్ కంపోస్టు పోషకవంతం చేయటమే కాకుండా నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని, కరువును తట్టుకునే శక్తిని పెంపొందించింది. బయోచార్‌ను ఎంత మోతాదులో వేయాలనే దాన్ని ఇంకా ప్రామాణీకరించాల్సి ఉంది. హెక్టారుకు 1 నుంచి 10 టన్నుల వరకు సూచిస్తున్న సందర్భాలున్నాయి. రైతుకు మరీ భారం కాకుండా వుండేలా హెక్టారుకు 2.5 టన్నుల (ఎకరానికి టన్ను) చొప్పున బయోచార్ కంపోస్టును వేయించాం. బొగ్గు పొడితో వర్మీ కంపోస్టు, అజొటోబాక్టర్, అజోస్పిరిల్లమ్ వంటి జీవన ఎరువులను కలిపి బయోచార్ కంపోస్టు తయారు చేసుకొని పంట పొలాల్లో వాడాం. ఆ సంవత్సరంలోనే పత్తి, సోయా వంటి పంటల దిగుబడి 12-15% పెరిగింది. పోషకాలను నిదానంగా దీర్ఘకాలం పాటు పంటలకు అందించేందుకు, బెట్టను తట్టుకునేందుకు బయోచార్ ఉపకరిస్తుంది. బయోచార్ వినియోగం వల్ల ఒనగూడే ప్రయోజనాలను రైతులు పూర్తిగా గుర్తించేలా ప్రచారం చేయటానికి ప్రభుత్వ మద్దతు అవసరం ఉంది. ఎఫ్‌పిఓలు తయారు చేసే బయోచార్ కంపోస్టుకు ప్రభుత్వం మార్కెటింగ్‌కు అవకాశాలు పెంపొందించాలి.



- గణేశ్ (98601 31646),
బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్, పుణే

సాగుబడి
పునర్వసు కార్తె : జూలై 19 వరకు
పుష్యమి కార్తె : 20 నుంచి

మట్టి కొట్టుకెళ్లనివ్వని సాగు!

పంటలకు ప్రాణప్రదమైన భూమి పైపొర మట్టి వర్షపు నీటితో భారీగా కొట్టుకుపోతోంది. మట్టితో కూడిన బురద నీరు వరదలా పారుతుంటే.. ఇది 'ప్రవహిస్తున్న భూమాత రక్తం' అని ఓ రైతు శాస్త్రవేత్త ఆవేదన చెందారు. మట్టిని కొట్టుకెళ్లనివ్వని సాగు పేరు పిఎండిఎస్..

ప్రపంచ వ్యాప్తంగా భూముల్లో నుంచి ప్రతి ఏటా 2,400 కోట్ల టన్నుల మట్టి వాన నీటితో పాటు కొట్టుకుపోతోంది. ప్రపంచ భూభాగంలో భారత్ వాటా 2.2% మాత్రమే. అయితే, ప్రపంచం ఏటా కోల్పోతున్న మట్టిలో 23%ని, హెక్టారుకు సగటున 16% టన్నుల మట్టిని మన దేశం కోల్పోతున్నదని ఎఫ్.పి.ఓ. చెబుతున్న లెక్క.


అయితే, ఢిల్లీ ఐఐటిలోని పరిశోధకుల బృందం 'సాయిల్ ఎమర్జెన్సీ' గురించి తాజా అధ్యయనం విస్తుగొలిపే గణాంకాలను బయటపెట్టింది. అస్సాం, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో హెక్టారుకు ఎకరానికి ఏటా 100 టన్నులకు పైగా మట్టి కొట్టుకుపోతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో హెక్టారుకు హెక్టారుకు ఏటా 15 నుంచి 30 టన్నుల వరకు మట్టి కొట్టుకుపోతోందని ఈ అధ్యయనంలో వెల్లడైంది. ఎడారీకరణకు గురవుతున్న రాయలసీమ వంటి కొన్ని చోట్ల ఏకంగా 50 టన్నుల వరకు మట్టి కొట్టుకుపోతోందని ఈ అధ్యయనం తేల్చింది. అడవుల నరికివేత, ప్రతి ఏటా అతిగా దుక్కిచేయటం వంటి అస్థిర వ్యవసాయ పద్ధతులతో పాటు వాతావరణ మార్పులతో కుండపోత వర్షాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయని ఈ అధ్యయనం చెబుతోంది.

అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మాత్రం తమ భూముల్లో మట్టి కొట్టుకుపోకుండా కాపాడుకోగలుగుతుండటం విశేషం. పోర్చుగల్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ గెల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యుమానిటీ పురస్కారాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం ఇటీవల అందుకున్న సందర్భంలో.. ప్రకృతి సాగులో ఒక ముఖ్యభాగమైన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పి.ఎం.డి.ఎస్.) అనే వినూత్న పద్ధతి గురించి తెలుసుకుందాం. సాయిల్ ఎమర్జెన్సీ విపత్కర స్థితిని మానవాళి దీటుగా ఎదుర్కోవాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు టి. విజయకుమార్ అంటున్నారు.

2023-24లో 8 లక్షల 60 వేల మంది రైతులు 3.80 లక్షల హెక్టార్లలో పి.ఎం.డి.ఎస్. పద్ధతిలో ఎండాకాలంలో వానకు ముందే విత్తారు. పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందుగా వేసవిలోనే విత్తుకునే వినూత్న పద్ధతే పి.ఎం.డి.ఎస్. సాగు. 20 నుంచి 30 రకాల పంటల విత్తనాలను కలిపి వానాకాలానికి ముందే విత్తనాలు వేస్తున్నారు. వేసవి వర్షాలకు మొలుస్తాయి. సజీవ వేరు వ్యవస్థతో మట్టిని కాపాడుకుంటూ.. సారవంతం చేసుకునే ప్రక్రియ ఇది. 30-60 రోజుల్లో ఈ పంటలు కోసిన తర్వాత రైతులు ప్రధాన పంటలు విత్తుకుంటారు.



● పిఎండిఎస్ పొలం



పిఎండిఎస్ ప్రయోజనాలు: ● నేల గుల్ల బారి వానపాములు వృద్ధి చెందుతాయి ● నేలలో నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది ● పోషక విలువలతో కూడిన నవధాన్య పంటలు పశువులకు పచ్చి మేతగా ఉపయోగపడతాయి ● ఏకకాలంలో బహుళ పంటలు వేయటం వలన అదనపు ఆదాయం వస్తుంది ● ప్రధాన పంటల్లో కలుపు సమస్య ఉండదు. నేల కోతకు గురి కాదు ● ప్రధాన పంటల దిగుబడులు పెరుగుతాయి ● నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది ● మట్టిలో సూక్ష్మజీవుల జీవవైవిధ్యం పెరుగుతుంది ● ప్రధాన పంటలకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది ● ప్రధాన పంటలకు చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది ● వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పిస్తాయి. ఈ సూక్ష్మజీవుల కార్యకలాపాల ద్వారా ప్రధాన పంటకు కావలసిన స్థూల, సూక్ష్మ పోషకాలు పుష్కలంగా అందుతాయి ● ప్రధాన పంటకు అతివృష్టి, అనావృష్టి వంటి వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది ● ఏడాదిలో 365 రోజులు బహుళ పంటలతో భూమిని కప్పి ఉంచే సేద్యం ఇలా సాధ్యమవుతుంది ● భూమిని పలు పంటలతో పూర్తిగా కప్పి ఉంచడం వల్ల నీరు ఆవిరికాకుండా ఉంటుంది.

ఔషధ మొక్కల వ్యాపారంపై శిక్షణ

ఔషధ, సుగంధ మొక్కల వ్యాపారావకాశాలపై 10 రోజుల ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుజరాత్ ఆనంద్‌లోని ఐసీఏఆర్ సంస్థ అయిన డైరెక్టరేట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమేటిక్ ప్లాంట్స్ రీసెర్చ్‌కు చెందిన మెడి-హబ్ ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకు రోజుకు రెండు విడతలుగా మొత్తం 5.30 గంటల పాటు ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఉ. 10 గం. నుంచి మ. 12.30 వరకు, మ. 2 గం. నుంచి సా. 5.30 వరకు ఇంగ్లీష్/హిందీలో జూమ్ ద్వారా శిక్షణ ఇస్తారు. వివరాలకు.. డా. స్నేహల్‌కుమార్ ఎ పటేల్, వాట్సాప్: 99098 52552. ఆసక్తి ఉన్న వారు ఈ గుగుల్ ఫామ్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలి: https://forms.gle/vRvMHjZGgC5n1RHH6

స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో అనాహత్, శౌర్య

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి ఇద్దరు భారత క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించారు. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో బాలికల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్... బాలుర సింగిల్స్‌లో శౌర్య బావా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అనాహత్ 11-6, 13-11, 11-2తో అకారి మిదోరికావా (జపాన్)పై, శౌర్య 11-9, 5-11, 11-5, 13-11తో సెగుండో పోర్టాబాలెస్ (అర్జెంటీనా)పై విజయం సాధించారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సుమిత్ నగాల్



భారత స్టార్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ పురుషుల సింగిల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ ఐదు స్థానాలు ఎగబాకి 68వ ర్యాంక్‌లో నిలిచాడు. 1973లో కంప్యూటర్ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకున్న మూడో భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. తొలి రెండు స్థానాల్లో విజయ్ అమృత్‌రాజ్ (1980లో 18వ ర్యాంక్), సోమ్‌దేవ్ వర్మన్ (2011లో 62వ ర్యాంక్) ఉన్నారు.

సాత్విక్-చిరాగ్ జోడీకి అనుకూలమైన 'డ్రా'



కౌలాలంపూర్: వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పోటీ పడుతున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి అనుకూలమైన 'డ్రా' లభించింది. మూడో సీడ్ పొందిన సాత్విక్-చిరాగ్‌లకు గ్రూప్ 'సి'లో చోటు దక్కింది. ఇదే గ్రూప్‌లో ఫజర్-అర్దియాంతో (ఇండోనేసియా), లమ్స్‌ఫుస్-సీడెల్ (జర్మనీ), కోర్వీ-లాబర్ (ఫ్రాన్స్) జంటలు ఉన్నాయి. ఈ మూడు జోడీలు కూడా గతంలో ఒక్కసారి కూడా సాత్విక్-చిరాగ్‌లను ఓడించలేదు. 'ఎ', 'బి', 'సి' గ్రూప్‌ల్లో నాలుగు జంటలు... 'డి' గ్రూప్‌లో ఐదు జోడీలున్నాయి. లీగ్ దశ తర్వాత ఆయా గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జోడీలు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటాయి. నాకౌట్ దశలో గ్రూప్ 'టాపర్'గా నిలిచిన జోడీలు మరో గ్రూప్ 'టాపర్'తో తలపడే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో సాత్విక్-చిరాగ్ ద్వయం గ్రూప్ టాపర్‌గా నిలిస్తే క్వార్టర్ ఫైనల్లోనూ సులువైన ప్రత్యర్థి ఎదురయ్యే చాన్స్ ఉంటుంది.

మన ఆటగాళ్లకు మద్దతు ఇవ్వండి: కోహ్లి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న భారత ఆటగాళ్లకు మద్ద తు పలుకుతూ వారిని పతకాలు సాధించే దిశగా ప్రోత్సహించాలని భారత క్రికెటర్ విరాట్ కోహ్లి విజ్ఞప్తి చేశాడు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మన దేశం ఒలింపిక్స్‌లోనూ మరింత పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నాడు. 'మన సోదర సోదరీమణులు పతకాలు నెగ్గాలనే ఆకలితో పారిస్‌కు వెళుతున్నారు. మన ఆటగాళ్లు మైదానంలో పోటీ పడేందుకు సిద్ధమవుతుండగా మనం వారిని ఉద్వేగంగా చూస్తున్నాం. ఇప్పుడు ప్రతీ ఇంట్లో, మూలమూలన ఇండియా, ఇండియా అని మాత్రమే వినిపించాలి. త్రివర్ణ పతాకం చేబూని వారంతా పోడియం వైపు వెళ్లే దిశగా నేను వారికి మద్దతు పలుకుతున్నాను. మీరూ నాతో జతకట్టండి. జై హింద్' అని కోహ్లి పేర్కొన్నాడు.



స్పెయిన్ తడాఖా

రికార్డుస్థాయిలో నాలుగోసారి యూరో టైటిల్ హస్తగతం
- ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయం


ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్

బెర్లిన్: పుష్కర కాలం తర్వాత స్పెయిన్ జట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్ వేదికపై మళ్లీ మెరిసింది. ప్రతిష్టాత్మక 'యూరో' టోర్నీలో స్పెయిన్ రికార్డు స్థాయిలో నాలుగోసారి చాంపియన్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఫైనల్లో అల్వారో మొరాటో సారథ్యంలోని స్పెయిన్ 2-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. స్పెయిన్ తరఫున నికో విలియమ్స్ (47వ ని.లో), మికెల్ ఒయర్‌జబాల్ (86వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఇంగ్లండ్ జట్టుకు పాల్మెర్ (73వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 68వ నిమిషంలో కెప్టెన్ అల్వారో మొరాటో స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఒయర్‌జబాల్ సహచరుడు మార్క్ కుకురెల్లా క్రాస్ పాస్‌ను లక్ష్యానికి చేర్చి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 90వ నిమిషంలో ఇంగ్లండ్ ప్లేయర్ మార్క్ గుయెహి హెడర్ షాట్‌ను గోల్ పోస్ట్ ముందు స్పెయిన్ డిఫెండర్ దాని ఓల్మో హెడర్ షాట్‌తో అడ్డుకోవడం కొసమెరుపు. ఈ గెలుపుతో స్పెయిన్ జట్టు 66 ఏళ్ల టోర్నీ చరిత్రలో అత్యధికంగా నాలుగుసార్లు విజేతగా నిలిచిన జట్టుగా గుర్తింపు పొందింది. గతంలో స్పెయిన్ 1964, 2008, 2012లలో యూరో టైటిల్‌ను సాధించింది. జర్మనీ జట్టు మూడుసార్లు (1972, 1980, 1996) విజేతగా నిలిచింది. 1966లో ఏకైక ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తర్వాత మరో అంతర్జాతీయ టైటిల్ నెగ్గలేకపోయిన ఇంగ్లండ్ జట్టుకు వరుసగా రెండోసారి యూరో టోర్నీలో నిరాశ ఎదురైంది. 2021 యూరో ఫైనల్లో ఇటలీ చేతిలో ఓడిన ఇంగ్లండ్‌కు ఈసారి స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఫైనల్ చేరిన స్పెయిన్ తుదిపోరులోనూ తమ సత్తా చాటుకుంది. బంతిని 63 శాతం తమ ఆధీనంలో ఉంచుకొని ఇంగ్లండ్ ఆటగాళ్లను కట్టడి చేసింది. ఏకంగా 60 సార్లు ఇంగ్లండ్ గోల్‌పోస్ట్ వైపునకు వెళ్లిన స్పెయిన్ 15 సార్లు గోల్ చేసేందుకు ప్రయత్నించింది. మరోవైపు హ్యారీ కేన్ కెప్టెన్సీలో ఇంగ్లండ్ జట్టు 31 సార్లు స్పెయిన్ గోల్ పోస్ట్ వైపునకు వెళ్లి తొమ్మిదిసార్లు గోల్ లక్ష్యంగా షాట్‌లు సంధించింది. స్పెయిన్ టీనేజ్ స్టార్, 17 ఏళ్ల లమీన్ యమాల్ 'యంగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'... స్పెయిన్‌కే చెందిన రోడ్రి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు గెల్చుకున్నారు.

విజేత స్పెయిన్ జట్టుకు 80 లక్షల యూరోలు (రూ. 72 కోట్ల 89 లక్షలు), రన్నరప్ ఇంగ్లండ్ జట్టుకు 50 లక్షల యూరోలు (రూ. 45 కోట్ల 56 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

1 యూరో టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది విజేతగా నిలిచిన తొలి జట్టుగా స్పెయిన్ రికార్డు నెలకొల్పింది.

15 ఒకే యూరో టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా స్పెయిన్ గుర్తింపు పొందింది. ఫ్రాన్స్ (14 గోల్స్: 1984లో) పేరిట ఉన్న రికార్డును స్పెయిన్ తిరగరాసింది.

అర్జెంటీనా ధమాకా

- రికార్డుస్థాయిలో 16వసారి కోపా అమెరికా కప్ సొంతం
- ఫైనల్లో కొలంబియాపై విజయం
- కెప్టెన్ మెస్సీ ఖాతాలో మరో టైటిల్

మయామి గార్డెన్స్ (అమెరికా): అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తమ ఖాతాలో మరో గొప్ప విజయాన్ని జమ చేసుకుంది. ప్రతిష్టాత్మక కోపా అమెరికా కప్ టోర్నీలో లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా టైటిల్‌ను నిలబెట్టుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా 1-0 గోల్ తేడాతో కొలంబియా జట్టును ఓడించింది. నిర్ణీత 90 నిమిషాల తర్వాత రెండు జట్లు 0-0తో సమంగా ఉండటంతో... మ్యాచ్ అదనపు సమయానికి దారి తీసింది. అదనపు సమయం తొలి అర్ధభాగంలోనూ గోల్ కాలేదు. ఆ తర్వాత అదనపు సమయం రెండో అర్ధభాగంలో 112వ నిమిషంలో లాటారో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాకు విజయాన్ని ఖరారు చేశాడు. 97వ నిమిషంలో మార్టినెజ్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. అంతకుముందు ఆట 64వ నిమిషంలో మెస్సీ మైదానంలో జారిపడటంతో చీలమండ గాయంతో అతను మైదానాన్ని వీడాడు. ఈ గెలుపుతో అర్జెంటీనా 108 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో 16వసారి చాంపియన్‌గా నిలిచింది. తద్వారా ఈ టోర్నీని అత్యధికసార్లు నెగ్గిన జట్టుగా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. 15 సార్లు ఈ టైటిల్ నెగ్గిన ఉరుగ్వే జట్టు రెండో స్థానంలోకి వెళ్లింది. మరోవైపు 23 ఏళ్ల తర్వాత కోపా అమెరికా కప్‌లో ఫైనల్ చేరిన కొలంబియా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గత 28 మ్యాచ్‌ల నుంచి అజేయంగా ఉన్న కొలంబియా తొలి ఓటమిని మూటగట్టుకుంది. కొలంబియా ప్లేయర్ జేమ్స్ రోడ్రిగ్వెజ్ టోర్నీ 'బెస్ట్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకోగా... ఐదు గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచిన అర్జెంటీనా ప్లేయర్ లాటారో మార్టినెజ్ 'గోల్డెన్ బూట్' పురస్కారం దక్కించుకున్నాడు. అంతకుముందు టికెట్ లేని ప్రేక్షకులు కూడా మైదానంలోకి రావడంతో గందరగోళం చోటు చేసుకుంది. వారందరినీ బయటకు పంపించాల్సి రావడంతో మ్యాచ్ 82 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.



చండీగఢ్ యూనివర్సిటీ ఘనత

పారిస్ ఒలింపిక్స్‌కు ఎనిమిది మంది ఆటగాళ్లు


భజన్ కౌర్

చండీగఢ్: ప్రతిష్టాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత బృందంలో ఒకే యూనివర్సిటీకి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉండటం విశేషం. చండీగఢ్ యూనివర్సిటీకి అలాంటి అరుదైన అవకాశం దక్కింది. ఈ యూనివర్సిటీ విద్యార్థులు భజన్ కౌర్ (ఆర్చరీ), అర్జున్ (షూటింగ్), సంజయ్ (హాకీ), రితిక (రెజ్లింగ్), అక్ష్‌దీప్ సింగ్ (రేస్ వాకింగ్), యశ్ (కయాకింగ్)లతో పాటు పారాలింపియన్లు పలక్ కోహ్లి (బ్యాడ్మింటన్), అరుణ తన్వర్ (తైక్వాండో) ఒలింపిక్స్‌లో భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. ఈ గౌరవం పట్ల చండీగఢ్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఎంపీ సత్నామ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు.

సినిమా

సెప్టెంబరులో స్టార్ట్?


కమల్ హాసన్

ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్, కల్కి 2898 ఏడీ, కమల్‌హాసన్ 'విక్రమ్', రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్', యశ్ 'కేజీఎఫ్' వంటి భారీ సినిమాలకు యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా చేసిన అన్బరివ్ (అన్బు, అరివు ద్వయం)దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో ఈ మూవీని ప్రకటించారు. అయితే 'ఇండియన్ 2', 'థగ్ లైఫ్' సినిమాలతో కమల్ బిజీగా ఉండటం వల్ల ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. 'ఇండియన్ 2' విడుదలవడం, 'థగ్ లైఫ్' చిత్రీకరణ తుదిదశకు చేరుకోవడంతో అన్బరివ్‌ల సినిమాపై కమల్ దృష్టిసారించారని కోలీవుడ్ సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబరు నుంచి మొదలయ్యేలా కమల్ అండ్ కో సన్నాహాలు చేస్తున్నారట. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించనున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీని 2025లో విడుదల చేయాలనుకుంటున్నారు.

ప్రేక్షకులకి బోర్ కొట్టిస్తున్నాం - నాని


అశ్విన్ రామ్, చైతన్య, నభా నటేష్, నాని, ప్రియదర్శి

"ఈ మధ్య సినిమాల్లో యాక్షన్ ఎక్కువైపోయి ప్రేమకథలు, వినోదం చాలా మిస్ అవుతున్నాం. చిన్నప్పుడు అన్నిరకాల జానర్స్ మూవీస్ వచ్చేవి.. అన్నింటినీ ఎంజాయ్ చేసేవాళ్లం. థియేటర్స్‌కి వెళ్లడానికి ఎక్కువ కారణాలుండేవి. కానీ, ఇప్పుడు మనకు తెలియకుండానే ఒకే జానర్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులకి బోర్ కొట్టిస్తున్నాం. అందరం కామెడీ, లవ్‌స్టోరీ, ఎమోషనల్, యాక్షన్.. ఇలా అన్ని జానర్స్ టచ్ చేయాలి. ప్రియదర్శిలాంటి ప్రతిభ ఉన్న నటుడు వైవిధ్యమైన జానర్స్ ఎంచుకోవడం గర్వంగా ఉంది" అని హీరో నాని అన్నారు. ప్రియదర్శి, నభా నటేష్ జోడీగా నటించిన చిత్రం 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అనన్య నాగళ్ల కీలక పాత్ర చేశారు. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ– "'డార్లింగ్' మూవీ టీజర్, ట్రైలర్ చాలా వినోదాత్మకంగా ఉంది. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి. 'హను–మాన్' మూవీ స్థాయిలో 'డార్లింగ్' విజయం సాధించాలి. వివేక్ సాగర్ మ్యూజిక్ అద్భుతంగా ఉంది. ఈ మూవీ టీజర్, ట్రైలర్ చూస్తే అశ్విన్ రామ్ ఎంత ప్రతిభ ఉన్న డైరెక్టరో తెలుస్తోంది. నభా నటేష్.. ప్రమాదం తర్వాత నీ కొత్త అధ్యాయం 'డార్లింగ్'తో ప్రారంభమైంది. దర్శి అంటే నాకు చాలా ఇష్టం. తన నటన, చేసే పాత్రలు ఇష్టం. అందుకుని 'డార్లింగ్' ఈవెంట్‌కి రాలేదు. నాకు ఇష్టమైన 'బలగం' మూవీ హీరో అని, 'బలగం' మూవీ అభిమానిగా వచ్చా. 'బలగం' స్థాయిలో 'డార్లింగ్' విజయం సాధించాలి. ఈ మూవీ తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలి. నా వాల్ పోస్టర్ ప్రొడక్షన్‌లో నేను నిర్మించనున్న తర్వాతి సినిమాలో ప్రియదర్శి హీరోగా నటిస్తాడు. జగదీశ్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తాడు" అన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నరేశ్ రామదురై, సంగీత దర్శకుడు వివేక్ సాగర్, నిర్మాతలు శివలెంక కృష్ణప్రసాద్, వివేక్ కూచిభొట్ల, అనన్య నాగళ్ల, డైరెక్టర్స్ వీఐ ఆనంద్, వేణు యెల్దండి పాల్గొన్నారు.


తాప్సీ

హైదరాబాద్‌లో యుద్ధం


ఎన్టీఆర్

హైదరాబాద్‌లో యుద్ధానికి సిద్ధం అవుతున్నారు హీరోలు ఎన్టీఆర్, హృతిక్ రోషన్. వారిద్దరూ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో స్టార్ హీరోగా దూసుకెళుతున్న ఎన్టీఆర్ 'వార్ 2' మూవీతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోలు నటిస్తున్న ఈ మూవీపై ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్‌లో ఫుల్ క్రేజ్ నెలకొంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ముంబై, గోవాతో పాటు విదేశాల్లోనూ కొన్ని సీన్స్ చిత్రీకరించారు. ముంబై షెడ్యూల్‌లో ఎన్టీఆర్-హృతిక్ రోషన్ పాల్గొన్నారు. కాగా 'వార్ 2' తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరగనుంది. ఇందుకోసం హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో భారీ బడ్జెట్‌తో పెద్ద సెట్‌ను నిర్మిస్తున్నారు. ఆగస్టు నుంచి ప్రారంభం కానున్న ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్-హృతిక్‌లపై యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించనున్నారట. ఇంటర్వెల్‌లో వచ్చే ఈ ఫైట్ సినిమాలో ఓ హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. జాన్ అబ్రహాం, కియారా అద్వానీ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వార్ 2'ని యష్ రాజ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తోంది. 2025 ఆగస్టు 14న ఈ సినిమా విడుదలకానుంది. కాగా 2019లో విడుదలైన హిట్ మూవీ 'వార్' కి సీక్వెల్‌గా 'వార్ 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే.

కథ విన్నారా?


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్' సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంటోంది. డిసెంబరు 6న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ మూవీ తర్వాత అల్లు అర్జున్ ఏ దర్శకుడితో సినిమా చేయబోతున్నారనే చర్చ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో జరుగుతోంది. త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగాలతో కొత్త సినిమాలకు అల్లు అర్జున్ ఆల్రెడీ కమిట్ అయినప్పటికీ ఈ చిత్రాలు సెట్స్‌పైకి వెళ్లడానికి చాలా సమయం ఉంది. ఈలోపు మరో దర్శకుడితో అల్లు అర్జున్ సినిమా చేయాలనుకుంటున్నారట. దీంతో ఆయన తర్వాతి సినిమా దర్శకుల జాబితాలో అట్లీ, బోయపాటి శీను, సురేందర్ రెడ్డి వంటి పేర్లు వినిపించాయి. అయితే రజనీకాంత్‌తో 'జైలర్' తీసి బ్లాక్‌బస్టర్ అందుకున్న నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ నెక్ట్స్ మూవీ తెరకెక్కనుందనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. ఇటీవల నెల్సన్ చెప్పిన స్టోరీ అల్లు అర్జున్‌కు నచ్చిందని, దీంతో ఈ కథకు తుది మెరుగులుదిద్దే పనిలో ఉన్నారట నెల్సన్. అనుకున్నట్లు జరిగితే అల్లు అర్జున్-నెల్సన్ దిలీప్ కాంబినేషన్‌లో సినిమా ఉండొచ్చని ఫిల్మ్‌నగర్ టాక్.

నా కెరీర్‌లోనే సారంగదరియా మంచి చిత్రం - రాజా రవీంద్ర


పద్మారావు, రాజా రవీంద్ర, యశస్విని, శరత్‌చంద్ర

"'సారంగదరియా' చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత ఇదే నాకు హ్యాపీయెస్ట్ మూమెంట్. నా కెరీర్‌లోనే 'సారంగదరియా' మంచి చిత్రంగా నిలిచింది" అని రాజా రవీంద్ర అన్నారు. పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వంలో రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో యశస్విని, మోయిన్, మోహిత్ ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'సారంగదరియా'. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో శరత్ చంద్ర మాట్లాడుతూ– "మా సినిమాకి ప్రేక్షకుల మౌత్ టాక్ వల్ల కలెక్షన్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి" అన్నారు. "మా సినిమాకు మంచి స్పందన వస్తుండటం సంతోషంగా ఉంది" అన్నారు పద్మారావు అబ్బిశెట్టి, మోయిన్, మోహిత్, యశస్విని.

సీక్వెల్ సిద్ధం

తాప్సీ పన్ను, విక్రాంత్ మెస్సే లీడ్ రోల్స్‌లో వినిల్ మాథ్యూ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'హసీనా దిల్‌రుబ'. 2021లో విడుదలైన ఈ సినిమాకు వీక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. దీంతో 'హసీనా దిల్‌రుబ'కు సీక్వెల్‌గా 'ఫిర్ ఆయా హసీనా దిల్‌రుబ' తీశారు మేకర్స్. తొలి భాగంలో నటించిన తాప్సీ పన్ను, విక్రాంత్ మెస్సే సీక్వెల్‌లోనూ యాక్ట్ చేయగా, వినిల్ మాథ్యూనే దర్శకత్వం వహించారు. సీక్వెల్‌లో సన్నీ కౌశల్, జిమ్మీ షెర్గిల్ ఇతర పాత్రల్లో నటించారు. దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్, భూషణ్ కుమార్ ఈ మూవీ నిర్మించారు. తాజాగా 'ఫిర్ ఆయా హసీనా దిల్‌రుబ' చిత్రం ఆగస్టు 9న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు.

షారుక్‌తో ఢీ?


అభిషేక్ బచ్చన్

షారుక్ ఖాన్ హీరోగా నటించనున్న తాజా చిత్రం 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో అభిషేక్ బచ్చన్ విలన్‌గా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. షారుక్ ఖాన్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ లీడ్ రోల్స్‌లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో 'కింగ్' తెరకెక్కనుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ మూవీలో విలన్ రోల్ కొత్తగా ఉంటుందట. ఈ రోల్‌కు అభిషేక్ బచ్చన్‌ను సంప్రదించారట సుజోయ్ ఘోష్. నెగటివ్ రోల్ కావడంతో మొదట కాస్త విముఖతను వ్యక్తం చేసిన అభిషేక్.. పాత్రలోని డెప్త్, ప్రత్యేకత నచ్చడంతో ఫైనల్‌గా ఓకే చెప్పారని బాలీవుడ్ సమాచారం.

ఒళ్లు దగ్గర పెట్టుకుని కష్టపడతా - కిరణ్ అబ్బవరం


గోపాలకృష్ణా రెడ్డి, కిరణ్ అబ్బవరం, సుజీత్, సందీప్

"ఇండస్ట్రీలో నా పని అయిపోయిందంటూ ఎవరైనా అంటే నమ్మకండి. నా పని అయిపోయిందనిపించినప్పుడు నేనే సినిమాలు చేయను. నన్ను ప్రేమించిన అభిమానుల కోసం ఒళ్లు దగ్గర పెట్టుకుని కష్టపడతాను" అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించిన చిత్రం 'క'. కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్‌కానుంది. కాగా సోమవారం (జూలై 15) కిరణ్ అబ్బవరం పుట్టినరోజు. ఈ సందర్భంగా జరిగిన 'క' మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ మాట్లాడుతూ– "'క' చూశాక తెలుగు నుంచి వచ్చిన ఒక మంచి సినిమా అని ప్రేక్షకులంతా చెప్పుకుంటారు" అన్నారు. "'క' మూవీతో నా కల నెరవేరుతోంది" అన్నారు చింతా గోపాలకృష్ణా రెడ్డి. "మాలాంటి కొత్త డైరెక్టర్స్‌కు 'క' లాంటి టీమ్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం" అన్నారు సుజీత్. "'క' అంటే కిరణ్ అబ్బవరం అని అనుకుంటున్నారు. కానీ 'క' అంటే సినిమాలో ఒక ఇంపార్టెంట్ రోల్ ఉంటుంది" అన్నారు సందీప్. ఈ వేడుకలో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు సతీష్ వేగేశ్న, చిత్ర సహ నిర్మాత వినీషా రెడ్డితో పాటు చిత్రయూనిట్ సభ్యులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
16-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
145	85
80,665	24,587

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాజా రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,501	▲ 105
డోజోన్స్	40,217	▼ 216
ఎఫ్‌టీఎస్ఈ 100	8,183	▼ 70
డాక్స్	18,591	▼ 157
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,974	▲ 2
నికాయ్	41,191	▼ 1003

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,932
బంగారం (99.5 స్వచ్ఛత)	72,640
వెండి (కిలో)	91,835

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.14	84.16
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.22	109.81
€	యూరో	ఎస్‌బీఐ	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.38	53.53
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

టోకు ధరలు రయ్!

జూన్ ద్రవ్యోల్బణం 3.36 శాతం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జూన్‌లో 3.36 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. 16 నెలల కాలంలో ఈ స్థాయి టోకు ధరల స్పీడ్ ఇదే తొలిసారి. ఆహార ధరలు ప్రధానంగా కూరగాయల ధరల తీవ్రత సూచీపై ప్రభావం చూపింది. సూచీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న తయారీ రంగంలో కూడా ద్రవ్యోల్బణం పెరిగిందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. టోకు ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తుండడం వరుసగా ఇది నాల్గవ నెల.

బీవోబీ డిపాజిట్ ధమాకా



ముంబై: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ బరోడా 'బీవోబీ మాన్సూన్ ధమాకా డిపాజిట్ స్కీమ్'ను ప్రకటించింది. అధిక వడ్డీ రేట్లపై ప్రత్యేక టర్మ్ డిపాజిట్లను స్వీకరిస్తున్నట్టు బ్యాంక్ తెలిపింది. 399 రోజుల డిపాజిట్‌పై 7.25 శాతం, 333 రోజుల డిపాజిట్‌పై 7.15 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చిందని, రూ.3 కోట్ల వరకు రిటైల్ డిపాజిట్లపై ఈ రేట్లు అమలవుతాయని వెల్లడించింది. ఇక 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు ఇవే డిపాజిట్లపై 0.50 శాతం అదనపు రేటును ఆఫర్ చేస్తున్నట్టు బ్యాంక్ తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ లాభం అప్ | అరబిందో షేర్ల బైబ్యాక్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-7-2024	
విశాఖ	575-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

సవాళ్లలోనూ ఎగుమతుల సత్తా

- అంతర్జాతీయంగా నెలకొన్న సవాళ్లలోనూ భారత్ వస్తు ఎగుమతులు పురోగమిస్తున్నాయి. జూన్‌లో సానుకూల ఫలితాన్ని అందించాయి.

ఎగుమతులు
- వృద్ధి: **2.56** శాతం
- విలువ: **35.20** బిలియన్ డాలర్లు

దిగుమతులు
- పెరుగుదల: **5** శాతం
- విలువ: **56.18** బిలియన్ డాలర్లు

- ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు: **20.98** బిలియన్ డాలర్లు

మూడు నెలల్లో..
- ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ మధ్య వస్తు ఎగుమతులు 5.84 శాతం పెరిగి, 109.96 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 7.6 శాతం ఎగసి 172.23 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి వాణిజ్యలోటు 62.26 బిలియన్ డాలర్లుగా ఉంది. వస్తు, సేవల ఎగుమతులు మూడు నెలల కాలంలో 200 బిలియన్ డాలర్లుగా ఉంది.

- **ఆయిల్ దిగుమతులు:** జూన్‌లో 20 శాతం పెరిగి 15 బిలియన్ డాలర్లుగా నమోదయితే, మూడు నెలల్లో ఈ విలువ 23 శాతం పెరిగి 51.5 బిలియన్ డాలర్లుగా ఉంది.
- **పసిడి దిగుమతులు:** జూన్‌లో 38.66 శాతం పడిపోయి 3 బిలియన్ డాలర్లకు చేరాయి. త్రైమాసికంలో 1.91 శాతం తగ్గి 9.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.



- భారత్ ప్రధానంగా ఎగుమతి చేస్తున్న దేశాల జాబితా తొలి వరుసలో అమెరికా, యూఏఈ, మలేసియా, బంగ్లాదేశ్, టాంజేనియా, నెదర్లాండ్స్, సింగపూర్ ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

జేపీ సిమెంట్స్‌పై అదానీ కన్ను

దివాలా చట్టం కింద కొనుగోలుకు అవకాశం




ముంబై: దేశీయంగా వేగవంతంగా ఏకీకృతమవుతున్న సిమెంట్ పరిశ్రమలో దివాలా చర్యలను ఎదుర్కొంటున్న జైప్రకాష్(జేపీ) అసోసియేట్స్ మరింత వేడిని పుట్టించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అల్ట్రాటెక్, అదానీ గ్రూప్, దాల్మియా, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రంగంలో భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. సిమెంట్ తయారీలో అదానీ గ్రూప్.. దిగ్గజ కంపెనీలు ఏసీసీ, అంబుజా ద్వారా దేశీయంగా రెండో పెద్ద సంస్థగా నిలుస్తోంది. ఈ బాటలో మరింత విస్తరించే వ్యూహాలలో ఉంది. ఇందుకు అనుగుణంగా 9 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన జేపీ గ్రూప్ సిమెంట్ ఆస్తులపై కన్నేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. జూన్ మొదట్లో జేపీ గ్రూప్‌పై దివాలా చట్ట చర్యలు ప్రారంభమైన నేపథ్యంలో అదానీ గ్రూప్ ప్రణాళికలకు ప్రాధాన్యత ఏర్పడింది. బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ దరఖాస్తు ప్రభావంతో అలహాబాద్‌లోని జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) కోర్టు జేపీ అసోసియేట్స్‌పై దివాలా చట్ట ప్రక్రియకు తెరతీసింది. వెరసి ఇన్‌సాల్వెన్సీ చర్యలు అదానీ గ్రూప్‌నకు అవకాశాలను కల్పించనున్నట్లు సిమెంట్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లైమ్‌స్టోన్ గనులు, విద్యుత్ ప్లాంటుసహా సిమెంట్ ఆస్తులను పొందేందుకు అదానీ సన్నాహాలు మొదలు పెట్టే వీలున్నట్లు తెలియజేశారు. అయితే ఇప్పటివరకూ జేపీ ఆస్తుల విక్రయానికి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని చెబుతున్నారు.

వేడెక్కనున్న మార్కెట్

గత నెల(జూన్) 27న ఇండియా సిమెంట్స్‌లో 19.44 శాతం వాటాను షేరుకి రూ. 267 ధరలో సిమెంట్ దిగ్గజం అల్ట్రాటెక్ కొనుగోలు చేసింది. అంతేకాకుండా మరో 3.4 శాతం వాటాను ఈ ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ షేరుకి రూ. 285 ధరలో సొంతం చేసుకోనుంది. తద్వారా దాదాపు 23 శాతం వాటాను రూ. 1,900 కోట్లకు చేజిక్కించుకుంటోంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ

- సూచీలకు పీఎస్‌యూ షేర్ల దన్ను
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ సోమవారం కూడా కొనసాగింది. రాబోయే బడ్జెట్‌పై ఆశావహ దృక్పథం, ఐటీ రంగ కంపెనీలు అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలు ప్రకటించడం తదితర అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 145 పాయింట్లు పెరిగి 80,665 వద్ద ముగిసింది. నిఫ్టీ 85 పాయింట్ల లాభంతో 24,587 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డు. ఒక దశలో సెన్సెక్స్ 343 పాయింట్లు బలపడి 80,862 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు ఎగసి 24,635 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి.

- ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో ఎస్‌బీఐ షేరు 2.50 శాతం, **క్యూ1లో నికర** లాభం 47% వృద్ధి నమోదుతో **బ్యాంక్ ఆఫ్** మహారాష్ట్ర షేరు 5.50% లాభపడ్డాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 7%, కెనరా బ్యాంక్ 4.50%, పీఎన్‌బీ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ షేర్లు 5 శాతం వరకు రాణించాయి.
- స్టాక్ సూచీలు కొత్త గరిష్టాలకు చేరడంతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడచిన రెండు రోజుల్లో రూ.3.85 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. సోమవారంఒక్క రోజే రూ. 2.70 లక్షల కోట్లు పెరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ. 455.08 లక్షల కోట్లకు (5.45 ట్రిలియన్ డాలర్లు) చేరింది.

జీవితకాల కనిష్టాన్ని తాకిన రూపాయి

దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగడం, అమెరికా కరెన్సీ బలోపేతంతో ఇంట్రాడేలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 83.62 వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. చివరికి 10 పైసలు బలహీనపడి 83.61 వద్ద ముగిసింది. రానున్న రోజుల్లో 83.30 - 83.80 శ్రేణిలో కదలాడొచ్చని ఫారెక్స్ నిపుణులు భావిస్తున్నారు.

స్క్రాపింగ్‌కు మరింత సపోర్ట్

బడ్జెట్‌పై కేంద్రానికి ఆటోమొబైల్ రంగం డిమాండ్లు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వివిధ రంగాలు తమ విజ్ఞప్తుల చిట్టాను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింతగా పెరిగేందుకు రాబోయే బడ్జెట్‌లో తగు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆటోమొబైల్ పరిశ్రమ సమాఖ్య సియామ్ కోరింది. అలాగే, వాహనాలను తుక్కు కింద మార్చే స్క్రాపింగ్ ప్రక్రియకు సంబంధించి అదనంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. 'ఎలక్ట్రిక్ వాహనాల కోసం కేంద్రం ఫేమ్ 3 వంటి పథకాన్ని ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నాం. ఇప్పటికే అమలవుతున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) వంటి స్కీములు ఇకపైనా కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ తెలిపారు. 'అలాగే, వాహనాల స్క్రాపేజీ పాలసీ అమల్లో ఉన్నప్పటికీ పెద్దగా ప్రభావం లేనందున, స్క్రాపింగ్ విషయంలో మరిన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు ప్రకటించవచ్చని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఎకానమీకి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటే ఆటోమోటివ్, ఎఫ్ఎంసీజీ వంటి రంగాలకు మేలు జరుగుతుందని అగర్వాల్ తెలిపారు. సబ్సిడీలు ఇవ్వడం ద్వారా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్ 2 గడువు ముగిసినందున దాని స్థానంలో ఫేమ్ 3ని అమలు చేస్తే పరిశ్రమకు తోడ్పాటు లభించగలదన్న ఆశలు నెలకొన్నాయి. ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాల కోసం కేంద్రం రూ. 10,000 కోట్లతో ఈ పథకాన్ని ప్రకటించవచ్చనే అంచనాలు ఉన్నాయి.



తరుగుదల ప్రయోజనాలు కల్పించాలి: ఫాడా

వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్లకు వాహనాల తరుగుదలను (డిప్రిసియేషన్) క్లెయిమ్ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరగడంతో పాటు వాహనాలకు డిమాండ్ పెరిగేందుకు కూడా ఇది తోడ్పడగలదని ఫాడా ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా తెలిపారు. మరోవైపు, ఎల్ఎల్‌పీ (లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్), ప్రొప్రైటరీ, భాగస్వామ్య సంస్థలకు సైతం కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించాలని కోరారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 195 పోస్టులు

పుణె(మహారాష్ట్ర)లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వివిధ విభాగాల్లోని పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 195.
» పోస్టులు: డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్.
» విభాగాలు: రిస్క్ మేనేజ్‌మెంట్, పోర్ట్‌ఫోలియో అనాలసిస్-ఐసీఏఏపీ, ఎంటర్‌ప్రైజ్-ఆపరేషన్ రిస్క్, మార్కెట్ రిస్క్, రిస్క్ అనలిటిక్స్-రిస్క్ మేనేజ్‌మెంట్,రిస్క్ మేనేజ్‌మెంట్, డొమెస్టిక్-ఫారెక్స్, ఫారెక్స్, డొమెస్టిక్ ట్రెజరీ, ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్, డేటా ఆర్కిటెక్చర్, ఐటీ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ తదితరాలు.
» అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ/పీజీ, పీజీ డిప్లొమా, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు స్కేల్-2 పోస్టులకు రూ.64,820 నుంచి రూ.93,960, స్కేల్-3 పోస్టులకు రూ.85,920 నుంచి రూ.1,05,280, స్కేల్-4 పోస్టులకు రూ.1,02,300 నుంచి రూ.1,20,940, స్కేల్-5 పోస్టులకు రూ.1,20,940 నుంచి రూ.1,35,020, స్కేల్-6 పోస్టులకు రూ.1,40,500 నుంచి రూ.1,56,500.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హెచ్ఆర్ఎం డిపార్ట్‌మెంట్, హెడ్ ఆఫీస్, లోక్‌మంగళ్, 1501, శివాజీనగర్, పుణె-411005 చిరునామకు పంపించాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 11.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.07.2024
» వెబ్‌సైట్: https://bankofmaharashtra.in

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ క్రీడా కోటా కింద డైరెక్ట్ ఎంట్రీ (ఇంటెక్ 02/2024) ద్వారా.. హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» క్రీడలు: అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు అవసరం. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.
» వయసు:17 1/2 నుంచి 25ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్ క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747 ఎ వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ-110011 చిరునామకు పంపించాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:30.09.2024.
» వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

ఎస్‌బీఐలో 16 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం.. రెగ్యులర్-కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 16
» పోస్టుల వివరాలు: సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)-02, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)-03, మేనేజర్(ఐఎస్ ఆడిటర్)-04, డిప్యూటీ మేనేజర్(ఐఎస్ ఆడిటర్)-07.
» అర్హత: బీఈ/బీటెక్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్), సీఐఎస్ఏ సర్టిఫికేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు మేనేజర్ పోస్టుకు రూ.85,920 నుంచి రూ.1,05,280. డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.64,820 నుంచి రూ.93,960. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు ఏడాదికి రూ.45 లక్షలు. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌కు ఏడాదికి రూ.40 లక్షలు.
» ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 03.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.07.2024
» వెబ్‌సైట్: https://www.sbi.co.in

'గేట్' గెలుపు

» 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో గేట్
» గేట్ స్కోర్‌తో ఎంటెక్, పీహెచ్‌డీతోపాటు పీఎస్‌యూ జాబ్స్
» ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో పరీక్ష: మొత్తం 30 పేపర్లలో గేట్
» అభ్యర్థులు రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

గేట్.. గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్! ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీలు, నిట్‌ల్లో ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశానికి మార్గం!! అంతేకాకుండా గేట్ స్కోర్‌తో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలను కూడా దక్కించుకోవచ్చు. తాజాగా గేట్ 2025 షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. గేట్-2025 వివరాలు, గేట్ స్కోర్‌తో ప్రయోజనాలు, బెస్ట్ స్కోర్ సాధించడానికి మార్గాలు తదితర వివరాలు..

ఐఐటీలు,ఎన్ఐటీలు,జీఎఫ్‌టీఐలే కాకుండా..రాష్ట్ర స్థాయిలోనూ ఎంటెక్ ప్రవేశాల్లో గేట్ విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. పీఎస్‌యూలు కూడా గేట్ స్కోర్‌తో ఎంట్రీ లెవల్ ఇంజనీరింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో లక్షల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఏటా ఎనిమిది లక్షలకు పైగా అభ్యర్థులు గేట్ రాస్తున్నట్లు అంచనా.

నిర్వహణ.. ఐఐటీ-రూర్కీ

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ పరీక్షను ప్రతి ఏటా ఒక ఐఐటీ నిర్వహిస్తుంది. గేట్-2025 నిర్వహణ బాధ్యతలు ఐఐటీ-రూర్కీకి అప్పగించారు. దీంతో.. సంబంధిత వర్గాలు గేట్-2025 వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. అదే విధంగా అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్ష షెడ్యూల్, సిలబస్, గేట్ గత పరీక్ష పేపర్లను సైతం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

మొత్తం 30 పేపర్లు

గేట్-2025 పరీక్షను మొత్తం 30 పేపర్లలో నిర్వహించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వీటిలో ఇంజనీరింగ్‌తోపాటు ఆర్కిటెక్చర్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్టులు కూడా ఉండడం విశేషం. పలు ఐఐటీల్లో ఇటీవల కాలంలో సోషల్ సైన్సెస్ విభాగాల్లోనూ పీజీ కోర్సులను అందిస్తున్నారు. గేట్ స్కోర్ ఆధారంగానే ఆ సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించారు. దీంతో గేట్‌లో ఎక్స్‌హెచ్ పేరుతో హ్యూమానిటీస్‌కు సంబంధించిన సబ్జెక్టులో పరీక్ష కూడా నిర్వహిస్తున్నారు.

అర్హతలు

ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో బీటెక్, ఇతర గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు మూడు, నాలుగు సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు గేట్ 2025కు దరఖాస్తుకు అర్హులు.

వంద మార్కులకు పరీక్ష

గేట్-2025 పరీక్ష మొత్తం మూడు గంటల వ్యవధిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు విభాగాల్లో 65 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌లో 13 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో పార్ట్-బిని నిర్వహిస్తారు. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 100 మార్కులకు గేట్ పరీక్ష జరుగుతుంది.

ప్రశ్నల తీరు ఇదే

గేట్ పరీక్షలో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి.. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్ (ఎంసీక్యూ), మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ (ఎంఎస్‌క్యూ), న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ విధానంలో ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే..సంబంధిత టాపిక్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగుండాలి. న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

పీఎస్‌యూ జాబ్స్

గేట్ స్కోర్ ఆధారంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లలో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలలో ప్రవేశాతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. పీఎస్‌యూలు గత కొన్నేళ్లుగా గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపడుతున్నాయి. ఇందుకోసం అభ్యర్థులు ఆయా సంస్థలు విడుదల చేసే నోటిఫికేషన్లకు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిర్దిష్ట కటాఫ్ నిబంధనలను అనుసరించి జాబితాలో ఉన్న వారికి పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ టాస్క్ వంటివి నిర్వహించి తుది విజేతలను ఖరారు చేస్తారు.

మలి దశ ఎంపిక ప్రక్రియ

గేట్ స్కోర్ ఆధారంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు మలిదశ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఐఐటీల్లో కౌన్సెలింగ్‌తోపాటు గ్రూప్ పర్సనల్ టాస్క్, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. కొన్ని ఐఐటీలు రిటెన్ ఎస్సేలు నిర్వహిస్తున్నాయి. వీటిలో విజయం సాధించిన వారికే సీట్లు ఖరారు అవుతున్నాయి. జనరల్ కేటగిరీలో 750, రిజర్వ్‌డ్ కేటగిరీల్లో 550కుపైగా స్కోర్ ఉంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

సీఓఏపీలో యాక్సెప్టెన్స్ తప్పనిసరి

ఐఐటీల్లో సీట్ల భర్తీలో సీఓఏపీ (కామన్ ఆఫర్ యాక్సెప్టెన్స్ పోర్టల్) విధానాన్ని అమలు చేస్తున్నారు. అంటే.. ఆయా ఐఐటీల్లో ఎంటెక్, ఇతర కోర్సులకు దరఖాస్తు చేసుకునే సమయంలో.. సీఓఏపీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగా సీఓఏపీలో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ నెంబర్ పొందిన విద్యార్థులే ఐఐటీల్లో ఎంటెక్ దరఖాస్తులకు అర్హులవుతారు. ఐఐటీల్లో సీటు లభించిన విద్యార్థులు సీఓఏపీ ద్వారానే తమ సమ్మతి లేదా తిరస్కరణ తెలియజేయాల్సి ఉంటుంది. అదే విధంగా పీఎస్‌యూ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారు కూడా సీఓఏపీలో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.

సన్నద్ధత పొందండిలా

ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకూ.. పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్హమైన టాపిక్స్‌ను గుర్తించడం, దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవడం చేయాలి.

అనుసంధానం

గేట్ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అనుసంధాన విధానాన్ని అలవర్చుకోవాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. ఈ అప్రోచ్ విజయ సాధనలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

వెయిటేజీని పరిశీలిస్తూ

గేట్ అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్, వాటికి గత అయిదారేళ్లుగా లభిస్తున్న వెయిటేజ్, అకడమిక్‌గా ఉన్న వెయిటేజీ ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగితే..పరీక్షలో మంచి స్కోర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.



ఎన్ఐటీలకు సీసీఎంటీ

దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ ఫర్ ఎంటెక్/మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్/మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(సీసీఎంటీ) పేరుతో ఉమ్మడి కౌన్సెలింగ్ విధానాన్ని అనుసరిస్తారు. విద్యార్థులు సీసీఎంటీ వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకుని ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, వారికి వచ్చిన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని.. ఆన్‌లైన్‌లో సీటు కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది.

గేట్‌తో స్కాలర్‌షిప్

గేట్ స్కోర్ ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీలలో ప్రవేశం పొందిన వారికి ఆర్థిక ప్రోత్సాహకం కూడా అందిస్తారు. ఎంటెక్ విద్యార్థులకు నెలకు రూ.12,400 చొప్పున 22 నెలలు స్కాలర్‌షిప్ ఇస్తారు. పీహెచ్‌డీలో ప్రవేశం ఖరారైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేలు చొప్పున; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.42 వేలు చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుంది.

పీఎస్‌యూల్లోనూ మలి దశ

తొలిదశలో గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న పీఎస్‌యూలు.. మలిదశలో సొంతంగా ఎంపిక ప్రక్రియ చేపడుతున్నాయి. మలిదశలో గ్రూప్ డిస్కషన్ /గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. తుది జాబితా ఖరారులో.. గేట్ స్కోర్, జీడీ/జీటీ, పర్సనల్ ఇంటర్వ్యూలకు వెయిటేజ్ ఇస్తున్నాయి. గ్రూప్ డిస్కషన్‌లో భాగంగా అభ్యర్థులను బృందాలుగా విభజించి.. ఏదైనా ఒక అంశం ఇచ్చి టీమ్‌లోని ప్రతి అభ్యర్థి మాట్లాడాలని సూచిస్తారు. గ్రూప్ టాస్క్‌లో ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందు ఉంచి పరిష్కారం కనుక్కోవాలని పేర్కొంటున్నాయి. చివరగా నిర్వహించే పర్సనల్ ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

గేట్-2025 ముఖ్య తేదీలు

- నోటిఫికేషన్ విడుదల:జూలై మూడో వారంలో..
- గేట్ పరీక్ష తేదీలు: 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీలు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://gate2025.iitr.ac.in

క్లుప్తంగా...

కూటమి బెదిరింపుల ఫలితం.. ఎస్వీయూ క్యాంటీన్ మూత!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నూతన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కూటమికి చెందిన నాయకుల ఆగడాలకు అదుపులేకుండా పోతున్నది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజున వర్సిటీ వీసీ, అధికారులపై విచక్షణా రహితంగా అసభ్యపదజాలంతో దూషించి దాడులు చేశారు. వర్సిటీకి సంబంధంలేని అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కొందరు వర్సిటీలో సంచరిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గత కొంతకాలంగా ఎస్వీయూ క్యాంటీన్‌ను మూసివేసి వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగారు. దీంతో క్యాంటీన్ యాజమాన్యం తమ టెండర్ కాలవ్యవధి మరికొంత కాలం ఉన్నప్పటికీ.. దాడులకు జడిసి సోమవారం క్యాంటీన్‌ను మూసివేసింది.

బీసీ స్టడీ సర్కిళ్లను పటిష్టం చేయండి

- మంత్రి సవితకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం పటిష్టం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు సోమవారం వెలగపూడి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను కలిసి వినతి పత్రం అందజేశారు. సివిల్స్‌తో సహా అన్ని పోటీ పరీక్షలకు నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. త్వరలో జరగబోయే టెట్, డీఎస్సీ పరీక్షలకు శిక్షణ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని చోట్ల స్టడీ సర్కిళ్లకు శాశ్వత భవనాలు లేవని, అలాంటి ప్రాంతాల్లో భవనాలు నిర్మించాలన్నారు.

నాలుగేళ్ల బాలిక ఉసురుతీసిన అతిసార

- కర్నూలు జిల్లా సుంకేశ్వరి గ్రామంలో కలుషిత నీరు సరఫరా
- వారం రోజుల వ్యవధిలో 50 మందికి అస్వస్థత


జ్యోతి

మంత్రాలయం: అతిసార వ్యాధికి నాలుగేళ్ల బాలిక బలైన ఘటన కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం...సుంకేశ్వరి గ్రామంలో వాటర్ పైపులైన్ల లీకేజీల వల్ల కలుషత నీరు కుళాయిల ద్వారా సరఫరా అయ్యింది. ఆ నీరు తాగి సుమారు 50 మంది గ్రామస్తులు వారం రోజుల వ్యవధిలో అస్వస్థతకు గురయ్యారు. వీరిని ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన ఈరమ్మ కుమార్తె జ్యోతి(4) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను బైక్‌పై ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అతిసార వ్యాధి తమ బిడ్డ ప్రాణాలు పొట్టనబెట్టుకుందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారం రోజుల నుంచి గ్రామంలో కలుషిత నీరు తాగి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా అధికారుల్లో చలనం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇంకెంత మంది ప్రాణాలు పోయిన తర్వాత వస్తారని నిలదీస్తున్నారు. కాగా, బాలిక మృతి విషయం తెలుసుకుని వైద్యాధికారి సురేష్ సోమవారం గ్రామంలో వైద్య సేవలు ప్రారంభించారు.

పచ్చడిలో బల్లి... పాడైపోయిన చికెన్!



తిరుపతి సిటీ(తిరుపతి జిల్లా): గోంగూర పచ్చడిలో బల్లి... దుర్వాసన వస్తున్న చికెన్.. ఇదీ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ)లోని మహిళా హాస్టళ్లలో పరిస్థితి. వారం కిందట పాడైపోయిన చికెన్ పెట్టిన సిబ్బంది.. రెండు రోజుల కిందట బల్లిపడిన గోంగూర పచ్చడిని వడ్డించారు. హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న ఇటువంటి ఘటనలతో విద్యార్థినులు భోజనం చేసేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. వారం రోజుల కిందట ఎస్వీయూ పీజీ మహిళా హాస్టల్-1లో పాడైపోయి దుర్వాసన వస్తున్న చికెన్‌ను వడ్డించారు. దీంతో విద్యార్థినులు భోజనం మానేసి ధర్నా చేశారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూస్తామని అధికారులు చెప్పడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. అయినా సిబ్బంది తీరులో ఎటువంటి మార్పు లేదు. రెండు రోజుల కిందట మళ్లీ హాస్టల్-2లో గోంగూర పచ్చడిలో బల్లి ప్రత్యక్షమైంది. వెంటనే విద్యార్థినులు గుర్తించి గోంగూర పచ్చడితోపాటు భోజనం చేయకుండా వదిలేయడంతో ప్రమాదం తప్పింది. వారం కిందటే ధర్నా చేసినా సిబ్బందిలో మార్పు రాలేదని విద్యార్థినులు వాపోతున్నారు. మరోవైపు పీజీ మహిళా హాస్టళ్లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, గంట మాత్రమే నీరు సక్రమంగా వస్తుందని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

కొనసాగుతున్న
టీడీపీ దౌర్జన్యాలు
వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు

- శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరిపై వేట కొడవళ్లతో దాడి
- పల్నాడు జిల్లాలో బూతులు తిట్టి దాడిచేసిన వైనం
- వైఎస్సార్ జిల్లాలో రియల్టర్లకు బెదిరింపులు
- గుంటూరు జిల్లాలో హోటల్ ధ్వంసం
- ఏలూరు జిల్లాలో షెడ్డు కూల్చేస్తామని నోటీసు

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు దౌర్జన్యాలను కొనసాగిస్తూనే ఉన్నారు. వీరి అరాచకాలు ఆదివారం రాత్రి, సోమవారం కొనసాగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై వేట కొడవళ్లతో దాడిచేశారు. హోటల్ ధ్వంసం చేశారు. షెడ్డు కూల్చేస్తామని నోటీసు ఇప్పించారు. రియల్టర్లను బెదిరించారు. - సాక్షి నెట్‌వర్క్


గాయపడిన రామకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డి

➤ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ముచ్చురామి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రామకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు క్రిష్టయ్య, బాలచంద్ర వేట కొడవళ్లతో దాడిచేశారు. ఈ దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. రామకృష్ణారెడ్డి సోమవారం సాయంత్రం తమ పొలంలో తెగిపడిన మోటర్ తీగలను విద్యుత్‌శాఖ అధికారులతో సరిచేస్తున్నారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు బాలచంద్ర, క్రిష్టయ్య.. రామకృష్ణారెడ్డి, పక్కనున్న నరేంద్రరెడ్డితో గొడవకు దిగారు. గొడవ తీవ్రమై పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బాలచంద్ర, క్రిష్టయ్య వేట కొడవళ్లతో రామకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డిపై వేట కొడవళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు.

➤ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి పంచాయతీ మహదేవపురం ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కంకిపాటి వెంకటేశ్వరరావు షెడ్డును వెంటనే తొలగించాలని పంచాయతీ వారు నోటీసు ఇచ్చారు. వెంకటేశ్వరరావు తండ్రి సత్తియ్య సుమారు 40 ఏళ్ల కిందట గ్రామంలోని ప్రభుత్వభూమిలో పశువుల పాక నిర్మించుకున్నారు. సత్తియ్య మరణానంతరం ఆ స్థలం అతడి కుమారుడు వెంకటేశ్వరరావు ఆధీనంలో ఉంది. వెంకటేశ్వరరావు ఇటీవల ఆ స్థలంలో షెడ్డు నిర్మించారు. వెంటనే ఆ షెడ్డును తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి ఈనెల 11న , మళ్లీ సోమవారం పంచాయతీ గుమాస్తా, సచివాలయ మహిళా పోలీస్ మరో నోటీసు ఇచ్చారు.వెంకటేశ్వరరావు ఇంటిపక్కన అదే ఆక్రమిత భూమిలో ఉన్న


ఆక్రమిత భూమిలో ఉన్న టీడీపీ కార్యకర్త కృష్ణ ఇల్లు, దానికి కుడి పక్కన వెంకటేశ్వరరావు షెడ్డు

టీడీపీ కార్యకర్త భీమడోలు కృష్ణకు పంచాయతీ వారు నోటీసు ఇవ్వలేదు. తనకే నోటీసు ఎందుకిచ్చారని పంచాయతీ అధికారులను ప్రశ్నించగా.. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా నోటీసులు ఇస్తున్నామన్నారని వెంకటేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్ జయంతి వేడుకల్లో తన కుమారుడు సతీష్ పాల్గొనడం వల్లే టీడీపీ నేతలు కక్ష సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➤ పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ అభిమాని ముజావర్ సైదావలిపై టీడీపీ వర్గీయుడు ముజావర్ బాజి దాడిచేశాడు. రోడ్డు మీద ఎదురొచ్చిన సైదావలిని దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళల్ని దూషించాడు. ఈ దాడిపై సైదావలి ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

➤ వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలోని స్విస్ట్ కళాశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద టీడీపీ నాయకులు హడావుడి చేశారు. వెంచర్ మేనేజర్, సూపర్‌వైజర్లను భయభ్రాంతులకు గురిచేసి పనులు నిలిపేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అనుమతి తీసుకుని వెంచర్లు వేయాలని హెచ్చరించారు. టీడీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వీరకుమార్‌రెడ్డి, మావిరెడ్డి, మరో నలుగురు తమ అనుమతులు లేకుండా పనులు చేస్తే టిప్పర్లు, జేసీబీలను పెట్రోల్ పోసి కాల్చేస్తామని హెచ్చరించారని సదరు కాంట్రాక్టర్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

➤ గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం రాత్రి టీడీపీ వారు వైఎస్సార్‌సీపీ నాయకుడు సుభాని హోటల్‌ను ధ్వంసం చేశారు. పదుల సంఖ్యలో వచ్చిన యువకులు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులోని హోటల్‌లో సామగ్రిని, ఆహారాన్ని రోడ్డుమీదకు విసిరేసి సుమారు రెండుగంటల పాటు వీరంగం చేశారు. అడ్వాన్స్ తీసుకుని సకాలంలో మటన్ ఇవ్వనందుకు మూడునెలల కిందట చినరావూరుతోటలోని మాంసం వ్యాపారి మక్బుల్‌ను సుభాని మందలించాడు. ఇది మనసులో పెట్టుకున్న మక్బుల్ ఆదివారం రాత్రి కొందరు యువకులతో కలిసి సుభాని హోటల్‌పై రాళ్లతో దాడి చేశాడు. సుభాని బుల్లెట్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో యువకుడు మహబూబ్‌కు గాయాలవగా 108లో తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరోవైపు తాము వహాబ్ చౌక్‌లోని ఓ హోటల్ నుంచి ఆహారం తీసుకెళుతుండగా సుభాని, అతడి హోటల్‌లో పనిచేసేవారు తమపై దాడిచేశారని మక్బుల్ వర్గీయులు చెబుతున్నారు.

జీపీఎస్‌పై టీచర్ల పోరుబాట

- ఆందోళనలకు సిద్ధమైన ఉపాధ్యాయ సంఘాలు
- కూటమి ప్రభుత్వం మాట తప్పిందంటూ ఆగ్రహం
- జీపీఎస్ అమలుకు గెజిట్ ఇవ్వడంపై మండిపాటు
- గెజిట్‌ను పూర్తిగా రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్

సాక్షి, అమరావతి: గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం(జీపీఎస్) వల్ల ఉద్యోగులు నష్టపోతారంటూ ఎన్నికల ప్రచారంలో చెప్పిన కూటమి పార్టీల నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడంపై ప్రభుత్వ ఉపాధ్యాయులు కన్నెర్ర జేశారు. అధికారంలోకి రాగానే మెరుగైన విధానం కోసం ఉద్యోగ సంఘాలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామన్న చంద్రబాబు.. ఆ విషయాన్ని విస్మరించి ఎవరికీ చెప్పకుండా జీపీఎస్ గెజిట్ విడుదల చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జీపీఎస్‌ను తమపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే సహించేది లేదని తేల్చిచెబుతున్నాయి. తాత్కాలిక చర్యలు కాకుండా పూర్తి స్థాయిలో గెజిట్‌ను రద్దు చేసే వరకు తమ ఆందోళన తెలుపుతామని స్పష్టం చేశాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మంగళ, బుధవారాల్లో ఆందోళనలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) పిలుపునిచ్చింది. గెజిట్‌ను ఉపసంహరించకపోతే ఉద్యమిస్తామని ఎస్టీయూ హెచ్చరించింది. ఫ్యాప్టో నాయకులు కూడా ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

ఉపాధ్యాయులను మోసం చేయడమే: ఫ్యాప్టో
కూటమి ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేయడమంటే ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసం చేయడమేనని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు మండిపడుతున్నారు. గెజిట్‌ను వెనక్కి తీసుకునేలా సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తేవాలని కూటమిలోని మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చించాలని యూనియన్ నేతలు మంత్రులను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నారు. పూర్తి స్థాయిలో గెజిట్‌ను రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. బుధవారం అన్ని ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నేతలు సమావేశమై ఫ్యాప్టో తరఫున నిర్ణయం ప్రకటించనున్నట్లు సమాచారం.

ఉపసంహరించకుంటే ఉద్యమిస్తాం: ఎస్టీయూ

తాత్కాలిక చర్యలు కాకుండా.. పూర్తి స్థాయిలో జీపీఎస్ గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. జీపీఎస్ కంటే మెరుగైన విధానం తెస్తామని చెప్పిన కూటమి పార్టీల నాయకులు.. ఎవరితోనూ చర్చలు జరపకుండా గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఈ గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోకపోతే మరోసారి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డక్కిలి గురుకులంలో ముగ్గురి సస్పెన్షన్

- చర్యలు తీసుకున్న అధికారులు

డక్కిలి (తిరుపతి జిల్లా): డక్కిలి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని అడసనపల్లి సరీనా మృతి వ్యవహారంలో ముగ్గురు ఉద్యోగులపై సోమవారం సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. పాఠశాలలో అనారోగ్యానికి గురైన సరీనాను ఈ నెల 9వ తేదీన గురుకులం ఉద్యోగులు తల్లిదండ్రులకు అప్పగించారు. వారు వెంటనే చెన్నై ఎగ్మూర్ చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ బాలిక మృతి చెందింది. ఈ ఘటనపై ప్రజా సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. దీంతో ఈ ఘటనపై తిరుపతి గురుకుల పాఠశాల, కళాశాలల సమన్వయకర్త పద్మజ, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవీ, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీహరి తదితరుల బృందం క్షేత్రస్థాయిలో విచారించి జిల్లా కలెక్టర్‌కు ఆదివారం నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా గురుకులంలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి, నర్సు సునీత, హౌస్ పేరెంట్ వాణిలను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

దళిత బాలిక అనుమానాస్పద మృతి

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో పన్నెండేళ్ల దళిత బాలిక సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తన ఇంటికి సమీపంలోని ఓ ఇంట్లో మంచంపై బాలిక మృతదేహాన్ని గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కొత్తరెడ్డిపాలెం నుంచి నారాకోడూరు వెళ్లే రోడ్డులో కుమ్మరిపాలెం దళితవాడకు చెందిన శైలజ అనే బాలిక 7వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక తమ్ముడితో కలిసి ఆడుకోవటానికి వెళ్లింది. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు పేరుపోగు దావీదు, ఇందిరమ్మ బాలిక కోసం వెతికారు. బాలిక ఇంటికి సమీపంలోని ఓ ఇంట్లో కృష్ణా జిల్లాకు చెందిన నాగరాజు (చిన్ని) అద్దెకు ఉంటున్నాడు. అతడు హోటల్, గ్యాస్ కంపెనీలో పనిచేస్తూ ఒక్కడే ఆ ఇంట్లో ఉంటున్నాడు. నాగరాజు ఇంటిముందు బాలిక చెప్పులు కనబడటంతో తల్లిదండ్రులు ఆ ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై బాలిక మృతదేహం పడి ఉంది. నాగరాజు అదృశ్యమవటంతో అతనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాలిక మృతదేహం సమీపంలో కూల్‌డ్రింక్ బాటిల్, తినుబండారాలు ఉన్నాయి. బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేసి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాన్ని తెనాలి డీఎస్పీ ఎం.రమేష్, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్‌కుమార్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ కొన్ని ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కృష్ణా జిల్లాలో కుండపోత

- గుంటూరులో మోస్తరు వాన
- తిరుపతిలో ఎడతెరిపిలేని వర్షం
- రాష్ట్రంలో అక్కడక్కడా చిరుజల్లులు


తిరుమల ఆలయం వెలుపల కురుస్తున్న వర్షం

సాక్షి నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోని రోడ్లు చెరువుల్ని తలపించాయి. పెనుగంచిప్రోలులో 11.2 మి.మీ., కంచికచర్లలో 5.8, ఇబ్రహీంపట్నంలో 3.6, విజయవాడ నార్త్‌లో 3.6, సెంట్రల్, వెస్ట్‌లో 3.4, వీరులపాడు, మైలవరం, ఎ.కొండూరు, విజయవాడ రూరల్, విజయవాడ ఈస్ట్‌లో 3.2 చొప్పున, రెడ్డిగూడెంలో 2.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. విజయవాడ నగరంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురవడంతో కొన్నిచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. గుంటూరులో మోస్తరు వర్షం కురిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిరు జల్లులు కురిశాయి. జిల్లాలో సగటున 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి నుంచి వర్షం కురవడంతో శ్రీవారి దర్శనం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, నరసాపురం, ఉండి నియోజకవర్గాల పరిధిలో మధ్యాహ్న సమయంలో చిరు జల్లులు పడ్డాయి. అనకాపల్లిలో జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

గోదావరికి వరదపోటు

పోలవరం రూరల్/పెనుగొండ: గోదావరి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఉప నదులు, కొండవాగుల నీరు కూడా చేరి ప్రవాహం పెరుగుతూ వస్తోంది. స్పిల్ వే 48 గేట్ల నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా నీరు దిగువకు చేరుతోంది. కాగా.. వశిష్ట గోదావరికి వరద నీరు చేరడంతో పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం వద్ద కేదారీ ఘాట్‌లో వరద నీరు పోటెత్తుతోంది. దీంతో పడవలనీ ఒడ్డుకు చేరాయి. లంక భూములకు రాకపోకలు తగ్గాయి. సోమవారం సాయంత్రానికి నెమ్మదిగా నీటి మట్టం పెరిగింది. పుష్కర రేవుకు వరద నీరు చేరింది.

గురుకుల విద్యార్థులకు
కలుషిత ఆహారం
139 మందికి అస్వస్థత.. ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం


అస్వస్థతకు గురై అచేతనంగా పడివున్న విద్యార్థులు


విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా)/చిల్లకూరు(తిరుపతి జిల్లా): నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఆదివారం అర్ధరాత్రి 139 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని నాయుడుపేట గురుకులం, సామాజిక వైద్య కేంద్రం, సూళ్లూరుపేట సామాజిక వైద్య కేంద్రంలో, గూడూరు ఏరియా వైద్యశాలకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కలుషిత ఆహారం వల్లే..
కలుషిత ఆహారం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు అధికారులు గుర్తించారు. శనివారం వండిన పూరీలతో పాటు బంగాళాదుంపల కుర్మా ఆదివారం ఉదయం విద్యార్థులకు వడ్డించారు. అదే విధంగా నిల్వచేసిన కోడి మాంసం ఆదివారం ఉదయం వండి మధ్యాహ్నం, మిగిలినది రాత్రి కూడా వడ్డించారు. దీనితోనే ఆదివారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని చెప్పారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రిన్సిపాల్ దాదాపీర్, వార్డెన్ విజయభాస్కర్ గోప్యంగా ఉంచారు. రాత్రి పరిస్థితి విషమించి విద్యార్థులకు వాంతులు, విరోచనాలు తీవ్రస్థాయిలో మొదలవడంతో సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే అస్వస్థతకు గురైన విద్యార్థులను ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర తదితర అధికారులు గురుకులం వద్దే ఉండి విద్యార్థులకు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ సోమవారం ఉదయం నాయుడుపేటకు చేరుకుని విద్యార్థులకు సత్వరం వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డీఎంఅండ్ హెచ్‌ఓ శ్రీహరి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పద్మజ, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వైద్య సేవలను పర్యవేక్షించారు.

ప్రిన్సిపాల్, వార్డెన్‌తో పాటు మరో ఇద్దరిపై చర్యలు
విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ దాదాపీర్‌తో పాటు వార్డెన్ విజయభాస్కర్‌రెడ్డి, శానిటేషన్ అధికారి, స్టాఫ్‌నర్సులపై చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయమై జేసీతో కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ చంద్రకళ బాధ్యతారాహిత్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో గురుకులంలోని విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం తదితరులు ప్రభుత్వ వైద్యశాలలను సందర్శించారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన

నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకుని తమ పిల్లలను చూసి ఆందోళన చెందారు. గురుకుల అధికారులు తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు కూడా నాయుడుపేట సీహెచ్‌సీ వైద్యులతో పాటు అర్బన్ వైద్యశాలల వైద్యులు, దొరవారిసత్రం ప్రభుత్వ వైద్యులు విద్యార్థులకు చికిత్సలు అందించారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున పడుకోబెట్టి వైద్య సేవలను అందించారు.

బాధ్యులపై కఠిన చర్యలు

విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. నాయుడుపేటలోని గురుకులంలో విద్యార్థుల అస్వస్థత ఘటనపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోమవారం గురుకులాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు సీఎంకు నివేదించారని తెలిపారు. మూడురోజులు గురుకులానికి సెలవులు ప్రకటించామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో మెరుగైన వసతుల కల్పనకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. అలాగే గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 41 మంది విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఆహారం కలుషితమైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కిరాతకం

- 36 రోజుల పసికందును కొట్టి చంపేసిన వైనం
- భార్య, మామ, అత్త, ఇద్దరు మరదళ్లపై పాశవికంగా దాడి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స


నిందితుడు బాలాజీ

లింగపాలెం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ 36 రోజుల పసికందును అత్యంత పాశవికంగా కొట్టి హతమార్చిన ఘటన ఏలూరు జిల్లా లింగపాలెం మండలం పాశ్యానగరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ దారుణ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాశ్యానగరం గ్రామానికి చెందిన యండ్రపాటి వెంకటేశ్వరావుకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె దివ్యకు పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చల్లపాటి బాలాజీతో ఏడాది క్రితం వివాహం జరిగింది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో.. ఏలూరు కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నది. ఈ క్రమంలో సోమవారం బాలాజీ భార్య దివ్య, తండ్రి వెంకటేశ్వరరావు కోర్టు వాయిదాకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా.. వంగూరు సమీపంలో బాలాజీ వారిని అడ్డగించాడు. భార్య దివ్యను, మామ వెంకటేశ్వరరావును చితకబాదాడు. తీవ్ర గాయాలపాలైన వీరిద్దరూ చికిత్స నిమిత్తం ఏలూరు ఆస్పత్రిలో చేరారు. మరోపక్క వారిని కొట్టిన బాలాజీ.. అనంతరం పాశ్యానగరం వెళ్లి.. ఇంటి వద్ద ఉన్న అత్త, ఇద్దరు మరదళ్లను తీవ్రంగా కొట్టి గాయపర్చాడు. ఆ తర్వాత ఉయ్యాలలో ఉన్న రెండో మరదలి కుమారుడు, 36 రోజుల పసికందును కొట్టి చంపేశాడు. అనంతరం పరారవుతూ కిందపడి గాయాలపాలయ్యాడు. అతను కూడా ఏలూరు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, చింతలపూడి సీఐ సుధాకర్, ధర్మాజీగూడెం ఎస్‌ఐ పి.చెన్నారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 16 : జూలై : 2024

పాత.. ఘనత

అలనాటి పాత బైక్‌లకు ఇప్పుడు ఎంతో క్రేజ్ ఉంది. బెంగళూరు యూబీ సిటీలో పాత జావా, యజ్డీ తదితర మోటార్ సైకిళ్ల ప్రదర్శన



న్యూస్‌రీల్

30 లేఔట్ల నివాసుల ర్యాలీ

- సౌకర్యాల కోసం మొర



మైసూరు: మైసూరు నగరంలో ఉన్న తమ తమ లేఔట్‌లలో సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం, పాలికే వెంటనే పరిష్కరించాలని సుమారు 30 లేఔట్ల నివాసులు సోమవారం నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. యరగనహళ్ళి లేఔట్ నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ధర్నా చేసి తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. లేఔట్ల సమాఖ్య అధ్యక్షుడు ఎఎం బాబు మట్లాడుతూ మైసూరు ఉత్తర విభాగం పరిధిలో ఉన్న సుమారు 30 లేఔట్లలో విద్యుత్, మంచినీరు, రోడ్లు వంటి కనీస వసతులు లేక కష్టపడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం, పాలికె తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సౌకర్యాలను కల్పించాలని కోరారు.

అక్రమ ఆస్తుల కేసులో డీకేశికి నిరాశ

శివాజీనగర: అక్రమ ఆస్తుల కేసులో తనకు వ్యతిరేకంగా సీబీఐ నమోదు చేసిన కేసును రద్దు చేయాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సుప్రీంకోర్టులో వేసిన అర్జీని కోర్టు తిరస్కరించింది. దీంతో డీకేకి ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది. ఈ కేసు విచారణను మూడు నెలలలోపు పూర్తి చేయాలని సీబీఐకి సుప్రీం ఆదేశించింది. సుప్రీం జడ్జిలు జస్టిస్ బేలా ఎం.త్రివేది, ఎస్.సీ.శర్మ ధర్మాసనం డీకే అర్జీని విచారిస్తూ, ఈ కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. డీకే శివకుమార్ 2013 - 18 మధ్య ఆదాయానికి మించి ఆస్తులను సమకూర్చుకున్నారని సీబీఐ కేసు దాఖలు చేసింది. 2020 సెప్టెంబర్ 3న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది.

కారులో రూ. 5 లక్షలు చోరీ



చోరీ జరిగిన కారు

చింతామణి: గుర్తుతెలియని దుండగులు బైక్‌లో వచ్చి కారులోని నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలోని యాజ్ఞవల్క్య ఆలయం దగ్గర జరిగింది. వివరాలు.. రాజీవ్ నగర ప్రాంతానికి చెందిన ఉల్లిగడ్డల వ్యాపారి కృష్ణారెడ్డి రూ. 5 లక్షల డబ్బులను డ్రా చేసుకుని కారులో వస్తున్నాడు. యాజ్ఞవల్క్య ఆలయంలో పూజలు చేయాలని కారును నిలిపి లోపలికి వెళ్లాడు. కారులో సీటు మీదే డబ్బుల బ్యాగును ఉంచాడు. ఇంతలో ఇద్దరు దుండగులు బైక్‌లో వచ్చి కారు అద్దాల పగలగొట్టి నగదు బ్యాగును ఎత్తుకెళ్లారు. కృష్ణారెడ్డి పూజలు చేసుకొని కారు దగ్గరకు రాగా చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. డీఎస్పీ మురళీధర్, సిబ్బంది వచ్చి పరిశీలించారు. సమీప సీసీ కెమరాలలో బైక్ దొంగలు రికార్డయ్యారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

కేంద్రమంత్రికి నాన్‌వెజ్ పార్టీనే ముఖ్యమా?

దొడ్డబళ్లాపురం: కావేరి జలాల అఖిల పక్ష సమావేశానికి హాజరుకాని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఒక నాన్‌వెజ్ పార్టీకి హాజరు కావడం సిగ్గుచేటని మంత్రి చెలువరాయస్వామి అన్నారు. సోమవారం విధానసౌధలో మాట్లాడిన ఆయన మాజీ సీఎం, కేంద్ర మంత్రి అయి ఉండి కుమారస్వామి కావేరి జలాల సమావేశానికి రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఒక్క బీజేపీ ఎంపీ కూడా రాలేదన్నారు. కేంద్ర మంత్రులైన ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజె, సోమన్న ఎందుకు రాలేకపోయారని ప్రశ్నించారు. రైతుల పేరు చెప్పుకుని రాజకీయాలు చేస్తున్న కుమారస్వామి అయినా రావాల్సిందన్నారు. చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ ముడా సైట్ల అక్రమాలపై హెచ్‌డీ కుమారస్వామి కుటుంబంపై యడియూరప్ప అప్పట్లోనే ఆరోపణలు చేసారన్నారు. ఇప్పుడు రెండు పార్టీలు పొత్తులు పెట్టుకున్నాయని హేళన చేశారు.

నీళ్లు వదిలి, భేటీలా: కుమార

దొడ్డబళ్లాపురం: కేఆర్‌ఎస్ డ్యాం నుండి రైతుల పేరుమీద తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేసినందుకు అభినందించడానికి సీఎం నిర్వహించిన సమావేశానికి వెళ్లాలా అని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రశ్నించారు. అఖిల పక్ష భేటీకి కుమారస్వామి రాలేదని పలువురు మంత్రులు నిందించడంపై ఆయన మండిపడ్డారు. కేఆర్‌ఎస్, కబిని నుంచి కావేరి నీటిని తమిళనాడుకు వదిలారు. ఇక సభకు గోడంబి, బాదామి తినడానికి వెళ్లాలా అని హేళన చేశారు. తన కార్యక్రమాలకు వెళ్లొద్దని అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తోందన్నారు.

తొలి రోజే సెగలు

- అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మరూ
- వాల్మీకి మండలి బాగోతంపై బీజేపీ ధర్నా
- పరిషత్‌లో చర్చ కోసం పట్టు



బయట కూల్ కూల్.. లోపల వేడి, సోమవారం విధానసౌధ బయట జల్లుల్లో జన సంచారం

శివాజీనగర/ బనశంకరి: విధానసభ వర్షాకాల సమావేశాల తొలి రోజునే ప్రతిపక్ష బీజేపీ ధర్నాకు దిగింది. సోమవారం ఉదయం సమావేశాలు ఆరంభమయ్యాయి. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో వందలాది కోట్ల రూపాయల కుంభకోణాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామాకు డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభ్యులు.. ఎమ్మెల్యేల భవన్‌లో ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా ముగించి విధానసౌధ ముట్టడికి వస్తుండగా, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అదే సమయంలో కారులో విధానసౌధ పశ్చిమ గేట్ వద్ద వస్తుండగా చూసి ఎమ్మెల్యేలు గట్టిగా నినాదాలు చేశారు. అసెంబ్లీ బయట, లోపలా పోరాటం సాగిస్తామని చెప్పారు. తరువాత విధానసభ సమావేశాలకు వెళ్లారు. వాల్మీకి విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ తదితరులు మాట్లాడుతూ వెంటనే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిధుల అక్రమాలకు సంబంధించి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి దిగిపోయే దాకా ఈ పోరాటం ఆగదని తెలిపారు.

పరిషత్‌లో రచ్చ

వాల్మీకి మండలిలో చోటుచేసుకున్న కోట్లాది కుంభకోణం గురించి చర్చకు అవకాశమివ్వాలని ఎగువసభ విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. సభ ప్రారంభమై దివంగత ప్రముఖులకు సంతాపం ప్రకటించిన తరువాత చర్చ ఆరంభమైంది. బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి మాట్లాడుతూ 59వ నిబంధన కింద వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంపై చర్చ జరపాలని సభాపతి బసవరాజ హొరట్టిని కోరారు. ఇది భారీ అవినీతి స్కాం కావున ఒకరోజు చర్చ జరగాలని అన్నారు. సభాపతి స్పందిస్తూ సభను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, మీరు నోటీస్ ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, ముందుగా ప్రశ్నోత్తరాలు చేపట్టిన తరువాత నిర్ణయం తీసకుంటానని తెలిపారు. మరో ఎమ్మెల్సీ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి మండలి నుంచి బళ్లారి లోక్‌సభ ఎన్నికలకు ఎంత డబ్బు వెళ్లింది, తెలంగాణకు ఎంత సొమ్ము వెళ్లిందనేదానిపై చర్చ జరపాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ సభ్యుడు యుబీ.వెంకటేశ్ మాట్లాడుతూ వేలాది కోట్ల అవినీతి గురించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ప్రశ్నోత్తరాల తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాక గొడవ ఎందుకని ప్రశ్నించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య గలాటా మొదలైంది, వీటి మధ్యనే సభాపతి ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు.



సోమవారం విధానసభలో సమావేశ దృశ్యం



బీజేపీ ఎమ్మెల్యేల నిరసన ర్యాలీ



వాల్మీకి మండలి స్కాంలో చర్చించాలంటూ విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యుల ఆందోళన

స్వర్గీయ ప్రముఖులకు సంతాపం

ఇటీవల కన్నుమూసిన మాజీ శాసనసభ్యులు, ప్రముఖులకు అసెంబ్లీలో ఉభయసభల్లో ఘన నివాళి అర్పించారు. సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే విధానసభలో స్పీకర్ యుటీ.ఖాదర్ సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. మాజీ మంత్రి నాగమ్మ కేశవమూర్తి, కేంద్ర, రాష్ట్ర మాజీమంత్రి వీ.శ్రీనివాస ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సీపీ మూడల గిరియప్ప, మాజీమంత్రి ఎంపీ.కేశవమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు కే.వసంతబంగేరా, డా.పాటిల్ బసనగౌడ గురనగౌడ, నాగరెడ్డి పాటిల్, రమేశ్‌కుమార్ పాండే, టీహెచ్.శివశంకరప్ప, వాసు, కన్నడ సినీ ప్రముఖుడు ద్వారకేశ్, సాహితీవేత్తలు ప్రొఫెసర్ కమలా హంపనా, నటి, యాంకర్ అపర్ణ, ధర్మగురు ఖాజీ ఫజల్ తదితరులకు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రులు వారి సేవలను కొనియాడుతూ మాట్లాడారు. రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

కొరగజ్జ సేవలో కత్రినా కైఫ్



కొరగజ్జ ఆలయంలో కత్రినా కైఫ్

దొడ్డబళ్లాపురం: మంగళూరు నగరం ఉళ్లాలలోని ప్రసిద్ధ కొరగజ్జ ఆలయానికి ప్రముఖుల తాకిడి పెరిగింది. తాజాగా ప్రముఖ బాలీవుడ్ అందాల నటి కత్రినా కైఫ్ సోమవారం ఆలయాన్ని దర్శించారు. కోల పూజలో పాల్గొన్నారు. కత్రినా భర్త విక్కీ కౌశల్, నటుడు సునీల్ శెట్టి కుమారుడు అహాన్‌శెట్టి, కుమార్తె ఆద్యా శెట్టి, క్రికెటర్ రాహుల్, రేష్మాశెట్టి, వీఎమ్ కామత్ మొత్తం 9 మంది ప్రముఖులు తరలివచ్చారు. మొక్కు తీర్చుకోవడానికి పేర్లు రాయించారు.

దర్శన్ కేసులో సీసీ ఫుటేజీలు సీజ్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు ముమ్మరంగా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. హత్య కేసులో కీలకంగా మారే 33 పైగా సీసీ కెమెరా చిత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ముందు మందు పార్టీ జరిగిన బెంగళూరు ఆర్‌ఆర్ నగరలోని స్టోని బ్రూక్ రెస్టారెంట్‌లో, రెస్టారెంట్ నుంచి పట్టణగెరె షెడ్ వరకూ మార్గం మధ్యలో ఉన్న సీసీ ఫుటేజీలు, శవాన్ని పారవేసిన సోమనహళ్లి రాజకాలువ పరిసరాల్లోని సీసీ చిత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోడ్ల పక్కన షాపులకు అమర్చిన కెమెరాలలో వారి వాహనాల సంచారం నమోదైంది. హీరో దర్శన్, నట పవిత్రగౌడ ఇళ్ల సీసీ కెమెరాల వీడియోలను సీజ్ చేశారు.


దర్శన్‌ను కలిసిన భార్య

గత నెల రోజులుగా పరప్పన అగ్రహార జైలులో ఉన్న దర్శన్‌ను భార్య విజయలక్ష్మి, సోదరుడు తూగుదీప దినకర్ కలిశారు. దర్శన్‌తో భార్యకు ముందు నుంచి తీవ్రమైన గొడవలు ఉన్నప్పటికీ అవన్నీ మరచిపోయి ఆమె తరచూ జైలుకు వస్తూ పరామర్శించడంతో పాటు ఇతరత్రా అండగా ఉంటున్నారు. బెయిలు, కోర్టు అంశాలపై ఆమె దర్శన్‌తో చర్చించినట్టు సమాచారం. తమ్ముడు దినకర్ కూడా విభేదాలు మరచి అన్నకు సహకారం అందిస్తున్నాడు. దర్శన్ ఆరోగ్యంపై విజయలక్ష్మి ఆందోళనగా ఉన్నట్లు సన్నిహితులు తెలిపారు.

చినుకుల సందడి



సోమవారం శివమొగ్గలో జోరు వాన



ఐటీ నగరిలో దట్టంగా మేఘాలు

- పలు జిల్లాల్లో కొనసాగుతున్న వర్షాలు

బనశంకరి/ శివమొగ్గ: రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు మరింత ఉధృతం కాగా కరావళి, మలెనాడులోని ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ జిల్లాలకు సోమవారం నుంచి మూడురోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మలెనాడు జిల్లాలైన చిక్కమగళూరు, శివమొగ్గ జిల్లాలకు సోమ, మంగళవారం రెడ్ అలర్ట్ జారీ అయ్యింది. ఉత్తర కర్ణాటక జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కోస్తా జిల్లాల్లో గాలి వేగం 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది. బెంగళూరు నగరం చుట్టుపక్కల రెండురోజుల పాటు సాధారణ మబ్బులతో కూడిన వాతావరణం ఉండి, జల్లు వర్షం కురిసే అవకాశం ఉంది.

నదులు, డ్యాంలకు ప్రవాహ

మలెనాడులో కురుస్తున్న భారీ వర్షాలు, అలాగే పశ్చిమ కనుమలలో కుండపోత వల్ల నదులలోకి పెద్ద మొత్తంలో నీరు చేరుతోంది. దాంతో శివమొగ్గ జిల్లాలో ఉన్న జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. సోమవారం అధికారులు తెలిపిన ప్రకారం .. ప్రముఖ జలవిద్యుత్ కేంద్రమైన లింగనమక్కి జలాశయంలోకి 45,115 క్యూసెక్కుల వరద నీరు చేరింది. డ్యాంలో 1778.15 అడుగుల నీరు ఉండగా గరిష్ట నీటిమట్టం 1819 అడుగులు. మధ్య కర్ణాటక ప్రముఖ జలాశయం అయిన భద్రా జలాశయంలోకి 16,047 క్యూసెక్కుల వరద నీరు చేరగా, 162 క్యూసెక్కులను వదిలిపెట్టారు. డ్యాంలో 141.3 అడుగుల నీటిమట్టం ఉండగా, డ్యాం గరిష్ట సామర్థ్యం 186 అడుగులు. అలాగే చిన్నస్థాయి రిజర్వాయర్లలోనూ భారీగా నీరు చేరుతోంది.

నకిలీ పోస్టును సృష్టించి లూటీ

- వాల్మీకి మండలిలో స్కాం ఇలా
- అధికారులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు
- ఈడీ విచారణలో రట్టు



బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటుచేసుకున్న కోట్లాది రూపాయల కుంభకోణంలో రోజుకో కొత్త సంగతి బయటపడుతోంది. కేంద్ర ఈడీ అధికారుల దర్యాప్తులో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. నిధులు లూటీ చేయడానికి నకిలీ పోస్టు సృష్టించినట్లు తేలింది. ఈడీ అధికారులు మాజీ ఎమ్మెల్యే బీ నాగేంద్రను అరెస్ట్ చేసి సోమవారం తమ కస్టడీలో రెండవరోజు విచారించారు. మండలి ఎండీ పద్మనాభ్ ఒక జూనియర్ అకౌంటెంట్ ఉద్యోగాన్ని సృష్టించి అందులో శివకుమార్ అనే సొంత వ్యక్తిని నియమించాడు. ఆర్థిక వ్యవహారాలు చూసుకునే అధికారం అప్పజెప్పారు. ఆ వ్యక్తి ద్వారా రూ.45 కోట్లను బదిలీ చేసినట్లు బహిర్గతమైంది. ఎంజీ రోడ్డులోని యూనియన్ బ్యాంకులో ఫిబ్రవరి 21 తేదీన అకౌంట్‌ను తెరిచి వాల్మీకి మండలి నుంచి మార్చి 5 , 6 తేదీల్లో రూ.187 కోట్ల నగదును బదిలీ చేశారు. శివకుమార్ ద్వారానే హైదరాబాద్‌లో ఆర్‌బీఎల్ బ్యాంకుకు నగదు బదిలీ కాబడింది. ఇతడు, పద్మనాభ్‌తో పాటు యూనియన్ బ్యాంక్ అధికారులు కుమ్మక్కై కోట్ల రూపాయలను స్వాహా చేసినట్లు ఈడీ విచారణలో తేలింది.

నాగేంద్ర ఆస్తుల తనిఖీ

నాగేంద్ర 2023 శాసనసభ ఎన్నికల సమయంలో బళ్లారి రూరల్ నియోజకవర్గంలో దాఖలు చేసిన నామినేషన్, ఆస్తుల అఫిడవిట్‌ను ఈడీ అధికారులు పరిశీలించారు. ఎన్నికల సమయంలో నాగేంద్ర ఆస్తి రూ.17 కోట్ల 20 లక్షల అని తెలిపారు. వాహనం, బంగారు ఆభరణాలతో పాటు రూ. 4.88 కోట్ల చరాస్తులు, రూ.12.3 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయనకున్న ఆస్తులను అఫిడవిట్‌తో సరిపోల్చగా వ్యత్యాసం కనబడటంతో నాగేంద్ర మరింత చిక్కుల్లో పడ్డారు.

విధానసౌధలో దద్దల్

వాల్మీకి మండలి అధ్యక్షుడు ఎమ్మెల్యే బసవనగౌడ దద్దల్ సోమవారం శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. విలేకరులతో మాట్లాడుతూ సిట్ నుంచి ఎలాంటి నోటీస్ రాలేదని అన్నారు.

నష్టాల్లో ఉన్నా, బస్సు చార్జీలను పెంచం

- రవాణా మంత్రి రామలింగారెడ్డి



శివాజీనగర: బస్సు టికెట్ ధర పెంపు ప్రస్తుతానికి లేదని రవాణా మంత్రి ఆర్.రామలింగారెడ్డి చెప్పారు. ఆదివారం వాయువ్య ఆర్టీసీ అధ్యక్షుడు రాజుకాగె మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణాలు, నష్టాల భారం వల్ల ఆర్టీసీ చార్జీలను పెంచక తప్పదని ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి సోమవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడుతూ అది ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. చార్జీల పెంపు ప్రస్తావన తమ ముందు లేదని తెలిపారు. డీజిల్, విడిభాగాల ధరలు పెరిగాయి, గత 10 సంవత్సరాల నుంచి టికెట్ ధరలను పెంచలేదు. నారీ శక్తి పథకం ద్వారా నష్టాల్లో ఉన్నాం. అయినా కూడా సంస్థను ముందుకు తీసుకొని వెళుతున్నామని మంత్రి తెలిపారు.

పెంచకపోతే ఆర్టీసీ ఉండదు

కేఎస్ ఆర్టీసీ మండలి అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం మాట్లాడుతూ గత త్రైమాసికంలో సంస్థకు రూ.295 కోట్లు నష్టం వచ్చిందని, టికెట్ ధర పెంచకపోతే సంస్థ మిగలదని, కాబట్టి త్వరలోనే చార్జీలను పెంచుతామని ప్రకటించారు. 15 నుండి 20 శాతం మేర చార్జీలను పెంచాలని ముఖ్యమంత్రికి నివేదికను సమర్పించామని తెలిపారు. ఇలా చార్జీలపై తలోరకంగా మాట్లాడడంతో ఒకరకంగా గందరగోళం ఏర్పడినట్లు ఉంది.

డ్యాంలోకి దూకిన యువ జంట



యువతి కోసం గాలిస్తున్న బృందం

హుబ్లీ: కలబుర్గి జిల్లాలోని కురికోట వంతెనపై నుంచి సోమవారం బెణ్ణెతొర జలాశయం బ్యాక్ వాటర్‌లోకి ఓ ప్రేమజంట దూకింది. యువకుని మృతదేహం లభించగా, యువతి మృతదేహం కోసం గాలిస్తున్నారు. కమలాపుర తాలూకా ముద్దటగ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ సిద్ధారూడ ముళగే(27) మృత యువకుడు కాగా యువతి పేరు సంధ్యారాణిగా తెలిసింది. స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్లు యువకుడి మృతదేహాన్ని వెలికితీయగా, యువతి కోసం గాలిస్తున్నారు.

నెత్తురోడిన రహదారులు

- డివైడర్‌కు కారు ఢీ, దంపతుల మృతి
- మరో దుర్ఘటనలో ఒకరు..
- చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకాలో ప్రమాదాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు



డివైడర్‌ను ఢీకొని నుజ్జయిన కారు ముందు భాగం



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి బళ్లారి: చిత్రదుర్గ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం చిత్రదుర్గ జిల్లాలోని చెళ్లకెరె తాలూకా తళకు సమీపంలోని హొసళ్లి వద్ద జాతీయ రహదారి-150ఏపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన గోపినాథ్(55), ఆయన భార్య లలితమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో బెంగళూరు నుంచి బళ్లారికి వస్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే దంపతులు మృతి చెందారు. వారి కుమారుడు శ్రీనివాస్, కుమార్తె శ్రేయ, డ్రైవర్ సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చెళ్లకెరె డీఎస్పీ రాజన్న, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను, గాయపడిన వారిని చెళ్లకెరె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

మరో ఘటనలో చెళ్లకెరె తాలూకా బుడ్నహట్టి సమీపంలో టాటా ఏస్ వాహనం బోల్తా పడి యాదగిరికి చెందిన సిద్ధరామయ్య అనే వ్యక్తి మృతి చెందారు. చెళ్లకెరె తాలూకాలో ఒకే రోజు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనలపై చెళ్లకెరె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బస్సు సౌకర్యానికి వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న ఆందోళనకారులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని, రవాణా సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో సోమవారం ఆర్టీసీ డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా సంచాలకుడు రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సులు సరైన సమయానికి రావడం లేదన్నారు. 800 మంది విద్యార్థులు నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్నారన్నారు. కటకనూరు నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతూ ఆర్టీసీ డీసీకి వినతిపత్రం సమర్పించారు.

పూల బొకే, శాలువా తేవద్దు

హుబ్లీ: తనను కలవడానికి వచ్చే వారు పూల బొకే, శాలువాలకు బదులుగా అచ్చుపుస్తకాలు, నోట్ బుక్కులను తేవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పూల బొకేలు, శాలువాలకు బదులుగా నోట్ పుస్తకాలను తీసుకురావాలని కోరారు. పూల దండలు, బొకేలు నిరుపయోగమని, అచ్చు పుస్తకాలు, నోట్ బుక్స్ తెస్తే వాటిని అవసరమైన విద్యార్థులకు అందజేస్తామని, తద్వారా విద్యార్థి జీవితానికి, విద్యాభ్యాసానికి ఉపయోగం ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్ సర్జరీపై శిబిరం


మాట్లాడుతున్న రాఘవేంద్ర

రాయచూరు రూరల్: నగరంలో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ ఆరోగ్య శిబిరాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణుడు రాఘవేంద్ర పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని గాంధీ చౌక్ వద్ద కాలిన గాయాలకు, ప్రమాదంలో జరిగిన గాయాలకు, కాస్మోటిక్ చికిత్స, చర్మ రోగాల నియంత్రణ, స్తన క్యాన్సర్, బోదకాలు, రక్తనాళాల బలహీనత వంటి వాటికి చికిత్స చేస్తారన్నారు. పదేళ్లలో 10 వేలకు పైగా ఆపరేషన్లు చేశామన్నారు. విలేఖర్ల సమావేశంలో గోవిందరాజులు, ముదుగల్ ఈరణ్ణ ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం

హుబ్లీ: పాత హుబ్లీ ఇండి పంపు వద్ద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌డీ ఎంసీ, దాతల సహకారంతో ప్రారంభమైన ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో ప్రతిభావంత విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ హెచ్ఎం కుందరిగి మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన నూతన గదులు, బెంచీలు, రక్షిత మంచినీటి యూనిట్, కంప్యూటర్‌తోపాటు ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే సమకూర్చారన్నారు. ఆయన సహకారంతో పాఠశాల సమగ్రాభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రేమలత గొణసగి, హారతీ కోటి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కార్యాలయం ముట్టడి


ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

రాయచూరు రూరల్: జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారించాలని, తాగునీరు సక్రమంగా అందించాలని కోరుతూ మహిళలు జీపీ కార్యాలయం ముట్టడించారు. సోమవారం దేవదుర్గ తాలూకా భూమనగుండ జీపీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అఖిల భారత రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సంచాలకుడు హులిగప్ప మాట్లాడారు. నీటి ఎద్దడి నివారణకు రూ.38 లక్షలతో నీటి ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టినా నీరందించకుండా నిర్లక్ష్యం చేసిన పీడీఓ కట్టెప్పపై చర్యలు చేపట్టి వెంటనే తాగునీటిని అందించాలని కోరుతూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

కలల సాకారానికి కృషి అవసరం

హుబ్లీ: విద్యార్థులు కలలు సాకారం చేసుకోవాలంటే నిరంతరం కఠినంగా శ్రమించడం అత్యవసరమని హుబ్లీ స్వర్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ డాక్టర్ సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. నగర కేఈబీ బోర్డు ఫస్ట్ గ్రేడ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్, వార్షిక స్నేహ సమ్మిలన, విద్యార్థి సమాఖ్య, సాంస్కృతిక ఎన్ఎస్ఎస్, క్రీడా కార్యకలాపాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల పాలక మండలి కార్యనిర్వహణాధ్యక్షురాలు డాక్టర్ సునీత పురోహిత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో వచ్చే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని కఠినమైన సాధన ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎంపీ సిద్ధాంతి, ప్రొఫెసర్ డీఆర్ వడికేరి, ప్రొఫెసర్ విద్యా జమఖండి, లక్ష్మి, ఆనంద్ ఎలిగార పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ఆదేశం.. కాగితాలకే పరిమితం

- అమలులో పాలక మండళ్లు, అధికారుల నిర్లక్ష్యం
- అక్కడక్కడా కొన్ని పాఠశాలల్లో మాత్రమే జారీ

హుబ్లీ: ఉపాధ్యాయుల హాజరు అధికార పూర్వకంగా తేటతెల్లం చేసేలా రాష్ట్ర విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరును ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. అయితే పాఠశాలల పాలక మండళ్లు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ వ్యవస్థ ఆదేశాలకే పరిమితమైంది. విద్యార్థులకు పాఠాలను బోధించాల్సిన ఉపాధ్యాయ బృందంలోని కొందరు ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయ సంఘాల కార్యకలాపాలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఇలాంటి బాధ్యతారాహిత్య ఉపాధ్యాయులకు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను అమలు చేసింది. 2022 సెప్టెంబర్ 3న అప్పటి ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలను కూడా వెల్లడించింది. అయితే దీన్ని వేళ్లపై లెక్కపెట్టగలిగినన్ని పాఠశాలలు మాత్రమే పాటిస్తున్నాయి. మిగిలిన పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.


ఓ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

హాజరు ప్రకారమే వేతనాలకు ప్రణాళిక

పాఠశాలలో బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెల ఇందులోనే హాజరు ప్రమాణాలను లెక్కవేసి వేతనాల చెల్లింపునకు అనుమతి ఇవ్వాలని స్పష్ట నియమావళిని ప్రభుత్వం రూపొందించింది. అయినా జిల్లాలోని 1538 ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు గాను 312 పాఠశాలల్లో మాత్రమే ఈ పద్ధతి అమలైంది. ఇంకా 1226 పాఠశాలల్లో పాత పద్ధతినే కొనసాగిస్తున్నారు. బయోమెట్రిక్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దిష్టంగా నిధులు ఇవ్వడం లేదు. స్థానికంగా లభ్యమున్న నిధులతోనే ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయితే కొన్ని పాఠశాలల్లో నిధుల కొరత సాకుతో బయోమెట్రిక్‌కు తిలోదకాలు ఇచ్చారు. మరి కొన్ని చోట్ల నిధులున్న వాటిని వినియోగించుకొని ఈ వ్యవస్థ జారీకి నిరాసక్తి


బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

చూపించడం కనిపిస్తోంది.

అరకొరగా ఆదేశాల అమలు

ధార్వాడ గ్రామీణ భాగంలో మొత్తం 238 పాఠశాలలకు గాను 15, ధార్వాడ టౌన్ 200 పాఠశాలకు గాను 32, హుబ్లీ గ్రామీణ 238 పాఠశాలలకు గాను 18, కలఘటిగి తాలూకాల్లో 172 పాఠశాలలను గాను 4, కుందగోళ తాలూకాలో 152 పాఠశాలలకు గాను 28, నవలగుంద తాలూకాలో 194 పాఠశాలలకు గాను కేవలం 18 పాఠశాలల్లో మాత్రమే బయోమెట్రిక్ సమకూర్చుకోవడం శోచనీయం. జిల్లాకు సంబంధించి హుబ్లీ టౌన్ పరిధిలో మాత్రమే 50 శాతానికి పైగా పాఠశాలల్లో ఈ వ్యవస్థ అమలులో ఉంది. ఇక్కడి 344 పాఠశాలలకు గాను 197 పాఠశాలల్లో బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలలే ఎక్కువగా ఉండటం విశేషం. మిగిలిన తాలూకాల్లో పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలుకు కట్టుదిట్టమైన సూచనలు ఇచ్చామని ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరోసారి ఆదేశాలను వెల్లడించామని, నూరు శాతం ఫలితమే లక్ష్యంగా తగిన చర్యలు తీసుకుంటామని ధార్వాడ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ఎస్.కేళదిమఠ వివరణ ఇచ్చారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతాం

- జిల్లా ఎస్పీ శోభారాణి వెల్లడి

బళ్లారి టౌన్: నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, వాహనాల పార్కింగ్, వాహనాలను నడపడంపై అవగాహన కార్యక్రమాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టిని సారించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని నూతన ఎస్పీ డాక్టర్ శోభారాణి తెలిపారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు కేసుల్లో అరెస్టు చేసిన నిందితుల వివరాలను తెలిపిన అనంతరం మాట్లాడారు. ఇటీవల తాను నగరంతో పాటు జిల్లాలో పర్యటించానన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య పెను సవాలుగా మారిందన్నారు. తాను బెంగళూరు లాంటి మెట్రో నగరంలో పని చేశానన్నారు. అయితే అక్కడ వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు ఉన్నాయన్నారు.

పార్కింగ్ ప్లేస్‌లు గుర్తిస్తాం

బళ్లారిలో పార్కింగ్ ప్లేస్‌లు లేవన్నారు. తాము స్థలాలను గుర్తించి పార్కింగ్ వ్యవస్థ కల్పిస్తే కొంత వరకు ఉపశమనం లభిస్తుందన్నారు. అంతేగాక ఫుట్‌పాత్‌లను ఆయా దుకాణదారులు ఆక్రమించుకొన్నందున పాదచారులకు ఆటంకం కలుగుతోందన్నారు. దీనిపై కూడా ముందు తాను చర్యలు తీసుకుంటానన్నారు. అయితే ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. నగరంలో డ్రైవింగ్‌పై అవగాహన లేక హెల్మెట్లు ధరించకుండా వాహనాలను నడుపుతున్నారని, దీనిపై కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ శోభారాణి

సండూరు తాలూకా కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలో జిందాల్ సా కంపెనీలో రామశంకర్ విశ్వకర్మ అనే కార్పెంటర్‌ను హత్య చేసిన ఇద్దరు నిందితులు సురేంద్ర, కిశోర్‌లాల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించమన్నందుకే..

ఈ హత్యకు కారణం అప్పు ఇచ్చిన వ్యక్తి ఆ సొమ్మును తిరిగివ్వాలని అడిగినందుకే హతమార్చినట్లు తెలిపారు. అదే విధంగా గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది మార్చి 8న కప్పగల్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద గల సాయి ఆర్యన్ అపార్ట్‌మెంట్‌లో ధనుంజయరెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దోపిడీ చేసిన నిందితుడు కార్తీక్‌ను అరెస్టు చేసి రూ.8,26,500లు విలువగల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అదే విధంగా గత ఏడాది అక్టోబర్ 24న, నవంబర్ 15న, బళ్లారి, కంప్లిలో దొంగతనం చేసిన నిందితులు వడ్డే పీటిల్, గంగాధరను అరెస్టు చేసి రూ.4,30,000 విలువగల బంగారు ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఆమె తెలిపారు.

కర్ణాటక వర్సిటీ వెబ్‌సైట్ హ్యాక్

హుబ్లీ: కర్ణాటక విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన దుండగులు అందులో అశ్లీల వీడియోలను అప్‌లోడ్ చేశారు. విశ్వవిద్యాలయం సమగ్ర సమాచారంతో పాటు విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని సమకూర్చడానికి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. అయితే దీన్ని హ్యాక్ చేసి ఎవరో దుండగులు అశ్లీల వీడియోలను ప్రసరింప జేశారు. హ్యాక్ అయినట్లు తెలిసిన వెంటనే వర్సిటీ వెబ్‌సైట్‌ను అప్‌డేట్‌కు పెట్టింది. దీంతో హ్యాక్ చేసి ఏ వివరాలను మార్చారన్న దానిపై స్పష్టమైన సమాచారం అందలేదు. ఈ విషయమై ఆ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కేవీ.గుడసి స్పందిస్తూ వెబ్‌సైట్ హ్యాక్ అయింది. దీన్ని ఎవరు చేశారో స్పష్టంగా తెలియరాలేదు. వారి ఉద్దేశం కూడా తెలియలేదన్నారు. ఈ విషయంలో పరిశీలించడానికి వీవీ ఐటీ విభాగానికి సూచించామన్నారు. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎంపీకి ఘన సన్మానం


సన్మానం అందుకున్న కుమార నాయక్

రాయచూరు రూరల్: ఎంపీ కుమార నాయక్‌ను రైల్వే శాఖ అధికారులు, బోర్డు మాజీ సభ్యులు సన్మానించారు. సోమవారం రైల్వే స్టేషన్‌లో అధికారులు అశోక్ కుమార్ మీనా, హేమరాజ్, సునీల్ కుమార్, మండలి మాజీ సభ్యులు బాబూరావ్, బసవరాజ్‌లు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గతంలో ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ చేపట్టిన పెండింగ్‌లో ఉన్న రైల్వే అభివృద్ధి పథకాలను పూర్తి చేస్తామన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా


ఆందోళన చేస్తున్న అతిథి ఉపాధ్యాయులు

రాయచూరు రూరల్: జిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు చెల్లించాలని అతిథి ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. సోమవారం ఆ శాఖ జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లా సంచాలకురాలు సరస్వతి అతిథి ఉపాధ్యాయులతో మాట్లాడారు. 2017–18 నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

డెంగీతో బాలిక మృతి

హుబ్లీ: అనుమానాస్పద డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఉడిపికి చెందిన ప్రథమ పీయూసీ విద్యార్థిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఇటీవల మృతి చెందిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఇక్కడి ప్రైవేటు కళాశాలలో చదువుతున్న 17 ఏళ్ల బాలిక తీవ్ర జ్వరంతో బాధపడటంతో చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక ఈనెల 11న మృతి చెందింది. సదరు ప్రైవేటు వైద్యుల ద్వారా సమాచారాన్ని సేకరించిన డీహెచ్ఓ డాక్టర్ శశిపాటిల్ విద్యార్థినికి ఎన్ఎస్-1 కార్డు విధాన పరీక్షల్లో డెంగీ పాజిటివ్‌గా వచ్చింది కానీ ధృవీకరణ కాలేదని తెలిపారు. ప్రభుత్వ నియమాల ప్రకారం ఏలిశా, ఐజీఎం పరీక్షల్లో డెంగీ ధృవీకరణ అయితేనే దాన్ని పరిగణిస్తారన్నారు. ఇప్పటికే నిపుణుల బృందం నమూనా పరీక్షలను చేపట్టిందని తెలిపారు.

సమాజ సేవే కలాం సంస్థ ధ్యేయం


యాపలదిన్నిలో ఏర్పాటు చేసిన కలాం కల్పవృక్షవనం

- గడినాడు సరిహద్దుల్లో సేవకు ప్రతి రూపం
- ఏటా విజ్ఞాన రంగ సేవకులకు అవార్డులు

రాయచూరు రూరల్: నక్సలైట్ ప్రభావిత కర్ణాటక–తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని పల్లెటూరులో పుట్టిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో యువకుల బృందం ఓ సేవా సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ఉదార మనోగుణంతో ఏడాదికి ఒకసారి 25 మంది విజ్ఞాన రంగంలో సేవలందించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సమాజ సేవకులను గుర్తించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో రాష్ట్ర స్థాయి అవార్డులను అందించేందుకు శ్రీకారం చుట్టారు. రాయచూరు తాలూకా యాపలదిన్నిలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంస్థ అధ్యక్షుడిగా విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహులు విధులు నిర్వర్తిస్తున్నారు. గత 13 ఏళ్ల నుంచి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, వ్యక్తిత్వ వికాసం, రక్తదాన శిబిరాలు, అభ్యాస సామగ్రి, నీరు, పరిసరాల సంరక్షణ, కలాం కల్పవృక్ష వనం నిర్మాణాలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి అనంత్ కుమార్ హెగ్డే భార్య తేజస్విని కలాం సంస్థ చేసిన సేవలను కొనియాడారు. గ్రామంలో కలాం విగ్రహం ఏర్పాటుకు తేజస్విని ఏడాది క్రితం భూమిపూజ చేశారు. ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో ఇప్పటికే నాలుగు పుస్తకాలను ముద్రించారు.


విగ్రహ నిర్మాణానికి తేజస్విని అనంత్ కుమార్ భూమిపూజ చేస్తున్న దృశ్యం


శ్రమదానం చేస్తున్న సభ్యులు

రీసెర్చ్ మెథడాలజీపై వర్క్‌షాప్

హొసపేటె: కొట్టూరు మహావిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ కామర్స్ విభాగం ద్వారా సోమవారం రీసెర్చ్ మెథడాలజీపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యక్షత వహించారు. వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగిస్తూ యూనివర్సిటీ ఎంకాం, బీకాం విద్యార్థులకు పాఠ్యాంశాల్లో పరిశోధన పద్ధతిని చేర్చడం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎం ఫిల్ అనంతరం హెచ్‌డీఓ-2 చేయడం ద్వారా డేటాను సేకరించడం, వివిధ కంపెనీలు లేదా సంస్థల్లో సమాచారాన్ని సూచించడం చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆసక్తి, కృషి ఉంటే విద్యార్థులు పరిశోధనలో విజయం సాధించి మంచి శాస్త్రవేత్తగా ఎదుగుతారన్నారు. వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్ డాక్టర్ ముబారక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్యార్థులకు పరిశోధన పద్ధతుల గురించి బోధించారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌పై కేసు నమోదు

హుబ్లీ: ఓటర్లకు రూ.1.50 లక్షల విలువ చేసే టీషర్టులను పంపిణీ చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఆరోపణలపై హావేరి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిపై హావేరి టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకొన్నారు. ఎన్నికల అధికారి వసీం అక్రమ్ మహమ్మద్ ఫారూక్ మిర్చి ఈ కేసును దాఖలు చేశారు. రుద్రప్ప లమాణి 2023 ఏప్రిల్ 17న అసెంబ్లీ ఎన్నికల వేళ హావేరిలోని మైలార మహదేవప్ప సర్కిల్ నుంచి హుక్కేరి మఠం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా రూ.1.50 లక్షల విలువ చేసే 1050 టీషర్టులను కార్యకర్తలకు, ఓటర్లకు పంపిణీ చేయడం ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని, ఇది ఓటర్లను ప్రలోభపెట్టినట్లేనని ఫిర్యాదు చేశారు. ఈ కేసు దాఖలు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


రుద్రప్ప లమాణి (ఫైల్)

ఎయిమ్స్ మంజూరుపై కేంద్రం నిర్లక్ష్యం

రాయచూరు రూరల్: రాయచూరులో అఖిల భారత వైద్య విజ్ఞాన, పరిశోధన సంస్థ(ఎయిమ్స్) ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణప్రకాశ్ పాటిల్ ధ్వజమెత్తారు. ఆయన సోమవారం విధాన సౌధలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాయచూరుకు ఎయిమ్స్‌ను మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు ముక్తకంఠంతో కేంద్రానికి విన్నవించుకొన్నా పెడచెవిన పెట్టడాన్ని తప్పుబట్టారు. వెనుక బడిన రాయచూరు జిల్లాను వైద్య, ఆరోగ్య పరంగా అభివృద్ధి పరిచేందుకు ఎయిమ్స్ సంస్థను స్థాపించాలని కోరినా బీజేపీ నేతలు విధానసభలో కాని, విధాన పరిషత్తులో కానీ చర్చించకపోవడాన్ని తప్పుబట్టారు. మంత్రి శరణప్రకాశ్ పాటిల్ మాట్లాడుతూ రాయచూరులో ఎయిమ్స్ మంజూరుకు నీరు, విద్యుత్, రైలు రాకపోకలు, జాతీయ రహదారుల అనుసంధానం ఉన్నందున ఆ ప్రాంతానికి ప్రాధాన్యతను కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమార్‌నాయక్, మిగతా బీజేపీ లోక్‌సభ సభ్యులు స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో ఒత్తిడి చేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బైక్ సీటు కింద దాగిన నాగుపాము

- చాకచక్యంగా పట్టివేతతో తప్పిన ముప్పు

హొసపేటె: కంప్లిలోని సత్యనారాయణపేటెలో ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం సీటు కింద నాగుపాము కనిపించి కాసేపు కలకలం సృష్టించింది. పట్టణానికి చెందిన టీ.కొట్రేష్ అనే వ్యాపారి తన ఇంటి ముందు బైకును ఆపి ఇంటిలోకి వెళ్లగా అదే సమయంలో బైక్‌లో పాము దాగి ఉండటంతో బైక్ పక్కనే ఉన్న చిన్నారులు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. బైక్‌పై తల ఎత్తి చుట్టుపక్కల చూస్తున్న పాము కనిపించడంతో అదే దారిలో వెళ్తున్న అశోక్ అనే పోలీసు కానిస్టేబుల్ బైక్‌పై పాము కూర్చున్న విషయంపై ఆరా తీశాడు. పాములను పట్టుకునే ప్రేమికుడు ప్రాణేష్ వచ్చి సీటు కింద ఉన్న పామును చాకచక్యంగా పట్టుకొన్నాడు. సకాలంలో స్పందించిన పోలీసు కానిస్టేబుల్ అశోక్, ప్రాణేష్‌ల చొరవను ప్రజలు అభినందించారు.


సీసాలోకి పామును పట్టుకుంటున్న ప్రాణేష్

క్రీడా పోటీలతో పని ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్


పరుగుపందెం పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

హొసపేటె: నిత్యం తమ విధి నిర్వహణలో నిమగ్నమయ్యే ప్రభుత్వ ఉద్యోగులకు పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడా పోటీలు ఎంతో అనుకూలమని జిల్లాధికారి దివాకర్ పేర్కొన్నారు. ఆయన సోమవారం జిల్లా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడారు. అంతకు ముందు రెండు రోజుల పాటు జరగనున్న క్రీడా పోటీలను మున్సిపాలిటీ అధ్యక్షురాలు కుమారి ఎ.లత ప్రారంభించారు. క్రీడా జ్యోతిని హుడా చైర్మన్ హెచ్ఎన్ఎఫ్ ఇమామ్ నియాజీ వెలిగించగా, పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకురాలు ఏ.హనుమక్క క్రీడా పతాక వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నోంగ్జాయ్ మహమ్మద్ అక్రమ్, జిల్లాధ్యక్షుడు జి.మల్లికార్జునగౌడ, తహసీల్దార్ విశ్వజిత్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పరిహారం ఏదీ?


మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో రైతులకు పరిహారం అందివ్వాలని కర్ణాటక రైతు సంఘం రాష్ట్రాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 2023–24వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు పీడిత తాలూకాలను ప్రకటించినా రైతులకు ఫసల్ బీమా సొమ్ము అందించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేవరాజ ట్రక్ టర్మినల్‌లో రూ.45 కోట్లు, వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు, ముడా కేసుల్లో రూ.కోట్లాది చేతివాటం కేసుల్లో మునిగిందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన జొన్నలకు ఇంతవరకు డబ్బులు చెల్లించక పోవడాన్ని తప్పుబట్టారు. విద్యుత్ బిల్లు చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

మోస్తరు వర్షం


వర్షంతో చిత్తడిగా మారిన రోడ్డు

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం తెల్లవారు జాము నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎక్కడ చూసిన రహదారులు చిత్తడిగా మారాయి. రంగమందిరం, మున్నూరువాడి, బంగికుంట, మడ్డిపేట, గద్వాల్ రోడ్డు, గాంధీచౌక్, మహావీర్ చౌక్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లోకి వర్షపు నీరు చొరబడ్డాయి.

సాంఘిక న్యాయం కరువు


మాట్లాడుతున్న వెంకటేష్ నాయక్

రాయచూరు రూరల్: సమాజంలో సాంఘిక న్యాయం కరువైందని నాయక్ పోరాట సమితి సంచాలకుడు వెంకటేష్ నాయక్ ఆరోపించారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయక్ వర్గాల హక్కులను పరిరక్షించడంలో ఎస్టీ ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఉపకార వేతనాలు మంజూరు కావడం లేదన్నారు. రూ.187 కోట్ల ఎస్టీ అభివృద్ధి మండలి నిధులను ఎస్టీ వర్గాల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతరత్రాలకు మళ్లించడాన్ని ఖండించారు.

బాలిక అనుమానాస్పద మృతి


అనసూయ(ఫైల్)

హొసపేటె: బహిర్భూమికి వెళ్లిన ఓ బాలిక అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన సోమవారం విజయనగర జిల్లా హడగలి తాలూకా దుంగావతి తండాలో చోటు చేసుకుంది. మృతి చెందిన బాలిక అనసూయ(10) కాగా రవి, లక్ష్మి దంపతులకు ఈమె ఒక్కగానొక్క కూతురు. గొయ్యి పక్కనే బాలిక మృతదేహం లభ్యం కాగా మరో పక్కన వాటర్ ట్యాంక్ ఉంది. బాలిక మృతిపై తల్లిదండ్రులు హత్యగా అనుమానం వ్యక్తం చేశారు. విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, హడగలి ఎమ్మెల్యే కృష్ణానాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోలారు: సుప్రీం సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రమణ మహర్షి విద్యాలయంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు నాగానంద కెంపరాజ్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు తోడు విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తోందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు బి.శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులు దాతల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. సంస్థ ప్రముఖుడు సుప్రీం మాట్లాడుతూ పాఠశాలను తమ సొంత విద్యా సంస్థగా తాము భావిస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కసాప తాలూకా గౌరవ అధ్యక్షుడు టి.సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించరూ

కోలారు: గోమాళం భూమిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు ట్రాక్టర్లతో ధర్నా నిర్వహించారు. క్యాసంబళ్లి జీపీలోని సర్వారెడ్డిహళ్లిలో చాలా ఏళ్లుగా సర్వే నెంబర్–46లో 8 అడుగుల కాలు దారి ఉండేదని, పూర్వీకులు ఎలాంటి షరతులు లేకుండా మానవతా దృష్టితో రైతులు, గ్రామ ప్రజలు నడవడానికి కాలుదారిని వదిలారని తెలిపారు. అయితే కాలుదారిని కొందరు నకిలీ దాఖలాలతో ఆక్రమించుకుంటున్నందున అధికారులు సర్వే చేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాగవేణికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మరగల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు రామసాగర వేణు, బాబు, సుప్రీంచల, గంగాధర్, తిమ్మణ్ణ పాల్గొన్నారు.